సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 255

బుధవారం 6-12-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'



యువ భారత్ శుభారంభం

జూనియర్ ప్రపంచకప్ హాకీ టోర్నీలో కొరియాపై 4-2తో గెలుపు -12లో



మూడో అతిపెద్ద ఎకానమీగా భారత్

2030 నాటికి అవతరించనుందని ఎస్అండ్‌పీ నివేదిక -13లో



'హెచ్-1బీ'పై ఆందోళన!

అమెరికా తెరపైకి తేనున్న హెచ్-1బీ వీసా రెన్యువల్ విధానాన్ని డిపెండెంట్స్‌కు వర్తింప జేయకపోవడంపై ఆందోళన వ్యక్తమవుతోంది.

- వివరాలు 6లో



'ఇండియా' భేటీ వాయిదా

బుధవారం జరగాల్సిన ప్రతిపక్ష ఇండియా కూటమి అగ్ర నేతల సమావేశం డిసెంబర్ మూడో వారానికి వాయిదా పడింది.

- వివరాలు 6లో



కర్ణిసేన చీఫ్ కాల్చివేత

జైపూర్‌లో శ్రీ రాష్ట్రీయ రాజ్‌పుత్ కర్ణి సేన అధ్యక్షుడు సుఖ్‌దేవ్ సింగ్ గొగామెడి మంగళవారం హత్యకు గురయ్యారు.

- వివరాలు 6లో



గాజాలో మళ్లీ యుద్ధ బీభత్సం

హమాస్‌తో కాల్పుల విరమణ ఒప్పందం ముగిసిన తర్వాత గాజాస్ట్రిప్‌లో పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి.

- వివరాలు 6లో

సీఎం రేవంత్



ప్రమాణస్వీకారం

గురువారం ఉదయం 10.28 గంటలకు..

స్థలం

హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియం

నాటకీయ పరిణామాల మధ్య సీఎల్పీ నేతను ప్రకటించిన కాంగ్రెస్ అధిష్టానం

రోజంతా ఢిల్లీలో హైడ్రామా.. చివరి వరకు సీఎం పదవికోసం ప్రయత్నాలు చేసిన ఉత్తమ్, భట్టి

- కీలక పదవుల పంపకాలపై తమ అభిప్రాయాల వెల్లడి
- ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే నివాసంలో రాహుల్, కేసీ, డీకే సంప్రదింపులు
- వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకున్నాక రేవంత్ వైపు మొగ్గు
- దీనిపై సోనియా సమ్మతి తీసుకుని ప్రకటించిన కేసీ వేణుగోపాల్
- మంత్రివర్గంపై రేవంత్‌తో చర్చించాక నేడు ప్రకటించే చాన్స్
- ఉత్తమ్, దామోదర, శ్రీధర్‌బాబు, సీతక్కలకు కీలక శాఖలు

సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, హైదరాబాద్: తెలంగాణ నూతన ముఖ్యమంత్రిగా పీసీసీ చీఫ్, కొడంగల్ ఎమ్మెల్యే ఎనుముల రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టనున్నారు. గురువారం ఉదయం 10.28 గంటలకు హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించే కార్యక్రమంలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆయనతోపాటు డిప్యూటీ సీఎంలు, మంత్రులుగా ఎవరెవరు ఉంటారన్న దానిపై బుధవారం నిర్ణయం తీసుకోనున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచాక రెండు రోజుల పాటు అనేక తర్జనభర్జనలు, సంప్రదింపులు జరిపి, నేతల అభిప్రాయాలు తీసుకున్న కాంగ్రెస్ అధిష్టానం.. పార్టీ శాసనసభాపక్ష (సీఎల్పీ) నేతగా రేవంత్‌రెడ్డిని ఎంపిక చేస్తున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీసుకున్న నిర్ణయాన్ని పార్టీ సంస్థాగత వ్యవహారాల కార్యదర్శి కేసీ వేణుగోపాల్ మంగళవారం సాయంత్రం ఢిల్లీలో ప్రకటించారు. ఖర్గే తెలంగాణ సీఎల్పీ భేటీ చేసిన తీర్మానాన్ని పరిశీలించిన తర్వాత రేవంత్‌రెడ్డిని సీఎంగా నియమించాలని నిర్ణయించారని చెప్పారు. గురువారం రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేస్తారని తెలిపారు. డిప్యూటీ సీఎం సహా ఇతర మంత్రి పదవుల అంశంపై బుధవారం నిర్ణయం తీసుకోనున్నట్టు వివరించారు. తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ సుపరిపాలన అందించబోతోందని.. తాము ఇచ్చిన ఆరు గ్యారంటీలను నెరవేరుస్తామని చెప్పారు.

తీర్మానాలను అధిష్టానానికి అందజేసి..

రాష్ట్ర ఎన్నికల్లో జయకేతనం అనంతరం సోమవారం కొత్త ఎమ్మెల్యేలతో కాంగ్రెస్ అధిష్టానం దూతలు, ఏఐసీసీ పరిశీలకులు మిగతా 2వ పేజీలో ▶



ఢిల్లీలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కేసీ వేణుగోపాల్. చిత్రంలో భట్టి విక్రమార్క, డీకే శివకుమార్, ఠాక్రే, ఉత్తమ్ కుమార్

వన్ మ్యాన్ షో ఉండదు

తెలంగాణ సీఎల్పీ సమావేశంలో చేసిన మూడు తీర్మానాలను పరిశీలకులు పార్టీ అధ్యక్షుడికి అందించారు. తెలంగాణలో అఖండ విజయాన్ని అందించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపే తీర్మానం మొదటిది. అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, సోనియాగాంధీ, రాహుల్, ప్రియాంకలకు ధన్యవాదాలు తెలిపేది రెండో తీర్మానం. సీఎల్పీ నేత ఎంపిక బాధ్యతను అధిష్టానానికే అప్పగిస్తూ మూడో తీర్మానం చేశారు. పార్టీ పరిశీలకులు ఇచ్చిన నివేదికను పరిశీలించిన అనంతరం సీనియర్లతో చర్చించాం. రేవంత్ రెడ్డిని ముఖ్యమంత్రి చేయాలని పార్టీ నిర్ణయించింది. ప్రభుత్వంలో వన్ మ్యాన్ షో ఉండదు. అందరినీ కలుపుకొంటూ కలసి టీమ్‌గా ముందుకు వెళ్తాం. సీనియర్లు అందరికీ సముచిత గౌరవం ఉంటుంది.

- కేసీ వేణుగోపాల్, ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల కార్యదర్శి

న్యూస్‌రీల్

ప్రొపల్షన్ మాడ్యూల్ భూకక్ష్య వైపు



చంద్రయాన్-3 మిషన్‌లో మరో కీలక మలుపు. ఈ ప్రయోగంలో భాగమైన ప్రొపల్షన్ మాడ్యూల్ కక్ష్యను మార్చుతున్నట్లు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) ప్రకటించింది. ఈ మాడ్యూల్‌ను చంద్రుడి కక్ష్య నుంచి భూకక్ష్య వైపు మళ్లించినట్లు తెలియజేసింది.

- వివరాలు 6లో

వాళ్లు ఓడిపోవడం ఏమిటో?



అసెంబ్లీ ఎన్నికల్లో పక్కాగా గెలిచి సత్తా చాటుతారని భావించిన ముఖ్యనేతలే ఓటమి చవిచూడడంపై బీజేపీలో విస్మయం వ్యక్తమవుతోంది. పోటీచేసిన ముగ్గురు ఎంపీలు, ఇద్దరు సిట్టింగ్ ఎమ్మెల్యేలు పరాజయం పాలు కావడాన్ని ఆ పార్టీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు.

- వివరాలు 10లో

పార్సిల్ స్కాం పసిగట్టండి ఇలా..



ప్రజల నుంచి డబ్బు కొల్లగొట్టేందుకు సైబర్ నేరగాళ్లు కొత్త తరహా మోసాలకు తెరతీస్తున్నారు. ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేయని వస్తువుల పేరుతో పార్సిల్ వచ్చిందంటూ అమాయకులకు ఫోన్లు చేసి డబ్బు గుంజుతున్నారని సైబర్ క్రైం పోలీసులు హెచ్చరిస్తున్నారు.

- వివరాలు 14లో

గోమూత్ర రాష్ట్రాల్లోనే బీజేపీ గెలుపు



హిందీ మాట్లాడే ఉత్తరాది రాష్ట్రాలను తమిళనాడుకు చెందిన డీఎంకే ఎంపీ డీఎన్‌వీ సెంథిల్ కుమార్ గోమూత్ర రాష్ట్రాలు అని అభివర్ణించారు. కేవలం గోమూత్ర రాష్ట్రాల్లోనే బీజేపీ గెలుస్తుందంటూ లోక్‌సభలో ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. దక్షిణాది రాష్ట్రాల్లో గెలిచే సత్తా బీజేపీకి లేదని ఆయన అన్నారు.

- వివరాలు 6లో

జెడ్పీటీసీ టు సీఎం

ఇదీ రేవంత్‌రెడ్డి రాజకీయ ప్రస్థానం

ఆరేళ్లలోనే అత్యున్నత హోదాకు

ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా తట్టుకుంటూ హస్తం పార్టీలో సీఎం దాకా అడుగులు 2లో

డిప్యూటీ సీఎం + పీసీసీ?

భట్టికి కాంగ్రెస్ హైకమాండ్ ఆఫర్

- పీసీసీ చీఫ్ పదవిని ఆయన వద్దంటే పొన్నంకు అవకాశం.. మంత్రి పదవితో పాటు బోనస్‌గా ఇచ్చే చాన్స్
- మధుయాష్కీ, మహేశ్‌కుమార్, జీవన్‌రెడ్డి, షబ్బీర్, మల్లు రవిల పేర్లూ పరిగణనలోకి..

3లో

రేవంత్ స్వగ్రామంలో సంబరాలు

మంత్రివర్గంలో చేరేందుకు సీపీఐ ఆసక్తి?

రేవంత్‌తో సీపీఐ నేతల భేటీ

- వివరాలు 3లో

సామాజిక కోణంలో కేబినెట్ కూర్పు

కాంగ్రెస్ హైకమాండ్ కసరత్తు

- గెలిచిన ఎమ్మెల్యేల్లో రెడ్డి సామాజిక వర్గం వారు 25 మంది
- వారిలో ఐదుగురు లేదా ఆరుగురికి బెర్తులు
- ముగ్గురు బీసీలకు అమాత్య హోదా.. ఇంకొకరికి కూడా చాన్స్
- ఎస్సీ, ఎస్టీలకు చెరో రెండు కేటాయించేందుకు ఓకే
- మంత్రులుగా ఇద్దరు మహిళలు.. ఒకరికి విప్ హోదా
- నేడు ఫైనల్ కానున్న పేర్లు!



సాక్షి, హైదరాబాద్: కొత్త ప్రభుత్వ ఏర్పాటులో సామాజిక న్యాయం పాటించాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. రాష్ట్ర కేబినెట్‌తో పాటు ఇతర కీలక పదవుల్లో ఆయా వర్గాలకు ప్రాధాన్యం కల్పించే దిశలో కసరత్తు చేస్తోంది. ఢిల్లీ వేదికగా మంగళవారం జరిగిన ఈ ప్రక్రియ బుధవారం కూడా కొనసాగనుంది. కొత్త సీఎల్పీ నాయకుడిగా ఎంపికైన రేవంత్‌రెడ్డితో పాటు భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, హైకమాండ్ పెద్దలు కేసీ వేణుగోపాల్, డి.కె.శివకుమార్, మాణిక్‌రావ్ ఠాక్రేల సమక్షంలో చర్చించిన తర్వాత రాహుల్, ఖర్గేలతో మాట్లాడి వారి అనుమతి మేరకు కీలక పదవులపై నిర్ణయం తీసుకోనున్నారు. ముఖ్యంగా కేబినెట్‌లో ఎంతమందిని తీసుకోవాలి? ఎవరెవరిని తీసుకోవాలి? ఏయే సామాజిక వర్గాలకు ఎలాంటి ప్రాధాన్యమివ్వాలన్న దానిపై తుది నిర్ణయం తీసుకుని గురువారం ప్రమాణ స్వీకార కార్యక్రమంలోనే సీఎంతో పాటు డిప్యూటీ సీఎం, మంత్రులందరి చేత ప్రమాణం చేయించనున్నారు.

డిప్యూటీ సీఎంలు ఒకరా... ఇద్దరా?

రెడ్డి సామాజిక వర్గానికి చెందిన రేవంత్‌రెడ్డిని సీఎంగా నిర్ణయించిన నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి పదవిపై అధిష్టానం తీవ్ర కసరత్తు చేస్తోంది. ఒకరిని నియమించాలా లేదా ఇద్దరికి అవకాశమివ్వాలా అన్న దానిపై టీపీసీసీ ముఖ్యులతో సమాలోచనలు జరుపుతోంది. ప్రస్తుతమున్న సమాచారం మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క పేరు ఇప్పటికే ఖరారైనట్టు తెలుస్తోంది. దళిత సామాజిక వర్గానికి చెందిన భట్టి గతంలో పలు పదవులు నిర్వహించారు. ప్రస్తుతం సీఎల్పీ నేతగా ఉన్న ఆయనకు తగిన గౌరవం ఇవ్వాల్సిన దృష్ట్యా కేబినెట్‌లో కీలక శాఖతో పాటు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వనున్నట్టు సమాచారం. అయితే ఉప ముఖ్యమంత్రి హోదాను భట్టికి మాత్రమే పరిమితం చేస్తారని, అలాగే భట్టితో పాటు మరొకరికి కూడా ఇస్తారనే రెండు రకాల వాదనలు వినిపిస్తున్నాయి. దీనిపై బుధవారం స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

ఏ సామాజిక వర్గం నుంచి ఎంతమంది?

కొత్త మంత్రివర్గాన్ని ఏ విధంగా ఏర్పాటు చేయాలన్న దానిపై అధిష్టానం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఏ సామాజిక వర్గం నుంచి ఎంతమంది ఎమ్మెల్యేలు గెలిచారనే అంశంతో పాటు ఏ సామాజిక వర్గానికి ఎంత ప్రాధాన్యం ఇవ్వాలన్న కోణంలో కసరత్తు చేస్తోంది. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన 25 మంది ఎంపిక కాగా.. సీఎంతో పాటు నాలుగు లేదా ఐదు బెర్తులు వారికి మిగతా 3వ పేజీలో ▶



తిరుపతి జిల్లా నాయుడుపేట వద్ద స్వర్ణముఖి నది కాజ్‌వే వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు

వణికించిన మిచాంగ్

తీవ్ర తుపానుతో ఏపీలోని తిరుపతి, నెల్లూరు జిల్లాలు అతలాకుతలం

- మంగళవారం మధ్యాహ్నం బాపట్ల వద్ద తీరం దాటిన తుపాను
- నీట మునిగిన పలు ప్రాంతాలు
- తిరుపతి జిల్లా చింతవరంలో 42 సెంటీమీటర్ల వర్షం
- కుండపోత వర్షాలతో పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు
- వందలాది గ్రామాలకు రాకపోకలు బంద్

సాక్షి, అమరావతి: మిచాంగ్ తుపాను ఏపీలోని తిరుపతి, నెల్లూరు జిల్లాలను కుదిపేసింది. పలు జిల్లాలను వణికించింది. దీని ప్రభావంతో కురుస్తున్న కుండపోత వర్షాలకు తిరుపతి, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల్లో జన జీవనం పూర్తిగా స్తంభించిపోయింది. రికార్డు స్థాయిలో కురిసిన వర్షాలు.. 80 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో వీచిన ఈదురు గాలులతో పట్టణాలు, పల్లెలు చిగురుటాకుల్లా వణికిపోయాయి. మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన అతి తీవ్ర వర్షాలతో లోతట్టు మిగతా 14వ పేజీలో ▶

రైళ్లు, విమానాల రాకపోకలకు బ్రేక్

- కొనసాగుతున్న మిచాంగ్ తుపాను ప్రభావం.. దక్షిణమధ్య రైల్వే పరిధిలో 120 రైళ్లకు అంతరాయం
- పలు మార్గాల్లో కొన్ని సర్వీసుల పునరుద్ధరణ.. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి నిలిచిన 20 విమాన సర్వీసులు

14లో

నేడు రాష్ట్రంలో వర్షాలు

- రానున్న రెండ్రోజులు తగ్గనున్న ఉష్ణోగ్రతలు

14లో

ఇదంజోత్



హైదరాబాద్‌ను డెవలప్ చేసింది మీరేనని ఎలా ప్రచారం చేశామో.. కాంగ్రెస్‌ను గెలిపించింది మనమేనని అలానే చేద్దాం సార్!

గిరిజన వర్సిటీ ఏర్పాటుకు గెజిట్

నోటిఫికేషన్ విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వం



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో సమ్మక్క–సారక్క కేంద్ర గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు సంబంధించిన కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. సోమవారం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ లోక్‌సభలో ఈ బిల్లు ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. కేంద్ర యూనివర్సిటీల జాబితాలో సమ్మక్క–సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ పేరు చేర్చుతూ చట్టానికి సవరణ ప్రతిపాదించారు. తెలంగాణ రాష్ట్రంలో సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ స్థాపన రాబోయే సంవత్సరాల్లో ప్రాంతీయ ఆకాంక్షలకు అనుగుణంగా ఉంటుందని, గిరిజన కళలు, సంస్కృతి, ఆచారాలు, సాంకేతికతలో బోధన, పరిశోధన సౌకర్యాలను అందిస్తుందని పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014 ప్రకారం తెలంగాణలో సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయడం తప్పనిసరి కాబట్టి, ఇక్కడ కొత్తగా 'సమ్మక్క సారక్క సెంట్రల్ యూనివర్సిటీ'గా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని గెజిట్‌లో పేర్కొన్నారు.



కరప్షన్ ఫ్రీ కామారెడ్డి

ఇదే లక్ష్యంతో ముందుకు సాగుతున్నానంటున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

''ఎన్నికల్లో డబ్బు..మద్యం పంచకుండా గెలిచి చూపాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. కార్యకర్తలు అండగా నిలవడం, జనం నన్ను నమ్మి ఓటేయడంతో నా లక్ష్యం నెరవేరింది. ఇక కామారెడ్డిలో పెరిగిన రాజకీయ అవినీతిని రూపుమాపి కరప్షన్ ఫ్రీ కామారెడ్డి అన్న పేరు తేవడానికి కృషి చేస్తా''అని ఇద్దరు రాజకీయ ఉద్ధండులను ఓడించిన కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి(కేవీఆర్) అంటున్నారు.

- వివరాలు 5లో

సీఎం రేవంత్


తల్లిదండ్రులు, భార్యతో రేవంత్‌రెడ్డి (ఫైల్)


ఢిల్లీలో విమానాశ్రయం నుంచి డీకే నివాసానికి వెళ్తున్న రేవంత్‌రెడ్డి

▶ మొదటి పేజీ తరువాయి

సమావేశం నిర్వహించి అభిప్రాయాలను సేకరించిన విషయం తెలిసిందే. సీఎం ఎంపిక నిర్ణయాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు అప్పగిస్తూ ఆ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఆ తీర్మానం, ఎమ్మెల్యే అభిప్రాయాల నివేదికలతో ఢిల్లీకి వచ్చిన కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఇతర నేతలు మంగళవారం రోజంతా బిజీబిజీగా గడిపారు. సీఎంతోపాటు ఇతర కీలక పదవులపై రాష్ట్ర, జాతీయ నేతలతో విస్తృతంగా చర్చలు జరిపారు. మరోవైపు సాయంత్రానికల్లా సీఎంను ఖరారు చేస్తామని ఖర్గే ప్రకటించారు.

వరుసగా భేటీలు.. విస్తృతంగా సంప్రదింపులు..

మంగళవారం ఉదయం ఢిల్లీకి చేరుకున్న సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, పీసీసీ మాజీ అధ్యక్షుడు, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తదితరులు కొద్దిసేపు పదవుల అంశంపై చర్చించుకున్నారు. 10.45 గంటలకు ఉత్తమ్ డీకే శివకుమార్‌తో భేటీ అయి.. సీఎం, డిప్యూటీ సీఎం పదవులు, పీసీసీ కొత్త అధ్యక్షుడి ఎంపిక, కీలక శాఖలకు మంత్రులు వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా తనకు సీఎం పదవికి అర్హత ఉందని నొక్కి చెప్పినట్టు తెలుస్తోంది. ఏడుసార్లు ఎమ్మెల్యేగా, ఎంపీగా, మంత్రిగా, పీసీసీ అధ్యక్షుడిగా పని చేశానని.. తనకు మెజార్టీ ఎమ్మెల్యేలు, సీనియర్ల మద్దతు ఉందని వివరించినట్టు సమాచారం. అయితే ఈ భేటీ అనంతరం మీడియాతో మాట్లాడిన ఉత్తమ్.. అధిష్టానం సీఎంగా ఎవరిని ఎంపిక చేసినా తనకు ఆమోదమేనని ప్రకటించారు. డీకేతో ఉత్తమ్ భేటీ జరుగుతున్న సమయంలోనే.. భట్టి రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రేతో భేటీ అయ్యారు. సీఎం పదవి కోసం తన అర్హతను పరిశీలించాలని కోరారు. ఈ భేటీలు సాగుతున్న సమయంలోనే ఖర్గే నివాసంలో మరో కీలక భేటీ జరిగింది.

రేవంత్‌రెడ్డి వైపే మొగ్గు: మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ఖర్గే నివాసానికి పార్టీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్ తదితరులు చేరుకుని.. సీఎల్పీ నేత ఎంపికపై చర్చించారు. పదవికి పోటీ పడుతున్న రేవంత్, ఉత్తమ్, భట్టి పేర్లను పరిశీలించారు. పార్టీకి పనిచేసిన అనుభవంతోపాటు రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులు, రానున్న పార్లమెంట్ ఎన్నికలు, మెజార్టీ ఎమ్మెల్యేల అభిప్రాయాలు, ప్రజల్లో ఉన్న ఆదరణను దృష్టిలో పెట్టుకుని రేవంత్‌రెడ్డి వైపే అంతా మొగ్గుచూపినట్టు తెలిసింది. ఈ భేటీ మొదలైన అరగంటకు డీకే శివకుమార్, ఠాక్రే కూడా ఖర్గే నివాసానికి చేరుకుని.. ఎమ్మెల్యేల తీర్మానం కాపీ, వారి అభిప్రాయాల నివేదికను అగ్రనేతలకు అందించారు. ఈ సందర్భంగా అంతా కలిసి.. పార్టీ సీనియర్ నేతల నుంచి వస్తున్న డిమాండ్లు, కీలక శాఖల అప్పగింత, పీసీసీ కొత్త అధ్యక్షుడి ఎంపికపై చర్చించారు. రేవంత్ ఎంపికను ఖరారు చేసి, ఈ విషయాన్ని సోనియాగాంధీకి తెలిపి ఆమోదం తీసుకున్నారు. భట్టికి ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని నిర్ణయించుకున్నట్టు తెలిసింది. ఉత్తమ్, దామోదర, శ్రీధర్‌బాబు, సీతక్కలకు కీలక శాఖలు ఇవ్వాలన్న ఆలోచనకు వచ్చినట్టు సమాచారం.

సోనియాతో జి.వినోద్ భేటీ

మరోవైపు మాజీ మంత్రి జి.వినోద్ ఢిల్లీలో సోనియాగాంధీతో విడిగా భేటీ అయ్యారు. తాను గతంలో మంత్రిగా పనిచేశానని, ఈసారి తనకు మంత్రి పదవి ఇవ్వాలని సోనియాను కోరానని భేటీ అనంతరం వినోద్ తెలిపారు. తన విజ్ఞప్తిపై ఆమె సానుకూలత వ్యక్తం చేశారని చెప్పారు.

అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటా: ఉత్తమ్

సీఎం పదవి కోసం తనకు అన్ని అర్హతలు ఉన్నాయని, ఈ విషయాన్ని పరిశీలించాలని హైకమాండ్‌ను కోరానని ఉత్తమ్ మీడియాతో చెప్పారు. అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటామన్నారు.

కొత్త ఎమ్మెల్యేలకు అవగాహన

కాంగ్రెస్ కొత్త ఎమ్మెల్యేలంతా మంగళవారం హైదరాబాద్‌లోని ఎల్లా హోటల్‌లోనే గడిపారు. కాగా,రేవంత్‌రెడ్డి హోటల్‌లో కొత్త ఎమ్మెల్యేలతో ఉండి చర్చలు జరుపుతూ గడిపారు. మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు ప్రొఫెసర్ నాగేశ్వర్, టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ చిన్నారెడ్డి తదితరులు అసెంబ్లీ వ్యవహారాలు, ప్రభుత్వ పనితీరు, ఇతర అంశాలపై ఎమ్మెల్యేలకు అవగాహన కల్పించారు. అధిష్టానం నుంచి పిలుపు రావడంతో రేవంత్ మంగళవారం సాయంత్రం ప్రత్యేక విమానంలో ఢిల్లీకి బయలుదేరారు. ఆయన ప్రయాణంలో ఉండగానే ఢిల్లీలో కేసీ వేణుగోపాల్, ఇతర నేతలు ప్రెస్‌మీట్ పెట్టి రేవంత్‌ను సీఎంగా ఎంపిక చేసినట్టు ప్రకటించారు. రేవంత్ వెళ్లాక ఎమ్మెల్యేలు కూడా ఒక్కొక్కరిగా ఎల్లా హోటల్ నుంచి వెళ్లిపోయారు. రాష్ట్రవ్యాప్తంగా కూడా కాంగ్రెస్ శ్రేణులు బాణసంచా కాల్చి, స్వీట్లు పంచుకుని సంబురాలు చేసుకున్నాయి.

డిప్యూటీ సీఎం, మంత్రిపదవులపై నేడు స్పష్టత

సీఎం ఎంపిక కసరత్తు కొలిక్కి వచ్చిన తర్వాత సాయంత్రం 5 గంటల సమయంలో కేసీ వేణుగోపాల్‌తో డీకే, ఠాక్రే, భట్టి, ఉత్తమ్ భేటీ అయ్యారు. డిప్యూటీ సీఎం పదవులతోపాటు మంత్రివర్గ కూర్పు, శాఖల కేటాయింపులపై వారు సుమారు గంట పాటు చర్చించారు. అనంతరం డీకే, ఠాక్రే, ఉత్తమ్, భట్టిలను వెంట పెట్టుకొని ఏఐసీసీ కార్యాలయానికి వచ్చిన కేసీ వేణుగోపాల్.. సీఎల్పీ నేతగా రేవంత్‌రెడ్డిని ఎంపిక చేసినట్టు ప్రకటించారు. ఉప ముఖ్యమంత్రులు ఎందరు ఉండాలి, మంత్రి పదవులు ఎవరికి అన్న దానిపై బుధవారం రేవంత్‌రెడ్డితో కలసి నిర్ణయం తీసుకోనున్నట్టు తెలిపారు.

సోనియా, ఖర్గేలకు రేవంత్ కృతజ్ఞతలు

ఇతర ఏఐసీసీ పెద్దలు, పార్టీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలకు ధన్యవాదాలు


జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 44లోని రేవంత్‌రెడ్డి ఇంటి వద్ద పోలీసు బందోబస్తు

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ శాసనసభాపక్ష (సీఎల్పీ) నేతగా తనను ఎంపిక చేయడంపై పార్టీ అధిష్టానం పెద్దలు, ముఖ్య నేతలు, ఎమ్మెల్యేలకు రేవంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. తనను ఎంపిక చేసిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. తనకు మద్దతుగా నిలిచినందుకు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీ, ఏఐసీసీ ముఖ్య నేతలు కేసీ వేణుగోపాల్, మాణిక్‌రావ్ ఠాక్రే, డీకే శివకుమార్, ఇతర నేతలకు ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు.

ప్రమాణ స్వీకారానికి ఆహ్వానించేందుకు..

గురువారం సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో ఆ కార్యక్రమానికి రావాల్సిందిగా ఏఐసీసీ ముఖ్యులను రేవంత్ ఆహ్వానించనున్నారు. మంగళవారం రాత్రి ఢిల్లీ వెళ్లిన ఆయన బుధవారం మల్లికార్జున ఖర్గే, సోనియా, రాహుల్, ప్రియాంకలతోపాటు కేసీ వేణుగోపాల్, ఠాక్రే, డీకే శివకుమార్‌లను కలవనున్నారు. రేవంత్ కార్యాలయ వర్గాలు ఈ వివరాలను వెల్లడించాయి.

రేవంత్ ఇంటివద్ద భారీ బందోబస్తు

బంజారాహిల్స్ (హైదరాబాద్): కాంగ్రెస్ అధిష్టానం రేవంత్‌రెడ్డిని సీఎంగా ఎంపిక చేసిన నేపథ్యంలో.. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 44లోని ఆయన నివాసం వద్ద భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. జూబ్లీహిల్స్ ఏసీపీ హరిప్రసాద్, సీఐ రవీంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. 20 మంది సాయుధ పోలీసులతో పికెట్ ఏర్పాటు చేశారు. ఆ నివాసానికి దారితీసే మార్గాల్లో పోలీసు సిబ్బందిని మోహరించారు.

ఎల్బీ స్టేడియంలో ప్రమాణ స్వీకారం

వేగంగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సీఎస్ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎనుముల రేవంత్‌రెడ్డి గురువారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ మేరకు వెంటనే ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. సీఎం, మంత్రుల ప్రమాణ స్వీకారోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లపై ఆమె మంగళవారం రాత్రి సచివాలయంలో సమీక్షించారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. తగిన బందోబస్తు, ట్రాఫిక్, పార్కింగ్, భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీసు శాఖకు సూచించారు. పారిశుధ్యం, తాగునీరు, ఫాగింగ్ వంటి చర్యలు చేపట్టాలని జీహెచ్‌ఎంసీ అధికారులను ఆదేశించారు. ఎల్బీ స్టేడియం వద్దకు వెళ్లే రహదారుల మరమ్మతులు చేపట్టాలని.. అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు. సమావేశంలో డీజీపీ రవిగుప్తా, హైదరాబాద్ సీపీ సందీప్ శాండిల్య, స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సునీల్‌శర్మ, ముఖ్య కార్యదర్శులు రిజ్వీ, శైలజా రామయ్యర్, గవర్నర్ సెక్రెటరీ సురేంద్ర మోహన్, జీఏడీ సెక్రెటరీ శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీకి చేరుకున్న రేవంత్.. సొంత వాహనంలోనే ఇంటికి..

సీఎల్పీ నేతగా ప్రకటించిన అనంతరం అధిష్టానం పిలుపుమేరకు రేవంత్‌రెడ్డి మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో ఢిల్లీకి చేరుకున్నారు. షబ్బీర్ అలీ, సుదర్శన్‌రెడ్డి, బలరాం నాయక్ కూడా ఆయన వెంట వెళ్లారు. రేవంత్‌రెడ్డి సీఎం కానున్న నేపథ్యంలో.. ఢిల్లీలోని రాష్ట్ర ప్రభుత్వ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ ఆయనకు లాంఛనంగా స్వాగతం పలికారు. పోలీసులు ప్రోటోకాల్ ప్రకారం సీఎంకు ఇచ్చేస్థాయిలో కాన్వాయ్‌ను, భద్రతను ఏర్పాటు చేశారు. కానీ రేవంత్ తాను ఎంపీగా ఇన్నిరోజుల నుంచి వినియోగిస్తున్న వాహనంలో డీకే శివకుమార్ నివాసానికి వెళ్లి భేటీ అయ్యారు. అక్కడి నుంచి తన నివాసానికి వెళ్లారు. పోలీసులు రేవంత్ వాహనానికి ముందు, వెనుక సెక్యూరిటీగా వెళ్లారు.

‘జెడ్పీటీసీ’ టు సీఎం

ఇదీ రేవంత్‌రెడ్డి రాజకీయ ప్రస్థానం



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: విద్యార్థి దశ నుంచే రేవంత్‌రెడ్డి రాజకీయాల్లోకి అడుగిడారు. హైదరాబాద్‌లోని ఏవీ కాలేజీలో డిగ్రీ చదువుతున్న రోజుల్లో ఆయన బీజేపీ అనుబంధ విభాగమైన ఏబీవీపీతోపాటు ఆర్‌ఎస్‌ఎస్‌లో కూడా చురుగ్గా పనిచేశారు. కొంతకాలం మలక్‌పేటలో ఉన్న ఆయన నారాయణగూడకు మకాం మార్చారు. నారాయణగూడలో మిస్టర్ ఆడ్స్ పేరుతో ఓ ప్రింటింగ్ ప్రెస్ ప్రారంభించారు. రేవంత్‌రెడ్డి క్రియాశీలక రాజకీయాల్లోకి వచ్చాక ప్రింటింగ్ ప్రెస్‌ను తమ్ముడు కృష్ణారెడ్డికి అప్పగించారు. కృష్ణారెడ్డి బర్కత్‌పుర డివిజన్‌కు టీడీపీ నుంచి ఎంసీహెచ్ కార్పొరేటర్‌గా పోటీ చేసి ఓడిపోయారు.

- 2004లో టీఆర్‌ఎస్‌లో చేరి కల్వకుర్తి అసెంబ్లీ సీటు ఆశించారు. ఆయనకు టీఆర్‌ఎస్ టికెట్ దక్కలేదు. 2006లో మిడ్జిల్ జెడ్పీటీసీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు.
- 2007లో మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్సీగా గెలుపొందారు. ఇండిపెండెంట్‌గా రేవంత్‌రెడ్డి గెలవడం అప్పట్లో సంచలనమే. అదే ఏడాదిలో టీడీపీలో చేరారు.
- 2009లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్ సెగ్మెంట్‌కు టీడీపీ తరఫున పోటీచేసిన రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ సీనియర్ ఎమ్మెల్యే గుర్నాథ్‌రెడ్డిని ఓడించి తొలిసారిగా అసెంబ్లీలో అడుగుపెట్టారు. 2014 ఎన్నికల్లోనూ కొడంగల్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు.
- 2015 మే 15న రేవంత్‌రెడ్డిని ఓటుకు కోట్లు కేసులో అరెస్ట్ చేసి జైలుకు పంపారు. కూతురి పెళ్లి సమయంలో తనను అరెస్ట్ చేయడం పట్ల రేవంత్ సీరియస్‌గా స్పందించారు. ‘నీ అంతు చూస్తా.. నిన్ను గద్దె దించడమే నా లక్ష్యం ’అంటూ కేసీఆర్‌కు సవాల్ విసిరారు.
- తెలంగాణలో టీడీపీ ప్రాభవం కోల్పోవడంతో 2017లో కాంగ్రెస్‌లో చేరారు.
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొనసాగుతూ 2018 ఎన్నికల్లో కొడంగల్ నుంచి మూడో సారి బరిలో దిగారు. పట్నం నరేందర్‌రెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు.
- 2019 లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజిగిరి ఎంపీగా పోటీచేసి గెలుపొందారు.
- 2021 జూన్ 26న అధిష్టానం రేవంత్‌రెడ్డిని టీపీసీసీ అధ్యక్షుడిగా నియమించింది. జూలై 7న ఆయన బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుంచి జరిగిన గ్రేటర్, ఉప ఎన్నికల్లో దెబ్బతిన్నా.. పట్టుదలతో ముందుకు కదిలి.. ఎట్టకేలకు అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి విజయాన్ని సాధించిపెట్టారు.
- ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున కొడంగల్ ఎమ్మెల్యేగా గెలిచారు.

పేరు	: ఎనుముల రేవంత్‌రెడ్డి
పుట్టిన తేదీ	: 8-11-1967
స్వగ్రామం	: కొండారెడ్డిపల్లి, వంగూరు మండలం (నాగర్‌కర్నూల్ జిల్లా)
చదువు	: బీఏ
భార్య	: గీతారెడ్డి
కూతురు	: నైమీష-సత్యనారాయణరెడ్డి (అల్లుడు)

నాపై గెలిచిన వ్యక్తి నేడు సీఎం.. వెరీ హ్యాపీ



నాపై పోటీ చేసిన వ్యక్తి నేడు తెలంగాణ సీఎం అవుతుండటం సంతోషంగా ఉంది. 2006లో మిడ్జిల్ జెడ్పీటీసీ సభ్యుడిగా నేను కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తే.. రేవంత్‌రెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు.

– ఎండీ రబ్బానీ, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు, మిడ్జిల్ మండలం

ఆరేళ్లలోనే... అత్యున్నత హోదాకు

- ఇంటిపోరును తట్టుకుంటూ... తనదైన ఇమేజ్ నిర్మించుకుంటూ ..
- కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, పీసీసీ అధ్యక్షుడిగా, ఎంపీగా రేవంత్‌రెడ్డి బాధ్యతల నిర్వహణ

సాక్షి, హైదరాబాద్: రేవంత్‌రెడ్డి ఆరేళ్లలోనే కాంగ్రెస్ పార్టీలో అత్యున్నత హోదాకు చేరుకున్నారు. 2017 అక్టోబర్‌లో కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన ఆరేళ్లు పూర్తి చేసుకునేలోపే అధిష్టానం మన్ననలు పొంది సీఎంగా ఎంపికయ్యారు. పీసీసీ అధ్యక్షుడిగా ఎంపికైన రోజే పార్టీ లో ప్రశంసలతో పాటు విమర్శలు కూడా ఎదుర్కొన్న ఆయన ఇంటా, బయటా సర్దిచెప్పుకుంటూ, సర్దుబాటు చేసుకుంటూ, సై అంటే సై అంటూ హైకమాండ్ నిర్ణయించే కీలక పదవి దక్కించుకోగలిగారు. ఎన్ని ఒత్తిడులు వచ్చిన తట్టుకుంటూ హస్తం పార్టీలో ముందడుగులు వేసిన ఈ పాలమూరు నాయకుడు ఇప్పుడు తెలంగాణ రాష్ట్రానికి నాయకత్వం వహించబోతున్నారు.

వైఫల్యాలను అధిగమిస్తూ..: కాంగ్రెస్ పార్టీలో చేరిన తర్వాత రేవంత్‌రెడ్డి అనూహ్యంగా ముందు వరుసలోకి వచ్చారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ హోదా దక్కించుకున్న కొద్ది కాలంలోనే పీసీసీ అధ్యక్ష పదవి చేపట్టారు. పార్టీలో అసమ్మతి, ఇంటిపోరును సమర్థవంతంగా ఎదుర్కొన్న రేవంత్ అటు ప్రజాక్షేత్రంలోనూ ప్రతికూల పరిస్థితులను చవిచూశారు. తాను పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత జరిగిన అనేక ఉప ఎన్నికలతో పాటు జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో ఆయన సారథ్యంలోని పార్టీ ఓటమి పాలైంది. అయినా వైఫల్యాలకు వెరవకుండా 2023 ఎన్నికల్లో రేవంత్ అన్నీ తానై వ్యవహరించారు. అభ్యర్థుల ఎంపిక, అధిష్టానంతో సమన్వయం అంశాల్లో తన ఇమేజ్‌కు తగినట్టు వ్యవహరించిన రేవంత్ ఈ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల పక్షాన ప్రచార సారథిగా కీలక అడుగు వేశారు. అధిష్టానం నిర్ణయం మేరకు సీఎం కేసీఆర్‌పై కామారెడ్డిలో పోటీ చేసి ఢిల్లీ పెద్దల దృష్టిని కూడా ఆకర్షించారు. అటు పార్టీ కేడర్, నాయకులను ముందుకు కదిలిస్తూ ఈ ఎన్నికల్లో పార్టీకి ఘనవిజయాన్ని చేకూర్చారని , అధిష్టానం వద్ద లభించిన ప్రత్యేక గుర్తింపే ఆయనకు పెద్ద పదవి లభించేలా చేసిందనే చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది.

ఎన్నికల ప్రభావం | సింగరేణిపై పడుతుందా?

మోగిన ఎన్నికల నగారా

- 27న గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు
- శాసనసభ ఎన్నికల్లో సీపీఐ, టీజేఎస్, ఇతర వామపక్ష పార్టీల మద్దతు తీసుకున్న కాంగ్రెస్
- ఈ ఎన్నికల్లో ఆయా పార్టీల అనుబంధ సంఘాలు కలిసి పోటీ చేస్తాయా.. విడిగానే బరిలో ఉంటాయా?
- ఓటింగ్‌లో పాల్గొననున్న 39,948 మంది కార్మికులు



సింగరేణి (కొత్తగూడెం): సింగరేణిలో ఎన్నికల నగారా మోగింది. ఈనెల 27న గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు జరగనున్నాయి. 2017లో జరిగిన గుర్తింపు ఎన్నికల్లో 62వేల మంది కార్మికులు ఓటుహక్కు వినియోగించుకోగా, ప్రస్తుతం 39,948 మంది ఓటు వేయనున్నారు. 2021లోనే ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా యాజమాన్యం పలుమార్లు వాయిదా వేసింది. చివరకు ఎన్నికలు జరపాలని డిప్యూటీ లేబర్ కమిషనర్(డీవైసీఎల్సీ)కు కోర్టు ఆదేశాలు జారీ చేయడంతో ఈనెల 27న పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 4న కార్మిక సంఘాల నేతలు ఓటర్ల జాబితాను డీవైసీఎల్సీకి అందజేయగా, 8వ తేదీ వరకు వాటిని పరిశీలిస్తారు. నామినేషన్ల ప్రక్రియ, గుర్తుల కేటాయింపు ఇంతకు ముందే పూర్తి కాగా, ఆ గుర్తుల పైనే ఇప్పుడు ఎన్నికలు జరగనున్నాయి.

ఎన్నికల బరిలో 14 సంఘాలు

2012కు ముందు 30 కార్మిక సంఘాలు ఎన్నికల బరిలో ఉండేవి. ఆ తర్వాత కార్మిక సంఘాల సంఖ్య తగ్గుముఖం పట్టింది. 2017లో 14 సంఘాలు పోటీ చేయగా, ఈ ఏడాది ఎన్నికల్లోనూ అదే సంఖ్యలో బరిలో ఉంటున్నాయి. ప్రధాన పోటీ మాత్రం ఐదింటి మధ్యనే నెలకొనే అవకాశం ఉంది.

ఎక్కువసార్లు ఏఐటీయూసీనే..

సింగరేణిలో 1998, 2001, 2007లో జరిగిన ఎన్నికల్లో ఏఐటీయూసీ గుర్తింపు సంఘంగా ప్రాతినిధ్యం వహించగా, 2003లో ఐఎన్‌టీయూసీ గెలుపొందింది. 2012, 2017 ఎన్నికల్లో వరుసగా రెండుసార్లు టీబీజీకేఎస్ విజయబావుటా ఎగురవేసింది.

తగ్గుతున్న కార్మికుల సంఖ్య

ఎన్నికల్లో పాల్గొనే కార్మికుల సంఖ్య ప్రతిసారీ తగ్గుతూ వస్తోంది. 1998లో 98 వేల మంది కార్మికులు ఓటు హక్కు వినియోగించుకోగా, 2001లో 96 వేలు, 2003లో 94 వేలు, 2007లో 92 వేల మంది కార్మికులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం గోల్డెన్ హ్యాండ్ షేక్ పథకాన్ని అమలు చేయడంతో వేలాదిమంది కార్మికులు స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. ఆ తర్వాత ఖాళీలు భర్తీ చేయకపోవడంతో 2012 ఎన్నికల్లో 80 వేల మంది, 2017లో 62 వేల మంది కార్మికులు మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. పలువురు ఉద్యోగ విరమణ పొందగా, మరి కొందరిని వివిధ కారణాలతో తగ్గించారు. కొత్త నియామకాలు లేకపోవడంతో ప్రస్తుత ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకునే కార్మికుల సంఖ్య 39 వేలకు పడిపోయింది.

పొత్తులా.. విడిగానా..?

గతంలో సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలంటే రెండు, మూడు నెలల పాటు కార్మిక సంఘాల ప్రచారంతో కోలాహలంగా ఉండేది. కానీ ఇప్పుడు ఎన్నికలకు 22 రోజుల సమయం మాత్రమే ఉంది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సీపీఐ, టీజేఎస్, ఇతర వామపక్ష పార్టీల మద్దతు తీసుకుంది. అయితే సింగరేణి ఎన్నికల్లో ఆయా పార్టీల అనుబంధ కార్మిక సంఘాలు కలిసి పోటీ చేస్తాయా లేక విడివిడిగా బరిలోకి దిగుతాయా అనే ఆసక్తి సర్వత్రా నెలకొంది. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీల జయాపజయాల ప్రభావం సింగరేణిపై పడుతుందా అన్న చర్చ కూడా కార్మిక వర్గాల్లో జరుగుతోంది.

గుర్తింపు సంఘం ఎందుకంటే

1987–89 మధ్యన గనుల్లో రక్షణ చర్యలు అంతంత మాత్రంగానే ఉండడంతో కార్మికులు భయం భయంగా పనిచేసేవారు. తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో కొందరు కార్మికులు పనికి వచ్చేవారు కాదు. దీంతో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలుగకుండా పరుగు పందెం పోటీలు నిర్వహించి భారీ సంఖ్యలో కార్మికులను బదిలీ పిల్లర్లుగా తీసుకున్నారు. ఇలా కార్మికుల సంఖ్య 1.16 లక్షలకు చేరింది. ఈ పరిస్థితుల్లో కొందరు కార్మికులు సంఘాలుగా ఏర్పడి ప్రతీ చిన్న విషయానికి సమ్మెకు దిగేవారు. ఆ సమయంలోనే సింగరేణి కార్మిక సమాఖ్య(సికాస) ఆవిర్భవించగా సమ్మెలు ఉధృతమయ్యాయి. దీంతో గుర్తింపు సంఘం ఏర్పడితే కార్మికులకు – యాజమాన్యానికి మధ్య వారధిగా పని చేస్తుందని లేబర్ కమిషనర్, కార్మిక సంఘాలు ఒక అవగాహనకు రావడంతో ఎన్నికలకు శ్రీకారం చుట్టినట్టయింది. మొదట్లో గుర్తింపు సంఘాలు కార్మికులకు మేలు చేసేలా ఉండేవని, ఇటీవల కొంత కాలంగా ఎన్నికైన సంఘాలు యాజమాన్యానికి తొత్తులుగా మారి కార్మికులకు అన్యాయం చేస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

11న మెడికల్ కౌన్సిల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు

సాక్షి, హైదరాబాద్: సుదీర్ఘ న్యాయ పోరాటం అనంతరం (దాదాపు 17 ఏళ్ల తర్వాత) తెలంగాణ మెడికల్ కౌన్సిల్ (టీఎంసీ) ఏర్పాటు కానుంది. ఈ కౌన్సిల్ సారథుల గెలుపోటముల్ని నిర్ధారించేందుకు ఈ నెల 11న హైదరాబాద్ కోఠిలోని టిఎంసీ ఆవరణలో కౌంటింగ్ ప్రారంభం కానుంది. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన కొన్ని రోజుల్లోనే ఈ కౌన్సిల్ కూడా అవతరించనుండటంతో కౌన్సిల్ కార్యకలాపాలపై వైద్య వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

పోటాపోటీగా సాగిన ఎన్నికలు..

తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌కు ఐదేళ్లకోసారి ఎన్నికలు జరగాల్సి ఉన్నా 2006 తర్వాత మళ్లీ జరగలేదు. దీనిపై హెల్త్ కేర్ రిఫార్మ్స్ డాక్టర్స్ అసోసియేషన్ (హెచ్‌ఆర్‌డీఏ) కొన్నేళ్లపాటు న్యాయపోరాటం చేసింది. చివరకు కోర్టు తీర్పుతో ఆగస్టులో ఎన్నికల ప్రక్రియ మొదలైంది. మొత్తం 13 మందితో కూడిన కౌన్సిల్‌లో గెలుపు కోసం 5 ప్యానెల్స్ నుంచి 96 మంది పోటీపడ్డారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓట్లేసేందుకు వైద్యులకు బ్యాలెట్ పేపర్లు పంపిణీ చేశారు. ఈ పంపిణీ గత నెల 15తో పూర్తవగా ఓట్లు వేసి తిప్పిపంపేందుకు గత నెల 30తో గడువు ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా 48,500 మంది అర్హులైన ఓటర్లు ఉన్నారు.

సమస్యలకు పరిష్కారం

నకిలీ వైద్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు వైద్య రంగానికి సంబంధించిన అనేక అంశాల్లో మెడికల్ కౌన్సిల్ పాత్ర కీలకం. ఇప్పటికే మన కౌన్సిల్ మిగిలిన రాష్ట్రాలతో పోలిస్తే 20 ఏళ్లు వెనుకబడింది. కౌంటింగ్ ప్రక్రియలో అక్రమాలు తావివ్వకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నాం.

– డా.జి.శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ, హెచ్‌ఆర్‌డీఏ

క్లుప్తంగా...

ఉత్తమ్ గడ్డం తీసే టైమొచ్చింది..



కోదాడ: కాంగ్రెస్ సీనియర్ నేత ఉత్తమ్ కుమార్‌రెడ్డి టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, అప్పటి వరకు తాను గడ్డం తీయనని 2018 సెప్టెంబర్ 22న చెప్పారు. అయితే ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘోర పరాజయం పాలైంది. ఉత్తమ్ హుజూర్‌నగర్ నుంచి విజయం సాధించినా, ఆయన సతీమణి పద్మావతి కోదాడ నుంచి ఓటమి పాలయ్యారు. అప్పటి నుంచి తాను అన్నమాటకు కట్టుబడి ఉత్తమ్ గడ్డం తీయకుండా గడిచిన ఐదేళ్లుగా అలాగే ఉన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రావడంతో తాను గడ్డం తీసేస్తానంటూ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇటీవల చెప్పారు. త్వరలో గడ్డం లేని ఉత్తమ్‌ను చూడొచ్చు.

కొత్త ప్రభుత్వానికి టీఎన్జీవో మద్దతు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఏర్పడే కాంగ్రెస్ ప్రభుత్వానికి టీఎన్జీవో కేంద్ర సంఘం మద్దతు ప్రకటించింది. ప్రభుత్వానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్, అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, సత్యనారాయణ గౌడ్, కోశాధికారి రామినేని శ్రీనివాస రావు ఒక ప్రకటనలో తెలిపారు. పది లక్షల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల కుటుంబాల ఆకాంక్షల మేరకు తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడాన్ని ఎన్జీవోల సంఘం పక్షాన హర్షం వ్యక్తం చేస్తున్నట్టు తెలిపారు.

సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రకటన పట్ల ఓయూ జేఏసీ హర్షం

ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేయడం పట్ల ఓయూ విద్యార్థి జేఏసీ చైర్మన్ ఓరుగంటి కృష్ణ, అధ్యక్షుడు బైరు నాగరాజుగౌడ్ హర్షం వ్యక్తంచేశారు. మంగళవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట బాణసంచా కాల్చి స్వీట్లు పంచి పెట్టారు. ముఖ్యమంత్రిగా ఈనెల 7న పదవీ బాధ్యతలు స్వీకరించనున్న రేవంత్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. రేవంత్‌రెడ్డి రాకతో యూనివర్సిటీల సమస్యల పరిష్కారంతో పాటు రైతులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, ఇతర వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు.

రేవంత్‌కి ట్రెసా శుభాకాంక్షలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సీఎంగా బాధ్యతలు స్వీకరించనున్న రేవంత్‌రెడ్డికి రాష్ట్ర రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్(ట్రెసా) శుభాకాంక్షలు తెలిపింది. ఈ సందర్భంగా కొత్త ప్రభుత్వం ఏర్పాటు కాబోతుండటం హర్షణీయమని ట్రెసా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వంగ రవీందర్‌రెడ్డి, కె.గౌతమ్ కుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో సంతోషం వ్యక్తం చేశారు. నూతన ప్రభుత్వం ఉద్యోగుల హక్కుల రక్షణ, ప్రజల సంక్షేమానికిపాటు పడుతుందని వారు ఆకాంక్షించారు. కొత్త ప్రభుత్వం రెవెన్యూ శాఖను పటిష్టపరిచి, గ్రామస్థాయి రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరించాలని కోరారు.

సీఎంగా రేవంత్‌రెడ్డి ఎన్నికపై ఎస్‌సీపీఎస్‌ఈయూ హర్షం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర మూడో సీఎంగా రేవంత్‌రెడ్డిని ఎన్నుకోవడంపై రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ (ఎస్‌సీపీఎస్‌ఈయూ) హర్షం వ్యక్తంచేసింది. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ, ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, కోశాధికారి నరేశ్‌గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. సీపీఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులు ప్రభుత్వంతో కలిసి సమన్వయం చేసుకుని రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ముందుంటామని పేర్కొన్నారు. రెండు దశాబ్దాల సీపీఎస్ ఉద్యోగుల పాత పెన్షన్ ఆకాంక్షను నెరవేర్చబోతున్న సీఎంకు మూడు లక్షల కుటుంబాలు రుణపడి ఉంటాయని తెలిపారు.

రేవంత్‌రెడ్డికి జర్నలిస్ట్ సంఘాల శుభాకాంక్షలు

సాక్షి, హైదరాబాద్: సీఎల్పీ నేతగా ఎన్నికై రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఈ నెల 7న పదవీబాధ్యతలు చేపట్టనున్న రేవంత్‌రెడ్డికి తెలంగాణ జర్నలిస్టుల అధ్యయన వేదిక, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ శుభాకాంక్షలు తెలిపాయి. గురువారం ప్రమాణస్వీకారం చేయనున్న సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రివర్గానికి అభినందనలు తెలియజేస్తున్నట్టు అధ్యయన వేదిక అధ్యక్షుడు బోదనపల్లి వేణుగోపాల్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి సాదిక్, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధానకార్యదర్శులు వేర్వేరు ప్రకటనల్లో అభినందనలు తెలిపారు. జర్నలిస్టులపై అక్రమ కేసులను ఎత్తివేయాలని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య కోరారు. జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని మరో ప్రకటనలో కోరారు.

బాలకృష్ణ అభినందనలు

తెలంగాణ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా వారి ఆకాంక్షలను నేరవేర్చాలని, అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో సీఎం రేవంత్‌రెడ్డి ముందుకు తీసుకెళతారని ఆశిస్తున్నానని సినీహీరో నందమూరి బాలకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రమాణ స్వీకారం రోజునే 6 గ్యారంటీలపై సంతకాలు

- కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో సర్వత్రా ఆసక్తి
- ఆ హామీల అమలుకు ఏటా రూ.88 వేల కోట్లు అవసరం అనే అంచనాలు
- పూర్తిస్థాయిలో అమలు చేస్తే ఈ మొత్తం భారీగా పెరిగే అవకాశం
- ఒక్క రైతు భరోసాకే రూ.29 వేల కోట్లు అవసరం!
- చేయూతకు రూ. 21 వేల కోట్లు, ఇందిరమ్మ ఇళ్లకు రూ.15 వేల కోట్లు!



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ శాసనసభా పక్ష (సీఎల్పీ) నేతగా టీపీసీసీ అధ్యక్షుడు ఎనుముల రేవంత్‌రెడ్డిని ఎంపిక చేశామని, ఈ నెల 7న ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారని కాంగ్రెస్ హైకమాండ్ ప్రకటించింది. దీంతో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోలోని 'ఆరు గ్యారంటీ'ల అమలుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. గతంలో ప్రకటించిన విధంగా ప్రమాణ స్వీకారోత్సవం రోజునే ఆరు గ్యారెంటీలపై సంతకాలు చేసే అవకాశాలు కన్పిస్తున్నాయి. ప్రధానంగా మహిళలు, రైతులు, విద్యార్థులు, ఇళ్లు లేని పేద కుటుంబాలు, నిస్సహాయుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ పార్టీ ఈ హామీలను ప్రకటించడంతో ఆయా వర్గాల్లో భారీగా ఆశలు రేకెత్తాయి. కాగా ఈ హామీల అమలుకు ఏటా కనీసం రూ.88 వేల కోట్ల నిధులు అవసరం అవుతాయని ఓ అంచనా. అయితే పూర్తి స్థాయిలో ఆరు గ్యారంటీలను అమలు చేస్తే మాత్రం నిధుల అవసరాలు రూ.లక్ష కోట్లకు చేరే అవకాశం ఉందని అంటున్నారు. మేనిఫెస్టోలో ఆరు గ్యారంటీలతో పాటు పెద్ద సంఖ్యలో ఇతర హామీలను కూడా కాంగ్రెస్ పార్టీ ఇచ్చింది. వీటి అమలుకు మరిన్ని రూ.వేల కోట్ల నిధులు అవసరం కానున్నాయి. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోగా ఎన్నికల హామీలను అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఆరు గ్యారంటీల అమలుకు అవసరం కానున్న నిధులపై 'సాక్షి' విశ్లేషణాత్మక కథనం..

మహాలక్ష్మికి రూ.10 వేల కోట్లు!

మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ప్రతి నెలా రూ.2,500 చొప్పున ఆర్థిక సహాయం, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. రాష్ట్రంలో దాదాపు 20 లక్షలకు పైగా నిస్సహాయ పేద మహిళలకు కొత్తగా నెలకు రూ.2500 చొప్పున సహాయం అందించాల్సి ఉండనుందని అంచనా. ఈ లెక్కన ఏటా రూ.6 వేల కోట్ల వ్యయం కానుంది.

- ప్రస్తుతం హైదరాబాద్‌లో 14.2 కేజీల డొమెస్టిక్ ఎల్పీజీ గ్యాస్ సిలిండర్‌ను రూ.955కు విక్రయిస్తున్నారు. రాష్ట్రంలో 1.28 కోట్ల డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లుండగా, రోజుకు 1.8 లక్షల నుంచి 2 లక్షల సిలిండర్లను విక్రయిస్తున్నారు. ఈ లెక్కన రూ.500కే గ్యాస్ సిలిండర్‌ను అందించడానికి ఏటా కనీసం రూ.2,923.65 కోట్ల గ్యాస్ సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సి ఉంటుంది. గ్యాస్ ధర పెరిగిన కొద్దీ ఈ భారం పెరుగుతుంది.
- మహిళలకు ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించడానికి సుమారుగా రూ.2,200 కోట్ల వ్యయం కానుంది. కేవలం పల్లె వెలుగు బస్సుల్లో ఈ సదుపాయం కల్పిస్తే రూ.750 కోట్లు కానున్నాయి.

గృహజ్యోతికి రూ.3,431.03 కోట్లు..

గృహజ్యోతి పథకం కింద ఇళ్లకు 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ సరఫరాకు ఏటా రూ.3,431.03 కోట్ల సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వం అందించాల్సి ఉంటుందని అంచనా. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం గృహ వినియోగదారులకు అందిస్తున్న సబ్సిడీలు, క్రాస్ సబ్సిడీలను కొనసాగిస్తూ అదనంగా ఈ మేరకు నిధులివ్వాల్సి ఉంటుంది. రాష్ట్రంలో మొత్తం గృహ కేటగిరీ విద్యుత్ కనెక్షన్లు 1.20 కోట్లు కాగా, అందులో 1.05 కోట్ల కనెక్షన్లు (87.9 శాతం గృహాలు) నెలకు 200 యూనిట్ల లోపు విద్యుత్‌ను మాత్రమే వినియోగిస్తున్నాయి.

రైతు భరోసాకు రూ.29 వేల కోట్లు!

రైతు భరోసా పథకం కింద రైతులు, కౌలు రైతులకు ఎకరానికి రూ.15,000 చొప్పున, వ్యవసాయ కూలీలకు రూ.12,000 చొప్పున ఆర్థిక సహాయం, వరి పంటకు క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. రాష్ట్రంలో 25 లక్షల మంది రైతు కూలీలున్నట్టు అంచనా. వీరికి రూ.12 వేలు చొప్పున ఇవ్వడానికి ఏటా రూ.3 వేల కోట్లు అవసరం కానున్నాయి. అలాగే ఎకరానికి రూ.15 వేలు చొప్పున రాష్ట్రంలోని 69 లక్షల మంది రైతులకు ఇచ్చేందుకు ఏటా రూ.22,500 కోట్లు, 6 లక్షల మంది కౌలు రైతులకు ఏటా రూ.3,000 కోట్ల సాయం అందించాల్సి ఉంటుంది. ఏటా సుమారు కోటిన్నర టన్నుల ధాన్యం సేకరిస్తుండగా, టన్నుకు రూ.500 చొప్పున రూ.750 కోట్లను ఇవ్వాల్సి ఉండనుంది. ఈ లెక్కన మొత్తం రైతు భరోసాకు ఏటా సుమారు రూ.29 వేల కోట్లు అవసరం అని అంచనా.

ఇందిరమ్మ ఇళ్లకు రూ.15 వేల కోట్లు

ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇల్లు లేని వారికి ఇంటి స్థలం, రూ.5 లక్షల ఆర్థిక సహాయం, ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. దశల వారీగా ఈ పథకం అమలు చేసే అవకాశం ఉంది. ఏటా ఎన్ని కుటుంబాలకు వర్తింపజేస్తారన్న అంశంపై స్పష్టత వచ్చాకే అందుకు అవసరం కానున్న నిధులపై స్పష్టత రానుంది. బీఆర్‌ఎస్ ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా 15 లక్షల ఇళ్లు లేని కుటుంబాలు దరఖాస్తు చేసుకున్నాయి. ఇళ్లులేని పేద కుటుంబాలు దాదాపుగా ఇదే సంఖ్యలో ఉంటాయని అంచనా వేయవచ్చు. ఐదేళ్ల టర్మ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం మొత్తం 15 లక్షల కొత్త ఇళ్లను నిర్మించాలని నిర్ణయిస్తే, ఏటా కనీసం 3 లక్షల ఇళ్లను నిర్మించాల్సి ఉంటుంది. ఈ లెక్కన ఏటా రూ.15 వేల కోట్ల నిధులు అవసరం అవుతాయని అంచనా.

చేయూతకు రూ. 21 వేల కోట్లు

చేయూత పథకం కింద నెలకు రూ.4వేల పెన్షన్, రూ.10 లక్షల ఆరోగ్యశ్రీ బీమా అమలు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ప్రస్తుతం రాష్ట్రంలో ఆసరా పథకం కింద మొత్తం 43,68,784 మంది వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, చేనేత, కల్లు గీత, బీడీ కార్మికులు, ఫైలేరియా, ఎయిడ్స్, డయాలసిస్ బాధితులు, ఒంటరి మహిళలు ప్రతి నెలా పెన్షన్లు అందుకుంటున్నారు. వీరికి రూ.4 వేల పెన్షన్ చెల్లిస్తే ఏటా సుమారు రూ.20,970 కోట్లు అవసరం అవుతాయి. రూ.10 లక్షల ఆరోగ్యశ్రీ బీమా అమలుకు అదనంగా నిధులు అవసరం కానున్నాయి.

యువ వికాసానికి రూ.10 వేల కోట్లు?

విద్యార్థులకు రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు, ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటు విషయంలో.. ఏ స్థాయి విద్య కోసం ఎంత మంది విద్యార్థులకు ఈ పథకాన్ని వర్తింపజేస్తారు అనే అంశంపై స్పష్టత వస్తేనే ఈ పథకం అమలుకు అవసరం కానున్న నిధులను అంచనా వేయడానికి వీలుంది. ఏటా 2 లక్షల మంది విద్యార్థులకు ఈ పథకం వర్తింపజేస్తే రూ.10 వేల కోట్ల నిధులు అవసరం కానున్నాయి.

భట్టికి డిప్యూటీ సీఎం+పీసీసీ పగ్గాలు?

- కాంగ్రెస్ హైకమాండ్ ఆఫర్
- పీసీసీ చీఫ్ పదవిని ఆయన వద్దంటే బీసీ నేత పొన్నంకు అవకాశం
- మంత్రి పదవితో పాటు బోనస్‌గా ఇచ్చే చాన్స్
- మధుయాష్కీ, మహేశ్‌కుమార్, జీవన్‌రెడ్డి, షబ్బీర్ అలీ, మల్లు రవిల పేర్లు కూడా పరిగణనలోకి



సాక్షి, హైదరాబాద్: ప్రస్తుతం టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ హైకమాండ్ సీఎల్పీ నాయకుడిగా ఎంపిక చేసిన నేపథ్యంలో కొత్త పీసీసీ అధ్యక్షుడు ఎవరన్నది ఆ పార్టీ వర్గాల్లో చర్చనీయాంశమవుతోంది. రేవంత్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పీసీసీ అధ్యక్షుడిగా కొనసాగే అవకాశం లేక పోవడంతో ఆయన స్థానంలో కొత్త నేతను అధిష్టానం ఎంపిక చేయనుంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత సీఎల్పీ నేత భట్టి విక్రమార్కతో పాటు హుస్నాబాద్ ఎమ్మెల్యే, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, షబ్బీర్‌అలీ, మల్లురవిల పేర్లు కూడా వినిపిస్తున్నాయి. కాగా సీఎల్పీ నాయకుడి ఎంపిక కసరత్తు కోసం ఢిల్లీ వెళ్లిన భట్టి ముందు అధిష్టానం ఓ ప్రతిపాదన చేసినట్టు తెలిసింది. కొత్త ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి హోదాతో పాటు పీసీసీ అధ్యక్ష బాధ్యతలు కూడా తీసుకోవాలని కేసీ వేణుగోపాల్ కోరినట్టు సమాచారం. అయితే సీఎం పదవి కావాలని అధిష్టానం వద్ద పట్టుబట్టిన భట్టి, ఈ విషయంలో ఏమీ తేల్చి చెప్పలేదని చెబుతున్నారు.

బీసీ కోటాలో పలువురి పేర్ల పరిశీలన!

పీసీసీ చీఫ్ పదవిని భట్టి నిరాకరించిన పక్షంలో.. సీఎం రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడం, డిప్యూటీ సీఎం ఎస్సీ నేతకు ఇచ్చే పక్షంలో పీసీసీ అధ్యక్ష పదవి బీసీలకు ఇవ్వాలనే ఆలోచనలో హైకమాండ్ ఉన్నట్టు సమాచారం. ఈ కోటాలో వినిపిస్తున్న మొదటి పేరు పొన్నం ప్రభాకర్. విద్యార్థి దశ నుంచే కాంగ్రెస్ రాజకీయాల్లో చురుకుగా పాల్గొంటున్న ప్రభాకర్.. అటు పార్టీకి, ఇటు గాంధీ కుటుంబానికి విధేయుడిగా గుర్తింపు పొందారు. ఎంపీగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఎంపీల ఫోరం కన్వీనర్‌గా పనిచేసిన పొన్నం ఇటీవల జరిగిన ఎన్నికల్లో హుస్నాబాద్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో కొత్త ప్రభుత్వంలో ఆయనకు మంత్రి పదవి ఇవ్వడంతో పాటు పీసీసీ అధ్యక్ష పదవి ఇస్తారనే చర్చ జరుగుతోంది. గతంలో డి.శ్రీనివాస్ కూడా పీసీసీ అధ్యక్షుడిగా ఉండి మంత్రిపదవి నిర్వహించడాన్ని దృష్టిలో పెట్టుకుని అధిష్టానం ఈ ప్రతిపాదనపై చర్చ జరుపుతోందని తెలుస్తోంది. అది సాధ్యం కాని పక్షంలో మరో ఇద్దరు బీసీ నేతలు మధుయాష్కీగౌడ్, మహేశ్‌కుమార్‌గౌడ్‌ల పేర్లు కూడా పరిగణనలోకి తీసుకునే అవకాశం లేకపోలేదని అంటున్నారు. అలాగే సామాజిక సమీకరణలను బట్టి సీనియర్ నేతలైన ప్రస్తుత ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి, మైనార్టీ నేత షబ్బీర్‌అలీ, మాజీ ఎంపీ మల్లురవిల పేర్లను కూడా హైకమాండ్ పరిశీలించే అవకాశముందనే చర్చ జరుగుతోంది.

టీజేఎస్ కార్యాలయానికి కాంగ్రెస్ నేతలు..

అమరవీరుల సంక్షేమంలో కోదండరాంకు ప్రాధాన్యం



సాక్షి, హైదరాబాద్: ఇటీవల జరిగిన ఎన్నికల్లో తమతో కలిసి పనిచేసిన తెలంగాణ జనసమితి(టీజేఎస్) కార్యాలయానికి రాష్ట్ర కాంగ్రెస్ నేతలు వెళ్లారు. మంగళవారం మధ్యాహ్నం టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ మల్లు రవి, ప్రధానకార్యదర్శి చరణ్‌కౌశిక్ యాదవ్, అధికార ప్రతినిధి భవానీరెడ్డి తదితరులు నాంపల్లిలోని టీజేఎస్ రాష్ట్ర కార్యాలయానికి వెళ్లి ఆ పార్టీ అధ్యక్షుడు కోదండరాంతో భేటీ అయ్యారు. ఎన్నికల్లో తమతో కలిసి పనిచేసినందుకు కృతజ్ఞతలు తెలిపిన మల్లు రవి భవిష్యత్తులోనూ ఇదే తరహా సహకారం అందించాలని కోదండరాంను కోరారు. ఈ సందర్భంగా రెండు పార్టీలు కలిసి అనుసరించాల్సిన వ్యూహాలు, కామన్ ఎజెండాపై చర్చ జరిగిందని, అమరవీరుల సంక్షేమం అమలు చేయడంలో కోదండరాంకు తగిన ప్రాధాన్యం ఇస్తామని మల్లు రవి వెల్లడించారు.



కొండారెడ్డిపల్లిలో టపాసులు కాల్చి సంబరాలు చేసుకుంటున్న గ్రామస్తులు

రేవంత్ స్వగ్రామంలో సంబరాలు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/వంగూరు: కాంగ్రెస్ అధిష్టానం రేవంత్‌రెడ్డిని సీఎంగా ప్రకటించగానే ఆయన స్వగ్రామమైన నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం కొండారెడ్డిపల్లిలో సంబరాలు అంబరాన్నంటాయి. మంగళవారం సాయంత్రం గ్రామ ప్రజలు రోడ్లమీదకు వచ్చి టపాకాయలు కాల్చి డీజే పాటలకు డ్యాన్సులు చేశారు. మా మధ్యలో పెరిగిన మా రేవంత్ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం ఎంతో సంతోషంగా ఉందని గ్రామస్తులు తెలిపారు.

విద్యార్థి దశ నుంచే తెలివైనవాడు



రేవంత్‌రెడ్డి తాండ్ర ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదివినప్పుడు నేను టీచర్‌గా పనిచేశాను. అప్పుడే తరగతిగదిలో రేవంత్ మక్కువను నేను గమనించేవాడిని. భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి ఎదుగుతాడని అనుకున్నాను. నేను చదువు చెప్పిన విద్యార్థి ఇప్పుడు రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం గర్వంగా ఉంది.

– జగన్‌మోహన్‌రెడ్డి, రిటైర్డ్ హెచ్‌ఎం, తాండ్ర

చిన్నప్పటి నుంచే రాజకీయాలపై ఆసక్తి



రేవంత్‌రెడ్డి నాకు క్లాస్‌మేట్, బంధువు కూడా. చిన్నప్పటి నుంచి కూడా రాజకీయాలపై ఆసక్తి ఎక్కువ. చదువులోనే కాకుండా ఆటల్లోనూఉత్సాహం కనబరిచేవాడు. ఒకటి నుంచి 5వ తరగతి వరకు కొండారెడ్డిపల్లిలో, 6వ తరగతి తాండ్ర గ్రామంలో చదువుకున్నాం. నా స్నేహితుడు రాష్ట్రానికి సీఎం కావడం ఎంతో గర్వంగా ఉంది.

– కేవీఎస్ రెడ్డి, వంగూరు జెడ్పీటీసీ, రేవంత్‌రెడ్డి స్నేహితుడు

నా సంతోషానికి అవధుల్లేవు



రాజకీయ నేపథ్యం లేకున్నా కృషి, పట్టుదలతో ఉన్నత శిఖరాలను చేరుకున్నాడు. నా స్నేహితుడు తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం నాతో పాటు మా గ్రామస్తులంతా గర్వపడుతున్నాం. ఐదో తరగతి వరకు కొండారెడ్డిపల్లిలో ఒకే పాఠశాలలో చదువుకున్నాం.

– ధర్మారెడ్డి, రేవంత్‌రెడ్డి స్నేహితుడు

అసెంబ్లీలోకి 19 మంది బీసీ ఎమ్మెల్యేలు

వైవిధ్యభరితంగా 13 కులాలకు ప్రాతినిధ్యం..

సాక్షి, హైదరాబాద్: తాజా అసెంబ్లీ ఎన్నికల్లో బీసీ నినాదం చర్చనీయాంశమైంది. రాష్ట్ర జనాభాలో 52 శాతానికిపైగా బీసీలున్నారనే అంచనాల మధ్య ఈ వర్గాల ఓట్ల సాధనకు ప్రధాన పార్టీలు పోటీపడ్డాయి. మొత్తంగా చూస్తే ఈ ఎన్నికల్లో వివిధ పార్టీల నుంచి 19 మంది బీసీలుఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. 2018 ఎన్నికల్లో 22 మంది బీసీ ఎమ్మెల్యేలు గెలుపొందగా, ఈసారి వారి సంఖ్య స్వల్పంగా తగ్గింది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఈసారి బీసీ నినాదాన్ని ఎత్తుకోవడంతో పాటు తమ పార్టీని గెలిపిస్తే బీసీ నేతను సీఎంగా చేస్తామంటూ ప్రకటించింది. ఎన్నికల మేనిఫెస్టోలోనూ దానిని ప్రముఖంగా ప్రస్తావించి ప్రచారం చేసింది. ఉమ్మడి ఏపీలో కానీ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కానీ బీసీవర్గానికి చెందిన వారెవరూ సీఎం కాకపోవడంతో ఆ దిశలో తమ పార్టీ కృషి చేస్తుందని హామీనిచ్చింది. దీనికి తగ్గట్టుగానే పార్టీ పోటీ చేసిన 111 స్థానాల్లో 36 సీట్లు బీసీ వర్గాలకు చెందినవారికి బీజేపీ కేటాయించింది. ఈ ఎన్నికల్లో బీసీలకు బీఆర్‌ఎస్–23, కాంగ్రెస్–24 టికెట్లు కేటాయించాయి. ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నుంచి 8 మంది, బీఆర్‌ఎస్ నుంచి 8 మంది, బీజేపీ నుంచి ముగ్గురు బీసీ ఎమ్మెల్యేలు గెలుపొందారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో 19 బీసీ ఎమ్మెల్యేలు గెలవగా, అందులో ఎక్కువ కులాలకు ప్రతినిధ్యం లభించడం గమనార్హం. వివిధ పార్టీల నుంచి నెగ్గిన బీసీ నేతలను గమనిస్తే... గౌడ సామాజికవర్గానికి చెందిన వారు నలుగురు, మున్నూరుకాపులు–3, పద్మశాలీలు– ఇద్దరు, ముదిరాజ్, యాదవ, కురుమ, గంగపుత్ర, వంజరి, లోథా, పెరిక, ఆరె మరాఠా, రజక, ఠాకూర్ సామాజికవర్గాలకు చెందిన ఒక్కొక్కరు చొప్పున గెలిచి శాసనసభలోకి అడుగుపెట్టబోతున్నారు.

రేవంత్‌రెడ్డికి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శుభాకాంక్షలు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: తెలంగాణ ముఖ్యమంత్రిగా ఎంపికైన రేవంత్‌రెడ్డికి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అభినందనలు తెలియ జేశారు. తెలంగాణ రాష్ట్ర ద్వితీయ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్న రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌పై పెట్టు కున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా వారి ఆకాంక్షను నెరవేర్చడం ఒక్క ఇందిరమ్మ రాజ్యంలోనే సాధ్యమని పేర్కొన్నారు. సోనియాగాంధీకి జన్మ దిన కానుకగా తెలంగాణ ప్రజలు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇచ్చారని పేర్కొన్నారు. రాష్ట్రంలో పార్టీ అధికారం సాధించడానికి సర్వశక్తులు ఒడ్డిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, నేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ, ఇతర నేతలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. పోరాట గడ్డపై కాంగ్రెస్‌పార్టీ కొత్తశకాన్ని ప్రారంభించబోతోందని వెల్లడించారు.

సామాజిక కోణంలో కేబినెట్ కూర్పు

▶ మొదటి పేజీ తరువాయి

లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి (నల్లగొండ), పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి (ఖమ్మం), సుదర్శన్‌రెడ్డి (నిజామాబాద్)లకు మంత్రివర్గంలో స్థానం ఖరారైనట్టేనని తెలుస్తోంది. టి.రామ్మోహన్‌రెడ్డి (రంగారెడ్డి), దొంతి మాధవరెడ్డి (వరంగల్)ల పేర్లు కూడా వినిపిస్తున్నాయి. ఒకటి లేదా రెండు విప్ పదవులు కూడా ఈ సామాజిక వర్గానికి లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. విప్‌లుగా ఉన్నత విద్యావంతులైన మహిళలు పరణికారెడ్డి, యశస్వినిరెడ్డిల్లో ఒకరికి అవకాశం లభిస్తుందని తెలుస్తోంది. వీరితో పాటు మల్‌రెడ్డి రంగారెడ్డి (రంగారెడ్డి), కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి (నల్లగొండ)లకు కూడా ప్రభుత్వంలో ప్రాధాన్య పదవులు లభించే అవకాశాలున్నాయి. ఇక వెలమ సామాజిక వర్గానికి చెందిన ప్రేంసాగర్ రావు, జూపల్లి కృష్ణారావులలో ఒకరికి లేదంటే ఇద్దరికీ మంత్రిగా అవకాశం దక్కనుంది. బ్రాహ్మణ సామాజిక వర్గం నుంచి గెలిచిన ఏకైక ఎమ్మెల్యే, మాజీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు మరోమారు కేబినెట్ మంత్రి బాధ్యత అప్పగించడం ఖాయమేనని, ఆయనకు విద్య లేదా ఐటీ శాఖ అప్పగించవచ్చనే చర్చ జరుగుతోంది.

బీసీలలో వీరికే..

తాజా ఎన్నికల్లో బీసీ సామాజిక వర్గానికి 8 మంది కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. వీరిలో పొన్నం ప్రభాకర్ (హుస్నాబాద్)కు కేబినెట్ బెర్తు ఖరారయిందనే చర్చ జరుగుతోంది. ఈయనతో పాటు మహిళా కోటాలో కొండా సురేఖ (వరంగల్ ఈస్ట్) పేరు ప్రకటన కూడా లాంఛన ప్రాయమేనని తెలుస్తోంది. ఈ ఇద్దరితో పాటు మరొకరికి అవకాశం ఇవ్వొచ్చనే చర్చ జరుగుతోంది. రాష్ట్రంలోని ప్రధాన సామాజిక వర్గాలకు చెందిన ఆది శ్రీనివాస్ (మున్నూరుకాపు), వాకిటి శ్రీహరి (ముదిరాజ్), బీర్ల అయిలయ్య (యాదవ్)లలో ఒకరికి చాన్స్ దొరకొచ్చని అంటున్నారు.

ఎస్సీ కోటాలో రాజనర్సింహ ఖరారు

దళిత ఎమ్మెల్యేలకు కూడా కొత్త కేబినెట్‌లో తగిన ప్రాధాన్యం ఇచ్చేలా అధిష్టానం కసరత్తు సాగుతోంది. మాల సామాజిక వర్గానికి చెందిన భట్టిని ఉప ముఖ్యమంత్రిగా నియమించనున్న నేపథ్యంలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన దామోదర రాజనర్సింహ (ఆంథోల్)కు కీలక శాఖ అప్పగించవచ్చని తెలుస్తోంది. ఆయనతో మాదిగ వర్గానికే చెందిన మరొక నాయకుడికి కూడా అవకాశాలున్నాయని అంటున్నారు. మాల సామాజిక వర్గానికి చెందిన ఓయూ విద్యార్థి నాయకుడు మేడిపల్లి సత్యంకు విప్ పదవి వస్తుందని, ఆయనతో పాటు మాదిగ సామాజిక వర్గానికి చెందిన వేముల వీరేశం (నకిరేకల్)కు కూడా విప్ హోదా కల్పించే ప్రతిపాదనలున్నాయని సమాచారం. ఇక ఎస్టీ కోటాలో ధనసరి అనసూయ (సీతక్క)కు మంత్రి పదవి ఖాయమైనట్టే. ఆమెకు డిప్యూటీ సీఎం హోదా ఇస్తారనే ప్రచారం కూడా జరుగుతోంది. ఆదివాసీ వర్గాలకు చెందిన ఆమెతో పాటు లంబాడా సామాజిక వర్గం నుంచి ఎస్.బాలూనాయక్ (దేవరకొండ), రామచంద్రనాయక్ (డోర్నకల్)ల పేర్లు వినిపిస్తున్నాయి.

ఖాళీగా కొన్ని బెర్తులు?

పార్టీ ఎక్కువ స్థానాలు గెలుచుకున్న నల్లగొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్, కరీంనగర్, వరంగల్ జిల్లాలకు ఎక్కువ ప్రాధాన్యత కల్పించే ఆలోచనలో కాంగ్రెస్ అధిష్టానం ఉన్నట్టు సమాచారం. ఎమ్మెల్యేలుగా గెలుపొందిన వారిలో ముఖ్యమంత్రిని, మంత్రులుగా మరో 17 మందిని నియమించే అవకాశం ఉండడంతో ఆ మేరకు ఒకేసారి భర్తీ చేస్తారా.. రెండు నుంచి నాలుగు బెర్తులను ఖాళీగా ఉంచి తొలిసారి ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని పూర్తి చేస్తారా అన్నది తేలాల్సి ఉంది. ప్రాంతాల వారీ ప్రాధాన్యతల దృష్ట్యా హైదరాబాద్ లాంటి జిల్లాలకు కూడా మంత్రి పదవులు ఇవ్వాలంటే ఎమ్మెల్సీలుగా అవకాశం కల్పించాల్సి ఉన్న నేపథ్యంలో అన్ని బెర్తులనూ నింపకపోవచ్చని తెలుస్తోంది. ఇలా మంత్రివర్గంలో స్థానంపై ఆశలు పెట్టుకున్న అనేకమంది.. ఏఐసీసీ పెద్దలు, తమకు సన్నిహితులైన ఇతర రాష్ట్రాలకు చెందిన కీలక నేతలతో లాబీయింగ్ చేస్తుండటం గమనార్హం.

మంత్రివర్గంలో చేరేందుకు సీపీఐ ఆసక్తి?

రేవంత్‌తో సీపీఐ నేతల భేటీ



రేవంత్‌ను అభినందిస్తున్న కూనంనేని, నారాయణ, చాడ వెంకట్‌రెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో సీపీఐ నేతలు మంగళవారం ఎల్లా హోటల్‌లో భేటీ అయ్యారు. ఆ పార్టీ జాతీయ కార్యదర్శి నారాయణ, రాష్ట్ర కార్యదర్శి, నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, పార్టీ నేతలు చాడ వెంకట్‌రెడ్డి, పల్లా వెంకట్‌రెడ్డి తదితరులు రేవంత్‌ను కలిసి అభినందించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ, తమను మంత్రివర్గంలోకి కాంగ్రెస్ పార్టీ ఆహ్వానిస్తే ఆలోచిస్తామని వ్యాఖ్యానించినట్టు తెలిసింది. దీనిపై చాడ వెంకటరెడ్డిని ప్రశ్నించగా, తమకు అలాంటి ఆలోచన లేదనీ, అయితే కాంగ్రెస్ ఆహ్వానిస్తే ఆలోచిస్తామని మాత్రమే చెప్పామన్నారు. అంటే సీపీఐకి ఈ ప్రభుత్వంలో నేరుగా భాగస్వామ్యం కావాలన్న ఆలోచన ఉన్నట్లుగా సీపీఐ వర్గాలు చెబుతున్నాయి.

ఒక్క సీటు గెలిస్తే మంత్రి పదవి వస్తుందా?

అయితే, ఒక్క సీటు గెలిచిన సీపీఐకి కాంగ్రెస్ పార్టీ మంత్రి పదవి ఇచ్చే పరిస్థితి ఉండదనీ, కాంగ్రెస్‌లో ఉన్న వారికే సర్దుబాటు చేయడం కష్టమని అంటున్నారు. పైగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్‌కు సీనియర్ నేతలు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు వంటి వారు ఉన్నప్పుడు సీపీఐకి ఇవ్వడం సాధ్యం కాదని అంటున్నారు.

ప్రతిపాదిస్తే ఆలోచిస్తాం: నారాయణ

మంత్రివర్గంలో చేరాలని కాంగ్రెస్ పార్టీ ప్రతిపాదిస్తే ఆలోచన చేసి నిర్ణయం తీసుకుంటామని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ వ్యాఖ్యానించారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టూరిజం అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయంలో జరిగిన అగ్నిప్రమాదంపై జ్యూడీషియల్ విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మారిన నేపథ్యంలో వందల కోట్ల రూపాయలు దుర్వినియోగం బయటపడుతుందని భావించి విలువైన దస్త్రాలను తగులబెట్టారని విమర్శించారు. తెలంగాణ మినహా మిగతా రాష్ట్రాల్లో కాంగ్రెస్ సంకుచిత వైఖరిని ప్రదర్శించిందని విమర్శించారు. దేశంలో బీజేపీ ప్రమాదకరమని, వ్యవస్థలను నాశనం చేస్తోందని విమర్శించిన ఆయన ఇండియా కూటమి బలపడాలని ఆకాంక్షించారు. కొత్తగూడెం ఎమ్మెల్యేగా గెలుపొందిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ, తాను అసెంబ్లీలో కమ్యూనిస్టు గొంతుకగా, అన్ని కమ్యూనిస్టు పార్టీల ప్రతినిధిగా ఉంటానన్నారు.



నీకు ఏం జరుగుతుందనే భయం వద్దు.
ఎవ్వరి మీదా ఆధారపడవద్దు. మన మొత్తం అస్తిత్వపు రహస్యం భయం లేకుండా ఉండటం!
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 6 డిసెంబర్ 2023

ఇంకా చల్లారని మణిపూర్

ఘర్షణల సమయంలో తప్ప సాధారణ పరిస్థితుల్లో ఎప్పుడూ వార్తలకెక్కని ఈశాన్య భారతం ఇంకా కుదుటపడలేదని మణిపూర్‌లో సోమవారం రెండు సాయుధ బృందాల మధ్య చోటుచేసుకున్న కాల్పుల ఉదంతం తెలియజెబుతోంది. ఈ కాల్పుల్లో 13 మంది యువకులు ప్రాణాలు కోల్పోయారు. ఏడునెలల క్రితం అక్కడ మొదలైన తెగల ఘర్షణల్లో ఇంతవరకూ 175 మంది మరణించారని, 50,000 మంది నిరాశ్రయులయ్యారని గణాంకాలు చెబుతున్నాయి. సుప్రీంకోర్టు నియమించిన కమిటీ ఆ రాష్ట్రంలో పర్యటించి ఎక్కడెక్కడ మారణకాండ జరిగిందో, తాజా పరిస్థితులు ఎలా వున్నాయో వివరిస్తూ నివేదిక సమర్పించింది. దానిపై సర్వోన్నత న్యాయస్థానం రాష్ట్ర ప్రభుత్వానికి పలు ఆదేశాలు కూడా ఇచ్చింది. ఇంతలోనే తాజా ఉదంతం చోటుచేసుకుంది. మే 3 నుంచి వరస బెట్టి జరుగుతున్న దారుణాలు అన్నీ ఇన్నీ కాదు. రాష్ట్రంలో మెజారిటీగా వున్న మెయితీలకూ, కుకీ–చిన్‌లకూ మధ్య తలెత్తిన ఘర్షణలు ఏ స్థాయికి చేరాయంటే మహిళలపై గుంపులు దాడిచేసి వారిని వివస్త్రలను చేయటం, నగ్నంగా వూరేగించి అత్యాచారాలకు తెగబడటం యథేచ్ఛగా సాగాయి. ఇక గృహదహనాలు, ఇతర ఆస్తుల ధ్వంసం వంటివి సరేసరి. ఘర్షణల సందర్భంగా పోలీస్ స్టేషన్లపై, సాయుధ రిజర్వ్ బెటాలియన్ స్థావరాలపై గుంపులు దాడులకు దిగి వేలాది తుపాకులు, రాకెట్ లాంచర్లు, లక్షల తూటాలు అపహరించారు. ఆయుధాలు అప్పగించినవారిపై ఎలాంటి చర్యలూ తీసుకోబోమని ప్రభుత్వం హామీ ఇచ్చినా వీటిల్లో వెనక్కొచ్చినవి స్వల్పం. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు వార్తలు చక్కర్లు కొట్టడం పర్యవసానంగా హింసాత్మక ఘటనలు మొదలుకాగా, అటు తర్వాత జరిగిందంతా ప్రధాన స్రవంతి మీడియా నిర్వాకమని ఎడిటర్స్ గిల్డ్ నిజనిర్ధారణ కమిటీ ఆరోపించింది. అది 'మెయితీ మీడియా'గా మారి పక్షపాతం ప్రదర్శించిందన్నది ఆ కమిటీ అభియోగం. ఆ తర్వాత కమిటీ సభ్యులపై మణిపూర్ సర్కారు కేసులు పెట్టడం, ఆ సభ్యులు సుప్రీంకోర్టును ఆశ్రయించటం వేరే కథ.

రాష్ట్రంలోని 90 శాతం ప్రాంతాలు ఇప్పుడు ప్రశాంతంగా వున్నాయని బీరేంద్ర సింగ్ ప్రకటించి నెల్లాళ్లయింది. అయినా అడపా దడపా ఘర్షణల వార్తలు వస్తూనే వున్నాయి. సోమవారం నాటి ఉదంతం ఈమధ్యకాలంలో పెద్దది. మరణించినవారంతా ఎవరో, ఎక్కడివారో అధికారులు ఇంకా తేల్చలేదు. ఘటన జరిగిన ప్రాంతానికి భద్రతా బలగాల శిబిరం 10 కిలోమీటర్ల దూరంలో వున్నదంటే ఇన్ని నెలల మారణకాండ నుంచి ప్రభుత్వం నేర్చుకున్నదేమీ లేదన్నమాట. హింసాత్మక ఘటనల సంఖ్య తగ్గిందని అధికారులు సంబరపడుతూవుండొచ్చు. కానీ కనబడని హింస పీడిస్తూనే వుంది. సమాజం మొత్తం రెండుగా చీలిపోయింది. మెయితీలు, కుకీలు గతంలో మాదిరి స్వేచ్ఛగా సంచరించలేకపోతున్నారు. నెలల తరబడి సాగిన హింస పర్యవసానంగా ఆప్తుల్ని కోల్పోయి, ఎంతో విధ్వంసం చోటుచేసుకుని భవిష్యత్తు అగమ్యగోచరంగా వున్నచోట అంతా బాగున్నదని చెప్పటం పరిహాసాస్పదం అవుతుంది. కుటుంబాల్ని పోషించుకోవటానికీ, చదువుకోవటానికీ, ఇతరేతర వ్యాపకాల కోసం వెళ్లటానికీ స్వేచ్ఛ లేని ప్రశాంతత వల్ల సాధారణ పౌరులకు ఒరిగేదేముంటుంది? ప్రభుత్వ యంత్రాంగం సమగ్రమైన, అత్యవసరమైన చర్యలు తీసుకొనేవరకూ ఇదంతా సాధ్యపడదు. ముఖ్యంగా ఎక్కడికక్కడ రెండు తెగల నుంచి బాధ్యతాయుత వ్యక్తుల్ని గుర్తించి కమిటీలు ఏర్పాటుచేసి సామరస్యత సాధించే దిశగా ప్రయత్నిస్తే వేరుగా వుండేది. ఇంటర్నెట్ సేవలు పునరుద్ధరించిన 24 గంటల్లోగానే తాజా ఉదంతం చోటుచేసుకోవటం ఆందోళన కలిగించే అంశం. ఏడు నెలల హింసలో ప్రాణాలు కోల్పోయినవారికి సంబంధించిన 88 గుర్తు తెలియని మృతదేహాలు ఏడు నెలలుగా ఇంఫాల్‌లోని రెండు ఆస్పత్రుల శవాల గదుల్లో పడివున్నాయి. రెండు తెగలవారూ భయం భయంగా బతుకుతున్న వర్తమానంలో తమ తమ గ్రామాలొదిలి ఇంఫాల్ వరకూ పోవటం, ఆ మృతదేహాలను గుర్తించటం సాధ్యమేనా? హింస కొనసాగుతున్న కాలంలోనూ, ఆ తర్వాతా తమ వారి జాడ తెలియటం లేదని చెప్పినవారు అనేకులున్నారు. వీరిలో అనేకులు కుకీలు కాగా, మెయితీ తెగకు చెందినవారు కూడా వున్నారు. ఆ మృతదేహాలు కల్లోలం సృష్టించటానికి మయన్మార్ నుంచి వచ్చినవారికి సంబంధించినవేనని అధికారులు చెబుతున్నా అందుకు వారి దగ్గర కచ్చితమైన సాక్ష్యాధారాలు లేవు. ఆదివాసీ నేతల ఫోరం 22 మంది కుకీల జాడ తెలియటం లేదని ఆ మధ్య ప్రకటించింది. గుర్తుతెలియని మృతదేహాల్లో ఇలా అదృశ్యమైనవారివే అధికంగా వుండొచ్చు. ఇక ఎవరి కోసమూ వేచిచూడకుండా ఈ మృతదేహాలను ఖననం చేయాలని సుప్రీంకోర్టు తాజాగా ఆదేశించటం మణిపూర్‌లో విషాదస్థితికి అద్దం పడుతోంది.

ఈపాటికే శాంతి సాధనకు తగిన చర్యలు తీసుకునివుంటే, బాధిత వర్గాల్లో భరోసా కల్పించినట్టయితే 'గుర్తు తెలియని మృతదేహాల' సమస్య వుండేదే కాదు. ఇప్పటికైనా మించిపోయింది లేదు. హింసాత్మక ఘటనలకు కారకులైనవారినీ, ఇప్పటికీ ఉద్రిక్తతలను రెచ్చగొడుతున్నవారినీ గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటే శాంతియుత పరిస్థితులను ఏర్పర్చటం తేలికవుతుంది. ఈనాటికీ ప్రభుత్వం నిష్పక్షపాతంగా వ్యవహరించటం లేదని, అది మెయితీల పట్ల మెతగ్గా వుంటున్నదని ఆదివాసీ సంస్థలు ఆరోపిస్తున్నాయి. ఇలాంటి ఆరోపణలకు తావు లేకుండా చేసినప్పుడే తమ వారి మృత దేహాలను గుర్తించి, సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించటం బాధిత కుటుంబాలకు సాధ్యమవుతుంది. ఆ దిశగా చర్యలు తీసుకోవటం మణిపూర్ సర్కారు బాధ్యత.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు
కార్తీక మాసం, **తిథి:** బ.నవమి రా.12.48 వరకు
తదుపరి దశమి, **నక్షత్రం:** ఉత్తర తె.5.10 వరకు (తెల్లవారితే గురువారం), తదుపరి హస్త. **వర్జ్యం:** ఉ.10.35 నుండి 12.19 వరకు.
దుర్ముహూర్తం: ఉ.11.29 నుండి 12.17 వరకు.
అమృత ఘడియలు: రా.9.06 నుండి 10.54 వరకు.

సూర్యోదయం : 6.20
సూర్యాస్తమయం : 5.21
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

ఈ ఫలితాలు ఏం చెబుతున్నాయి?

దేశంలో అయిదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు అనేక విలువైన అంశాలను వెలుగులోకి తెచ్చాయి. సాంఘిక సంక్షేమం, కుల గణన వంటివాటిని కేంద్రంగా చేసుకొని సాగిన ఎన్నికల పోరులో బీజేపీ ఆధిక్యత స్పష్టమయ్యింది. మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వ విధానాలకు ప్రజలు మద్దతు ఇస్తున్న విషయాన్ని మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లలో బీజేపీ విజయం సూచిస్తోంది. బీజేపీ విజయంలో మహిళా ఓటర్లు కీలక పాత్ర పోషించారనేది ఒక కీలక అంశం.

కాంగ్రెస్ పాఠం నేర్చేనా?

అభిప్రాయం



బద్రీనారాయణ్

మూడు హిందీ ప్రాంత రాష్ట్రాలైన మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లలో బీజేపీ సాధించిన అద్భుతమైన విజయం ఎన్నికల విజయం మాత్రమే కాదు. ఇది భారత రాజకీయాల వర్తమానంతోపాటు భవిష్యత్తు గురించి కూడా వివిధ వ్యక్తావ్యక్త సందేశాలను కలిగి ఉంది. ఉత్తర భారతదేశంలో ఆ పార్టీకి భారీఎత్తున ప్రజాభిమానం ఉందని బీజేపీ విజయాలు తెలియజేస్తున్నాయి. హిందీ ప్రాంత ఓటర్లతో ఆ పార్టీ అంత లోతైన సంబంధాన్ని ఎలా ఏర్పరచుకోగలిగింది, ముఖ్యంగా బీజేపీపై ప్రజల విశ్వాసం గురించి ఈ ఫలితాల నుండి వెలువడుతున్న పెద్ద సందేశం ఏమిటి?

సాంఘిక సంక్షేమ రాజకీయం, రిజర్వేషన్లకు సంబంధించి కులగణన కేంద్రక రాజకీయాలు అనే రెండు ప్రధాన అంశాలను కేంద్రంగా చేసుకొని ఈ ఎన్నికలు జరిగాయి. సంక్షేమ చర్యల రాజకీయాలను ప్రధాన పోటీదారులైన బీజేపీ, కాంగ్రెస్‌లు అనుసరించాయి. బీజేపీ తన ప్రణాళికాబద్ధమైన ఎన్నికల ప్రచారం ద్వారా, డబుల్ ఇంజిన్ సర్కార్‌తో కలిగే ప్రయోజనాలను ప్రచారం చేసింది. ఒకే సమయంలో కేంద్రంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం ఉన్నందున కలిగిన ప్రయోజనాలను ప్రచారంలో ఎత్తి చూపింది బీజేపీ. ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లలో మోదీ ప్రభుత్వం చేపడుతున్న, చేపట్టనున్న సామాజిక సంక్షేమ కార్యక్రమాలను విశేషించి పేర్కొన్నారు కమలనాథులు.

కాంగ్రెస్, బీజేపీలు తమ పథకాల ద్వారా లబ్ధి పొందినవారిని ఎవరికి వారు తయారుచేసుకోగలిగాయి. కానీ కాంగ్రెస్ ఇంకా తన లబ్ధిదారులతో రాజకీయ సంస్థాగత సంబంధాలను ఏర్పరచుకోలేదు. అయితే, బీజేపీ తన లబ్ధిదారులను ఒక సంఘంగా – ఒక సముదాయంగా–వారితో సన్నిహిత సంబంధాన్ని ఏర్పరచుకుంది. మామా, లాడ్లీ బెహనా (ప్రియమైన సోదరి) వంటి కుటుంబ సంబంధ పదజాలాన్ని వాడటం ద్వారా, వారితో సన్నిహితంగా ఉండటం ద్వారా బీజేపీ ఈ పని చేయ గలిగింది. పార్టీ కార్యకర్తలు వివిధ పథకాల లబ్ధిదా రులతో హోలీ, దీపావళి, రక్షా బంధన్ వంటి పండు గలను జరుపుకోవడం ప్రారంభించారు. తన వంతుగా, కాంగ్రెస్ కూడా పేద ప్రజలకు పథకాలను అందించింది, కానీ వారితో దీర్ఘకాలిక భావోద్వేగ సంబంధాన్ని ఏర్పరచుకోలేకపోయింది. హిందీ ప్రాంత వాసి మనస్సు... తనతో గౌరవంగా, భావోద్వేగ సంబంధాన్ని కలిగి ఉన్న పార్టీతో స్పష్టంగా కనెక్ట్ అయి ఉంటుంది. బీజేపీ రాజకీయ పదజాలం... ఆర్థిక సమస్యలనూ, అభివృద్ధినీ అట్టడుగు స్థాయిలో ప్రతిధ్వనించే సాంస్కృతిక, సామాజిక భావోద్వేగాల చట్రంలో రూపొందించింది.



రెండవది – గ్రామీణ భారతదేశంలోని గ్రామీణ ప్రజలకు నమ్మకం చాలా ముఖ్యం. ప్రధాని నరేంద్ర మోదీ తన రాజకీయాలతో ప్రజలలో మత, సాంస్కృతిక భద్రతకు భరోసా కల్పించడం ద్వారా వారిలో అపారమైన నమ్మకాన్ని ఏర్పరచుకున్నారు. ఈ ఎన్నికలలో కూడా మోదీ తనకు తానుగా ప్రచారానికి పూనుకుని, ఓటర్లకు 'నేను ఇక్కడ ఉన్నాను, నేను మీ కోసం పని చేస్తాను' అనే భరోసా ఇచ్చే రిస్క్ తీసుకున్నారు. ఈ రాష్ట్రాల్లో బీజేపీ విజయం సాధించకుంటే అది మోదీ ప్రతిష్ఠపై ప్రభావం చూపి ఉండేది.

మూడవది – హిందుత్వం. బీజేపీ తన రాజకీయాలను హిందుత్వ భావనపై నిర్మించి, పునరుద్ధరించే ఆధార్ భావాన్ని (ఫౌండేషనల్ ఎమోషన్) ను హిందువులు అధికంగా ఉన్న హిందీ ప్రాంత రాష్ట్రాల్లో అందించింది. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో సనాతన ధర్మానికి సంబంధించిన అంశాన్ని ప్రధాన ప్రచారాయుధంగా మలచుకొంది. రామ్ భద్రాచార్య వంటి అనేక మంది సనాతన ధర్మ సాధువులు ఈ ఎన్నికలను ధర్మం, అధర్మాల మధ్య యుద్ధంగా అంచనా వేశారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రి అభ్యర్థి అయిన కమల్‌నాథ్ నియోజకవర్గమైన ఛింద్‌వారాలో జరిగిన ఓ మీటింగ్‌లో తమ ధర్మాన్ని కాపాడే పార్టీకి మద్దతు ఇవ్వాలని రామ్ భద్రాచార్య ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సాధువులు తమ సమావేశాల్లో ఇచ్చిన ప్రవచనాలలో, డీఎంకే నాయకుడు ఉదయనిధి స్టాలిన్ సనాతన ధర్మంపై చేసిన వ్యాఖ్యలను ఉటంకించారు. కాంగ్రెస్‌ను స్టాలిన్ పార్టీకి మద్దతుదారుగా చూపారు. అలా ఆ పార్టీని సనాతన విరోధిగా చిత్రించారు. సనాతన ధర్మంపై మధ్యప్రదేశ్‌లోని చిత్రకూట్ నుండి ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ వరకు సాగిన ఈ ప్రచారం హిందీ ప్రాంత ఓటర్లను ప్రభావితం చేసే ప్రజా కథనంగా ఉద్భవించింది. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లలోని గిరిజనులు, దళితులపై కూడా ఇది ప్రభావం చూపింది.

ఇతర వెనుకబడిన తరగతుల (ఓబీసీ) ఓటర్లను వారి కుల గుర్తింపుపై సమీకరించేందుకు కుల గణన డిమాండ్‌పై కాంగ్రెస్ ఎక్కువగా ఆధారపడింది. ఈ ఎన్నికల్లో దాని వ్యూహం పూర్తిగా విఫలమైంది. హిందీ ప్రాంత రాష్ట్రాల్లో కులం ప్రభావం కొనసాగుతోంది. కానీ ప్రజల మూడ్ మారిందని అర్థం చేసుకోవడంలో కాంగ్రెస్ విఫలమైంది. ఇది బహుళ ఆకాంక్షల యుగం. కుల చైతన్యం ఒక ఆకాంక్ష మాత్రమే. 'కుల గుర్తింపు తర్వాత ఏమిటి'అనేది ఓటర్ల మనసులోని ప్రశ్న. బీజేపీ ఇకపై బ్రాహ్మణ–బనియా పార్టీ కాదనే వాస్తవాన్ని కాంగ్రెస్ కూడా అంగీకరించలేదు, బీజేపీ నాయకత్వంలో ఓబీసీలు ఉన్నారు. కాబట్టి, కుల గణన ద్వారా బీజేపీకి వ్యతిరేకంగా ఓబీసీల సంఘటిత సమీకరణ దాదాపు అసాధ్యం.

ఈ ఎన్నికల ఫలితాలు 2024 సార్వత్రిక ఎన్నికలను ఎలా ప్రభావితం చేస్తాయి. ఇవి ముఖ్యంగా హిందీ ప్రాంతంలో తన వ్యూహాలు, ప్రజలతో రాజకీయంగా వ్యవహరించే తీరు (డిక్షన్) గురించి పునరాలోచించడానికి కాంగ్రెస్‌పై ఒత్తిడి తెస్తాయి. ప్రతిపక్ష కూటమి 'ఇండియా'కు ఇరుసుగా కాంగ్రెస్‌కు దాని స్థానం దానికి ఉండవచ్చు. అయితే, కూటమిలో సీట్ల కేటాయింపు ప్రక్రియల్లో జరిగే చర్చలు, ప్రాధాన్యాలను ఈ ఎన్నికలు ప్రభావితం చేస్తాయి. తాజా ఫలితాలు ప్రధాని మోదీ ప్రతిష్ఠను బలోపేతం చేశాయి. ఇది నిస్సందేహంగా బీజేపీపై సానుకూల ప్రభావాన్ని సృష్టిస్తుంది.

వ్యాసకర్త అలహాబాద్‌లోని 'గోవింద్ వల్లభ్ పంత్ సోషల్ సైన్స్ ఇనిస్టిట్యూట్'లో ప్రొఫెసర్

మహిళలే ఆదుకున్నారా?

అభిప్రాయం



నీలాంజన్ సర్కార్

మూడు హిందీ ప్రాంత రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో బీజేపీ సమగ్ర విజయాన్ని సాధించింది. ప్రత్యేకించి నవంబర్‌లోనే ఎన్నికలు జరిగిన రాజస్థాన్ ఫలితం అయితే, కొన్ని అత్యంత ఆశాజనకమైన ఎగ్జిట్ పోల్స్‌ను కూడా అధిగమించింది. ఈ రాష్ట్రాలలో బీజేపీకి గట్టి మద్దతు లభించిందనేది రహస్యమేమీ కాదు: 2014, 2019 జాతీయ ఎన్నికలు రెండింటిలోనూ ఈ రాష్ట్రాల్లోని మొత్తం 65 లోక్‌సభ సీట్లలో 62 స్థానాలను బీజేపీ గెల్చుకుంది. 2018లో మూడు రాష్ట్రాల్లోని అసెంబ్లీ ఎన్నికలను గెలుచుకున్న కాంగ్రెస్ పార్టీ, 2023లో అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లేటప్పుడు కాస్త ఆశాజనకంగానే ఉండింది.

సంక్షేమంపై, ముఖ్యంగా మహిళా ఓటర్లకు సంబంధించిన సంక్షేమంపై కాంగ్రెస్ ఆశలు పెట్టుకుంది. లింగ ప్రాతిపదికన సంక్షేమ వాదానికి చెందిన ఈ నమూనా 2021లో పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీకి, ఆమె పార్టీ తృణమూల్ కాంగ్రెస్‌కూ గొప్ప ప్రయోజనాలను అందించింది. కర్ణాటకలో బీజేపీపై కాంగ్రెస్ విజయానికి కూడా ఇదే కారణమైంది. ఈ అంచనాను బట్టి చూస్తే, కాంగ్రెస్ ఉత్తరాది మహిళా ఓటర్లలో మంచి పనితీరు కనబరుస్తుందని ఎవరైనా ఊహించవచ్చు. అయితే... డేటా, క్షేత్ర పరిశీలనలు కచ్చితమైన వ్యతిరేక విషయాలను ప్రతిబింబిస్తున్నాయి.

ప్రత్యేకించి యువతీ యువకులను సర్వే చేసే సంస్థల్లో ఒకటైన 'యాక్సిస్ – మై ఇండియా పోల్' మధ్యప్రదేశ్‌లో ఈసారి బీజేపీ విజయపు పరిమాణాన్ని అంచనా వేయడానికి సంబంధించి కొన్ని ఎగ్జిట్ పోల్స్ నిర్వహించింది. ఇందులో 50 శాతం మంది మహిళలు బీజేపీకి మద్దతు ఇచ్చారనీ, కాంగ్రెస్‌కు కేవలం 40 శాతం మంది మహిళలు సపోర్ట్ చేశారనీ తేలింది. ఇది 10 శాతం పాయింట్ల భారీ అంతరం. దీనికి విరుద్ధంగా 44 శాతం మంది పురుషులు బీజేపీకి మద్దతివ్వగా, 41 శాతం మంది కాంగ్రెస్‌కు మద్దతు పలికారు– కేవలం 3 శాతం పాయింట్ల తేడా! క్లుప్తంగా చెప్పాలంటే, మహిళా ఓటర్ల నుంచి వచ్చిన మద్దతుతో మధ్యప్రదేశ్‌లో బీజేపీ గెలుపు స్థాయి పెరిగింది. ప్రస్తుత ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ 23–60 ఏళ్ల మధ్య ఉన్న మహిళలకు అమలు చేసిన, ప్రత్యక్ష నగదు బదిలీ అయిన 'లాడ్లీ బెహనా' పథకం జనాదరణకు కొంత కారణమని చెప్పవచ్చు. ఇది అత్యధికసంఖ్యలో మధ్యప్రదేశ్‌లోని మెజారిటీ గృహాలకు చేరుకుంది.

నేను మధ్యప్రదేశ్‌లో ఎన్నికల ఫీల్డ్‌వర్క్‌ని నిర్వహించనప్పటికీ, రాజస్థాన్‌లో నా ఫీల్డ్‌వర్క్‌లో ఇలాంటి అంశాన్ని గమనించాను. పురుషుల కంటే మహిళలు బీజేపీకి ఎక్కువ మద్దతు ఇచ్చారు. మహిళా ఓటు ముఖ్యంగా యువ మహిళల్లో ఒక స్పష్టమైన రాజకీయ గుర్తింపుగా మారింది. ఇంట్లోని ఇతరుల మాదిరిగానే మహిళలు కూడా ఓటు వేస్తారని ఊహించడం సరి కాదు.

నాలుగుసార్లు ప్రజారంజక ముఖ్యమంత్రిగా శివరాజ్ చౌహాన్ పేరుపొందడం, విజయవంతమైన లాడ్లీ బెహనా పథకం అమలుతో మధ్యప్రదేశ్‌లో బీజేపీ అధికారంలో ఉంది. కానీ రాజస్థాన్‌లోని మహిళా ఓటర్లు బీజేపీ వైపు మొగ్గు చూపడాన్ని ఎలా వివరించాలి? అన్నింటికంటే, ప్రస్తుత కాంగ్రెస్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్ ప్రజారంజకమైన సంక్షేమ పథకాలను అమలు చేశారు. మహిళా ఓటర్లను కూడా లక్ష్యంగా చేసుకున్నారు.

నితీష్ కుమార్ లేదా మమతా బెనర్జీలా కాకుండా, కాంగ్రెస్ పార్టీ మహిళా ఓటర్ల పట్ల దీర్ఘకాలిక నిబద్ధత చూపలేదు. రెండోది – మరీ ముఖ్యంగా, బీజేపీ, ముఖ్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, పట్టుదలతో స్త్రీలలో మద్దతును పెంచుకున్నారు. ఉదాహరణకు, హిందీ మాట్లాడే ప్రాంతాల్లో, గుజరాత్‌లో మహిళా ఓటరుతో చేసినట్లు నేరుగా మోదీ కమ్యూనికేట్ చేయడంతో చక్కటి ఫలితం వచ్చింది. వాస్తవానికి, ఛత్తీస్‌గఢ్‌లో మహిళా ఓటర్లలో బీజేపీకి ఉన్న సాను కూలతను కూడా యాక్సిస్ పోల్ ద్వారా గమనించవచ్చు. హిందీ ప్రాంతంలో, ముఖ్యంగా మహిళల్లో ప్రధాని మోదీకి ఉన్న ఈ ప్రజాదరణ, ఈ ప్రాంతంలోని ఏ రాష్ట్ర ఎన్నికలలోనైనా బీజేపీని బలీయమైన పార్టీగా, జాతీయ ఎన్నికలలో అభేద్యంగా చేస్తుంది.

తన కార్యాలయంలో, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంక్షేమవాదంపై దృష్టి పెట్టి, 'లాభార్థి (లబ్ధిదారు) ఓటరును సృష్టించారు. గ్యాస్ సిలిండర్లు వంటివాటిపైనా, మహిళలపైనా దృష్టిపెట్టారు. పైగా మోదీ తనను తాను ఒక 'ప్రదాత'గా ఇమేజ్‌ని అభివృద్ధి చేసుకొన్నారు. కరోనా వైరస్ మహమ్మారి నేపథ్యంలో ఆయన నేరుగా, హిందీ బెల్ట్‌తో ఉచిత రేషన్ పథకాలతో సంబంధం కలిగి ఉన్నారు. దీంతో ఆయన 'పంపిణీ చేయగల ఏకైక వ్యక్తిగా ప్రజల మనసుల్లో చిత్రితమయ్యారు. దక్షిణ భారతదేశంలో నేను వివిధ రాష్ట్రాలలో ఎవరు వివిధ పథకాల పంపిణీలో ముందున్నారు అని అడిగినప్పుడు వేరు వేరు పేర్లు వినిపించేవి. కానీ ఉత్తర భారతదేశంలో పథకాల బట్వాడాకు బాధ్యత వహించే వ్యక్తిగా ప్రధానమంత్రిని మాత్రమే ఓటర్లు ఎక్కువగా పేర్కొంటున్నారు.

చాలా కాలం క్రితం తమ ప్రత్యేక ప్రయోజనాల పంపిణీ నమూనాలను అభివృద్ధి చేసిన కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాల మాదిరిగా కాకుండా, నగదు బదిలీ ద్వారా ప్రయోజనాల పంపిణీని బీజేపీ, మోదీ పునర్నిర్వచించారు. వాటిని ప్రధానమంత్రి ముద్రతో బ్రాండ్ వేశారు. దురదృష్టవశాత్తు కాంగ్రెస్‌కు, హిందీ బెల్ట్‌లో బీజేపీపై నేరుగా పోటీ చేయడంపైనే మొగ్గు చూపాల్సి వస్తోంది.

కొత్త మహిళా ఓటరు సాంప్రదాయికమైన ప్రాంతీయ, కులాలవారీ గణనలను మెరుగుపరుస్తుంది. జైపూర్ వెలుపల ఉన్న ఫూలేరా నియోజకవర్గంలోని ఒక గ్రామంలో సూర్యుడు అస్తమిస్తుండగా, ఒక యువతి మమ్మల్ని వెతుక్కుంటూ వచ్చి ఇలా చెప్పింది: 'ఎన్నికలను కవర్ చేయడానికి మీరు ఇక్కడ ఉన్నారని నేను చూస్తున్నాను. మా కుటుంబం ఎప్పుడూ కాంగ్రెస్‌కి ఓటేస్తుంది, కానీ ఈసారి ఓటు వేయడానికి నేను చాలా చిన్నదానిని. అయితే 2024లో నాకు ఓటు ఉంటుంది, నేను మోదీకే ఓటు వేస్తాను!'

వ్యాసకర్త 'సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చ్'లో సీనియర్ ఫెలో

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

అనుమానాలు వీడని అంబేడ్కర్ మరణం

సందర్భం




డాక్టర్ దేవరాజు మహారాజు

బాబా సాహెబ్ డా॥ బీఆర్ అంబేడ్కర్ 1956, అక్టోబర్ 14న నాగపూర్‌లో లక్షల మంది అనుచరులతో హిందూ మతాన్ని వదిలి, బౌద్ధం స్వీకరించారు. నాగపూర్ నాగజాతి ప్రజలు జీవించిన భూమి గనుక, వారంతా బౌద్ధులు గనుక, తాను బౌద్ధం స్వీకరించడానికి నాగపూర్‌ను ఎంచుకున్నానని ఆయన ప్రకటించారు. అంతేగాని, నాగ్‌పూర్‌లో ఆరెస్సెస్ వారి ప్రధాన కార్యాలయం ఉంది గనుక, వారి ప్రాముఖ్యం తగ్గించడానికి తను ఆ పట్టణాన్ని ఎంచుకోలేదనీ వివరణ ఇచ్చారు. అయితే, ఆ తర్వాత 52 రోజులకే (డిసెంబర్ 6) అంబేడ్కర్ కన్నుమూశారు. ఆయన మరణం వెనుక ఓ కుట్ర ఉందనీ, ఆయన మరణించిన నాటి నుండి నేటి దాకా ఒక ఆరోపణ ఉంది. ఆ ఆరోపణ నిజం కాదని అటు భారత ప్రభుత్వం గానీ, ఇటు ఆరోపణలు ఎదుర్కొన్న వర్గాలు గానీ ఆధారాలు, వివరణలు ప్రజల ముందు పెట్టలేదు. అందువల్ల అనుమానాలు అనుమానాల్లాగే ప్రజల మనసుల్లో సజీవంగా ఉన్నాయి.

ఆ రోజుల్లో జీవించి ఉన్న ఇ.వి.ఆర్. పెరియార్ తన వార్తా పత్రిక 'విడుదలై'లో ఇలా రాశారు. 'డాక్టర్ అంబేడ్కర్ చనిపోయారని అకస్మాత్తుగా ప్రకటించడం వెనుక ఏదో కుట్ర ఉందని నాకు అనిపిస్తోంది. గాంధీ మరణం వెనుక ఏ కారణం, ఏ కుట్ర ఉన్నాయో అలాంటివే అంబేడ్కర్ చనిపోవడం వెనక ఉన్నాయని నేను బలంగా నమ్ముతున్నాను' అంటూ చాలా వివరంగా రాశారు. మొత్తం మీద ఆయన వెలిబుచ్చిన ఆవేదనలోని సారాంశం ఏమిటంటే – గాంధీ మరణానికి కారకులెవరో, వారే అంబేడ్కర్ మరణాకి కూడా కారకులని! అందుకు అవకాశమిచ్చే పలు అంశాలు కూడా ఆ రోజుల్లో చాలా బయటికి వచ్చాయి. 'తన తండ్రికి విషమిచ్చి తెలియకుండా చంపేశారని' స్వయానా అంబేడ్కర్ కుమారుడు యశ్వంత్ ఒక అభిప్రాయం వెలిబుచ్చారు. అంబేడ్కర్ అభిమానులంతా యశ్వంత్‌ను బలపరిచారు. అంబేడ్కర్ మరణవార్త ఈ దేశ ప్రజలకు అనుమానాస్పదమైన వార్త అయింది. 'తన తండ్రిది సహజ మరణం కాదనీ, హత్య అనీ – దోషులెవరో తేల్చాలనీ' – అంబేడ్కర్ కుమారుడు యశ్వంత్ నాటి ప్రధాని నివాసం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంబేడ్కర్ మరణం తర్వాత పదకొండవ రోజున, ఆయన అనుయాయులు ఢిల్లీ వీధుల్లో పెద్ద ఎత్తున ప్రదర్శన నిర్వహించారు. నాటి ప్రధాని, రాష్ట్రపతులకు లిఖితపూర్వక నివేదికలు, విన్నపాలు అందజేశారు. అంబేడ్కర్ మరణం వెనక ఏం జరిగిందో తేల్చాలని వారు డిమాండ్ చేశారు.

నాటి ప్రధాని నెహ్రూ స్పందించి నిజనిర్ధారణ కమిటీని నియమించారు. కమిటీ భారత ప్రభుత్వానికి అందజేసిన రిపోర్టు ఆనాటి నుండి ఈనాటి వరకు ప్రజల ముందుపెట్టలేదు. ఒకవేళ రహస్యాలేవీ లేకపోతే, అది బయటపెడితే అన్ని అనుమానాలకూ తెరపడినట్టయ్యేది కదా! ఢిల్లీ పోలీస్ ఐజీ ఇచ్చిన వివరణను మాత్రం 1957 నవంబర్ 27 నాడు – అంటే దాదాపు సంవత్సరం తర్వాత, అప్పటి హోంమంత్రి గోవింద్ వల్లభ్ పంత్‌తో పార్లమెంట్‌లో ఒక ప్రకటనగా ఇప్పించారు. 'అంబేడ్కర్ మరణం సహజమైందని'– ఆ ప్రకటన సారాంశం! అదొక కంటి తుడుపు ప్రకటన అని దేశ ప్రజలు ఆనాడే భావించారు. అసంతృప్తితో రగిలిపోయారు. ఆనాటి నుండి నిరసనలు వెల్లువెత్తుతూనే ఉన్నాయి. వ్యాసాలు, పుస్తకాలు ప్రచురింప బడుతూనే ఉన్నాయి. అసహనం, అసంతృప్తి ఏదోరకంగా బయట పడుతూనే ఉంది. తాజాగా ఈ మధ్యే 2021 జనవరి 26 నాడు నాగపూర్ ఆరెస్సెస్ ప్రధాన కార్యాలయం ముందు – అంబేడ్కర్ ఎలా చనిపోయారో తేటతెల్లం చేయాలని పెద్దఎత్తున నిరసన ప్రదర్శన జరిగింది. జనవరి 26నే ఎందుకు ఎంచుకున్నా రంటే... ఆ తేదీన అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగం అమలులోకి వచ్చింది గనుక! వారి పాత్ర లేకపోతే జనం వెళ్లి వారి కార్యాలయం ముందు ఎందుకు నిరసన ప్రదర్శనలిస్తారూ? అర్థం చేసుకోవాల్సిన విషయం!



నెహ్రూజీ తొలి ప్రధాని అయ్యారు కాబట్టి, సోషలిజానికి, వైజ్ఞానిక ప్రగతికి ఆయన ప్రాధాన్యమిస్తూ వచ్చారు. అప్పుడు వీరి ఆటలు అంతగా సాగలేదు. అయినా, వారి లక్ష్యసాధనకు వారు నిరంతరం కృషి చేస్తూనే వస్తున్నారు. దాని ఫలితాలను నేడు కూడా మనం చూస్తూనే ఉన్నాం! అంబేడ్కర్‌ది సహజ మరణమా? లేక హత్యా అనేది ఆరోజుల్లో బయటికి రాలేదు.

67 ఏళ్ళ తర్వాత, ఆధారాలన్నీ చెదిరిపోయిన తర్వాత, ఇప్పుడు బయటికి వస్తుందన్న నమ్మకం లేదు గానీ – గతంలో జరిగిన కొన్ని వాస్తవాలు ఈ తరానికి తెలియజేయడం అవసరం అనిపించింది. అయితే, బాబా సాహెబ్ అర్ధంతరంగా వదిలేసిన కర్తవ్యాలనూ, రాజ్యాంగబద్ధమైన హక్కుల సాధననూ ఈ తరం యువతీ యువకులు ముందుకు తీసుకుపోవాల్సి ఉంది. ఈ పోరాటం నిరంతరం కొనసాగుతూ ఉండాల్సిందే!

వ్యాసకర్త కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీత
(నేడు అంబేడ్కర్ వర్ధంతి)

ఎవరు గొప్ప?

నలుగురు మనుషులు ఒక చోట కూడారంటే వివాదాలు రాకమానవు. తమ ఆధిక్యాన్ని స్థాపించుకోవటానికి తమ మాట నెగ్గించుకోవటానికి ప్రతి ఒక్కరూ విశ్వప్రయత్నం చేస్తారు. ఈ పరిస్థితి కుటుంబంలోనూ, సమాజంలోనూ కనిపిస్తుంది. కుటుంబంలో ప్రతి ఒక్కరూ తన వల్లే కుటుంబం నడుస్తోందని తను లేకపోతే ఏమవుతుందో అనుకుంటూ అందరూ తన మాటే వినాలనుకుంటారు. మనిషిలో ఈ అహం నశించనంత వరకు ఈ వివాదాలు తప్పవు.

ఒకసారి ప్రాణం; ఇంకా కన్ను, చెవి, నోరు వంటి ఇంద్రియాలు నేను గొప్పంటే నేనని వాదించుకున్నాయి. కాని, విషయం తేలలేదు. ఇంద్రియాలన్నీ ఒక కుటుంబం లాంటివే. అన్నీ కలిసి దైవం దగ్గరకు వెళ్లి 'మాలో ఎవరు గొప్పో తేల్చి చెప్పు. నువ్వేం చెప్పినా మేం అంగీకరిస్తాం' అన్నాయి. అప్పుడు దేవుడు 'మీలో ఎవరు శరీరాన్ని విడిచి వెళ్ళిపోతే, శరీరం తేజస్సు తగ్గి పనులన్నీ ఆగిపోతాయో అదే గొప్పది' అని చెబుతాడు. మొదట వాక్కు శరీరాన్ని వదిలి బైటకు వెళ్ళిపోతుంది. తను లేనప్పుడు ఎలా వున్నారు అని అడుగుతుంది ఏడాది తర్వాత తిరిగి వచ్చి. మాట లేకపోయినా కళ్ళతో చూస్తూ, చెవులతో వింటూ, ఊపిరి పీలుస్తూ బాగానే ఉన్నాము. నువ్వు లేకపోతే మాకు ఇబ్బందేం కలగలేదు అన్నాయి ఇంద్రియాలు. అలాగే, కళ్ళు, చెవులు, నోరు ఒక్కొక్కటి వెళ్లిపోయినా మిగిలిన అవయవాలతో శరీరం బాగానే ఉంది. చివరకు ప్రాణం వెళ్లిపోవటానికి సిద్ధమవుతుంటే శరీరం చైతన్యం కోల్పోతూ ఉంది. ఇంద్రియాలు పనిచేయలేకపోయాయి. అవి అన్నీ ప్రాణంతో 'నువ్వే గొప్ప. నువ్వు వెళ్ళిపోవద్దు' అని ప్రార్థించాయి. ఇది ఒక ఉపనిషత్ కథ.



జ్యోతిర్మయం

అయితే కన్ను, చెవి, నోరు వంటి ఇంద్రియాలు పని చేయకుండా ప్రాణం మాత్రమే ఉన్నా, మనిషి జీవించి ప్రయోజనం లేదు. అన్ని ఇంద్రియాలూ వాటి పని అవి చేయాలి... ప్రాణం ఉండాలి. దేని కదే గొప్ప. అలాగే, ఇంటికి పెద్ద తండ్రో, అన్నో ఒకరు ఉన్నా, ఇంట్లో అందరి సహాయ సహకారాలు లేనిదే ఒక్కరూ అన్నీ చేయలేరు. అందరూ గొప్పవారే! అన్ని ఇంద్రియాలూ గొప్పవే!

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

క్లుప్తంగా...

ప్రజాస్వామ్యం ఊపిరి పోసుకుంది

బీఆర్‌ఎస్ ఓటమిపై మందకృష్ణ మాదిగ



బౌద్ధనగర్ (హైదరాబాద్): తెలంగాణ ఎన్నికల్లో నియంతృత్వ, అహంకార కుటుంబ పాలనను రాష్ట్ర ప్రజలు ఓడించారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. పార్శీగుట్ట లోని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...తెలంగాణలో ప్రజాస్వామ్యం ఊపిరి పోసుకుందన్నారు. బీఆర్‌ఎస్‌ను ఓడించే ప్రయత్నంలో ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారని, ప్రజాస్వామ్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పరిరక్షించాలని కోరారు. ఎమ్మార్పీఎస్ మద్దతుతోనే బీజేపీకి 8 సీట్లు, 14 శాతం ఓట్లు వచ్చాయని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ, కేసీఆర్ పాలనలో మాదిగల అణచివేత, సామాజికన్యాయాన్ని బతికించేందుకు మాదిగలు ఓటును వినియోగించుకున్నారని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి తమలో నియంతృత్వం పెరగకుండా చూసుకోవాలని, అలా కాకుండా అవలక్షణాలు ఏర్పడితే నియంతృత్వాన్ని ఓడించే చైతన్యం తెలంగాణ ప్రజలకు ఉందనే విషయాన్ని ముందుగానే గుర్తు చేస్తున్నామని హెచ్చరించారు.

18, 19 తేదీల్లో చలో ఢిల్లీ

పంజగుట్ట(హైదరాబాద్): ప్రధాని మోదీ ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదం తెలపకుండా వర్గీకరణ ఉద్యమానికి తోడుగా ఉంటానని పేర్కొనడం హాస్యాస్పదమని పలు మాదిగ సంఘాల నేతలు ఎద్దేవా చేశారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశ పెట్టి ఆమోదింపజేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18, 19 తేదీల్లో చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టినట్లు వారు వెల్లడించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ గజ్జల కాంతం, మాదిగ జేఏసీ వ్యవస్థాపకుడు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి మాట్లాడుతూ...దేశ ప్రధాని మోదీ సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌కు వచ్చి కూడా సుదీర్ఘకాలంగా పోరాడుతున్న ఎస్సీ వర్గీకరణ సమస్యను పరిష్కరించకుండా అలానే ఉంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మాదిగ కులానికి ఒక్క మంత్రి పదవి కూడా ఇవ్వలేదని, వైస్‌చాన్సలర్, టీఎస్‌పీఎస్సీలో తమ కులానికి వాటా లేకుండా అన్యాయం చేయడం వల్లే కేసీఆర్ ఓడిపోయారని చెప్పారు. కొత్తగా ఏర్పాటు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంలో మాదిగలకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని కోరారు.

కరప్షన్ ఫ్రీ కామారెడ్డి

- ఇదే లక్ష్యంతో ముందుకు సాగుతున్నానంటున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి
- కార్యకర్తల బలం, ప్రజల నమ్మకమే నన్ను గెలిపించాయి... ఏడాదిన్నరలో సొంత మేనిఫెస్టో అమలు చేస్తా
- ప్రధాని సహకారంతో 40 వేల ఇళ్లు నిర్మించి ఇస్తా



సాక్షి, కామారెడ్డి: ''ఎన్నికల్లో డబ్బు..మద్యం పంచకుండా గెలిచి చూపాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. కార్యకర్తలు అండగా నిలవడం, జనం నన్ను నమ్మి ఓటేయడంతో నా లక్ష్యం నెరవేరింది. ఇక కామారెడ్డిలో పెరిగిన రాజకీయ అవినీతిని రూపుమాపి కరప్షన్ ఫ్రీ కామారెడ్డి అన్న పేరు తేవడానికి కృషి చేస్తా''అని ఇద్దరు రాజకీయ ఉద్ధండులను ఓడించిన కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి(కేవీఆర్) అంటున్నారు. ''దేమె రాజిరెడ్డి కొడుకు తండ్రిలా నిజాయితీపరుడు అన్న పేరు రావాలి. నేను చనిపోయినప్పుడు లక్షలాది మంది ప్రజలు ఆఖరి చూపునకు రావాలి. అదే నా కోరిక''అంటున్న కేవీఆర్‌ను మంగళవారం 'సాక్షి'పలకరించింది.

జెయింట్ కిల్లర్ అవుతాననుకున్నారా ?

కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్నపుడు కామారెడ్డిలో సీఎం కేసీఆర్ పోటీ చేసినా, టీపీసీసీ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి పోటీ చేసినా ఇక్కడ బీజేపీ జెండా ఎగరాలని, అందుకు మనం కష్టపడా లని కార్యకర్తలతో మాటవరుసకు అన్న. దైవ నిర్ణయమో ఏమోగానీ, ఆ రోజు నా నోటి నుంచి వచ్చినట్టే నామీద కేసీఆర్, రేవంత్‌రెడ్డి పోటీకి వచ్చారు. ఆ ఇద్దరితో తలపడి ఓడించే అవకాశాన్ని ప్రజలు నాకిచ్చారు. అందుకే రాష్ట్రం, దేశం మొత్తం కామారెడ్డి ఎన్నికల ఫలితం కోసం ఎదురుచూసింది.

ఆ ఇద్దరితో పోటీ అని తెలియగానే ఎలా ఫీల్ అయ్యారు ?

దేశంలో ఎవరికీ రాని అవకాశం నాకు దక్కింది. సీఎం, కాబోయే సీఎంలిద్దరూ కామారెడ్డిలో నిలబడుతున్నారని తెలియడంతో ఇద్దరినీ ఓడిస్తానని, ఓడించకుంటే రాజకీయాల నుంచి తప్పుకుంటానని ప్రకటించిన. ఇద్దరితో పోటీపడడం అంటే మామూలు విషయం కాదు. వాళ్ల దగ్గర డబ్బు, అధికారం, బలం, బలగం అన్నీ ఉన్నాయి. నా దగ్గర ఆత్మస్థైర్యం ఉంది. నా కోసం దేనికైనా తెగించే కార్యకర్తల బలం ఉంది. అన్నింటికి మించి ప్రజల్లో నామీద నమ్మకం ఉంది. ఆ నమ్మకం, ఆ ధైర్యంతోనే వాళ్లను ఓడిస్తానని శపథం చేసిన. ఒకేసారి ఇద్దరు రాజకీయ ఉద్ధండులను కొట్టే అవకాశం రావడం అదృష్టంగానే భావిస్తున్నా.

ప్రజల నుంచి స్పందన ఎలా ఉంది?

ఇక్కడి ప్రజలు తమ సొంత ఇంటి వ్యక్తిగా భావించి నన్ను గెలిపించారు. ఎన్ని ప్రలోభాలు పెట్టినా, ఎంత మందిని లొంగదీసుకున్నా, ప్రజలు మాత్రం నావైపు నిలిచారు. ఏ ఊరికి వెళ్లినా మహిళలు ఎంతో ఆదరించారు. వారికి రావాల్సిన వడ్డీ రాయితీ డబ్బుల కోసం చేసిన పోరాటం, భూముల కోసం చేసిన ఉద్యమాలతో నన్ను సొంత అన్నలా, తమ్ముడిలా భావించారు. పోయిన ప్రతిచోటా నువ్వే గెలుస్తావంటూ దీవించి పంపించారు.

మీకు రాజకీయ ప్రేరణ ఎవరు?

నా చిన్నతనంలో మా నాన్న రాజిరెడ్డి సమితి అధ్యక్షుడిగా పనిచేశారు. చదువుకునేరోజుల్లో, ఆ తర్వాత ఎక్కడకు వెళ్లినా ఆయన గురించి మాట్లాడుతుంటే ఆసక్తిగా వినేవాన్ని. దేమె రాజిరెడ్డి ఉద్యోగం ఇప్పించాడని చెబుతుండేవారు. వారితో మాట్లాడుతున్నపుడు తాను రాజిరెడ్డి కొడుకునని వారికి తెలియదు. ఆ రాజిరెడ్డి కొడుకును నేనే అన్నప్పుడు వారు నాకు ఇచ్చిన మర్యాద ఇప్పటికీ కళ్ల ముందు కదలాడుతుంది. ఇంటికి వెళ్లిన తర్వాత అన్నీ నాన్నతో చర్చించేవాడిని. నీతి, నిజాయితీగా పనిచేసినపుడు ప్రజలు చిరకాలం గుర్తుంచుకుంటారని ఆయన చెప్పిన మాటలు నా మనసులో నిండిపోయాయి. మా నాన్నలాగా గొప్ప పేరు తెచ్చుకోవాలని ఆ రోజే అనుకున్నాను.

హామీలు నెరవేర్చడానికి ఎంత సమయం తీసుకుంటారు?

కామారెడ్డి నియోజకవర్గంలో ఇల్లు లేని వారందరికీ ఇల్లు కట్టించి ఇవ్వడమే నా ముందున్న అతి పెద్ద లక్ష్యం. ప్రధాని మోదీ సహకారంతో కేంద్రం నుంచి 40 వేల ఇళ్లు మంజూరు చేయించుకొని, వాటిని నిర్మించి ఇస్తా. సొంత మేనిఫెస్టోలో పేర్కొన్న కార్యక్రమాలన్నీ ఏడాదిన్నరలో పూర్తి చేయాలని అనుకుంటున్న. ముందుగా రైతులు ఎదుర్కొంటున్న కల్లాల సమస్యను పరిష్కరించేందుకు నెల, రెండు నెలల్లో కార్యాచరణ మొదలుపెడతా. ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తా.



సంపత్‌రెడ్డి భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పిస్తున్న కేటీఆర్

పాగాల కుటుంబానికి అండగా ఉంటాం

- సంపత్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పించిన కేటీఆర్
- నేడు అన్ని జిల్లాల్లో సంతాపసభలు

జనగామ: జనగామ జిల్లా పరిషత్ చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు పాగాల సంపత్‌రెడ్డి అకాల మరణం పార్టీకి తీరనిలోటని మాజీమంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. జనగామ జిల్లా చిల్పూరు మండలం రాజవరం గ్రామంలో మంగళవారం కేటీఆర్ ఆయన మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చి, అధైర్యపడవద్దని భరోసా కల్పించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ సంపత్‌రెడ్డి భౌతికంగా మన మధ్య లేకున్నా, ఆయన జ్ఞాపకాలు పార్టీలో ఎప్పుడూ గుర్తుకు చేస్తాయన్నారు. సంపత్‌రెడ్డి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని, ఆయన కూతురు ఉన్నత చదువులు, ఇతర అవసరాలు ఏవి ఉన్నా తన వద్దకు నేరుగా రావచ్చన్నారు. బుధవారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో సంపత్‌రెడ్డికి నివాళులర్పిస్తూ, సంతాప సభలను ఏర్పాటు చేస్తామన్నారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కడియం శ్రీహరి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ పసునూరి దయాకర్, మాజీ ఎమ్మెల్యేలు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతిరాథోడ్, వినయ్ భాస్కర్, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఉన్నారు.

కేసీఆర్‌తో మండలి చైర్మన్ గుత్తా భేటీ



సాక్షి, హైదరాబాద్: శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మంగళవారం మాజీ సీఎం కేసీఆర్‌తో ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. తన కుమారుడు గుత్తా అమిత్‌రెడ్డితో పాటు ఫామ్‌హౌస్‌కి వెళ్లిన సుఖేందర్‌రెడ్డి తాజా రాజకీయ పరిస్థితులు, అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై కేసీఆర్‌తో చర్చించినట్లు సమాచారం. ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు కూడా కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు కూడా మంగళవారం ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్‌తో సుదీర్ఘంగా భేటీ అయ్యారు.

ఎమ్మెల్యే విజయుడికి కేసీఆర్ ఆశీస్సులు

అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావును మంగళవారం ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఆయన వెంట ఎమ్మెల్సీ చల్లా వెంకట్రాంరెడ్డి కూడా ఉన్నారు. తొలుత మాజీ ఎమ్మెల్యే అబ్రహాంను అలంపూర్ అభ్యర్థిగా ప్రకటించి చివరి నిమిషంలో కేసీఆర్ విజయుడికి బీ ఫారాన్ని ఇచ్చిన విషయం తెలిసిందే. ఎమ్మెల్సీ చల్లాకు ప్రధాన అనుచరుడిగా ఉన్న విజయుడు చివరి నిమిషంలో టికెట్ దక్కించుకుని విజేతగా నిలిచారు.

ఒక సీటు.. శాసనసభకు
ముగ్గురు అభ్యర్థులు

- కామారెడ్డిలో విజయం సాధించిన వెంకటరమణారెడ్డి ... ఇక్కడ ఓడినా.. వేరే స్థానాల్లో గెలిచిన కేసీఆర్, రేవంత్

కామారెడ్డి టౌన్: సాధారణంగా ఒక అసెంబ్లీ స్థానం నుంచి పోటీపడినవారిలో ఒకరు మాత్రమే శాసనసభలో అడుగుపెట్టే అవకాశం ఉంటుంది. కానీ, కామారెడ్డి బరిలో దిగిన ముగ్గురు అభ్యర్థులు అసెంబ్లీగడప తొక్కనున్నారు. కామారెడ్డి అసెంబ్లీ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా కె.వెంకటరమణారెడ్డి, బీఆర్‌ఎస్ అభ్యర్థిగా కేసీఆర్, కాంగ్రెస్ అభ్యర్థిగా రేవంత్‌రెడ్డి పోటీ చేసిన విషయం తెలిసిందే. ఈ ఎన్నికలలో విజయం సాధించి వెంకటరమణారెడ్డి తొలిసారి ఎమ్మెల్యే అయ్యారు. ఇక కేసీఆర్ ఇక్కడ ఓడిపోయినా గజ్వేల్ నుంచి గెలుపొందారు. రేవంత్‌రెడ్డి కొడంగల్ నుంచి గెలిచారు. దీంతో కామారెడ్డి నుంచి పోటీ చేసిన ప్రధాన పార్టీల అభ్యర్థులు ముగ్గురికి అసెంబ్లీకి వెళ్లే అవకాశం లభించినట్లయింది. ఒకేసారి సీఎం, కాబోయే సీఎంలను ఓడించి చరిత్ర సృష్టించిన కామారెడ్డి స్థానం నుంచి పోటీ చేసిన ముగ్గురు అభ్యర్థులు అసెంబ్లీలో అడుగుపెడుతుండటం విశేషం

రక్షణ గోడలు
ఎందుకు విఫలమయ్యాయి?

- నిబంధనలకు అనుగుణంగా ఎత్తును కలిగి ఉన్నాయా?
- కాళేశ్వరం బ్యారేజీల గట్లు పరిసర గ్రామాలను ఎందుకు రక్షించలేకపోయాయి?
- కాళేశ్వరం ప్రాజెక్టుపై వివరాలు కోరిన కేంద్ర జలశక్తి శాఖ

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై కేంద్రం మరోసారి పలు వివరాలు కోరింది. గతేడాది జూలైలో గోదావరికి వచ్చిన వరదల సందర్భంగా మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలకు పక్కన ఉన్న వరద రక్షణ గోడలు పంప్‌హౌస్‌లు, తదితరాలను రక్షించడంలో ఎందుకు విఫలమయ్యాయి? రక్షణ గోడలు నిబంధనల అనుగుణంగా ఎత్తును కలిగి ఉన్నాయా? బ్యారేజీలకు సంబంధించిన గట్టులు (సేఫ్టీ ఎంబ్యాక్‌మెంట్) పరిసర గ్రామాలకు రక్షణ కల్పించడంలో ఎందుకు విఫలమయ్యాయి?.. తదితర వివరాలను సమర్పించాలని పేర్కొంటూ కేంద్ర జలశక్తి శాఖ ఈ నెల 1న రాష్ట్ర నీటిపారుదల శాఖ ఈఎన్‌సీకి లేఖ రాసింది. గోదావరి నదిపై కాళేశ్వరం ప్రాజెక్టుకు సమానంగా వరద ముప్పును కలిగి ఉన్న ఇతర ప్రాజెక్టులున్నాయా? ఆ ప్రాజెక్టులు ఎందుకు వరదను సమర్థవంతంగా ఎదుర్కోగలిగాయి? కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీలు ఎందుకు విఫలమయ్యాయి? అనే సమాచారాన్ని సైతం అందించాలని కోరింది. ఇటీవల మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోగా, అన్నారం బ్యారేజీకి బుంగలు పడి నీళ్లు లీకైన విషయం తెలిసిందే. ఈ ఘటనల నేపథ్యంలోనే జలశక్తి శాఖ ఈ సమాచారం కోరినట్టు తెలుస్తోంది.

అవగాహన ఉన్న అధికారిని పంపండి

పంప్‌హౌసుల్లోని పంపింగ్ యూనిట్ల డిజైన్లు, ప్లేస్‌మెంట్ల (లొకేషన్)లో లోపాలు వంటి సమాచారాన్ని కూడా జలశక్తి శాఖ కోరింది. వరదల సమయంలో పంప్‌హౌసుల్లో చేరిన నీళ్లను బయటకి తోడడంలో డీవాటరింగ్ పంప్‌లు ఎందుకు విఫలమయ్యాయి? వీటికి సంబంధించిన ఇన్‌లెట్ గేట్లు/వాల్వ్‌లు ఎందుకు మొరాయించాయి ? అనే వివరాలను సమర్పించాలని ఆదేశించింది. సవరించిన డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్)ను ఇవ్వాలని సూచించింది. ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని అందజేసేందుకు వీలుగా ఈ విషయంలో పూర్తి అవగాహన కలిగిన ఓ అధికారిని జలశక్తి శాఖకు డిప్యుటేషన్‌పై పంపాలని ఆదేశించింది.

క్లుప్తంగా...

'ఇండియా' భేటీ వాయిదా

న్యూఢిల్లీ: ప్రతిపక్ష ఇండియా కూటమి అగ్ర నేతల సమావేశం డిసెంబర్ మూడో వారానికి వాయిదా పడింది. ముందుగా నిర్ణయించిన కార్యక్రమాలతో బిజీగా ఉన్నందున బుధవారం జరగాల్సిన భేటీకి రాలేకపోతున్నట్లు కూటమిలోని కొన్ని పార్టీల నేతలు అశక్తత వ్యక్తం చేయడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే, ఇండియా కూటమి పార్టీలకు చెందిన ఫ్లోర్ లీడర్లతో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తన నివాసంలో బుధవారం సాయంత్రం తలపెట్టిన సమావేశం మాత్రం కొనసాగనుంది. కూటమి అగ్ర నేతల సమావేశం డిసెంబర్ మూడో వారంలో అందరికీ అనుకూలమైన తేదీలో జరగనుందని 'ఇండియా' ప్రచార కమిటీ సభ్యుడు గుర్దీప్ సప్పాల్ తెలిపారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని కలిసికట్టుగా ఎదుర్కొనేందుకు అనుసరించాల్సిన వ్యూహాన్ని ఈ సమావేశంలో చర్చించనున్నారు. బుధవారం జరగాల్సిన భేటీకి తాము రాలేకపోతున్నట్లు ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్, టీఎంసీ చీఫ్, బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తెలిపారు. బిహార్ సీఎం, జేడీయూ నితీశ్ కుమార్ అనారోగ్య కారణాలతో, తమిళనాడు సీఎం స్టాలిన్ తమ రాష్ట్రంపై తుపాను ప్రభావం తీవ్రంగా ఉండటంతో రాలేకపోతున్నట్లు తెలిపారని సప్పాల్ వివరించారు.

నైజీరియాలో డ్రోన్ దాడి.. 85 మంది మృతి

అబుజా: నైజీరియాలో మతపరమైన ఉత్సవంపై జరిగిన డ్రోన్ దాడిలో కనీసం 85 మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. మరో 66 మంది గాయపడ్డారు. ఈ దాడి పొరపాటున జరిగినట్లు ఆ దేశ సైన్యం ప్రకటించింది. ఆదివారం రాత్రి కదునా రాష్ట్రం టుడున్ బిరి గ్రామంలో మౌలిద్ అల్ నబీ వేడుక జరుగుతుండగా ఆర్మీ డ్రోన్ దాడి జరిపింది. మృతుల్లో చిన్నారులు, మహిళలు, వృద్ధులు ఉన్నారని అధికారులు చెప్పారు. ఇప్పటి వరకు 85 మృతదేహాలను ఖననం చేశామన్నారు. ఘర్షణలతో అట్టుడుకుతున్న ప్రాంతాల్లో బందిపోట్లు, తీవ్రవాదులే లక్ష్యంగా జరుగుతున్న దాడుల్లో తరచూ ఇలాంటి పొరపాట్లు చోటుచేసుకోవడం ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఆందోళన వ్యక్తం చేసింది.

ఎంఎన్ఎఫ్ చీఫ్ జోరామ్‌తాంగ రాజీనామా

ఐజ్వాల్: ఇటీవలి ఎన్నికల్లో ఘోర పరాజయం నేపథ్యంలో మిజో నేషనల్ ఫ్రంట్(ఎంఎన్ఎఫ్) అధ్యక్ష పదవికి సీఎం జోరామ్‌తాంగ (79) రాజీనామా చేశారు. ఆయన ఎంఎన్ఎఫ్ చీఫ్‌గా 33 ఏళ్ల పాటు కొనసాగారు. మంగళవారం రాజీనామా లేఖను పార్టీ సీనియర్ ఉపాధ్యక్షుడు తాన్‌లుయియాకు పంపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ బాధ్యతల నుంచి వైదొలుగుతున్నట్లు అందులో జోరామ్‌తాంగ వివరించారు. ఆయన రాజీనామాను ఆమోదించాలా వద్దా అనే విషయం చర్చించేందుకు పార్టీ నేషనల్ కోర్ కమిటీ, పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ బుధవారం సమావేశం కానున్నట్లు పార్టీ జనరల్ సెక్రటరీ క్రోస్నెజోవా వెల్లడించారు.

పీఎం-కిసాన్ సాయం పెంపు ప్రతిపాదన లేదు

న్యూఢిల్లీ: ప్రధాన్‌మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద దేశవ్యాప్తంగా రైతులకు ఇచ్చే మొత్తాన్ని పెంచే ప్రతిపాదన ఏమీ లేదని మోదీ సర్కార్ స్పష్టంచేసింది. ఈ పథకం కింద రైతులకు ఏటా అందించే రూ.6,000 నగదు సాయం మొత్తాన్ని ప్రస్తుతానికి పెంచట్లేమని తేల్చి చెప్పింది. ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంగా లోక్‌సభలో వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ ఈ విషయం చెప్పారు. దేశంలోని రైతులకు సాయం కింద 2018 నుంచి ఏటా మోదీ సర్కార్ రూ.6,000 చొప్పున పంపిణీ చేస్తున్న విషయం విదితమే.

ఇండోనేసియా ఘటనలో 23కు చేరిన మృతులు

బటు పలనో: ఇండోనేసియాలోని మరపీ అగ్ని పర్వతం బద్దలైన ఘటనలో మరణించిన పర్వతారోహకుల సంఖ్య 23కు చేరింది. ఈ ఘటనలో 11 మంది చనిపోయినట్లు సోమవారం అధికారులు ప్రకటించారు. మంగళవారం మరికొన్ని మృతదేహాలు లభ్యం కావడంతో మృతుల సంఖ్య పెరిగింది. అయితే, సోమవారం మరో విస్ఫోటనంతో 2,620 అడుగుల ఎత్తున వేడి బూడిద గాలిలోకి చిమ్మడంతో అన్వేషణ కార్యకలాపాలను నిలిపివేశారు. ఆదివారం మరపీ వైపుగా వెళ్లి ప్రమాదంలో పడిన సుమారు 75 మందిలో 50 మందిని రక్షించారు.

'సీఐడీ' నటుడు దినేశ్ హఠాన్మరణం



ముంబై: పాపులర్ టీవీ సీరియల్ 'సీఐడీ'లో ఫ్రెడరిక్స్ పాత్ర పోషించిన నటుడు దినేశ్ ఫడ్నిస్(57) కన్నుమూశారు. కొంతకాలంగా లివర్ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న దినేశ్ ముంబైలోని తుంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించి సోమవారం అర్ధరాత్రి 12.8 గంటలకు దినేశ్ తుదిశ్వాస విడిచినట్లు ఆయన స్నేహితుడు, నటుడు ఆదిత్య శ్రీవాస్తవ చెప్పారు.

అవినీతి.. అంతర్గత పోరు

రాజస్తాన్‌లో కాంగ్రెస్ ఓటమికి ప్రధాన కారణాలివే

- మంత్రులు, ఎమ్మెల్యేలపై వ్యతిరేకత
- అయినా 90 శాతం మందికి టికెట్లు
- 17 మంది మంత్రులు, 31 మంది ఎమ్మెల్యేల ఓటమి
- పేపర్ లీకేజీలతో యువతలో చెడ్డ పేరు




గెహ్లోత్

రాజస్తాన్‌లో అసెంబ్లీ ఎన్నికలంటే అధికార పార్టీకి ఎప్పుడూ ముచ్చెమటలే. ప్రతి ఐదేళ్లకూ ప్రభుత్వాన్ని పడగొట్టడం అక్కడి ప్రజలకు అలవాటు. 30 ఏళ్లుగా కొనసాగుతున్న ఆనవాయితీ ఇది. అధికార కాంగ్రెస్ ఓడిపోవడంతో ఈసారీ అది కొనసాగింది. కానీ కాంగ్రెస్ ఓటమికి ఆనవాయితీ కంటే అంతర్గత పోరు, అవినీతిని కట్టడి చేయడంలో సీఎం గెహ్లోత్ వైఫల్యమే ముఖ్య కారణాలు. యువ నేత సచిన్ పైలట్‌కు, గెహ్లోత్‌కు మధ్య నెలకొన్న తీవ్ర విభేదాలు తూర్పు రాజస్తాన్‌లో కాంగ్రెస్‌ను బాగా దెబ్బ తీశాయి. ప్రజాకర్షక పథకాల మైలేజీని మంత్రులు, ఎమ్మెల్యేల అవినీతి తుడిచిపెట్టేసింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

కొంపముంచిన సిట్టింగులు

గత ఐదేళ్లలో రాజస్తాన్‌లో వరుసబెట్టి పలు అవినీతి కుంభకోణాలు జరిగాయి. నిరుద్యోగం తీవ్రంగా ఉన్న నేపథ్యంలో వీలైనన్ని నియామకాలు చేపట్టడం ద్వారా వారిలో అసంతృప్తిని చల్లార్చేందుకు గహ్లోత్ ప్రభుత్వం ప్రయత్నించకపోలేదు. కానీ ఆ క్రమంలో ప్రభుత్వం నిర్వహించిన పరీక్షల్లో ఏకంగా 12 సార్లు పేపర్లు లీకయ్యాయి! వాటికోసం రాత్రింబవళ్లు కష్టపడి సన్నద్ధమైన 50 లక్షల మంది యువతీ యువకులతో పాటు వారి కుటుంబాల్లో ఇది కాంగ్రెస్‌పై తీవ్ర వ్యతిరేకతకు దారితీసింది. దీనికి తోడు మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై ప్రజల్లో తీవ్రస్థాయిలో అసమ్మతి నెలకొని ఉంది. కాంగ్రెస్ అంతర్గత సర్వే ఈ మేరకు స్పష్టంగా పేర్కొంది. అయినా ఈ కీలకమైన అంశాన్ని విస్మరించి 90 శాతానికి పైగా సిట్టింగులకు గెహ్లోత్ మళ్లీ టికెట్లిచ్చారు. తద్వారా కోలుకోలేని పొరపాటు చేశారు. తీరా ఫలితాలొచ్చాక మంత్రుల్లో ఏకంగా 17 మంది ఓటమిపాలవగా ఎమ్మెల్యేల్లోనూ 31 మంది అదే బాట పట్టారు. పైగా 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచార భారమంతటినీ సమర్థంగా మోసి కాంగ్రెస్‌ను అధికారంలోకి తేవడంలో కీలకంగా వ్యవహరించిన పైలట్‌ను ఈసారి గెహ్లోత్ పూర్తిగా దూరం పెట్టడం చేటు చేసింది.



ఓట్ల తేడా స్వల్పమే!

రాజస్తాన్‌లో కాంగ్రెస్ ఓటమి పాలైనా బీజేపీకి పోలైన ఓట్లతో పోలిస్తే అంతరం కేవలం 2.2 శాతమే కావడం గమనార్హం. బీజేపీకి 41.7 శాతం ఓట్లు రాగా కాంగ్రెస్ 39.5 శాతం దక్కించుకుంది. సిట్టింగ్ ఎమ్మెల్యేలపై అసంతృప్తే ఆ పార్టీ ఓటమికి ప్రధానంగా కారణమైందనేందుకు ఇది మరో నిదర్శనం. ఎందుకంటే...

- మొత్తం 199 స్థానాలకుగాను ఏకంగా 111 చోట్ల కాంగ్రెస్ రెండో స్థానంలో నిలిచింది. బీజేపీ కేవలం 66 సీట్లలోనే రెండో స్థానంలో ఉంది.
- 20 వేల ఓట్లకు పైగా మెజారిటీతో గెలిచిన 77 స్థానాల్లో బీజేపీకి 45 దక్కగా కాంగ్రెస్ 22తో సరిపెట్టుకుంది.
- 5 శాతం కంటే తక్కువ మెజారిటీ నమోదైన 66 స్థానాల్లో బీజేపీకి 34, కాంగ్రెస్‌కు 23 దక్కాయి.
- అలాగే 10-20 శాతం మెజారిటీ వచ్చిన 61 స్థానాల్లోనూ బీజేపీకి 37 వస్తే కాంగ్రెస్‌కు 22 వచ్చాయి.
- మెజారిటీ 20 శాతాన్ని మించిన 19 స్థానాల్లో మాత్రం 11 బీజేపీ ఖాతాలో పడ్డాయి. కాంగ్రెస్ ఆరింటికి పరిమితమైంది.
- అలాగే 5-10 శాతం మెజారిటీ నమోదైన 53 సీట్లలోనూ బీజేపీకి 33 దక్కితే కాంగ్రెస్ 18తో సరిపెట్టుకుంది.

గాజాలో మళ్లీ బీభత్సం

- ఖాన్ యూనిస్ సిటీపై ఇజ్రాయెల్ భీకర దాడులు.. 43 మంది మృతి
- జబాలియా శరణార్థి శిబిరాన్ని చుట్టుముట్టిన ఇజ్రాయెల్ సైన్యం

ఖాన్ యూనిస్: హమాస్‌తో కాల్పుల విరమణ ఒప్పందం ముగిసిన తర్వాత గాజాస్ట్రిప్‌లో పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. మళ్లీ యుద్ధ బీభత్సం స్పష్టం కనిపిస్తోంది. జనం చెల్లాచెదురవుతున్నారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని సురక్షిత ప్రాంతాలను వెతుక్కుంటూ తరలివెళ్తున్నారు. హమాస్ మిలిటెంట్ల స్థావరాలు, మౌలిక సదుపాయాలను ధ్వంసం చేయడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ సైన్యం దాడులు తీవ్రతరం చేసింది. దక్షిణ గాజాలోని ఖాన్ యూనిస్ సిటీపై సోమవారం అర్ధరాత్రి తర్వాత క్షిపణుల వర్షం కురిపించింది. ఖాన్ యూనిస్‌లో ఇజ్రాయెల్ తాజా దాడుల్లో 43 మంది మరణించారని హమాస్ వెల్లడించింది. సాధారణ జనావాసాలపై దాడులు చేయలేదని, హమాస్ స్థావరాలను మాత్రమే లక్ష్యంగా చేసుకున్నామని ఇజ్రాయెల్ ప్రకటించింది. ఉత్తర గాజాలో అతిపెద్ద జబాలియా రెఫ్యూజీ క్యాంప్‌ను తమ సైన్యం చుట్టుముట్టిందని ఇజ్రాయెల్ ప్రకటించింది. ఈ క్యాంప్‌లోపలి హమాస్ స్థావరాలను నేలమట్టం చేయబోతున్నామని వెల్లడించింది. గాజాలో ఇప్పుడు సురక్షిత ప్రాంతం అంటూ ఏదీ లేకుండాపోయిందని 'యూనిసెఫ్' ఆందోళన వ్యక్తం చేసింది. ఇక్కడ పరిస్థితి ప్రతి గంట గంటకూ దిగజారుతోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొంది.

గాజాలో 15,899కి చేరిన మృతులు

ఇజ్రాయెల్-హమాస్ మధ్య అక్టోబర్ 7న యుద్ధం మొదలైంది. ఇజ్రాయెల్ దాడుల్లో గాజాలో ఇప్పటివరకు 15,899 మంది మృతిచెందారని గాజా ఆరోగ్య శాఖ తెలిపింది. కాల్పుల విరమణ ఒప్పందం ముగిసిన తర్వాత గత మూడు రోజుల వ్యవధిలోనే 700 మంది మరణించినట్లు తెలుస్తోంది.

కలుగుల్లోని ఎలుకలను రప్పించినట్లు..

గాజాలో హమాస్ మిలిటెంట్లు బలమైన సొరంగాల వ్యవస్థను నిర్మించుకున్నారు. అక్కడే వారి ఆయుధ నిల్వలు, కమ్యూనికేషన్ పరికరాలను ఏర్పాటు చేసుకున్నారు. ఈ కలుగుల్లో దాక్కొని ఇజ్రాయెల్ సైన్యంపై దాడులకు దిగుతున్నారు. అందుకే సొరంగాలను ధ్వంసం చేయడానికి , వాటిని సముద్రపు నీటితో నింపేయాలని ఇజ్రాయెల్ రంగం సిద్ధం చేసింది. ఇందుకోసం నవంబర్‌లోనే అల్-షాతీ శరణార్థి శిబిరానికి మైలు దూరంలో 5 భారీ పంపులను ఏర్పాటు చేసినట్లు ఓ వార్తా సంస్థ వెల్లడించింది. ఇవి గంటకు కొన్ని వేల క్యూబిక్ మీటర్ల నీటిని పంప్ చేస్తాయని, వారాల వ్యవధిలోనే సొరంగాలను నింపుతాయని పేర్కొంది. దీంతో సొరంగాలు పనికిరాకుండాపోతాయి. అందులోని ఆయుధాలు, కమ్యూనికేషన్ పరికరాలు నిరుపయోగంగా మారతాయని ఇజ్రాయెల్ అంచనా. సొరంగాల్లోని మిలిటెంట్లను అంతం చేయడం తేలికవుతుందని భావిస్తోంది. ఇలా ఉండగా, బందీలను సొరంగాల్లో మిలిటెంట్లు దాచిపెట్టిన సంగతి తెలిసింది. వారంతా విడుదలైన తర్వాత సొరంగాలను నీటితో నింపే ప్రణాళికలను అమలు చేస్తారా? లేక ముందే చేస్తారా? అనేది తెలియరాలేదు.

హెచ్-1బీ రెన్యువల్స్.. కొత్త విధానంపై ఆందోళన!

వాషింగ్టన్: అమెరికా తాజాగా తెరపైకి తేనున్న ప్రయోగాత్మక హెచ్-1బీ వీసా రెన్యువల్ విధానాన్ని డిపెండెంట్స్(కుటుంబ సభ్యుల)కు వర్తింపజేయకపోవడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. హెచ్-1బీ వీసాలపై అమెరికాలో కొన్ని సంవత్సరాలుగా పని చేస్తున్న వేలాదిమంది భారతీయ టెకీలకు ఇది పెద్ద సమస్య కానుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. గత జనవరిలో ప్రకటించిన ఈ విధానం ప్రకారం హెచ్-1బీ వీసాదారులు రెన్యువల్/స్టాంపింగ్ కోసం మాతృదేశానికి వెళ్లాల్సిన అవసరముండదు. కేవలం ఆన్‌లైన్‌లో రెన్యువల్ దరఖాస్తు చేసుకుంటే చాలు. అయితే ఆ దరఖాస్తు ఆమోదు ప్రక్రియలో ఉన్నకాలంలో వారు అమెరికాను వీడి వెళ్లకూడదు. 'అమెరికాలోనే రెన్యువల్/స్టాంపింగ్' అనేది ఇంకా పైలెట్ ప్రాజెక్టు దశలోనే ఉన్నందున తొలుత కేవలం 20,000 దరఖాస్తులనే అనుమతించనున్నట్టు కాన్సులర్ వ్యవహారాల డిప్యూటీ అసిస్టెంట్ సెక్రెటరీ జూలీ స్టఫ్ వెల్లడించారు. "ఇది కొత్త విధానమేమీ కాదు. కాకపోతే గత 20 ఏళ్లలో ఎన్నడూ దీన్ని అమలు చేయలేదు. ఈ దృష్ట్యా ప్రయోగాత్మకంగా అమలు చేసి చూడనున్నాం. ఫలితాలను బట్టి దీన్ని ఏ మేరకు ముందుకు తీసుకెళ్లాలో నిర్ణయానికి వస్తాం" అని వివరించారు. వీసాల జారీ, రెన్యువల్ ప్రక్రియలో ప్రస్తుతం సుదీర్ఘ వెయిటింగ్ పీరియడ్‌ను వీలైనంతగా తగ్గించడమే కొత్త విధానం ఉద్దేశం. దీన్ని హెచ్-1బీ వీసాదారుల కుటుంబీకులకు వర్తింపజేయడం లేదు కాబట్టి డిపెండెంట్స్ వారి రెన్యువల్ కోసం మాతృదేశం వెళ్లడం తప్పనిసరి. దీంతో వీసాదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. జూలీ స్టఫ్ మాత్రం కొత్త విధానాన్ని ప్రస్తుతానికి వర్క్ వీసాలకే పరిమితం చేయదలచినట్టు స్పష్టం చేశారు.

గోమూత్ర రాష్ట్రాల్లోనే గెలుపు

దక్షిణాదిన బీజేపీకి స్థానం లేదు

- లోక్‌సభలో డీఎంకే ఎంపీ సెంథిల్ కుమార్ వ్యాఖ్యలు
- బీజేపీ, కాంగ్రెస్ నేతల ఆగ్రహం



సెంథిల్

న్యూఢిల్లీ: హిందీ మాట్లాడే ఉత్తరాది రాష్ట్రాలను తమిళనాడుకు చెందిన డీఎంకే ఎంపీ డీఎన్‌వీ సెంథిల్ కుమార్ గోమూత్ర రాష్ట్రాలు అని అభివర్ణించారు. కేవలం గోమూత్ర రాష్ట్రాల్లోనే బీజేపీ గెలుస్తుందంటూ లోక్‌సభలో ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. దక్షిణాది రాష్ట్రాల్లో గెలిచే సత్తా బీజేపీకి లేదని ఆయన అన్నారు. సెంథిల్ కుమార్‌పై బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. విపక్ష 'ఇండియా' కూటమిలో భాగస్వామి అయిన డీఎంకే ఎంపీ ఉత్తర భారతీయులను కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలను సమర్థిస్తున్నారా? అని కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీని ప్రశ్నించారు. జమ్మూకశ్మీర్‌కు సంబంధించిన రెండు బిల్లులపై మంగళవారం లోక్‌సభలో జరిగిన చర్చలో సెంథిల్ కుమార్ మాట్లాడారు. మనం సాధారణంగా గోమూత్ర రాష్ట్రాలుగా పిలిచే ఉత్తరాది రాష్ట్రాల్లోనే బీజేపీ విజయం సాధిస్తుందని, ఈ విషయం ప్రజలు గుర్తించాలని అన్నారు. "మీరు(బీజేపీ) దక్షిణ భారతదేశానికి చేరుకోలేరు. అక్కడ మీకు విజయం దక్కదు. స్థానం లేదు. కేరళ, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ఎన్నికల్లో ఏం జరిగిందో చూడండి. దక్షిణాదిన మేము బలంగా ఉన్నాం" అని స్పష్టంచేశారు. దక్షిణాది రాష్ట్రాలను కేంద్ర పాలిత ప్రాంతాలుగా మారిస్తే తప్ప బీజేపీకి అక్కడ అధికారం దక్కదని తేల్చిచెప్పారు. దక్షిణ భారతదేశంపై ఆధిపత్యం చెలాయించే సాహసాన్ని బీజేపీ కలలో కూడా చేయలేదని పేర్కొన్నారు. సెంథిల్‌కుమార్ వ్యాఖ్యలను తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు కె.అన్నామలై తీవ్రంగా ఖండించారు. తమిళనాడులో డీఎంకే పతనం ప్రారంభమైందని, ఆ పార్టీ నేతల అహంకారమే ఇందుకు కారణమని 'ఎక్స్'లో పోస్టు చేశారు. రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వ నిర్వాకం వల్లే చెన్నై నగరం నీట మునుగుతోందని విమర్శించారు. పుదుచ్చేరిలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వమే అధికారంలో ఉందని అన్నామలై గుర్తుచేశారు. సెంథిల్ కుమార్ వ్యాఖ్యలను రాహుల్ గాంధీ సమర్థిస్తున్నారా? అని కర్ణాటక మాజీ మంత్రి సి.టి.రవి నిలదీశారు. భారతీయులను కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు అవమానిస్తున్నాయని మండిపడ్డారు. సెంథిల్ కుమార్ వెంటనే క్షమాపణ చెప్పాలని, వివాదాస్పద వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం డిమాండ్ చేశారు. సెంథిల్ కుమార్ వ్యాఖ్యలను బీజేపీ సీనియర్ నేత, బిహార్ ఉప ముఖ్యమంత్రి సుశీల్ మోదీ, కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ శుక్లా తదితరులు తప్పుపట్టారు. మరోవైపు, సనాతన ధర్మానికి వ్యతిరేకంగా మాట్లాడిన తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్‌పై కేసు నమోదు చేయాలని, పదవి నుంచి తొలగించాలని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు మంగళవారం తమిళనాడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సభ గౌరవాన్ని కాపాడాలి: ఓం బిర్లా

లోక్‌సభలోకి ఎంపీలు ప్లకార్డులు తీసుకురావడం పట్ల స్పీకర్ ఓం బిర్లా అభ్యంతరం వ్యక్తం చేశారు. సభ గౌరవాన్ని కాపాడాలని, క్రమశిక్షణ పాటించాలని సూచించారు. తనను కించపర్చేలా మాట్లాడిన బీజేపీ ఎంపీ రమేశ్ బిధూరీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బీఎస్పీ సభ్యుడు డానిష్ అలీ సోమవారం సభలో ప్లకార్డును మెడకు బిగించుకొని నిరసన తెలిపారు. ఈ ఘటనపై స్పీకర్ మంగళవారం సభలో స్పందించారు. సభలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేయడం సరైంది కాదని హితవు పలికారు. నియమ నిబంధనలకు సభ్యులంతా కట్టుబడి ఉండాలని చెప్పారు.

సెంథిల్ కుమార్ క్షమాపణ

లోక్‌సభలో తాను చేసిన వ్యాఖ్యల పట్ల డీఎంకే ఎంపీ సెంథిల్ కుమార్ క్షమాపణ చెప్పారు. ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల గురించి ప్రస్తావించానని, ఇందులో భాగంగా ఒక వాక్యాన్ని సరైన రీతిలో ఉపయోగించలేదని పేర్కొన్నారు. తనకు ఎలాంటి దురుద్దేశం లేదన్నారు. తన మాటలకు తప్పుడు అర్థాలు ప్రచారంలోకి వస్తుండడంతో క్షమాపణ కోరుతున్నానని వివరించారు.

కొన్ని విషయాలు చెప్పకపోవడమే మేలు



న్యూఢిల్లీ: హైకోర్టుల్లో న్యాయమూర్తుల నియామకం, బదిలీల విషయంలో కొలీజియం సిఫార్సులపై చర్యలు తీసుకోకుండా కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తోందని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టులో ఆసక్తికరమైన పరిణామం చోటుచేసుకుంది. వాస్తవానికి ఈ పిటిషన్లపై మంగళవారం విచారణ కొనసాగించాల్సి ఉంది. కానీ, జాబితా నుంచి వీటిని హఠాత్తుగా తొలగించారు. దీనిపై పిటిషన్ల తరఫు న్యాయవాదులు అభ్యంతరం వ్యక్తం చేశారు. న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ సుధాంశు ధూలియాతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనాన్ని ప్రశ్నించారు. తమ పిటిషన్లపై మంగళవారం విచారణ చేపట్టాలంటూ జ్యుడీషియల్ ఆర్డర్ సైతం ఉందని, అయినప్పటికీ ఈరోజు వ్యాజ్యాల జాబితా నుంచి హఠాత్తుగా తొలగించడానికి గల కారణం చెప్పాలని అన్నారు. తాము తొలగించలేదని జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ బదులిచ్చారు. అయితే, సుప్రీంకోర్టు రిజిస్ట్రీ నుంచి వివరణ కోరాలని పిటిషనర్ తరఫు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ సూచించారు. జాబితా నుంచి పిటిషన్లను ఎవరికీ చెప్పకుండా తొలగించడం అసాధారణ పరిణామం అని అన్నారు. "కొన్నిసార్లు కొన్ని విషయాలు చెప్పకుండా వదిలేయడమే మేలు" అని జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ ప్రతిస్పందించారు.

భూకక్ష్య వైపు ప్రొపల్షన్ మాడ్యూల్: ఇస్రో

బెంగళూరు: చంద్రయాన్-3 మిషన్‌లో మరో కీలక మలుపు. ఈ ప్రయోగంలో భాగమైన ప్రొపల్షన్ మాడ్యూల్ కక్ష్యను మార్చుతున్నట్లు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) ప్రకటించింది. ఈ మాడ్యూల్‌ను చంద్రుడి కక్ష్య నుంచి భూకక్ష్య వైపు మళ్లించినట్లు తెలియజేసింది. ఇదొక విశిష్టమైన ప్రయోగమని పేర్కొంది. ఈ మేరకు మంగళవారం 'ఎక్స్'లో పోస్టు చేసింది. చంద్రయాన్-3లోని మూడు ప్రధాన భాగాల్లో ల్యాండర్ మాడ్యూల్, రోవర్‌తోపాటు ప్రొపల్షన్ మాడ్యూల్ కూడా ఉంది. చంద్రయాన్-3 ప్రయోగానికి ముందు ప్రొపల్షన్ మాడ్యూల్‌తోపాటు ల్యాండర్ మాడ్యూల్ అనుసంధానమై ఉంది. ప్రొపల్షన్ మాడ్యూల్ వాహక నౌక నుంచి విడిపోయి, ల్యాండర్ మాడ్యూల్‌ను జాబిల్లికి 100 కిలోమీటర్ల సమీపంలోకి విజయంతంగా తీసుకెళ్లింది. అనంతరం ప్రొపల్షన్ మాడ్యూల్ నుంచి ల్యాండర్ మాడ్యూల్‌ను విడిపోయింది. చంద్రుడి ఉపరితలంపై అడుగుపెట్టింది. ప్రొపల్షన్ మాడ్యూల్ అప్పటి నుంచి చంద్రుడి కక్ష్యలో పరిభ్రమిస్తూనే ఉంది. అందులో 100 కిలోల ఇంధనం ఉండడంతో చక్కగా పనిచేస్తోంది. ప్రొపల్షన్ మాడ్యూల్‌ను ఇప్పుడు భూకక్ష్య వైపు మళ్లించడం ద్వారా భూమికి సంబంధించిన పరిశోధనలు చేయనున్నారు.

కర్ణిసేన చీఫ్ కాల్చివేత

ఇంటికెళ్లి చంపిన దుండగులు | తమదే బాధ్యతన్న లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్



సుఖ్‌దేవ్ సింగ్‌పైకి దుండగులు కాల్పులు జరుపుతున్న దృశ్యం

జైపూర్: శ్రీ రాష్ట్రీయ రాజ్‌పుత్ కర్ణి సేన అధ్యక్షుడు సుఖ్‌దేవ్ సింగ్ గొగామెడి హత్యకు గురయ్యారు. గుర్తు తెలియని ముగ్గురు దుండగులు మంగళవారం ఉదయం జైపూర్‌లోని సుఖ్‌దేవ్ ఇంటికి వెళ్లారు. ఆయనతో 10 నిమిషాల పాటు మాట్లాడాక కాల్పులకు దిగారు. ఈ ఘటనలో సుఖ్‌దేవ్ చనిపోగా ఎదురుకాల్పుల్లో దుండగుల్లో ఒకడు హతమయ్యాడు. సుఖ్‌దేవ్ అంగరక్షకుడు తీవ్రంగా గాయపడ్డారు. శ్రీ రాజ్‌పుత్ కర్ణి సేన వ్యవస్థాపకుడు లోకేంద్ర సింగ్ కల్వీతో విభేదాలు రావడంతో సుఖ్‌దేవ్ సింగ్ 2015లో సొంతంగా శ్రీ రాష్ట్రీయ రాజ్‌పుత్ కర్ణి సేనను నెలకొల్పారు. ఈ రెండు సంఘాలు 2018లో విడుదలైన పద్మావత్ సినిమాకు వ్యతిరేకంగా ఆందోళనలకు దిగిన విషయం తెలిసిందే. ఆ సినిమాలో రాజ్‌పుత్‌లకు సంబంధించి చారిత్రక సత్యాలను వక్రీకరించారంటూ ఆరోపించారు. గొగామెడి హత్య ఘటనపై జైపూర్ పోలీస్ కమిషనర్ బిజు జార్జి జోసెఫ్ మీడియాతో మాట్లాడారు. 'ముగ్గురు దుండగులు గొగామెడి ఇంటికి వెళ్లారు. ఆయనతో మాట్లాడాలంటూ అక్కడి సెక్యూరిటీ గార్డులకు చెప్పారు. దీంతో, వారిని లోపలికి తీసుకెళ్లారు. గోగామెడితో 10 నిమిషాలపాటు మాట్లాడాక అకస్మాత్తుగా కాల్పులకు దిగారు. దుండగుల్లో నవీన్ సింగ్ షెకావత్ అనే వ్యక్తి ఎదురుకాల్పుల్లో చనిపోయాడు. మిగతా ఇద్దరు గోగామెడి ఇంటి బయట ఓ వ్యక్తి నుంచి స్కూటీని లాగేసుకుని పరారయ్యారు'అని వివరించారు. 'ఈ ఘటనలో గొగామెడి భద్రతా సిబ్బంది ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. అతడు ఆస్పత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. కాల్పుల ఘటన మొత్తం సీసీటీవీలో రికార్డయింది. తప్పించుకుపోయిన నిందితులను గుర్తించి, పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నాం. హత్యకు కుట్ర పన్నిన వారిని సైతం పట్టుకుంటాం. హతమైన షెకావత్ స్థానికంగా దుకాణం నడుపుతున్నట్లు ప్రాథమికంగా తేలింది'అని చెప్పారు. గొగామెడి కాల్చివేత వార్త తెలిపిన వెంటనే మద్దతుదారులు అతడి ఇంటి వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. గత కొంతకాలంగా గొగామెడికి బెదిరింపులు వస్తున్నాయని అతడి బంధువొకరు తెలిపారు. ఈ సమాచారం పోలీసులకు కూడా అందించామన్నారు. గొగామెడి మృతదేహాన్ని తరలించిన ఆస్పత్రికి వెళ్లే రోడ్డును మద్దతుదారులు దిగ్బంధించారు. నిందితులను వెంటనే పట్టుకోవాలంటూ డిమాండ్ చేశారు. హత్యను నిరసిస్తూ కర్ణి సేన మద్దతుదారులు జైపూర్‌లో ర్యాలీ నిర్వహించారు. కాగా, గొగామెడి హత్యకు తమదే బాధ్యతని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన రోహిత్ గొదారా ఫేస్‌బుక్‌లో ప్రకటించాడు. తమ శత్రువులతో చేయి కలిపినందునే గొగామెడిని చంపేశామన్నాడు. శత్రువులకు కూడా ఇదే గతి పడుతుందని హెచ్చరించాడు.

పాక్‌లో ఖలిస్తానీ ఉగ్రవాది లఖ్‌బీర్ సింగ్ మృతి



న్యూఢిల్లీ: భారత ప్రభుత్వం ఉగ్రవాదిగా ప్రకటించిన ఖలిస్తాన్ వేర్పాటువాది లఖ్‌బీర్ సింగ్ అలియాస్ రోడ్(87) పాకిస్తాన్‌లో కన్నుమూశాడు. రావల్పిండిలోని ఓ ఆస్పత్రిలో ఇటీవల అతడు గుండెపోటుతో చనిపోయినట్లు ఒక అధికారి తెలిపారు. రోడ్ సోమవారం చనిపోయినట్లు కొందరు చెబుతుండగా, శనివారమే ఆయన తుదిశ్వాస విడిచినట్లు మరికొన్ని వార్తా కథనాలు పేర్కొంటున్నాయి. పంజాబ్‌లోని మోగా జిల్లా రోడ్ సుఖ్‌బీర్ స్వగ్రామం. 1982లో దుబాయ్ నుంచి పంజాబ్‌కు వచ్చినప్పటి నుంచి ఇతడు ఖలిస్తాన్ ఉద్యమంలో పాల్గొంటున్నాడు. 1984లో స్వర్ణదేవాలయంపై సైనిక చర్య అనంతరం నేపాల్‌కు, అక్కడి నుంచి మళ్లీ దుబాయ్‌కి పారిపోయాడు. 1991 నుంచి పాక్‌లో ఆశ్రయం పొందుతున్నాడు. ఇతడు ఏర్పాటు చేసిన ఖలిస్తాన్ లిబరేషన్ ఫ్రంట్(కేఎల్ఎఫ్), ఇంటర్నేషనల్ సిఖ్ యూత్ ఫెడరేషన్‌పై భారత ప్రభుత్వం నిషేధం విధించింది. ఇతడిపై ఇంటర్‌పోల్ రెడ్ కార్నర్ నోటీసు జారీ చేసింది. 2001లో పార్లమెంట్‌పై జైషే మహ్మద్ ఉగ్రవాదుల దాడి ఘటనకు సంబంధించి భారత్..పాకిస్తాన్‌ను అప్పగించాలని కోరిన 20 మంది మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదుల జాబితాలో రోడ్ పేరూ ఉంది.

సాక్షి కరీంనగర్

బుధవారం । 6 । డిసెంబర్ । 2023



బోనమో తల్లీ

వేములవాడ: రాజన్నను దర్శించుకున్న భక్తులు మంగళవారం బద్దిపోచమ్మకు బోనం సమర్పించారు. వర్షంలో చలవపందిళ్ల కింద తడుస్తూనే మొక్కులు చెల్లించుకున్నారు.

పవర్‌కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: కరీంనగర్‌లో విద్యుత్ మరమ్మతు పనులు చేపడుతున్నందున బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు తెలంగాణ చౌరస్తా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2 ఏడీఈ ఎం.సుధీర్ కుమార్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
24.0/21.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తుపాను కారణంగా చిరుజల్లుల నుంచి మోస్తరు వర్షం కురుస్తుంది. చలి తీవ్రత పెరుగుతుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

బండిని కలిసిన జెయింట్ కిల్లర్



సాక్షిప్రతినిధి కరీంనగర్: కామారెడ్డిలో తాజా మాజీ సీఎం కేసీఆర్, కాబోయే సీఎం రేవంత్ రెడ్డిని ఓడించిన జెయింట్ కిల్లర్, బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మంగళవారం రాత్రి బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ ను కలిశారు. కామారెడ్డి నుంచి తన అనుచరులతో కలిసి వచ్చిన ఆయనను సంజయ్ ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. ఇరువురు అరగంటకుపైగా వివిధ అంశాలపై చర్చించారు. తన గెలుపునకు దోహదపడిన అంశాలు, కార్యకర్తలకృషి, పార్టీ సహకారం తదితరాలపై ముచ్చటించారు.

డీజేలపై నిషేధాజ్ఞలు పొడిగింపు



కరీంనగర్‌క్రైం: కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో డీజేల వినియోగంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలు ఈనెల 31వ తేదీ వరకు పొడిగించినట్లు సీపీ అభిషేక్ మహంతి తెలిపారు. చిన్నపిల్లలు, వృద్ధులు, రోగులు, విద్యార్థుల విద్యాభ్యాసానికి భంగం కలగకుండా డీజే వినియోగంపై నిషేధాజ్ఞలు విధించినట్లు పేర్కొన్నారు. దీంతోపాటు సాధారణ పౌరులు, మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కమిషనరేట్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలు ఈ నెల 31వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు. భద్రత కారణాల దృష్ట్యా పారాగ్లైడర్స్, రిమోట్ కంట్రోల్ డ్రోన్స్, రిమోట్ కంట్రోల్ మైక్రోలైట్ ఎయిర్ క్రాఫ్టుల వినియోగాన్ని నిషేధించినట్లు ఈ ఆజ్ఞలు ఈ నెల 31వ తేదీ వరకు అమల్లో ఉంటాయని సీపీ పేర్కొన్నారు.

పత్తి క్వింటాల్ రూ.6,550



జమ్మికుంట:జమ్మికుంట పత్తి మార్కెట్‌లో క్వింటాల్ పత్తిధర గరిష్టంగా రూ.6,550 పలికింది. మంగళవారం మార్కెట్‌కు 111 వాహనాల్లో 1,545 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తెచ్చారు.క్వింటాల్‌కు మోడల్ ధర రూ.6,400, కనిష్ట ధర రూ.6,000 పలికింది. గన్నీ సంచుల్లో నలుగురు రైతులు నాలుగు క్వింటాళ్ల పత్తిని అమ్మకానికి తీసుకొచ్చారు. గరిష్ట ధర రూ.6,200, మోడల్, కనిష్ట ధరలు రూ.5,900కు వ్యాపారులు కొనుగోలు చేశారు. కాగా.. మార్కెట్‌లో సీసీఐ సంస్థ ఐదుగురు రైతుల నుంచి 75.70 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసింది. క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7,020, మోడల్ ధర రూ.6,925, కనిష్ట ధర రూ.6,880 పలికింది. మార్కెట్ కార్యదర్శి గూగులోతు రెడ్డి నాయక్ కొనుగోళ్లను పర్యవేక్షించారు.

జాతీయ సాహస శిబిరానికి రుచిత



కరీంనగర్ సిటీ: జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే జాతీయ సాహస శిబిరానికి ఎస్సారార్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ జి.రుచిత ఎంపికైంది. బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న రుచిత ఈనెల 30వ తేదీ నుంచి 2024 జనవరి 8వ తేదీ వరకు వారంరోజుల పాటు హిమాచల్ ప్రదేశ్‌లోని నార్కండలో జరిగే జాతీయ సాహస శిబిరంలో పాల్గొంటుంది. ఇక్కడ పర్వతారోహణ, రోప్ పాసింగ్, జంపింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. రుచితను ప్రోగ్రాం అధికారి వరప్రసాద్, ప్రిన్సిపాల్ కె.రామకృష్ణ అభినందించారు.

సామాజిక చైతన్యం పెంపొందించుకోవాలి

గన్నేరువరం: విద్యార్థి దశనుంచి సామాజిక సేవా కార్యక్రమాలపై చైతన్యం పెంపొందించుకోవాలని జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు సూచించారు. మండలంలోని జంగపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం యూనిసెఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన యూఎన్ అంతర్జాతీయ స్వచ్ఛంద దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చదువులో ప్రతిభ కనబరిచిన 10వ తరగతి విద్యార్థులకు ఫిబ్రవరి నుంచి తగు ప్రోత్సాహం ఇస్తామన్నారు. యూనిసెఫ్ సమన్వయకర్త కిషన్‌స్వామి మాట్లాడుతూ విద్యార్థి దశలోనే నీరు, విద్యుత్ పొదుపు, పరిశుభ్రతను పాటించాలని సూచించారు.

‘హస్త’వాసి బాగుంది!

- ప్రభుత్వ వ్యతిరేకత, పోరాటాలతో 8 సీట్లు కైవసం
- బలంగా పనిచేసిన సానుభూతి, ఆరు గ్యారంటీలు
- నిరాశపరిచిన హుజూరాబాద్, జగిత్యాల ఫలితాలు
- ఉత్సాహం నింపిన రాహుల్‌గాంధీ, రేవంత్, భట్టి పర్యటనలు
- నాలుగు స్థానాల్లో కాంగ్రెస్ విజయావకాశాలకు బీజేపీ గండి
- నిజమైన 'సాక్షి' కథనం



సాక్షిప్రతినిధి, కరీంనగర్:

కాంగ్రెస్ పార్టీ నేతల హస్తవాసి బాగుంది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో చేతి గుర్తు లీడర్లకు, కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం వచ్చింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో దక్కిన ఈ విజయం కేడర్‌లో కొత్త ఉత్సాహం నింపింది. అయితే, ఇవన్నీ ఒక్క రోజులో జరిగినవి కావు. పకడ్బందీ ప్రణాళికతో ఈరోజు పటిష్ట స్థితికి చేరుకోగలిగింది.

13 నియోజకవర్గాల్లో మీటింగ్‌లు

ఉమ్మడి జిల్లాలోని 13 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ 8 సీట్లు కైవసం చేసుకుంది. ప్రచారంలో ఆ పార్టీ హామీలు, అనుసరించిన వ్యూహాలు, ఆరు గ్యారంటీ పథకాలను పక్కాగా ప్రజల్లోకి తీసుకెళ్లగలగడం, అగ్రనేతల పర్యటనలు కేడర్‌లో ఆత్మస్థైర్యాన్ని నింపాయి. భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ పేరిట ఆదిలాబాద్ నుంచి మధిర వరకు చేపట్టిన పాదయాత్ర ఉమ్మడి జిల్లాలోని నియోజకవర్గాల మీదుగా సాగింది. దీనికి జాతీయ నాయకులు హాజరవడం కేడర్‌లో ఐక్యతను పెంచింది. తర్వాత రేవంత్‌రెడ్డి వరుస మీటింగ్‌లు, రాహుల్ గాంధీ పర్యటనలు మరింత జోష్ పెంచాయి.

ప్రభుత్వ వ్యతిరేకత, ధరణి సమస్యలు

టీఎస్‌పీఎస్సీ కుంభకోణం, 317 జీవో అమలుతో వచ్చిన వ్యతిరేకత, ధరణి సమస్యలు ప్రభుత్వానికి తలనొప్పిగా మారాయి. వీటిని ఎండగట్టడంలో ఇక్కడి కాంగ్రెస్ నాయకులు సక్సెస్ అయ్యారు. టీఎస్‌పీఎస్సీ నిందితులుగా ఆరోపణలు ఎదుర్కొన్నవారు, సూత్రధారులు, పాత్రధారులు సైతం ఉమ్మడి జిల్లాకు చెందినవారు కావడం ఇక్కడ కారు పార్టీ ప్రతిష్ట మసకబారేలా చేసింది. దళితబంధు, బీసీ, మైనార్టీ బంధు పథకాల అమలులో అవినీతి, అనుచరులకే ఇస్తామంటూ నేతల బహిరంగ వ్యాఖ్యలు హస్తం పార్టీకి కలిసివచ్చాయి. ఎన్నికల మేనిఫెస్టో రూపొందించాక.. 6 గ్యారంటీలపై విస్తృత ప్రచారం, బీఆర్‌ఎస్, బీజేపీ ఒకటేనన్న నినాదాన్ని జనాల్లోకి తీసుకెళ్లడంలో కిందిస్థాయి కేడర్ సఫలీకృతులయ్యారు. వీటికి ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ నాయకులపై ప్రజలకు ఉన్న సానుభూతి జత కలిసింది. ఫలితంగా మంచి మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థులు విజయతీరాలకు చేరారు.

దెబ్బతీసిన బీజేపీ, ఇండిపెండెంట్లు..

ఈసారి ఎన్నికల్లో బీజేపీ బలమైన అభ్యర్థులను రంగంలోకి దించడం పరోక్షంగా కాంగ్రెస్‌కు చేటు చేసింది. దీనికి స్వతంత్రులు సైతం తోడయ్యారు. సిరిసిల్ల మినహా కోరుట్ల, జగిత్యాల, కరీంనగర్, హుజూరాబాద్‌లో బీజేపీ బలం, చీలిన ప్రభుత్వ వ్యతిరేక ఓటు కాంగ్రెస్‌ను ఓటమిపాలు చేశాయి. బీఆర్‌ఎస్ గెలిచిన 5 స్థానాల్లోనూ కాంగ్రెస్‌కు బలమైన అభ్యర్థులు ఉన్నారు. జగిత్యాలలో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, కోరుట్లలో జువ్వాడి నర్సింగరావు, హుజూరాబాద్‌లో ఒడితెల ప్రణవ్ ఓటమికి కమలం పార్టీ అభ్యర్థులు చీల్చిన ప్రభుత్వ వ్యతిరేక ఓట్లే కారణమని కాంగ్రెస్ సీనియర్లు అభిప్రాయపడుతున్నారు. అదే సమయంలో పెద్దపల్లి జిల్లాలోని రామగుండం, పెద్దపల్లి, మంథని నియోజకవర్గాల్లో ఆ పార్టీ అభ్యర్థులు గెలిచి, క్లీన్ స్వీప్ చేశారు. ఈ మూడు నియోజకవర్గాల్లో ఎక్కడా బీజేపీ బలమైన అభ్యర్థులను నిలబెట్టలేకపోయిందని, ఇందుకు ఆ పార్టీకి వచ్చిన ఓట్లే నిదర్శనమని అంటున్నారు.

పెద్దపల్లి జిల్లాలో కాంగ్రెస్, బీజేపీలకు వచ్చిన ఓట్లు

రామగుండం:	రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్:	92,227
	కందుల సంధ్యారాణి (బీజేపీ):	12,966
పెద్దపల్లి :	చింతకుంట విజయరమణారావు:	1,18,888
	దుగ్యాల ప్రదీప్‌కుమార్ (బీజేపీ):	6,312
మంథని :	దుద్దిళ్ల శ్రీధర్‌బాబు:	1,03,822
	చంద్రుపట్ల సునీల్‌రెడ్డి (బీజేపీ):	5,680

బీఆర్‌ఎస్ గెలిచినచోట బీజేపీకి వచ్చిన ఓట్లు

కరీంనగర్:	గంగుల కమలాకర్(బీఆర్‌ఎస్) :	92,179
	బండి సంజయ్ (బీజేపీ) :	89,016
హుజూరాబాద్:	పాడి కౌశిక్‌రెడ్డి(బీఆర్‌ఎస్) :	80,333
	ఈటల రాజేందర్ (బీజేపీ) :	63,460
జగిత్యాల :	సంజయ్‌కుమార్(బీఆర్‌ఎస్) :	70,243
	బోగ శ్రావణి(బీజేపీ):	42,138
కోరుట్ల:	కల్వకుంట్ల సంజయ్(బీఆర్‌ఎస్):	72115
	ధర్మపురి అర్వింద్ (బీజేపీ) :	61,810
సిరిసిల్ల:	కేటీఆర్ (బీఆర్‌ఎస్) :	88,761
	రాణీ రుద్రమదేవి (బీజేపీ) :	18,328

నిజమైన సాక్షి కథనం

ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన ఆది శ్రీనివాస్–వేములవాడ, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్–ధర్మపురి, మక్కాన్‌సింగ్–రామగుండం, శ్రీధర్‌బాబు–మంథని, జీవన్‌రెడ్డి–జగిత్యాల, పొన్నం ప్రభాకర్–హుస్నాబాద్ గెలుస్తారని, ఆ దిశగా పార్టీ ప్రణాళికతో సాగుతోందని 'ఆరైనా హస్తగతం కావాలి' అన్న శీర్షికన గత ఆగస్టు 26న 'సాక్షి' దినపత్రికలో కథనం ప్రచురితమైంది. అదే నిజమైంది. అయితే, హోరాహోరీ పోరులో జగిత్యాల సీటు కాంగ్రెస్ చేజారగా, అదనంగా పెద్దపల్లి, మానకొండూరు, చొప్పదండి స్థానాలు ఆ పార్టీ ఖాతాలో చేరడం గమనార్హం. మాజీ ఎంపీ వివేక్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుంటారన్న విషయాన్నీ ఇదే కథనంలో ప్రస్తావించిన విషయం విదితమే.



ఆరైనా 'హస్తగతం' కావాలి!

ఆగస్టు 26న 'సాక్షి' ప్రచురించిన కథనం

దుకాణాల కేటాయింపు ఎప్పుడో!



ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి వద్ద నిర్మించిన దుకాణ సముదాయం

- స్మార్ట్‌సిటీలో భాగంగా నిర్మాణం
- ఏడాది కావస్తున్నా అప్పగించని వైనం
- ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలతో తప్పని ట్రాఫిక్ ఇక్కట్లు

కరీంనగర్ కార్పొరేషన్: స్మార్ట్‌సిటీలో భాగంగా నగరంలో నిర్మించిన దుకాణ సముదాయం అలంకారప్రాయంగా మారింది. దాదాపు ఏడాది కావస్తున్నా ఈ సముదాయంలోని దుకాణాల కేటాయింపు జరపకపోవడంతో అవి వృథాగా మిగిలాయి. మరోవైపు ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకొని చిరువ్యాపారులు తమ క్రయవిక్రయాలు కొనసాగించడం ఇబ్బందిగా మారింది.

- కరీంనగర్ నగరపాలకసంస్థ స్మార్ట్‌సిటీ ప్రాజెక్ట్ కింద ఎంపిక కావడంతో రూ.వందల కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ప్రధాన రహదారులు, కూడళ్లు, సమీకృత మార్కెట్‌లు, ఇతరత్రా భవనాల నిర్మాణాలు చేపడుతున్నారు.
- ఈ క్రమంలోనే రోడ్లపై వ్యాపారాలు ఉండరాదనే నిబంధనల మేరకు వీధివ్యాపారులకు నగరంలోని పలుచోట్ల ప్రత్యేక దుకాణ సముదాయాలు నిర్మించారు. ప్రభుత్వ ప్రధానఆస్పత్రి ప్రహరీని ఆనుకుని నగరపాలకసంస్థ ఆకర్షణీయమైన దుకాణ సముదాయాన్ని నిర్మించింది.
- ఇందులో దాదాపు 132వరకు దుకాణాలు ఉన్నాయి. వీటిని అర్హులైన వీధి వ్యాపారులకు కేటాయించడం ద్వారా ఫుట్‌పాత్‌లు, రోడ్లపై వ్యాపారాలను పూర్తిగా నిరోధించాలనేది స్మార్ట్‌సిటీ నిబంధన.
- ఈ సముదాయంలో నిబంధనల మేరకు ట్రేడ్ లైసెన్స్ పొందిన వీధివ్యాపారులకు దుకాణాల కేటాయింపు ఉంటుంది. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది.
- ఇదిలాఉంటే దుకాణాలను శాశ్వత ప్రాతిపదికన కేటాయించాలా, తాత్కాలిక పద్ధతిన ఇవ్వాలా, ఏయే వర్గాలకు ఇవ్వాలనేది నగరపాలకసంస్థ కౌన్సిల్ నిర్ణయిస్తుంది. నగరపాలకసంస్థ కౌన్సిల్ సమావేశంలో ఈ మార్గదర్శకాలపై తీర్మానం చేయాల్సి ఉంటుంది.
- అయితే ఈ దుకాణాల కేటాయింపు చేస్తామంటూ దళారులు వీధివ్యాపారుల వద్ద లక్షల రూపాయలు వసూలు చేస్తున్న వైనం గత ఆరు నెలల క్రితం వెలుగు చూసింది.
- ఒక్కో దుకాణం పేరిట రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు వసూలు చేసినట్లు ప్రచారం జరిగింది. అప్పటి నుంచి ఇప్పటివరకు అధికారులు ఆ దుకాణాల కేటాయింపు జోలికి పోవడం లేదు. సముదాయంలోని కొన్ని దుకాణాలు ఆక్రమించుకొని ఇప్పటికే కొంతమంది వ్యాపారాలు నిర్వహించుకొంటుండడం గమనార్హం.



ఫుట్‌పాత్‌లపైనే చిరువ్యాపారాలు

ఫుట్‌పాత్‌లపైనే వ్యాపారాలు..

నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లపైనే వ్యాపారాలు నిర్వహించుకోవడం ఇబ్బందిగా మారింది. వీధి వ్యాపారులకు దుకాణాలు కేటాయించకపోవడంతో వారంతా ఫుట్‌పాత్‌లనే దుకాణాలుగా మార్చేశారు. దీంతో ప్రజలు కనీసం నడవడానికి కూడా సాధ్యపడడం లేదు. టవర్‌సర్కిల్, ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి, బస్‌స్టేషన్ తదితర ప్రాంతాల్లో ఈ సమస్య అధికంగా ఉంది. స్మార్ట్‌సిటీలో భాగంగా రోడ్డుకు రెండు వైపులా ఫుట్‌పాత్‌లు నిర్మించగా, ఆ ఫుట్‌పాత్‌లను వ్యాపారులు ఆక్రమించుకోవడంతో లక్ష్యం నెరవేరడం లేదు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో నిర్మించిన దుకాణసముదాయాల కేటాయింపును త్వరగా పూర్తి చేసి, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు లేకుండా చూడాలని నగరప్రజలు అధికారులను కోరుతున్నారు.



కాంగ్రెస్ సంబరాలు

కరీంనగర్ కార్పొరేషన్: రాష్ట్ర మూడో ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయనుండడంతో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు నిర్వహించాయి. సీఎల్పీ నేతగా రేవంత్ రెడ్డిని ఎంపికచేసినట్లు ఏఐసీసీ ప్రకటించడంతో నగరంలోని తెలంగాణచౌక్‌లో బాణాసంచా కాల్చి, సంబరాలు జరుపుకున్నారు. పీసీసీ నాయకుడు వైద్యుల అంజన్ కుమార్, సిరాజ్ హుస్సేన్, అబ్దుల్ రెహమాన్, ఎస్‌ఏ. మోహసిన్, శ్రావణ్ నాయక్, అరుణ్ కుమార్, దన్నుసింగ్, హైమద్ అలీ, రజితారెడ్డి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్‌రూరల్: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను వేగవంతంగా పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. మంగళవారం కరీంనగర్ మండలం నగునూరు, తీగలగుట్టపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్‌తో కలిసి పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తుపాన్ ప్రభావంతో వర్షాలు కురుస్తున్న దృష్ట్యా రైతులకు ఇబ్బంది లేకుండా కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలన్నారు. కొనుగోళ్ల వివరాలను ఎప్పటికప్పుడు ట్యాబ్‌లో నమోదు చేయాలని సూచించారు. కేంద్రాల్లోని ధాన్యం తడవకుండా టార్పాలిన్లను కప్పాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట డీసీవో రామానుజచారి, సివిల్ సప్లయి డీఎం రజినీకాంత్, జిల్లా పౌరసరఫరాల అధికారి సురేశ్, కరీంనగర్ సింగిల్‌విండో సీఈవో రమేశ్ పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలి

కరీంనగర్‌టౌన్: జిల్లాలో సాధారణ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆరోగ్యశాఖ సిబ్బంది, ప్రోగ్రాం అధికారులు, స్త్రీశిశు సంక్షేమ అధికారులతో సమీక్షించారు. మాతాశిశు సంక్షేమంలో భాగంగా గర్భిణులను గుర్తించి వారి వివరాలు మొదటి త్రైమాసికంలోనే నమోదు చేయాలని, అవసరమైన టీకాలు అందించడంతో పాటు రక్తహీనతను నమోదు చేయించాలని తెలిపారు. జిల్లాలో సాధారణ కాన్పుల కన్నా ఆపరేషన్ కాన్పులు అధికంగా ఉన్నందున, ప్రతీ పీహెచ్‌సీలో సాధారణ కాన్పులు జరిగేలా చూడాలని సూచించారు. డీఎంహెచ్‌వో లలితాదేవి, డీడబ్ల్యూవో సరస్వతీ, డీసీహెచ్‌ఎస్ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

ఎన్నికల సేన 2.0

- ముందస్తు కార్యాచరణతో యంత్రాంగం సఫలం
- చెదురుమదురు ఘటనలు మినహా అంతా ప్రశాంతం
- సకల సౌకర్యాలు.. ప్రత్యేక కేంద్రాల్లో పెరిగిన పోలింగ్ శాతం

కరీంనగర్ అర్బన్: తెలంగాణ శాసన సమరంలో అభ్యర్థుల జయాపజయాలు పక్కనబెడితే ఉద్యోగుల పాత్ర అమోఘం. రాత్రనక, పగలనక శ్రమించిన తీరు అభినందనీయం. నోటిఫికేషన్ వెలువడిన దరిమిలా జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యలు, ముందస్తు కార్యాచరణ ఎన్నికల మెరుగైన నిర్వహణకు దోహదపడ్డాయి. అటెండర్ నుంచి కలెక్టర్ వరకు ఎన్నికల్లో భాగస్వాములు కాగా పక్కా ప్రణాళికతో భేష్ అనిపించారు. ఉమ్మడి జిల్లాలో చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగా నిర్వహించారు. పలు చోట్ల ఓట్లు గల్లంతవడం.. పోల్ చీటీలు రాకపోవడం కొంత ఆందోళన కలిగించింది. వెరసి 2023 ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగింది.

కలెక్టర్ల పాత్ర అభినందనీయం

ఉమ్మడి కరీంనగర్ పరిధిలోని నాలుగు జిల్లాల ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన కలెక్టర్ల పాత్ర అభినందనీయం. కలెక్టర్లు పమేలా సత్పతి(కరీంనగర్), అనురాగ్ జయంతి(రాజన్నసిరిసిల్ల), ముజమ్మిలాఖాన్(పెద్దపల్లి), షేక్ యాస్మిన్ బాషా(జగిత్యాల)లు ఎన్నికల నిర్వహణలో సఫలమయ్యారు. ఎన్నికల సంఘం నుంచి ఆదేశాలను కిందిస్థాయి సిబ్బంది వరకు చేరవేరవేయడంలో పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. శాంతిభద్రతల పర్యవేక్షణలో వీరికి ఆయా జిల్లాల సీపీలు, ఎస్పీలు సహకారం అందించారు. ఫలితంగా ఎన్నికలలో కీలకఘట్టమైన పోలింగ్ ప్రశాంతంగా ముగియగా ఓట్ల లెక్కింపు పారదర్శకంగా నిర్వహించారు.

గురువులు కీలకులే

ఎన్నికల ప్రక్రియ అంతా ఒకెత్తయితే పోలింగ్ మరో ఎత్తు. ఆ పోలింగ్‌ను విజయవంతంగా నిర్వహించడంలో ఉపాధ్యాయుల పాత్ర ప్రశంసనీయం. గత నెల 29, 30 తేదీల్లో వారు నిద్రలేని రాత్రులు గడిపి ఎన్నికల సమరాన్ని గట్టెక్కించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 13,185 మంది ఉపాధ్యాయులు ఈ క్రతువులో పాల్గొన్నారు.

ప్రత్యేక సేవల్లో సంక్షేమ, డీఆర్డీఏ

ఓటుహక్కు ఉన్న దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి వద్దే ఓటింగ్ సౌకర్యం కల్పించగా జిల్లా సంక్షేమ శాఖ, డీఆర్డీఏ, పరిశ్రమలశాఖ విశేష కృషి చేసింది. ఇంటింటికీ వెళ్లి ఓటుహక్కు వినియోగించుకునేలా శ్రమించారు. నడిచేవారు, ఆరోగ్యంగా ఉన్న వృద్ధులను పోలింగ్ కేంద్రాలకు తీసుకురావడం, తిరిగి వారిని ఇంటి వద్దకు చేర్చడంలో వలంటీర్ల కృషి అభినందనీయం. అంగన్‌వాడీలు గర్భిణులు, బాలింతలతో ఓటు వేయించడంలో చొరవ చూపారు.

పటిష్ట భద్రత

ఒకప్పుడు మావోయిస్టు, జనశక్తి ప్రభావిత ప్రాంతంగా ముద్రపడ్డ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఇప్పుడు ఆ ప్రభావం అంతగా లేకపోయినా పోలింగ్ రోజున ఎలాంటి సమస్య తలెత్తకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టారు. అభిషేక్ మహంతి(కరీంనగర్ సీపీ) అఖిల్ మహాజన్(రాజన్నసిరిసిల్ల ఎస్పీ) రెమో రాజేశ్వరి(పెద్దపల్లి సీపీ), సన్‌ప్రీత్‌సింగ్(జగిత్యాల ఎస్పీ)ల సమక్షంలో జిల్లా పోలీసులతో పాటు బలగాలు, పారామిలటరీ సైనికులు బందోబస్తు నిర్వహించారు.



కౌంటింగ్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి(ఫైల్)

యువత భాగస్వామ్యం

పాలిటెక్నిక్ విద్యార్థులు, మీ సేవ కేంద్రాల నిర్వాహకులు, మండల, జిల్లా కార్యాలయాల్లో పనిచేసే కంప్యూటర్ ఆపరేటర్లకు పోలింగ్ చిత్రీకరణ పనులు అప్పజెప్పారు. వారూ కేంద్రాలకు వెళ్లి ఉదయం నుంచి పోలింగ్ ముగిసే వరకు వీడియో చిత్రీకరణ చేసి ఎన్నికల సంఘానికి ఎప్పటికప్పుడు ప్రత్యక్ష ప్రసారం అందించడంలో కీలక భూమిక పోషించా రు. ఈ ప్రక్రియలో ఉమ్మడిజిల్లావ్యాప్తంగా 2,500 మంది యువత సాంకేతిక జోడింపులో పాత్ర పోషించారు. బీఎల్వోలు, ఆశాకార్యకర్తలు, ఏఎన్‌ఎంలు ఓటరు జాబితా రూపకల్పనలో ఓటర్లకు పోల్ చీటీలు పంచి వారిని పోలింగ్ కేంద్రానికి చేర్చడంలో కీలక పాత్ర పోషించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మూడు వేల సిబ్బంది రెండునెలలకు పైగా తీరిక లేకుండా క్షేత్రస్థాయిలో పని చేశారు.

నిర్వహణలో ప్రధాన శాఖలు ఇవే..

ఎన్నికల విజయవంతం అయ్యాయంటే రెవెన్యూ పాత్ర కీలకం కాగా దీనికితోడు సుమారు 20శాఖలకు పైగా ఉద్యోగులు తమవంతు పాత్ర పోషించారు. ఓటరు నమోదు మొదలుకుని పోలింగ్ పూర్తయి.. ఓట్ల లెక్కింపు వరకు కీలక భూమిక పోషించారు. యువత ఓటెత్తగా పట్టణాల్లోనూ పలు పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్‌శాతం పెరిగింది. రెవెన్యూ, విద్యాశాఖ, కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలు, ఎక్సైజ్, మహిళా సంక్షేమం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, రవాణా, ఆర్టీసీ, సర్వే లాండ్ రికార్డ్స్, సహకార ఆడిట్ విభాగం, వీటిపారుదల, రోడ్లు, భవనాలు, ట్రెజరీ, బీఎస్‌ఎన్‌ఎల్, బ్యాంకింగ్, వైద్య ఆరోగ్యశాఖ, యువజన సంక్షేమ, ఇంటర్మీడియట్, తదితర శాఖలు, ఆయా కళాశాలల ఉద్యోగులు ఎన్నికల సేనలో ఉన్నారు.

జిల్లాలవారీగా పోలింగ్ శాతం

ఉమ్మడి జిల్లా పోలింగ్‌శాతం:	76.00
కరీంనగర్:	75.64
పెద్దపల్లి:	75.62
జగిత్యాల:	76.12
రాజన్న సిరిసిల్ల:	75.92

నియోజకవర్గాల వారీగా నమోదైన పోలింగ్‌శాతం

కరీంనగర్:	62.93
మానకొండూరు:	81.33
హుజూరాబాద్:	80.62
చొప్పదండి:	77.68
కోరుట్ల:	75.62
జగిత్యాల:	74.12
ధర్మపురి:	79.01
సిరిసిల్ల:	73.42
వేములవాడ:	78.43
మంథని:	79.14
రామగుండం:	68.74
పెద్దపల్లి:	81.40

క్లుప్తంగా

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

కరీంనగర్‌రూరల్‌: కరీంనగర్‌ మండలంలోని దుర్శేడ్‌కు చెందిన భూతం రాయలింగు(48) ఆత్మహత్య చేసుకున్నాడు. రూరల్‌ పోలీసుల కథనం ప్రకారం.. రాయలింగు కూలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. గత ఆరు నెలలుగా మద్యానికి బానిసై, పనికి వెళ్లకుండా ఖాళీగా ఉంటున్నాడు. సోమవారం రాత్రి 11 గంటల సమయంలో అతిగా మద్యం సేవించి, ఆ మత్తులో ఇంట్లోనే ఉరేసుకున్నాడు. మంగళవారం ఉదయం అతని భార్య లక్ష్మి లేచి చూడగా మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. మద్యానికి బానిసై, జీవితంపై విరక్తితో తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని అతని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రదీప్‌కుమార్‌ పేర్కొన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని ఒకరు..

తిమ్మాపూర్‌(మానకొండూర్‌): భార్య కాపురానికి రావడం లేదని మన్నెంపల్లికి చెందిన నాంపల్లి రాజు(29) ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ ప్రమోద్‌రెడ్డి కథనం ప్రకారం.. రాజు భార్య కవిత కుటుంబ కలహాల కారణంగా పుట్టింటికి వెళ్లిపోయింది. ఎన్నిసార్లు తిరిగి రావాలని కోరినా రాకపోవడంతో అతను మనస్తాపం చెందాడు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. మృతుడి తండ్రి జగన్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఓపెన్‌ స్కూల్‌ పరీక్షల ఫలితాలు విడుదల

కరీంనగర్‌: తెలంగాణ ఓపెన్‌ స్కూల్‌ సొసైటీ 2023–24 సంవత్సరానికి గాను గత అక్టోబర్‌లో నిర్వహించిన ఓపెన్‌ పదో తరగతి, ఇంటర్‌ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు మంగళవారం విడుదలైనట్లు డీఈవో జనార్దన్‌రావు, ఉమ్మడి జిల్లా ఓపెన్‌ స్కూల్‌ కో–ఆర్డినేటర్‌ నాగేశ్వర్‌రావు సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా నుంచి పదోతరగతి విద్యార్థులు 859 మంది హాజరు కాగా 233 మంది, ఇంటర్‌లో 1,116 మంది పరీక్షలు రాయగా 658 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. పదోతరగతి రీకౌంటింగ్‌ కోసం ఒక్కో సబ్జెక్టుకు రూ.350, రీవాల్యుయేషన్‌ కోసం రూ.1,200, ఇంటర్‌ రీకౌంటింగ్‌ కోసం ఒక్కో సబ్జెక్టుకు రూ.400, రీవాల్యుయేషన్‌ కోసం రూ.1,200 మీసేవ కేంద్రాల్లో ఈ నెల 16వ తేదీలోపు చెల్లించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మెట్‌పల్లి(కోరుట్ల): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందినట్లు ఎస్సై చిరంజీవి మంగళవారం తెలిపారు. నిర్మల్‌ జిల్లాలోని వేణునగర్‌ గ్రామానికి చెందిన టీకం హన్మంతు, ఆత్రం నాగరావు, కొత్తపల్లి చందు సోమవారం సాయంత్రం ద్విచక్రవాహనంపై పనినిమిత్తం మెట్‌పల్లికి వచ్చారు. తిరిగి రాత్రి సమయంలో స్వగ్రామానికి వెళ్తుండగా రైల్వేవంతెన దాటిన తర్వాత క్రాసింగ్‌ వద్ద బైక్‌ అదుపు తప్పి కింద పడ్డారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన హన్మంతును ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య గంగవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- 15 మందికి గాయాలు
- క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్‌

మానకొండూర్‌: లారీని ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో పలువురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. సూర్యాపేటకు చెందిన ఆర్టీసీ బస్సు మంగళవారం వేములవాడ నుంచి సూర్యాపేట వెళ్తోంది. మార్గమధ్యలో మానకొండూర్‌ పోలీస్‌స్టేషన్‌ సమీపంలో ముందు వెళ్తున్న లారీని వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న జి.కమలమ్మ, భిక్షం, రమణ, బండపెల్లి పద్మతో సహా 15 మంది గాయపడ్డారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. డ్రైవర్‌ మల్లయ్య బస్సు క్యాబిన్‌లో ఇరుక్కుపోవడంతో అతికష్టమ్మీద బయటకు తీశారు. అనంతరం క్షతగాత్రులను కరీంనగర్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



బస్సులో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ మల్లయ్య



గాయపడిన ప్రయాణికులు

హరితహారం యాక్షన్‌ ప్లాన్‌ రూపొందించాలి

- వందశాతం పన్నులు వసూలు చేయాలి
- నగరపాలకసంస్థ కమిషనర్‌ బోనగిరి శ్రీనివాస్‌

కరీంనగర్‌ కార్పొరేషన్‌: వచ్చే ఏడాది హరితహారం లక్ష్యాలను సిద్ధం చేసుకొని అందుకు తగినట్లుగా ప్రణాళిక రూపొందించాలని నగరపాలకసంస్థ కమిషనర్‌ బోనగిరి శ్రీనివాస్‌ ఆదేశించారు. మంగళవారం నగరపాలకసంస్థ సమావేశ మందిరంలో హరితహారంపై సమీక్ష నిర్వహించారు. ఈ సంవత్సరం చేపట్టిన హరితహారం వివరాలను సమీక్షించారు. లక్ష్యాన్ని చేరుకోవడంతో పాటు, మొక్కలను సంరక్షించడంపై వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరపాలకసంస్థ పరిధిలో నిర్వహించే హరితహారాన్ని విజయవంతం చేయాలన్నారు. వచ్చే ఏడాది చేపట్టనున్న హరితహారానికి సంబంధించి యాక్షన్‌ ప్లాన్‌ సిద్ధం చేయాలని అధికారులను సూచించారు. యాక్షన్‌ ప్లాన్‌కు అనుగుణంగా నగరపాలకసంస్థకు సంబంధించిన నర్సరీల్లో మొక్కలు పెంచాలని అన్నారు. ముఖ్యంగా ఇండ్లల్లో పెంచే మొక్కలపై దష్టి సారించాలని,ఆ మొక్కలను నర్సరీల్లో ఎక్కువగా పెంచాల్సి ఉందన్నారు. నగరంలో వందశాతం పన్నులు వసూలు చేసి, ఆదాయం పెంచాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఆస్తి, నల్లా, వాణిజ్య తదితర పన్నులు వందశాతం వసూలు చేయాలన్నారు. డిప్యూటీ కమిషనర్‌ స్వరూప, డీసీపీ సుభాష్‌, రెవెన్యూ అధికారి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్‌ శ్రీనివాస్‌

పోస్టల్‌ ఏజెంట్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

విద్యానగర్‌(కరీంనగర్‌): తపాలాశాఖ కరీంనగర్‌ డివిజన్‌ పరిధిలో కమీషన్‌ పద్ధతిలో తపాలా జీవిత బీమా ఏజెంట్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కరీంనగర్‌ డివిజన్‌ తపాలాశాఖ సూపరింటెండెంట్‌ కె.శివాజీ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై, 18–50ఏళ్ల మధ్య ఉన్న కరీంనగర్‌ డివిజన్‌కు చెందిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసక్తి కలిగినవారు పూర్తిచేసిన దరఖాస్తులను కరీంనగర్‌ డివిజన్‌ ఆఫీస్‌లో ఈ నెల 18లోపు అందజేయాలని, ఎంపిక చేసిన అభ్యర్థులు సంబంధిత సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. ఏజెంట్లుగా నియామకం అయినవారు సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.5వేలు చెల్లించాల్సి ఉంటుందని వివరాలకు సమీపంలోని పోస్టాఫీస్‌లో సంప్రదించాలని సూచించారు.

ప్రజాతీర్పును శిరసావహిస్తున్నా

- పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్‌: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును శిరసావహిస్తున్నానని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని తననివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జెడ్పీటీసీలు గంట రాములు, వంగల తిరుపతిరెడ్డి, ఎంపీపీ బాలాజీరావుతో కలిసి ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్‌ అమలు చేసిన సంక్షేమ పథకాల ఫలాలను వేలాదిమంది అర్హులకు అందించగలిగానన్నారు. ఎన్నికల్లో గెలుపోటలు సహజమని, కార్యకర్తలు, నాయకులు అధైర్యపడవద్దని కోరారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌ నేతలు ఇచ్చిన హామీలు అమలు చేయడంపై శ్రద్ధ చూపాలని సూచించారు. హామీల అమలులో విఫలమైతే ప్రజాపోరాటాలకు సిద్ధపడతామని పేర్కొన్నారు. కాంగ్రెస్‌ నాయకులు బీఆర్‌ఎస్‌ పార్టీ నాయకులపై భౌతిక దాడులకు పాల్పడడం సరికాదని ఓదెల జెడ్పీటీసీ గంట రాములు అన్నారు. పెద్దపల్లి మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ మమతారెడ్డి, ఎంపీపీ బాలాజీరావు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి

టీబీజీకేఎస్‌కు 'జక్కుల' రాజీనామా



దామోదర్‌రావు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): సింగరేణి ఆర్జీ–3 ఏరియా, అడ్రియాల లాంగ్‌వాల్‌ ప్రాజెక్టు తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం(టీబీజీకేఎస్‌) బ్రాంచి కార్యదర్శి పదవికి రాజీనామా చేస్తున్నట్లు జక్కుల దామోదర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. 5 రోజుల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ అభ్యర్థులు కోల్‌ బెల్ట్‌ ప్రాంతంలో ఒకరు కూడా గెలవలేక పోయారని అన్నారు. దీనికి నైతిక బాధ్యత వహిస్తూ తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు రాజీనామా పత్రాన్ని ఎమ్మెల్సీ, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం గౌరవ అధ్యక్షురాలు కవితకు పంపినట్లు తెలిపారు.

'పెంచాల'తో ఐఎన్‌టీయూసీకి సంబంధం లేదు

గోదావరిఖని(రామగుండం): పెంచాల తిరుపతితో ఐఎన్‌టీయూసీకి సంబంధం లేదని ఆర్జీ–1 ఉపాధ్యక్షుడు సదానందం అన్నారు. మంగళవారం గోదావరిఖనిలోని జనక్‌ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్‌ జి.సంజీవరెడ్డి, సెక్రటరీ జనరల్‌ జనక్‌ప్రసాద్‌ల నాయకత్వంలో వేసిన కమిటీలకు గుర్తింపు ఉందని తెలిపారు. తిరుపతికి సంఘంలో సభ్యత్వం కూడా లేదని, కమిటీలు వేసే అర్హత లేదన్నారు. ఆయనతోపాటు కొందరు వ్యక్తులు కమిటీ పేరిట సోషల్‌ మీడియాలో ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. నాయకులు వంగ లక్ష్మీపతిగౌడ్‌, ఆరెపల్లి శ్రీనివాస్‌, సాగర్‌, జగన్మోహన్‌, గాదె సంపత్‌, నర్సయ్య, చారి, గణపతి, దామోదర్‌, చంద్రారెడ్డి, కుమారస్వామి, రాజయ్య తదితరులున్నారు.



సమావేశమైన నాయకులు

కాపర్‌ వైర్‌ చోరీ

కథలాపూర్‌: మండలకేంద్రంలోని శివారులో వ్యవసాయ విద్యుత్‌ మోటార్ల కాపర్‌ వైర్లను దొంగలు ఎత్తుకెళ్లినట్లు రైతులు మంగళవారం తెలిపారు. కథలాపూర్‌ విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ ఏరియాలోని పది మోటార్ల కాపర్‌ వైరును చోరీ చేశారన్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వైద్య సేవల మెరుగుకు సీపీడీ దోహదం

- డీఎంఈ డాక్టర్‌ రమేశ్‌రెడ్డి
- ఆన్‌లైన్‌ ద్వారా సిమ్స్‌లో సీఎంఈ కార్యక్రమం ప్రారంభం

కోల్‌సిటీ(రామగుండం): వైద్య సేవలను మరింత మెరుగుపర్చడానికి గోదావరిఖనిలోని సింగరేణి ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ మెడికల్‌ సైన్సెస్‌(సిమ్స్‌) నిర్వహించిన నిరంతర వృత్తి వికాస కార్యక్రమం (సీపీడీ) వైద్యులకు దోహదపడుతుందని రాష్ట్ర వైద్య విద్య సంచాలకులు(డీఎంఈ) డాక్టర్‌ రమేశ్‌రెడ్డి అన్నారు. కాలేజీ యాజమాన్యం తొలిసారి సిమ్స్‌ ప్రొఫెసర్లతోపాటు రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు చెందిన వైద్యులకు మంగళవారం సిమ్స్‌ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌ వ్యాధి నిర్మూళన, మెరుగైన వైద్య సేవలపై కంటిన్యూస్‌ మెడికల్‌ ఎడ్యుకేషన్‌(సీఎంఈ) కార్యక్రమం నిర్వహించింది. దీన్ని డాక్టర్‌ రమేశ్‌రెడ్డి హైదరాబాద్‌ నుంచి ఆన్‌లైన్‌ ద్వారా ప్రారంభించారు. కార్యక్రమాన్ని వైద్యులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్‌, డీసీహెచ్‌ఎస్‌ రమాకాంత్‌, డిప్యూటీ డీఎంహెచ్‌వో కృపాబాయి, కళాశాల నిర్వాహకులను అభినందించారు. సిమ్స్‌ ప్రిన్సిపాల్‌ హిమబింద్‌ సింగ్‌ మాట్లాడుతూ.. సీఎంఈ కార్యక్రమానికి కళాశాలకు చెందిన ప్రొఫెసర్లు, జీజీహెచ్‌ వైద్యులు, గోదావరిఖనిలోని పలువురు ప్రైవేట్‌ డాక్టర్లతోపాటు కరీంనగర్‌, మంచిర్యాల, నిజామాబాద్‌ జిల్లాల నుంచి 150 మంది వైద్యులు హాజరైనట్లు తెలిపారు. వీరికి తెలంగాణ స్టేట్‌ మెడికల్‌ కౌన్సిల్‌ ద్వారా రెండు క్రెడిట్‌ అవర్స్‌ సర్టిఫికెట్లు అందిస్తామన్నారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌ వ్యాధి నిర్మూళనకు చేసిన పరిశోధనల్లో ఇప్పటివరకు వచ్చిన మెరుగైన ఫలితాలు, భవిష్యత్తు పోకడలు, వైద్య సేవలు మెరుగుపడిన తీరు తదితర అంశాలపై వైద్య నిపుణులు వివరించారు. దేశవ్యాప్తంగా ఐదుగురు హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులను వాడటం ద్వారా వ్యాధిని జయించారని తెలిపారు. అనంతరం ఏఆర్‌టీ విభాగం వైద్యులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. జీజీహెచ్‌ సూపరింటెండెంట్‌ దయాల్‌సింగ్‌, సిమ్స్‌ ప్రొఫెసర్లు అరుణ, అశోక్‌, శ్రీదేవి, భాగ్యలక్ష్మి, అనంతబాబు, శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.



వైద్యులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ప్రిన్సిపాల్‌, డిప్యూటీ డీఎంహెచ్‌వో



ఆలయం ముందు భక్తులు



క్యూలైన్‌లో భక్తులు

అంజన్నకు భక్తుల మొక్కులు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టులోని శ్రీఆంజనేయస్వామి వారిని మంగళవారం వేలాది మంది భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఆవరణతోపాటు క్యూలైన్లు భక్తులతో కిక్కిరిసిపోయాయి. బొజ్జ పోతన్న, ఘాట్‌రోడ్‌, వైజంక్షన్‌ వద్ద వాహనాలు కిక్కిరిసిపోవడంతో అదుపు చేయడంలో పోలీసులు విఫలమయ్యారు. దాదాపు 20వేలకు భక్తులు వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఏర్పాట్లను ఈవో వెంకటేశ్‌, ఏఈవో శ్రీనివాస్‌, సూపరింటెండెంట్‌ సునీల్‌, శ్రీనివాసశర్మ, అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండి సేవలందించారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

ఇల్లందకుంట(హుజూరాబాద్‌): మండలంలోని కనగర్తి గ్రామ సర్పంచ్‌ అత్త హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. జమ్మికుంట రూరల్‌ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏసీపీ జీవన్‌రెడ్డి సంబంధిత వివరాలు వెల్లడించారు. కనగర్తికి చెందిన రామంచ కుమార్‌కు దామెర మండలం లాదేల్ల గ్రామానికి చెందిన శ్రీలతతో కొన్ని నెలల క్రితం వివాహం జరిగింది. అయితే, దంపతుల మధ్య విభేదాలు రావడంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. కుమార్‌ పలుమార్లు అత్తగారింటికి వెళ్లి, తన భార్యను పంపాలని కోరగా వారు నిరాకరించారు. దీంతో మద్యానికి బానిసయ్యాడు. సమస్య పరిష్కరించాలని సర్పంచ్‌ రజిత భర్త వాసుదేవరెడ్డికి విన్నవించాడు. ఇది మీ ఇంటి సమస్య కాబట్టి తాను జోక్యం చేసుకోనని ఆయన తెలిపాడు. దీంతో కుమార్‌ వాసుదేవరెడ్డిపై కక్ష పెంచుకున్నాడు. ఈ నెల 4న సాయంత్రం 5.30 గంటలకు పెట్రోల్‌, కారంపొడి, కత్తి బ్యాగ్‌లో పట్టుకొని, గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దకు వెళ్లాడు. కార్యాలయ తలుపులపై పెట్రోల్‌ చల్లి, కాల్చే ప్రయత్నం చేయగా గ్రామస్తులు అడ్డుకున్నారు. అక్కడి నుంచి నేరుగా సర్పంచ్‌ ఇంటికి వెళ్లాడు. సర్పంచ్‌ అత్త లచ్చవ్వ తన ఇంటి ముందు ఒంటరిగా కూర్చొని ఉంది. ఇదే అదునుగా భావించి, ఆమెను కత్తితో విచక్షణారహితంగా దాడి చేయడంతో మృతిచెందింది. నిందితుడిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ పేర్కొన్నారు. కార్యక్రమంలో జమ్మికుంట రూరల్‌ సీఐ కిశోర్‌, ఇల్లందకుంట ఎస్‌ఐ రాజ్‌కుమార్‌, కానిస్టేబుల్‌ పాషా తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ జీవన్‌రెడ్డి

'పారమిత'లో స్కౌట్స్‌ అండ్‌ గైడ్స్‌ దినోత్సవం



స్కౌట్స్‌ విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

కరీంనగర్‌: మంకమ్మతోటలోని పారమిత పాఠశాలలో మంగళవారం స్కౌట్స్‌ అండ్‌ గైడ్స్‌ దినోత్సవాన్ని జిల్లా స్కౌట్స్‌ అండ్‌ గైడ్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో నిర్వహించారు. వేడుకలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రశాంత్‌ పతాకావిష్కరణ చేసి, ప్రారంభించారు. విద్యార్థులు చేసిన కవాతు అందరినీ ఆకర్షించింది. పాఠశాల డైరెక్టర్లు వినోదరావు, హనుమంతరావు విద్యార్థులకు స్కార్ఫ్‌, బ్యాడ్జీలను అందజేశారు. పిల్లల విన్యాసాలు అబ్బురపరిచాయి. పారమిత విద్యాసంస్థల అధినేత ప్రసాద్‌రావు, ప్రధానోపాధ్యాయులు బాలాజీ, కవిత, స్కౌట్స్‌ అండ్‌ గైడ్స్‌ కార్యదర్శి రాంరెడ్డి, గైడ్స్‌ కెప్టెన్‌ రజిత, స్కౌట్స్‌ మాస్టర్లు రాజశేఖర్‌, నాగరాజు, శ్రీను నాయక్‌, సమన్వయకర్తలు, టీచర్లు పాల్గొన్నారు.

నేల ఆరోగ్యాన్ని కాపాడటం బాధ్యత

జమ్మికుంట(హుజూరాబాద్‌): వాతావరణంలోని మార్పులను గమనించి, నేల ఆరోగ్యాన్ని కాపాడటం మనందరి బాధ్యత అని వరంగల్‌ ప్రాంతీయ వ్యవసాయ మాజీ సహ పరిశోధన సంచాలకుడు డాక్టర్‌ చేరాలు, జమ్మికుంట వ్యవసాయ పాలిటెక్నిక్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ శ్రీనివాస్‌, కేవీకే ప్రధాన కార్యదర్శి విజయ్‌గోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం జమ్మికుంట పట్టణంలోని కేవీకే(కృషి విజ్ఞాన కేంద్రం)లో ప్రపంచ నేల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేల ఆరోగ్యం బాగుంటేనే మనిషి ఆరోగ్యం బాగుంటుందని, తద్వారా దేశ భవిషత్‌ను కాపాడగలుగుతామని తెలిపారు. యువత సేంద్రియ విధానాలు అవలంబించి, సహజ వనరులను కాపాడేందుకు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వ్యవసాయంలో భాగంగా నేలలోని కర్బన శాతాన్ని ఏవిధంగా పెంచాలి, పెంచడం వల్ల కలిగే లాభాలను వివరించారు. ప్రతీ ఒక్కరు సేంద్రియ వ్యవసాయం వైపు అడుగులు వేయాలన్నారు. అనంతరం నేల ఆరోగ్యం కాపాడాలంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కరీంనగర్‌ ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్‌ ప్రియదర్శిని, కేవీకే హెడ్‌, సీనియర్‌ శాస్త్రవేత్త డాక్టర్‌ వెంకటేశ్వర్‌రావు, ప్రాజెక్టు మేనేజర్‌ రత్నాకర్‌, శాస్త్రవేత్తలు, రైతులు, డీలర్లు, వ్యవసాయ కళాశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న అతిథులు, శాస్త్రవేత్తలు

బాలల జాతీయ సైన్స్‌ కాంగ్రెస్‌కు ఎంపిక

కరీంనగర్‌: 31వ జాతీయ బాలల సైన్స్‌ కాంగ్రెస్‌ ప్రదర్శన హైదరాబాద్‌లోని జెనెటిక్స్‌ భవన్‌లో జరిగింది. పారమిత పాఠశాలకు చెందిన ఆరోతరగతి విద్యార్థి కె.ఋగ్వేద్‌ ప్రదర్శించిన వెండర్స్‌ ఫ్రెండ్లీ వెజిటేబుల్‌ కార్ట్‌ ప్రాజెక్టు జాతీయస్థాయికి ఎంపికైంది. టీఎస్‌ కాస్ట్‌ మెంబర్‌ సెక్రటరీ మారుపాక సతీశ్‌, ఐ.ఐ.సి.టి. పూర్వ సంచాలకులు కమల్‌, జెనెటిక్‌ విభాగం డైరెక్టర్‌ విజయలక్ష్మి, విద్యాశాఖ సంయుక్త సంచాలకులు పి.మదన్‌మోహన్‌ చేతులమీదుగా ఋగ్వేద్‌ ప్రశంసాపత్రం అందుకున్నాడు. కార్యక్రమంలో జిల్లా సైన్స్‌ అధికారి జయపాల్‌ రెడ్డి, బాలల జాతీయ సైన్స్‌ కాంగ్రెస్‌ అకాడమిక్‌ కో–ఆర్డినేటర్‌ కేఎస్‌.అనంతాచార్య, గైడ్‌ టీచర్‌ రమేశ్‌ తదితరులు పాల్గొన్నారు. డీఈవో జనార్దన్‌రావు విద్యార్థిని అభినందించారు.



ప్రశంసాపత్రం అందుకుంటున్న ఋగ్వేద్‌

అదృశ్యమై.. వ్యవసాయ బావిలో శవమై

- లస్మన్నపల్లికి చెందిన వ్యక్తి మృతి



శ్రీకాంత్‌ రెడ్డి (ఫైల్‌)

సైదాపూర్‌: అదృశ్యమైన ఓ వ్యక్తి వ్యవసాయ బావిలో శవమై తేలాడు. పోలీసులు, గ్రామస్తుల వివరాల ప్రకారం.. సైదాపూర్‌ మండలంలోని లస్మన్నపల్లికి చెందిన కొట్టె శ్రీకాంత్‌రెడ్డి(34) భార్య ప్రణీత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆమె పిల్లలతో కలిసి తన పట్టింటికి వెళ్లింది. శ్రీకాంత్‌రెడ్డి సోమవారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. రాత్రయినా తిరిగి రాలేదు. అయితే, అతను కనిపించడం లేదని సోషల్‌ మీడియాలో వైరల్‌ అయ్యింది. వెన్నంపల్లికి చెందిన రైతు ప్రభాకర్‌రెడ్డి మంగళవారం తన వ్యవసాయ బావిలో నీళ్ల ఏ మేరకు ఉన్నాయోనని తొంగి చూశాడు. అతనికి అందులో శ్రీకాంత్‌రెడ్డి మృతదేహం కనిపించింది. పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని బయటికి తీయించారు. బహిర్భూమికి వెళ్లి, ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందినట్లు మృతుడి భార్య ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆరోగ్యం తెలిపారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌ పోటీలకు ఎంపిక

యైటింక్లయిన్‌కాలనీ: స్థానిక సంతోష్‌నగర్‌ ఏరియాలోని కేజీబీవీ పాలకుర్తి పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని కె.మౌనిక ఎస్‌జీఎఫ్‌ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల స్పెషల్‌ ఆఫీసర్‌ స్వరూప తెలిపారు. ఈ నెల 4న అండర్‌–17 విభాగంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి 1.5 కిలోమీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు వరంగల్‌లోని జవహర్‌లాల్‌ నెహ్రూ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని స్పెషల్‌ ఆఫీసర్‌తోపాటు పీఈటీ రాజేశ్వరి, టీచర్లు మంగళవారం అభినందించారు.



మౌనికను అభినందిస్తున్న టీచర్లు

కోర్టు ఆవరణలో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గోదావరిఖనిటౌన్‌: గోదావరిఖని వన్‌టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని కోర్టు కాంప్లెక్స్‌ ఆవరణలో స్థానిక రాజీవ్‌నగర్‌కు చెందిన మేకల పోశం అలియాస్‌ గ్యాస్‌ పోశం ఆత్మహత్యాయత్నం చేశాడు. పోలీసుల కథనం ప్రకారం.. పోశంకు రాజీవ్‌నగర్‌కే చెందిన మహేశ్‌తో పాత గొడవలున్నాయి. ఈ నెల 3న ఇద్దరూ గొడవ పడ్డారు. మహేశ్‌ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో పోశం మంగళవారం కోర్టు ఆవరణలోకి వచ్చి, వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకున్నాడు. తనకు న్యాయం చేయాలంటూ నిప్పంటించుకునే ప్రయత్నం చేయగా అక్కడే విధుల్లో ఉన్న ఎన్టీపీసీ ఠాణా కానిస్టేబుల్‌ పురుషోత్తం, వన్‌టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ కానిస్టేబుల్‌ అభి, కోర్టు హోంగార్డు నాగేశ్వర్‌రావులు అడ్డుకున్నారు. వెంటనే అతన్ని ఆస్పత్రికి తరలించి, బాధిత కుటుంబసభ్యులకు సమాచారం అందించారు.



పోశంను ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

- కరీంనగర్‌లో దాతల ఔదార్యం
- అన్నార్తులకు మూడు పూటలా భోజనం
- రోజూ వెయ్యి మందికి అందుతున్న ఆహారం
- ప్రభుత్వాసుపత్రిలో నిత్యాన్నదానం

అన్నదాత సుఖీభవ!



ఉదయం టిఫిన్స్ పెడుతున్న దాతలు

కరీంనగర్‌టౌన్: కరీంనగర్‌లోని ప్రభుత్వ ప్రధానాసుపత్రి నిత్యం రోగులతో కిటకిటలాడుతుంది. ప్రతీరోజు వెయ్యి మంది వరకు రోగులు ఆసుపత్రికి వస్తుంటారు. రోగులతో పాటు మరో వెయ్యి మంది వారి కుటుంబసభ్యులు, బంధువులు తోడుగా వస్తుంటారు. ముఖ్యంగా ప్రభుత్వాసుపత్రికి గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే నిరుపేదలే ఎక్కువ. పనిచేస్తేనే రోజు గడిచే వారికి జ్వరాలు, ఇతర రోగాలు వస్తే చేతిలో చిల్లిగవ్వ లేకుండా వైద్యం కోసం ప్రభుత్వాసుపత్రికి చేరే వారే ఎక్కువగా ఉంటారు. ఆసుపత్రిలో రోగులకు చికిత్సతో పాటు ఇన్‌పేషెంట్‌కు మాత్రమే భోజనం పెడతారు. కానీ ఔట్ పేషెంట్‌కు తోడుగా వచ్చిన వారు గతంలో పస్తులుండే వారు. ఆసుపత్రి పరిసరాల్లో పెద్దగా హోటల్స్ కూడా ఉండేవి కావు. ఉన్నా విపరీతమైన ధరలు ఉంటాయి. ఈ పరిస్థితుల్లో మారుమూల గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే రోగుల బంధువులు ఆకలితో అలమటించే దుస్థితి ఉండేది. ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఆసుపత్రి అన్నదానానికి కేంద్రంగా మారింది. ఎవరూ పస్తులుండాల్సిన పనిలేకుండా దాతల ఔదార్యంతో ప్రతినిత్యం అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

మూడు పూటల భోజనం

జనరల్ ఆసుపత్రికి, మాతా శిశు ఆరోగ్య కేంద్రంకు మధ్యలో ఉన్న స్థలం అన్నదాన కార్యక్రమానికి నిలయంగా మారింది. పెద్ద పెద్ద వృక్షాలు ఉండడంతో ఆ ప్రాంతం ఆహ్లాదంగా ఉంటుంది. ఇక్కడ దాతలు అన్నదానం చేసేందుకు షెడ్లను కూడా ఏర్పాటు చేశారు. ఉదయం 7.30 నుంచి 8.30 గంటల లోపు మూడు సంస్థల ద్వారా టిఫిన్ అందజేస్తారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు భోజనాలు రెండు సంస్థల ద్వారా పెడతారు. మళ్లీ సాయంత్రం ఒక సంస్థకు చెందిన వారు టిఫిన్ ఏర్పాటు చేస్తారు. ఇలా మూడు పూటలు నిరుపేదలకు కడుపునిండా భోజనం అందజేస్తున్నారు. ఇక్కడ సాధారణ పౌరులు కూడా సమయానికి వచ్చి భోజనాలు చేస్తుండడం గమనార్హం.

మూడు సంస్థల ద్వారా..

ఆకలితో ఉన్న వారికి పట్టెడు అన్నం పెట్టాలనే ఉద్దేశ్యంతో పలువురు రిటైర్డ్ ఉద్యోగులు, స్వచ్ఛంద సేవకులు అన్నదానానికి శ్రీకారం చుట్టారు. ఎక్కడైతే అన్నం కోసం ఎదురుచూస్తారో అక్కడే అన్నదానం చేయాలని నిర్ణయించారు. అందుకు ప్రభుత్వ ప్రధానాసుపత్రిని ఎంచుకున్నారు. శ్రీకాశీ అన్నపూర్ణ అన్న ప్రసాద ఉచిత వితరణ, లయన్స్‌క్లబ్ స్వచ్ఛంద సంస్థ, బాలాజీ అన్నపూర్ణ సేవాసమితికి చెందిన సభ్యులు ఏడేళ్లుగా ఆసుపత్రిలో అన్నదానం నిర్వహిస్తున్నారు. వర్షం, వరదలు వచ్చినా ఏ రోజు కూడా ఈ కార్యక్రమాలు నిలిచిపోవు. ఇందుకోసం షెడ్లను కూడా సొంతంగానే ఏర్పాటు చేసుకుని సేవలు చేస్తున్నారు.

ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టాలని..



ప్రభుత్వాసుపత్రికి ఎక్కడెక్కడి నుంచో నిరుపేదలు వైద్యం కోసం వచ్చి ఆకలితో పస్తులుండడం గమనించి ఇక్కడే అన్నదాన కార్యక్రమం చేపట్టాం. మిత్రులందరం కలిసి నిర్వహిస్తున్నాం. రెండు పూటల టిఫిన్, ఒక పూట భోజనానికి రోజూ రూ.7 వేల వరకు ఖర్చు అవుతుంది. అందరి సహకారంతో నిరాటంకంగా నడుపుతున్నాం.

– సత్యానంద్, జెడ్పీ రిటైర్డ్ సూపరింటెండెంట్

సేవా కార్యక్రమాల్లో భాగంగా..



లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ సంస్థ సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రతీరోజు రోగులు, వారి బంధువులకు ఉదయం టిఫిన్ ఏర్పాటు చేస్తున్నాం. మా సంస్థ సభ్యులు, ఇతరులెవరైన వారి పుట్టిన రోజు, పెళ్లి రోజు, వారి పెద్దల వర్ధంతి వంటి సందర్భాల్లో వారి పేర్ల మీద టిఫిన్స్ పెడుతున్నాం. ఆస్పత్రికి వచ్చే వారే కాకుండా బయటి వా రు కూడా సమయానికి వచ్చి తిని వెళ్తుంటారు.

– చింతల కిషన్, లయన్స్‌క్లబ్ బాధ్యులు

ఆధ్యాత్మికం



విగ్రహప్రతిష్టాపనోత్సవాలు ప్రారంభం

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం మొగ్ధుంపూర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీమల్లిఖార్జునస్వామి ఆలయంలో మంగళవారం నుంచి మల్లిఖార్జునస్వామి విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వేదపండితులు కాసుల చంద్రశేఖరశాస్త్రి ఆధ్వర్యంలో గణపతిపూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ, దేవతాహవనం, మూలమంత్ర హవనం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులతో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి అందజేత



కరీంనగర్: నగరంలోని గాయంత్రీనగర్‌లో గల కపిల్ బాలకుటీర్ విద్యార్థులకు మంగళవారం హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో క్రీడా సామగ్రి అందజేశారు. రాహుల్ ముందడ కుమారుడు రిధన్ మందడ జన్మదినం సందర్భంగా కపిల్ బాలకుటీర్ లోని 45 మంది పిల్లలు ఆటలు ఆడుకునేందుకు అవసరమైన సామగ్రిని అందజేసినట్లు సంస్థ వ్యవస్థాపకుడు ధనపురి సాగర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాహుల్ మందడ, ఆయుష్ ముందడ, ఎ.అరుణ్, ఎ.అర్చన, బాలకుటీర్ మేనేజర్ గీకూరి శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉచిత నేత్ర వైద్యశిబిరం



కరీంనగర్: నగరంలోని కోరా ఉన్నత పాఠశాలలో మంగళవారం వాసన్ కంటి సంరక్షణ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. పాఠశాల చైర్మన్ మహిపాల్‌రెడ్డి వైద్యశిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ విద్యార్థులు విటమిన్–ఏ లోపం వల్ల కంటి సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. బలమైన పోషకాహారాన్ని సరైన సమయంలో తీసుకోవాలని, కంటి సమస్యలు రాకుండా మొబైల్ ఫోన్లకు పిల్లలు దూరంగా ఉండాలని తెలిపారు. సరైన వెలుతురులో చదువుకుంటూ కంటిని ఆరోగ్యంగా చూసుకోవాలని సూచించారు. పాఠశాల డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, సింహచలం హరికృష్ణ, సంతోష్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నోటు బుక్స్ పంపిణీ



నోటు పుస్తకాలతో విద్యార్థులు

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం మల్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం భరత్‌రెడ్డి జ్ఞాపకార్థం నోటు పుస్తకాలు, పండ్లను ఆయన తల్లిదండ్రులు నరహరి లక్ష్మారెడ్డి, లక్ష్మీలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం డి.జ్యోతి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, భీమేశ్, వెంకటరమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

భూసార పరీక్షల ఆధారిత ఎరువులు వాడాలి



మాట్లాడుతున్న మంజులత

కొత్తపల్లి: విచక్షణ రహితంగా ఎరువులు వాడకుండా భూసార పరీక్ష ఫలితాల ఆధారిత ఎరువులు వాడాలని కరీంనగర్ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త, హెడ్ డా.మంజులత సూచించారు. ప్రపంచ నేలల దినోత్సవం సందర్భంగా కొత్తపల్లి మండలం బద్దిపల్లి రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ పరిశోధన స్థానం కరీంనగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దత్తత గ్రామమైన నాగులమల్యాల, కొండాపూర్, బద్దిపల్లి గ్రామ రైతులకు భూసార కార్డులు పంపిణీ చేశారు. నేలలో ఆరోగ్య పరిరక్షణకు సస్యశాస్త్ర విధానాలు, సేంద్రియ ఎరువులు, జీవన ఎరువుల వాడకం, పచ్చిరొట్ట పంటలు పెంపొందించడం, పంట అవశేషాల యాజమాన్యం, పంట మార్పిడి చేయడం, అంతర పంటలు, మల్చింగ్ వంటి వాటిపై మంజులత వివరించారు. జీవ నియంత్రణ సూక్ష్మజీవుల ద్వారా విత్తన శుద్ధి, పురుగులు, తెగుళ్ల నివారణలో భూసారం కాపాడుకునే విధానాన్ని సీనియర్ శాస్త్రవేత్త ఏ.విజయ భాస్కర్ తెలియజేశారు. నేల ప్రాముఖ్యత, మట్టి నమూనా సేకరణను శాస్త్రవేత్తలు పి.మధూకర్ రావు, జి.ఉషారాణి వివరించారు. సర్పంచ్ నాయిని ప్రసాద్, వ్యవసాయ విస్తరణాధికారిణి లలిత, ఆత్మ ఏటీఎం రమ్య , రైతులు పాల్గొన్నారు.

ఐఎస్‌ఏ ఫెస్టివల్‌లో ఆకట్టుకున్న శంకర్ సైకత శిల్పం



శంకర్ రూపొందించిన సైకత శిల్పం

కరీంనగర్‌కల్చరల్: ఏటా ఒడిస్సా రాష్ట్ర టూరిజం శాఖ ఆధ్వర్యంలో కోణార్క్ ఆలయ సమీపంలోని చంద్రభాగా నదీ తీరంలో నిర్వహించే ఇంటర్‌నేషనల్ సాండ్ ఆర్ట్ ఫెస్టివల్ మంగళవారం ఘనంగా ముగిసింది. కరీంనగర్‌కు చెందిన సైకత శిల్పి రేవెల్లి శంకర్ వరుసగా కల్చర్ అండ్ హెరిటేజ్, ఎకో టూరిజం, మహిళా సర్వతోముఖాభివృద్ధి, అతిథిదేవోభవ అంశాలపై సైకత శిల్పాలు రూపొందించారు. మంగళవారం 'భారతీయ సంస్కృతి ' అంశంపై తెలంగాణకు చెందిన కాకతీయ శిలాతోరణంతో పాటు శివుని సైకత శిల్పాన్ని రూపొందించి సందర్శకుల ప్రశంసలు అందుకున్నారు. ముగింపు వేడుకల్లో ఫెస్టివల్ బ్రాస్ అంబాసిడర్, పద్మశ్రీ సుదర్శన్ పట్నాయక్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులు శంకర్‌కు అభినందనలు తెలిపారు.

విద్యార్థులు ఏకాగ్రత అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న రామస్వామి

చొప్పదండి: విద్యార్థులు ఏకాగ్రత అలవర్చుకోవాలని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు రామస్వామి అన్నారు. పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో ప్రిన్సిపాల్ స్వాతి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఏకాగ్రతతో పాఠాలు అర్థమవుతాయని, సందేహాలు నివృత్తి చేసుకోవచ్చన్నారు. విజ్ఞానంతో ఆలోచించి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు పేరుప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ అలివేల దీప్తి, తదితరులు పాల్గొన్నారు.

చిత్ర కథ



ఇంటిగోడకు కర్ర రక్షణ

కరీంనగర్ మండలం చామనపల్లిలో ఓ ఇంటి గోడ కూలిపోకుండా కర్రను సపోర్టుగా పెట్టారు. ప్రధాన రహదారిలో రెండు నెలలక్రితం అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కోసం జేసీబీతో కందకం తవ్వుతుండగా పోలు నర్సింగంకు చెందిన ఇంటిగోడకు పగులేర్పడ్డాయి. డ్రైనేజీ నిర్మాణం పూర్తవడంతో గోడ కూలిపోకుండా ఉండేందుకు రక్షణగా కర్రను నిలబెట్టారు. అయితే ఎప్పుడు గోడ కూలిపోతుందో తెలియక గ్రామస్తులు ఆ దారి వెంట భయంభయంగా రాకపోకలు సాగిస్తున్నారు.

- కరీంనగర్‌రూరల్

ప్రకృతిని కాపాడుకోవడం అందరి బాధ్యత



మాట్లాడుతున్న సంస్కృతి చైర్మన్ నవీన్‌కుమార్

కరీంనగర్ సిటీ: ప్రకృతిని కాపాడుకోవడం అందరి బాధ్యత అని కరీంనగర్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి తెలిపారు. కళాశాలలో ఐక్యూఏసీ ఆధ్వర్యంలో మంగళవారం సుపోషన్ కార్యక్రమం నిర్వహించారు. సంస్కృతి చైర్మన్ నవీన్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పోషకాల ఆవశ్యకతను వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ.. ప్రకృతికి నష్టం కలిగించకుండా చేపట్టాల్సిన చర్యలపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ కో– ఆర్డినేటర్ డి.చక్రవర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ లావణ్య, శకుంతల, సుజాత, అరుణ పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ



అయ్యప్ప పడిపూజలో నరేందర్‌రెడ్డి దంపతులు

కొత్తపల్లి: కరీంనగర్ వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ విద్యా సంస్థల కేంద్ర కార్యాలయంలో మంగళవారం రాత్రి అయ్యప్ప మహాపడిపూజ మహోత్సవం వైభవంగా జరిగింది. చక్రవర్తుల పురుషోత్తమాచార్యులు గురుస్వామి ఆధ్వర్యంలో జరిగిన పదునెట్టంబడి పూజా కార్యక్రమాన్ని అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ దంపతులు వి.నరేందర్ రెడ్డి, వి.వనజారెడ్డిలు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మహా గణపతి పూజతో ప్రారంభమై సుబ్రహ్మణ్యస్వామి, అయ్యప్పస్వామి పడిపూజ వైభవోపేతంగా సాగింది. హరిహర పుత్ర అయ్యప్ప స్వామిని పుష్పాలు, సుగంధ ద్రవ్యాలు, ఫల పంచామృతాలతో అభిషేకం చేశారు. అయ్యప్ప భక్తులు ఆలపించిన భజన పాటలతో అల్ఫోర్స్ ప్రాంగణం మారుమ్రోగింది. అనంతరం అయ్యప్ప స్వాములు, భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అల్పాహారం అందించారు. లోకకల్యాణార్థమై, మానవాళి శ్రేయస్సుకై ఏటా వైభవోపేతంగా అల్ఫోర్స్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తుండటం ఆనందంగా ఉందని నరేందర్‌రెడ్డి తెలిపారు. అల్ఫోర్స్ పాఠశాలలు, కళాశాలల సిబ్బంది, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

రైతులకు మిచాంగ్ గుబులు





తీగలగుట్టపల్లి, చామనపల్లిలో ధాన్యం కుప్పలపై కప్పిన టార్పాలిన్లు

- చివరిదశలో ధాన్యం కొనుగోళ్లు
- ఇంకా పూర్తికాని వరికోతలు

కరీంనగర్‌రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుపాన్‌తో రైతులు ఆందోళన చెందుతున్నారు. తుపాన్ ప్రభావంతో మంగళవారం కరీంనగర్ మండలంలోని పలు గ్రామాల్లో తేలికపాటి వర్షం కురిసింది. వర్షానికి ధాన్యం తడవకుండా కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం కుప్పలపై టార్పాలిన్లు కప్పారు. నిర్వాహకులు కాంటా నిలిపివేశారు.

చిరుజల్లులతో కాంటా నిలిపివేత

కరీంనగర్ మండలంలోని నగునూరు, జూబ్లీనగర్ తదితర గ్రామాల్లో వరికోతలు ముమ్మరంగా సాగుతుండటంతో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలివస్తోంది. మరికొన్ని గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్లు చివరి దశకు చేరుకున్నాయి. మరో నాలుగైదు రోజుల్లో కేంద్రాలను మూసివేయాల్సిన తరుణంలో అల్పపీడన ప్రభావంతో మంగళవారం పలు గ్రామాల్లో కురిసిన చిరుజల్లులతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తేమ రావడానికి ఆరబోసిన ధాన్యాన్ని కుప్పగా పోసి తడవకుండా కవర్లు, టార్పాలిన్లు కప్పారు. వర్షం పడటంతో నిర్వాహకులు ధాన్యం కాంటా పెట్టలేదు.

చివరిదశలో కొనుగోళ్లు

కరీంనగర్ మండలంలోని 17 గ్రామాలతోపాటు కార్పొరేషన్‌లో విలీనమైన ఆరెపల్లి, తీగలగుట్టపల్లి, వల్లంపహాడ్‌లో గతనెల 2 నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించి నెలరోజులవుతుండటంతో అన్ని కేంద్రాల్లో కొనుగోళ్లు చివరిదశకు చేరుకున్నాయి. ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బహదూర్‌ఖాన్ పేట కేంద్రాన్ని మూసివేశారు. మరో రెండు, మూడు రోజుల్లో చామనపల్లి, ఎలబోతారం కేంద్రాలను మూసివేసే దశలో వర్షాలు కురుస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దుర్శేడ్ సింగిల్ విండో ఆధ్వర్యంలోని ఇరుకుల్ల, మొగ్దుంపూర్, చేగుర్తి కేంద్రాల్లో సైతం కొనుగోళ్లు చివరిదశలో ఉన్నాయి. కరీంనగర్ సింగిల్‌విండో ఆధ్వర్యంలోని నాగులమల్యాల కేంద్రం మూసివేయగా దుబ్బపల్లి, తీగలగుట్టపల్లి, జూబ్లీనగర్ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు రెండు, మూడు రోజుల్లో ముగుస్తాయి. ఈ తరుణంలో కురుస్తున్న అకాల వర్షాలతో కేంద్రాల్లో కాంటా నిలిచిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలకు ధాన్యం తడిస్తే మళ్లీ ఆరబోయడం ఎంతో ఇబ్బందవుతుందని వాపోతున్నారు.

ధాన్యం కొనుగోళ్ల వివరాలు

సంస్థ	కేంద్రాలు	కొనుగోలు (క్వింటాళ్లలో)
కరీంనగర్‌సొసైటీ	11	70,970
దుర్శేడ్‌సొసైటీ	6	42,609
ఐకేపీ	3	16,762









ముసురుకున్న వాన

మిచాంగ్ తుపాను ముసురుకుంది. కరీంనగర్‌లో మంగళవారం చిరుజల్లులతో కూడిన వర్షం కురియడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. అత్యవసర పనుల నిమిత్తం బయటికి వెళ్లిన వారు తలపై రక్షణగా చున్నీలు, టవళ్లు, కవర్లు కప్పుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

ఇస్రో సందర్శన



కొత్తపల్లి: కొత్తపల్లిలోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ (సీబీఎస్ఈ) 9వ తరగతి విద్యార్థులు క్షేత్ర పర్యటనలో భాగంగా హైదరాబాద్‌లోని ఎన్ఆర్ఎస్సీ ఇస్రోను సందర్శించినట్లు ఆ విద్యాసంస్థల చైర్మన్ పి.ఫాతిమారెడ్డి తెలిపారు. శాటిలైట్, ఇస్రో గురించి శాస్త్రవేత్త శ్రీనివాస్ వివరించారన్నారు. విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు క్షేత్ర పర్యటన చేపట్టినట్లు తెలిపారు. గైడ్ టీచర్ ఫాతిమా, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాద నిర్లక్ష్యాన్ని ప్రయాణికుడికి ఎలా ఆపాదిస్తారు?

బాధిత కుటుంబానికి రూ.29 లక్షలను వడ్డీతో చెల్లించాలన్న హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: రోడ్డు ప్రమాదంలో కారు డ్రైవర్ సీటు పక్కనే కూర్చున్న వ్యక్తి మరణిస్తే, అతనికి నిర్లక్ష్యాన్ని ఎలా ఆపాదిస్తారని హైకోర్టు ప్రశ్నించింది. దీన్ని కారణంగా పేర్కొంటూ మృతుడి కుటుంబసభ్యులకు చెల్లించాల్సిన పరిహారాన్ని తగ్గించడం చెల్లదని, ట్రిబ్యునల్ ఉత్తర్వులు సరికాదని స్పష్టం చేసింది. పరిహారం మొత్తం రూ.29 లక్షలను వడ్డీతో సహా చెల్లించాలని న్యూఇండియా అస్యూరెన్స్ సంస్థను ఆదేశించింది. రోడ్డు ప్రమాదంలో తన భర్త మృతి చెందారని, ప్రమాద బీమా పరిహారాన్ని తగ్గిస్తూ ట్రిబ్యునల్ జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ మెదక్‌కు చెందిన ఎ.సత్యవతి మరొకరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిని జస్టిస్ పి.శ్యాంకోషి, జస్టిస్ ఎన్.తుకారాంజీ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. పిటిషనర్లకు రూ.29 లక్షల్లో కొంత మొత్తం పరిహారం ఇప్పటికే చెల్లించి ఉంటే దానిని మినహాయించి మిగిలిన మొత్తానికి గత పదేళ్లుగా వడ్డీ జమ చేసి చెల్లించాలని బీమా కంపెనీని ఆదేశించింది. పిటిషనర్ భర్త సుబ్బారావు కారులో 2013లో మచిలీపట్నం నుంచి హైదరాబాద్ వస్తుండగా రోడ్డు పక్కన వాహనాన్ని ఢీకొట్టడంతో ప్రమాదం జరిగిందని, ఆ ప్రమాదంలో ఆయన మరణించారని పిటిషనర్ న్యాయవాది ధర్మాసనానికి నివేదించారు. ప్రమాదానికి కారులో ఉన్న వారు కూడా కారణమని చెప్పి పరిహారం రూ.29 లక్షల్లో సగమే చెల్లించాలని ట్రిబ్యునల్ ఉత్తర్వులిచ్చిందన్నారు. పిటిషనర్ భర్త డ్రైవర్ పక్కన కూర్చున్నారని, ప్రమాదానికి అతడెలా కారణమవుతారని ప్రశ్నించారు. బీమా సంస్థ తరపు న్యాయవాది ప్రతివాదన చేస్తూ, కారు డ్రైవర్, సుబ్బారావు నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని ట్రిబ్యునల్ తేల్చిందన్నారు. వాదనల తర్వాత ట్రిబ్యునల్ ఇచ్చిన నిర్ణయాన్ని హైకోర్టు తప్పుబట్టింది. ఇరుపక్షాల నిర్లక్ష్యం ఉందని చెప్పి పరిహారాన్ని సగానికి తగ్గింపు చెల్లదని తేల్చి చెప్పింది.

వాళ్లు ఓడిపోవడం ఏమిటో?

- ముగ్గురు ఎంపీలు, ఇద్దరు ఎమ్మెల్యేల ఓటమిపై కమలదళంలో విస్మయం!
- బండి, ఈటల, అర్వింద్, రఘునందన్‌రావు, సోయం పరాజయం పెద్ద దెబ్బే
- పని చేయని బీసీ సీఎం నినాదం
- బండి టార్గెట్‌గా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కుమ్మక్కు
- బీజేపీ కీలక నేతల ఓటమిపై పార్టీ వర్గాల విశ్లేషణ



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో పక్కాగా గెలిచి సత్తా చాటుతారని భావించిన ముఖ్యనేతలే ఓటమి చవిచూడడంపై బీజేపీలో విస్మయం వ్యక్తమవుతోంది. పోటీచేసిన ముగ్గురు ఎంపీలు, ఇద్దరు సిట్టింగ్ ఎమ్మెల్యేలు పరాజయం పాలు కావడాన్ని ఆ పార్టీ నాయకులు జీర్ణించు కోలేకపోతున్నారు. కరీంనగర్ ఎంపీగా, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా ప్రజల్లో అత్యంత ప్రజాకర్షణ కలిగిన నాయకుల్లో ముఖ్యుడైన బండి సంజయ్, ఒకప్పుడు బీఆర్‌ఎస్‌లో నంబర్–టూగా వెలిగి, ఇప్పటిదాకా ఓటమి ఎరగని ఈటల రాజేందర్, నిజామాబాద్ ఎంపీగా కల్వకుంట్ల కవితపై గెలిచి సంచలనం సృష్టించిన ధర్మపురి అర్వింద్, ఫైర్‌బ్రాండ్ నేతగా గుర్తింపు పొందిదుబ్బాక ఉప ఎన్నికల్లో అందరి అంచనాలు తలకిందులు చేసిన రఘునందన్‌రావు, ఆదిలాబాద్ ఎంపీగా ఉన్న సోయం బాపూరావు ఓడిపోవడానికి కారణాలు ఏమై ఉంటాయా అన్న చర్చ పార్టీలో విస్తృతంగా సాగుతోంది.

పని చేయని బీసీ నినాదం

బీజేపీ బీసీ నినాదం, ఇతర పార్టీల కంటే అత్యధికంగా 36 సీట్లు బీసీలకు కేటాయించిన నేపథ్యం, అధికారంలోకి వస్తే బీసీ నేతను సీఎం చేస్తామనే పార్టీ విధానపరమైన నిర్ణయం... ఈ ఎన్నికల్లో కనీసంగా పనిచేయలేదని విశ్లేషిస్తున్నారు. ఈ ఎన్నికల్లో గెలిచిన ఎనిమిది మందిలో ముగ్గురు మాత్రమే బీసీలు ఉండటం, బీసీ సీఎం అభ్యర్థులుగా ముందువరుసలో నిలిచే సంజయ్, ఈటల, అర్వింద్ ఓటమి పాలవడం చూస్తుంటే బీసీ ప్రభావం ప్రశ్నార్థకంగానే ఉందని అంటున్నారు.

సంజయ్‌ను ఓడించేందుకు...

రాష్ట్రమంతా పాదయాత్ర చేసి ప్రజలకు దగ్గరై, బీఆర్‌ఎస్‌కు బీజేపీనే ప్రత్యామ్నాయం అన్నంత స్థాయిలో పార్టీ ఇమేజ్‌ని అమాంతం పెంచిన నేతగా గుర్తింపు పొందిన బండి సంజయ్ ఓటమికి పైకి కనిపించని కారణాలు ప్రభావితం చేసినట్టు అంచనా వేస్తున్నారు. కరీంనగర్ ఫలితాన్ని పోలింగ్ బూత్‌ల వారీగా విశ్లేషించిన పార్టీ నేతలు ముస్లిం, మైనారిటీ ఓటర్లు ఏకపక్షంగా సంజయ్‌కు వ్యతిరేకంగా ఓటేశారని లెక్కలు వేస్తున్నారు. ఎలాగైనా సంజయ్‌ను ఓడించాలంటూ పోలింగ్ సమయం నాటికి బీఆర్‌ఎస్‌తో కాంగ్రెస్ మిలాఖత్ అయిందని ఆరోపిస్తున్నారు. మొత్తం 390 పోలింగ్ బూత్‌లలో దాదాపు 200 బూత్‌లలో సంజయ్ ప్రత్యర్థి గంగుల కమలాకర్ కంటే ఎక్కువ ఓట్లు సాధించారు. మిగిలిన 186 బూత్‌లలోనే బీఆర్‌ఎస్ అభ్యర్థి అధిక ఓట్లు సాధించగలిగారు. ఈ నియోజకవర్గంలో ఉన్న 62 ముస్లిం ఓటర్ల ప్రభావిత పోలింగ్ కేంద్రాల్లో అత్యధిక ఓట్లు గంగులకే పడ్డాయి. ఉదాహరణకు చూస్తే హుస్సేన్ పురాలోని 232 నుంచి 241 వరకు ఉన్న పోలింగ్ కేంద్రాల్లో 80 శాతానికిపైగా మైనారిటీ ముస్లిం ఓటర్లుండగా, వీటిలో పోలైన 6,764 ఓట్లలో సంజయ్‌కు కేవలం 259 మాత్రమే పడ్డాయి. ఈ బూత్‌లలో 4,979 ఓట్లు అంటే 80 శాతం కమలాకర్‌కు పడ్డాయి. సంజయ్ 3,163 ఓట్లతో వెనకబడడం చూస్తే...ఈ ఓట్లే సంజయ్ ఓటమిని శాసించాయని గణాంకాలతో సహా పార్టీ నాయకులు ఉదహరిస్తున్నారు. ఇక ముస్లిం ఓటర్ల ప్రాబల్యమున్న 62 పోలింగ్ బూత్‌లలో ఒక్కటంటే ఒక్క పోలింగ్ బూత్‌లో కూడా కాంగ్రెస్ అభ్యర్థి ఆధిక్యత కనబరచకపోవడం చూస్తే కమలాకర్‌తో మిలాఖత్ అయ్యారనే ఆరోపణలకు బలం చేకూరుతోందని విశ్లేషిస్తున్నారు. ప్రజల కోసం నిత్యం పోరాడే తనను ఓడించేందుకు ముస్లింలంతా ఏకమయ్యారని, హిందూ సమాజం ఇప్పటికైనా కళ్లు తెరవాలని బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు కూడా దీనినే స్పష్టం చేస్తున్నాయని చెబుతున్నారు.

అంతటా తిరగడం వల్లనే ఈటలకు నష్టం

కేసీఆర్‌ను గజ్వేల్‌లో పోటీచేసి ఓడిస్తానంటూ ఈటల రాజేందర్ సవాల్ విసిరి బరిలోకి దిగిన సంగతి తెలిసిందే. తన సిట్టింగ్ స్థానం హుజూరాబాద్‌తో పాటు గజ్వేల్‌లోనూ పోటీ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా వివిధ నియోజకవర్గాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం ఈటలకు వ్యక్తిగతంగా నష్టం చేసిందని అంచనా వేస్తున్నారు. వరుసగా గెలుస్తూ వచ్చిన హుజూరాబాద్‌లో ఈ సారి త్రిముఖ పోటీ కారణంగా ప్రజా వ్యతిరేకత ప్రాతిపదికన కాంగ్రెస్ అధిక ఓట్లు చీల్చడంతో ఈటల అనూహ్యంగా ఓటమి పాలు కావాల్సి వచ్చిందని పార్టీ నాయకులు విశ్లేషిస్తున్నారు.

ఆత్మహత్యల్లో 6.6% అన్నదాతలవే!

- గతేడాది దేశవ్యాప్తంగా 5,207 మంది రైతుల బలవన్మరణం
- 6,083 మంది కౌలు రైతు, వ్యవసాయ కూలీలు కూడా..
- 2021తో పోలిస్తే 2022లో తెలంగాణలో మాత్రం తగ్గిన రైతు ఆత్మహత్యలు
- గతేడాది దేశంలో ఉసురుతీసుకున్న 1,70,924 మంది ప్రజలు
- జాతీయ నేర గణాంకాల బ్యూరో–2022 నివేదిక వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వాలు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా అన్నదాతల ఆత్మహ్యతలు మాత్రం తగ్గడం లేదు. దేశవ్యాప్తంగా నమోదైన అన్ని రకాల ఆత్మహత్యల్లో 6.6 శాతం మంది వ్యవసాయ రంగానికి చెందినవారే ఉండటం గమనార్హం. 2022లో దేశవ్యాప్తంగా అన్ని రకాల కారణాలు కలిపి 1,70,924 మంది ప్రజలు ఆత్మహత్య చేసుకోగా అందులో 5,207 మంది రైతులతోపాటు మరో 6,083 మంది కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు బలవన్మరణానికి పాల్పడ్డారు. 2021తో పోలిస్తే 2022లో దేశవ్యాప్తంగా వ్యవసాయ రంగానికి చెందిన వారి ఆత్మహత్యల్లో 3.75 శాతం నమోదైనట్లు జాతీయ నేర గణాంకాల బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) 2022 నివేదిక తెలిపింది. 2021లో వ్యవసాయ రంగానికి చెందిన 10,881 మంది ఆత్మహత్య చేసుకోగా 2022లో 11,290 మంది ఉసురు తీసుకున్నారు.

దేశవ్యాప్తంగా రైతులు, వ్యవసాయరంగ కూలీల ఆత్మహత్యలు..	
ఏడాది	మొత్తం ఆత్మహత్యలు
2018	10,349
2019	10,281
2020	10,677
2021	10,881
2022	11,290



రాష్ట్రంలో తగ్గిన రైతు ఆత్మహత్యలు..

ఈ నివేదిక ప్రకారం 2021తో పోలిస్తే 2022లో తెలంగాణలో రైతుల ఆత్మహత్యలు తగ్గాయి. 2021లో రాష్ట్రంలో 303 మంది రైతు ఆత్మహత్యలు నమోదవగా 2022లో 178 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. తెలంగాణలో కౌలు రైతులు, వ్యవసాయ రంగం ఆధారిత కూలీల మరణాలు నమోదు కాలేదని నివేదిక వెల్లడించింది.

పెరిగిన రోడ్డు ప్రమాద మృతులు...

దేశవ్యాప్తంగా 2021లో జరిగిన అన్ని రకాల ప్రమాదాల్లో 3,97,530 మంది మృతిచెందగా 2022లో ఆ సంఖ్య 4,30,504కు చేరింది. ఆయా ప్రమాదాల్లో మృతిచెందిన వారిలో 30 ఏళ్ల నుంచి 45 ఏళ్ల వారు 30.9 శాతం (1,32,846 మంది) ఉండగా 18 ఏళ్ల నుంచి 30 ఏళ్లలోపు వారు 24.9 శాతం (1,07,244 మంది) ఉన్నట్లు ఎన్‌సీఆర్‌బీ నివేదిక వెల్లడించింది. గతేడాది మొత్తం 4,46,768 రోడ్డు ప్రమాదాలు నమోదైనట్లు నివేదిక పేర్కొంది. రోడ్డు ప్రమాదాల్లో మొత్తం 1,71,100 మంది మృతిచెందగా 4,23,158 మంది గాయపడ్డారు. రోడ్డు ప్రమాద బాధితుల్లో అత్యధికంగా 45.5 శాతం మంది ద్విచక్రవాహనదారులే కావడం గమనార్హం. అత్యధిక రోడ్డు ప్రమాదాలు అతివేగం కారణంగానే జరిగాయని నివేదిక తెలిపింది. అతి వేగం కారణంగా జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 1,00,726 మంది దుర్మరణం చెందగా 2,72,661 మంది గాయపడ్డారు. 2021తో పోలిస్తే తెలంగాణలో రోడ్డు ప్రమాదాలు 1.4% మేర పెరిగాయి. 2021లో రాష్ట్రంలో మొత్తం 21,315 రోడ్డు ప్రమా దాలు జరగ్గా 2022లో 21,619 రోడ్డు ప్రమాద ఘటనలు నమోదయ్యాయని నివేదిక వెల్లడించింది. 2022లో రాష్ట్రవ్యాప్తంగా నమోదైన రోడ్డు ప్రమాదాల్లో 7,559 మంది మృతిచెందినట్లు తెలిపింది.

‘ఉచిత ప్రయాణానికి’ ఏర్పాట్లు!

- బస్సుల్లో మహిళలకు ఫ్రీ జర్నీపై కాంగ్రెస్ హామీ
- అధికారంలోకి వచ్చిన దరిమిలా ఆ మేరకు ఆర్టీసీ లెక్కలు
- కర్ణాటకలో అమలవుతున్న తీరును అధ్యయనం చేయనున్న టీఎస్ ఆర్టీసీ అధికారులు
- నలుగురు సభ్యుల బృందం బెంగళూరుకు

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని కల్పించేందుకు ఏర్పాట్లు మొదలయ్యాయి. ఏయే కేటగిరీ బస్సుల్లో అమలు చేస్తే ఎంత భారం పడనుందనే విషయంలో ఆర్టీసీ అధికారులు లెక్కలు సిద్ధం చేస్తున్నారు. కర్ణాటక రాష్ట్రంలో ఈ పథకం ఎలా అమలవుతోంది, అక్కడ ఎంత ఖర్చవుతోంది, దాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎలా సర్దుబాటు చేస్తోంది.. అన్న విషయాలను పరిశీలించేందుకు నలుగురు ఆర్టీసీ అధికారుల బృందం బెంగళూరుకు వెళ్తోంది. రెండు రోజుల పాటు అక్కడ పరిశీలించి నివేదికను సిద్ధం చేయనుంది. అధికారంలోకి వస్తే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ వసతి కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. తాజా ఎన్నికల్లో ఆ పార్టీ అధికారంలోకి రావటంతో అధికారులు పూర్తి వివరాలతో నివేదిక సిద్ధం చేస్తున్నారు. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి పేరును పార్టీ అధిష్టానం ఖరారు చేసిన నేపథ్యంలో ప్రభుత్వం కొలువుదీరబోతోంది. దీంతో వీలైనంత తొందరలో ఈ పథకం అమలు చేసే అవకాశం ఉన్నందున, ముఖ్యమంత్రి అడిగిన వెంటనే నివేదిక అందజేసేందుకు వీలుగా ఆర్టీసీ ఏర్పాట్లు చేస్తోంది.

ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో కూడా అమలు చేస్తే..

దక్షిణాదిలో తొలుత తమిళనాడు రాష్ట్రంలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ వసతి కల్పించారు. కానీ అక్కడ, కేవలం నగర, పట్టణ ప్రాంతాల్లో తిరిగే సిటీ ఆర్డినరీ బస్సుల్లో మాత్రమే ఈ వెసులుబాటు కల్పించారు. ఇందుకోసం ప్రత్యేకంగా గులాబీ రంగులో ఉండే బస్సులను అందుబాటులోకి తెచ్చారు. వాటిల్లోనే ఈ వెసులుబాటు ఉంటుంది. కానీ, కర్ణాటకలో మాత్రం రాష్ట్రవ్యాప్తంగా ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీ బస్సుల్లో ఈ వసతి కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీని ప్రకటించింది. అధికారంలోకి రావటంతో దాన్ని అమలులోకి తెచ్చింది. తెలంగాణలో కూడా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. కానీ కర్ణాటక మోడల్‌ను అనుసరిస్తుందా, తమిళనాడు మోడల్‌ను చేపడుతుందా అన్న విషయంలో స్పష్టత రావాల్సి ఉంది. కర్ణాటక తరహాలో పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్‌బస్సుల్లో ఈ పథకాన్ని అమలు చేస్తే సాలీనా రూ.2200 కోట్లు అవుతుంది. పల్లెవెలుగు బస్సులకే పరిమితం చేస్తే ఏటా రూ.750 కోట్లు అవుతుందని అంచనా వేస్తున్నారు.



ప్రభుత్వం ఇవ్వాల్సింది ప్రతినెలా దాదాపు రూ.185 కోట్లు ..

మహిళలకు ఉచిత ప్రయాణ పథకం ప్రారంభమైతే, ఆ రూపంలో ఆర్టీసీ కోల్పోయే టికెట్ ఆదాయాన్ని ప్రభుత్వం రీయింబర్స్ చేయాల్సి ఉంటుంది. ఎక్స్‌ప్రెస్ కేటగిరీ బస్సుల వరకు ఈ పథకాన్ని అమలు చేస్తే సాలీనా రూ.2200 కోట్ల వరకు రీయింబర్స్ చేయాలి. అంటే ప్రతి నెలా రూ.185 కోట్లు ఇవ్వాల్సి ఉంటుంది.

జీరో టికెట్ ప్రవేశపెడతారా..?

ఎంతమంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారన్నది లెక్క తేలాల్సి ఉంటుంది. ఇందుకోసం కర్ణాటకలో జీరో టికెట్ విధానం ప్రారంభించారు. మహిళలకు రూ.సున్నా అని ఉండే జీరో టికెట్‌ను జారీ చేస్తారు. అలా రోజుకు ఎన్ని టికెట్లు జారీ అయ్యాయో నమోదు చేసి నెలవారీగా లెక్కిస్తారు. ఇక్కడ అదే పద్ధతి ప్రవేశపెడతారా లేక మరో విధానాన్ని అనుసరిస్తారా అన్నది తేలాల్సి ఉంది.

సింగరేణిలో పొత్తులు పొడిచేనా..?

- ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ కలిసే అవకాశముందా..?
- వేర్వేరుగానే గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో తలపడతాయా?
- అసెంబ్లీ ఎన్నికల్లో కుదిరిన పొత్తు సింగరేణిలోనూ కొనసాగుతుందా?
- గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల నేపథ్యంలో సందేహాలు



రామకృష్ణాపూర్: సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల హడావిడి మొదలైంది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఈ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో వివిధ కార్మిక సంఘాలు ఎన్నికల సమరానికి సై అంటున్నాయి. ఈ నెల 27వ తేదీన గుర్తింపు ఎన్నికల నిర్వహణకు లేబర్ కమిషనర్ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల ఏర్పాట్ల విషయాన్ని పక్కనపెడితే కార్మిక సంఘం ఎన్నికల్లో పొత్తులు కుదిరే అవకాశాలు ఏమైనా ఉన్నాయా? అనే సంశయం కార్మికవర్గాల్లో నెలకొంది. జాతీయ కార్మిక సంఘాలైన ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ మధ్య పొత్తులు పొడుస్తాయా అనే చర్చ సాగుతోంది.

కోల్‌బెల్ట్ ప్రాంతాల్లో కోలాహలం...

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల అనంతరం సింగరేణిలో గుర్తింపు సైరన్ మోగడంతో కోల్‌బెల్ట్ ప్రాంతాల్లో కోలాహలం వ్యక్తమవుతోంది. సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల ప్రక్రియ చురుగ్గా సాగుతున్న సంగతి తెల్సిందే. ఈ క్రమంలో సంఘాల మధ్య పొత్తులు ఏమైనా విత్తుకునే అవకాశం ఉందా.? అనే దానిపై చర్చ సాగుతోంది. ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ జాతీయ కార్మిక సంఘాల నాయకులు ఈ దిశగా అడుగులు వేస్తున్నారా? అనే సందేహం సహజంగానే వ్యక్తం చేస్తున్నారు. బీఆర్‌ఎస్ అనుబంధ కార్మిక సంఘమైన టీబీజీకేఎస్‌ని ఓడించేందుకు ఈ రెండు సంఘాలు ఒక్కటవుతాయనే అనుమానాలు కలుగుతున్నాయి. ఇటీవలే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, వామపక్ష సీపీఐ మిత్రపక్షాలుగా కలిసి పనిచేయటం గమనార్హం.


ఐఎన్‌టీయూసీ ఒంటరిగానే...

సింగరేణి కాలరీస్‌లో జరిగే గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ ఒంటరిగానే పోటీ చేసే సూచనలు కనిపిస్తున్నాయి. ఐఎన్‌టీయూసీ అగ్రనేతలు తమ గడియారం గుర్తుపై ఒంటరిపోరుకు సన్నద్ధం అవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. రాజకీయ పార్టీలు వేరు, కార్మిక సంఘాలు వేరు అనే వ్యత్యాసాన్ని వారు వెల్లడిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల మాదిరి కార్మిక సంఘం ఎన్నికల పొత్తులు కుదురవని కుండబద్దలు కొట్టినట్లు చెబుతున్నారు.

ఆరేళ్ల తర్వాత ఎన్నికలకు మోక్షం...

ఆరేళ్ల అనంతరం ఎన్నికలు జరుగుతున్నాయి. 2017 అక్టోబర్ నెలలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో గెలిచిన టీబీజీకేఎస్ కాలపరిమితి ఏనాడో ముగిసిపోయింది. వాస్తవానికి ఈ ఎన్నికలు రెండేళ్ల క్రితమే జరగాలి. కోవిడ్ వ్యాప్తితో పలుసార్లు వాయిదా వేస్తూ వచ్చారు. ఈ ఏడాది ఆరంభంలో నిర్వహిస్తారని భావించినా.. బొగ్గు ఉత్పత్తి లక్ష్యం అంశాన్ని తెరపైకి తెచ్చిన సింగరేణి యాజమాన్యం కోర్టుకెక్కింది. ఇలా సవాలక్ష కారణాలతో వాయిదా పడుతూ వచ్చిన ఎన్నికలు ఈ నెలలో జరుగుతుండడంతో కార్మిక వర్గాల్లో కొంత జోష్ కనిపిస్తోంది.


ఐఎన్‌టీయూసీ కలిసిరావాలి



ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కి సీపీఐ సహకరించింది. వారికి పూర్తిగా సపోర్ట్ చేశాం. కాబట్టి సింగరేణి ఎన్నికల్లో ఏఐటీయూసీతో కలిసిరావాలని మాట్లాడటానికి ప్రయత్నించాం. అయితే వారు ఒంటరిగానే పోటీ చేస్తామని గనులపై వాల్‌పోస్టర్లు వేశారు. ధర్మంగా ఆలోచిస్తే వాళ్లు కలిసిరావాలి.

– వాసిరెడ్డి సీతారామయ్య, ఏఐటీయూసీ అధ్యక్షుడు

ఒంటరిగానే పోటీ చేస్తాం



సింగరేణి ఎన్నికల్లో ఎవరితో మాకు పొత్తుల్లేవు. మేము గడియారం గుర్తుపై పోటీ చేస్తాం. ఇప్పటికే నామినేషన్లు కూడా వేశాం. రాజకీయ పార్టీలకు యూనియన్లకు ఎలాంటి సంబంధం ఉండదు. అలా అంటే మునుగోడు ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు సీపీఐ సపోర్ట్ చేసింది. మరి టీబీజీకేఎస్‌తో ఏఐటీయూసీ పొత్తు పెట్టుకుంటుందా.? పార్టీలు వేరు యూనియన్లు వేరు.

–జనక్‌ప్రసాద్, ఐఎన్‌టీయూసీ నేత

బాలికా సాధికారత సంఘాలు

- జిల్లాలోని 84 పాఠశాలల్లో ఏర్పాటుకు విద్యాశాఖ కసరత్తు
- బాలికల భద్రత కోసమే..
- అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయం

సంఘంలో ఉండేది వీరే..

చైర్మన్ : హెచ్‌ఎం
మెంబర్ కన్వీనర్ : గర్ల్ చైల్డ్ ఫ్రెండ్లీ టీచర్
సభ్యులు : 10–12 ఏళ్ల బాలికలు (ప్రతీ సెక్షన్ నుంచి ఇద్దరు)
ఎక్స్‌టర్నల్ మెంబర్ : స్థానిక ఠాణా మహిళా కానిస్టేబుల్, షీటీం ఇన్‌చార్జి

కరీంనగర్: బాలికలపై రోజురోజుకూ నేరాలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం వారి భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ఇంటి నుంచి వెళ్లిన పిల్లలు తిరిగొచ్చే వరకు తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంటోంది. ఇలాంటి సమయంలో బాలికలకు పూర్తిస్థాయి భద్రత కల్పించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. ‘బాలికా సాధికారత సంఘాల’ ఏర్పాటుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. కరీంనగర్ జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలల్లో ఈ సంఘాలను నియమించనున్నాయి. పాఠశాలలో లేదా బయట ఎలాంటి వేధింపులకు గురైనా వెంటనే వారికి తగిన రక్షణ కల్పించేలా సంఘాలు పని చేయనున్నాయి. అలాగే, బాలికలు సమస్యలను ఎదుర్కొనేలా వారికి అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



సప్తగిరికాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల

సత్వరమే పోలీసులకు ఫిర్యాదు..

ఈవ్‌టీజింగ్, అనుచిత ప్రవర్తన, బెదిరించడం, దూషించడం, లైంగిక వేధింపులకు పాల్పడటం వంటి ఘటనలు జరిగినప్పుడు బాలికలు వెంటనే ఫిర్యాదు చేసి, రక్షణ పొందడానికి ఈ సంఘాలు దోహదపడతాయి. బాలికలపై నేరాలు జరిగినప్పుడు సత్వరమే పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు చొరవ చూపుతాయి. ఒక విధంగా చెప్పాలంటే పాఠశాల, స్థానిక పోలీసులకు మధ్య వారధిలా పని చేస్తాయి.

కలెక్టర్ చైర్మన్‌గా...

జిల్లాస్థాయి కమిటీలో కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, బాలికలతో స్నేహపూర్వకంగా ఉండే ఉపాధ్యాయినులతో నెలకోసారి సమావేశమై, జరిగిన విషయాలపై కలెక్టర్ చర్చించాలి. సంఘాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలి.

సంఘాల పనితీరు ఇలా...

- ప్రతినెలా విద్యార్థినులతో సమావేశం నిర్వహించాలి.
- కౌమార దశలో బాలికల్లో వచ్చే శారీరక మార్పుల గురించి తెలియజేయాలి.
- వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి.
- లింగ సమానత్వంపై శిక్షణ ఇవ్వాలి.
- బాల్య వివాహాలను నిరోధించాలి.
- బాలికల హక్కులను వివరించాలి.
- ఏదైనా ఘటన జరిగితే సత్వరం స్పందించి, ఫిర్యాదు చేసేలా చూడాలి.
- బాలురకూ అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి.
- జీవన నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వాలి.

బాలికల రక్షణకు చర్యలు



బాలికల రక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఎంపిక చేసిన పాఠశాలల్లో బాలికా సాధికారత సంఘాలను నియమిస్తాం. దీనివల్ల అమ్మాయిలు స్కూళ్లలో స్వేచ్ఛాయుత వాతావరణంలో చదువుకునే అవకాశం ఉంటుంది. ఎలాంటి సమస్య ఎదురైనా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. జిల్లాలో 12 కేజీబీవీలు, 72 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సంఘాలను ఏర్పాటు చేస్తాం. ఆయా విద్యాలయాల్లో 7,581 మంది బాలికలు చదువుతున్నారు.

– జనార్దన్‌రావు, డీఈవో

పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల రద్దు

- తుపాను ప్రభావమే కారణం



రామగుండం: తుపాను ప్రభావంతో చెన్నై నుంచి నడిచే సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేశారు. పరిస్థితిని బట్టి రద్దు గడువు పొడగించే అవకాశాలు ఉన్నాయని, ప్రయాణికులు రైల్వేస్టేషన్‌లోని విచారణ అధికారులను సంప్రదించాలని ఉన్నతాధికారులు కోరారు. ఈ మేరకు మంగళవారం రద్దుచేసిన రైళ్ల జాబితాను రామగుండం రైల్వేస్టేషన్ నోటీసు బోర్డుపై అంటించారు. ఆ వివరాలు

రైలు నంబరు	పేరు	రద్దు
12296	దాణాపూర్–బెంగళూరు(సంఘమిత్ర)	6వరకు
12295	బెంగళూరు – దాణాపూర్(సంఘమిత్ర)	8వరకు
12511/12	గోరఖ్‌పూర్–కొచ్చువెల్లి(రప్తిసాగర్ ఇరువైపులా)	7వరకు
12615/16	చెన్నై – న్యూఢిల్లీ(జీటీ ఇరువైపులా)	8వరకు
12625/26	త్రివేంద్రం – న్యూఢిల్లీ(కేరళ ఇరువైపులా)	7వరకు
16093/94	చెన్నై – లక్నో(లక్నో ఇరువైపులా)	8వరకు
16787/88	తిరునల్వేలి – శ్రీమాతవైష్ణోదేవి(కాట్రా ఇరువైపులా)	8వరకు
22535/36	రామేశ్వరం –బనారస్(బనారస్ ఇరువైపులా)	7వరకు
22647/48	కోర్బా – కొచ్చువెల్లి(కొచ్చువెల్లి ఇరువైపులా)	7వరకు
22669/70	ఎర్నాకులం – పాట్నా(పాట్నా ఇరువైపులా)	6వరకు
22673/74	భగత్‌కీకోటీ – మన్నార్‌గుడి(మన్నార్‌గుడి ఇరువైపులా)	8వరకు

ఆరేళ్ల చిన్నారికి ‘ఊపిరి’ పోయండి

- ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న బాలుడు
- దాతల సాయం కోసం తల్లిదండ్రుల ఎదురుచూపు



చిన్నారితో తల్లిదండ్రులు

మల్యాల: కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న ఆ దంపతులకు చిన్నారికి వైద్యం చేయించేందుకు చేతిలో చిల్లి గవ్వలేక దాతల సాయం ఎదురుచూస్తున్నారు. మండలంలోని సర్వాపూర్ అనుబంధ గ్రామమైన కొత్తపల్లెకు చెందిన మెరుగు లక్ష్మీనారాయణ, మంజుల కుమారుడు కార్తికేయ (6) కొంతకాలంగా ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నాడు. పుట్టిన 5 నెలలకే గుండెకు రంధ్రం ఉందని వైద్యులు తెలపడంతో ఆపరేషన్ చేయించారు. కాగా తరచూ అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేపించారు. ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నాడని, చిన్నారికి ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించారు. లక్ష్మీనారాయణ మేస్త్రీ పని చేస్తుండగా, మంజుల బీడీలు చేస్తూ జీవిస్తున్నారు. ఇప్పటికే ఆస్పత్రిలో కుమారుడి వైద్యం కోసం పెద్దమొత్తంలో ఖర్చుచేశారు. చిన్నారి ఆపరేషన్ కోసం ఆర్థికసాయం అందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

అకౌంట్ నంబర్ 79021566022, లేదా, 9553680052 నంబర్‌కు ఫోన్ పే ద్వారా దాతలు సాయం అందించాలని కోరుతున్నారు.

నాగోబా ఆలయంలో పూజలు

ఇంద్రవెల్లి: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి సీఎం పదవి, ఖానాపూర్ ఎమ్మెల్యేగా గెలిచిన వెడ్మ బొజ్జుకు మంత్రి పదవి రావాలని కోరుతూ ఆదివాసీలు మంగళవారం కేస్లాపూర్‌లోని నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో మెస్రం వెంకట్‌రావ్, మెస్రం నాగ్‌నాథ్, ఆత్రం అశోక్, సాగర్, చిత్రు, మానిక్‌రావ్, షేక్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న కేస్లాపూర్ గ్రామస్తులు

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతి బాపూలే గురుకుల పాఠశాలలో నిర్వహించిన అండర్ –19 స్కూల్ గేమ్స్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జోనల్‌స్థాయి పోటీలలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రిన్సిపల్ లలితకుమారి తెలిపారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు అథ్లెటిక్స్‌లో పాల్గొని జోనల్ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు పేరు తీసుకొచ్చారన్నారు. ఈ నెల 7, 8, 9 తేదీల్లో హన్మకొండలోని జేఎన్‌ఎస్ స్టేడియంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులను ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.



రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా పురస్కారం..



తాను అందుకున్న జ్ఞాపికలతో జ్యోత్స్న

జ్యోత్స్న ఫణిజ... తెలుగమ్మాయి.
ఢిల్లీ... ఏఆర్‌ఎస్‌డీలో అసిస్టెంట్ ప్రొఫెసర్.
దేశవిదేశాల్లో అవార్డులందుకున్న కవయిత్రి
మిస్ కాలేజ్... బెస్ట్ హాఫ్ శారీ విజేత.
ర్యాంప్ వాకరే కాదు... మారథాన్ రన్నర్ కూడా.
కర్ణాటక, హిందుస్థానీ సంగీత గాయని...
చిన్న వయసులో డాక్టరేట్ అందుకున్న చదువరి.
స్క్రైబ్ సహాయంతో పరీక్షలు రాసిన జ్యోత్స్న...
ఆత్మస్థైర్యం... ఆత్మవిశ్వాసమే నా కళ్లు అంటోంది.

మనోనేత్రంతో ముందడుగు...

జ్యోత్స్న ఫణిజ సొంతూరు ఆంధ్రప్రదేశ్, కృష్ణాజిల్లా, కైకలూరు. ఆమె పుట్టినప్పుడు ఆమెలోని జన్యు సమస్యను డాక్టర్లు గుర్తించలేకపోయారు. కంటి సమస్య గురించి ఆరు నెలలకు తెలిసింది. మేనరికపు వివాహం కారణంగా ఇలా జరిగిందని, వైద్యచికిత్సలతో ప్రయోజనం లేదన్నారు ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ డాక్టర్లు. అమ్మాయి చదువు కోసం నర్సాపురంలో ఉన్న స్పెషల్ స్కూలు గురించి కూడా వాళ్లే చెప్పారు. ఊహ తెలిసినప్పటి నుంచి తన జీవనప్రయాణాన్ని సాక్షితో పంచుకున్నారు జ్యోత్స్న ఫణిజ.

■ అంతులేని ఆప్యాయత

''నా సమస్య తెలిసిన తరవాత ఇంట్లో అందరూ నా గురించి ప్రత్యేక శ్రద్ధ చూపించారు. నా చదువు కోసం అమ్మమ్మ నర్సాపురంలో ఇల్లు తీసుకుని ఒకటో తరగతి నుంచి పదవ తరగతి వరకు సంరక్షించింది. అమ్మ సాహిత్యాభిలాషి. నన్ను సాహిత్యానికి దగ్గర చేయడానికి కథలు, హిందీ పాటల క్యాసెట్‌లు తెచ్చేది. నాకు అనేక ప్రదేశాలు తెలియడం కోసం తరచూ టూర్‌లకు తీసుకెళ్లేవారు. వాళ్ల కళ్లతో చూసినవన్నీ పూసగుచ్చినట్లు వివరిస్తుంటే నేను మనోనేత్రంతో చూసేదాన్ని. డిగ్రీ వరకు బ్రెయిలీలో చదివాను. డిగ్రీ విజయవాడలోని మేరిస్ స్టెల్లా కాలేజీలో చదివాను. బ్రెయిలీలో త్వరగా పేజీ నిండిపోతుంది. లెక్చరర్‌లు నోట్స్ డిక్టేట్ చేసేటప్పుడు నన్ను గమనిస్తూ నాకు పేపర్ మార్చుకునే విరామం ఇచ్చేవారు. పరీక్ష రాయడానికి కొన్నిసార్లు లెక్చరర్‌లే స్క్రైబ్‌గా సహకరించేవారు. ఎగ్జామ్ రాయడానికి నాకు మామూలు వాళ్లకంటే ఎక్కువ సమయం ఇచ్చేవారు. నా పరీక్ష పూర్తయ్యే వరకు నా ఫ్రెండ్స్ నా కోసం వెయిట్ చేసేవాళ్లు. క్లాస్ మేట్స్ నుంచి క్లాస్ లీడర్, లెక్చరర్‌లు, ప్రిన్సిపల్ అందరూ ఆప్యాయంగా చూశారు. వారందరి సహకారం వల్లే ఇప్పుడు ఈ స్థాయికి చేరగలిగాను. హైదరాబాద్‌లో ఇఫ్లూలో ఎం.ఏ ఇంగ్లిష్ లిటరేచర్, పీహెచ్‌డీ చేశాను. పీజీకి వచ్చిన తర్వాత మొత్తం బ్రెయిలీలో రాయడం కుదరదని టైపింగ్ నేర్చుకున్నాను. దాంతో కంప్యూటర్ ఆపరేట్ చేయడం సులువైంది.



హెల్పర్ సాయంతో మారథాన్‌లో...

చదువుతోపాటు కర్ణాటక, హిందూస్థానీ సంగీతం నేర్చుకుని టీవీ ప్రోగ్రాముల్లో పాటలు పాడాను. కాలేజ్‌లో బ్యూటీ కాంటెస్ట్‌లు, ఫ్యాషన్ ర్యాంప్ వాక్ చేశాను. ఇప్పుడు ఢిల్లీలో కూడా మారథాన్‌లు చేస్తున్నాను. దేనికీ 'నో' చెప్పను. అందరూ చర్మచక్షువులతో చూస్తే నేను మనోనేత్రంతో చూస్తాను. రన్‌లో మాత్రం హెల్పర్‌ల సహాయం తీసుకుంటాను.

■ పాఠాలు... పేపర్‌లు

ఢిల్లీలో ఏఎస్‌ఆర్‌డీ కాలేజ్‌లో ఉద్యోగం వచ్చింది. ఇక్కడ కూడా సహోద్యోగులు, ప్రిన్సిపల్, స్టూడెంట్స్ ఎంతగా స్నేహపూర్వకంగా ఉంటారో చెప్పలేను. పాఠాలు చెప్పడంలో ఎటువంటి ఇబ్బంది లేదు. కానీ స్టూడెంట్స్ పేపర్‌లు దిద్దడంలో మాత్రం మా వారి సహకారం తీసుకుంటాను. రొటేషన్‌లో భాగంగా ఇంగ్లిష్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ బాధ్యతలు వచ్చాయి. అప్పుడు కొలీగ్స్ 'చేయలేనని చెప్పకు. అది కెరీర్‌లో పెద్ద అడ్డంకి అవుతుంది. బాధ్యతలు తీసుకో, మేమున్నాం' అన్నారు. ఆ భరోసాతో అడ్మినిస్ట్రేషన్ బాధ్యతలు తీసుకున్నాను. 'నువ్వు పేరుకి ఉంటే చాలు, పని మేము చేసి పెడతాం' అన్నారు. కానీ నా మనసే అంగీకరించలేదు. టైమ్‌టేబుల్ సెట్టింగ్ నుంచి స్టూడెంట్స్ ఎన్‌రోల్‌మెంట్ వరకు స్వయంగా చేశాను. పేపర్ వర్క్ అయితే కష్టమయ్యేదేమో, టెక్నాలజీతో అప్‌డేట్ అవుతుంటాను కాబట్టి మొత్తం డిజిటల్‌గానే చేయగలిగాను.

■ రాష్ట్రపతి పురస్కారం

ఇంగ్లిష్ పాఠాలు చెప్పడం నా వృత్తి అయితే, ఇంగ్లిష్ సాహిత్యం నా ప్రవృత్తి అని చెప్పవచ్చు. తెలుగులో నాకు నచ్చిన సాహిత్యాన్ని ఇంగ్లిష్‌లోకి అనువాదం చేస్తున్నాను. నెల్లూరులో పెన్నా రైటర్స్ అసోసియేషన్‌కు చెందిన ప్రముఖ రచయిత మోపూరు పెంచల నరసింహం గారి ఎర్రదీపం రచనను క్రిమ్‌సన్ ల్యాంప్ పేరుతో, రాతిపాటను స్టోన్‌సాంగ్ పేరుతో అనువదించాను. వివిధ సామాజికాంశాల మీద జర్నల్స్‌లో 12 వ్యాసాలు రాశాను. రచయితల సదస్సుకు హాజరవుతుంటాను. రచయితల నుంచి 'దృష్టిలోపం' అనే ఇతివృత్తం ఆధారంగా రచనలను ఆహ్వానించి ప్రచురించడం, కలకత్తా రైటర్స్ వర్క్‌షాప్‌లో పోయెట్రీ కలెక్షన్‌ను ప్రచురించడంలో కీలకంగా పని చేశాను. డిసెంబర్ మూడవ తేదీ ఇంటర్నేషనల్ డిజేబులిటీ డే సందర్భంగా 2017లో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌గారి చేతుల మీదుగా 'రోల్‌మోడల్' జాతీయ పురస్కారం అందుకోవడం, ప్రధానమంత్రి నుంచి ప్రశంసాపూర్వకమైన అధికారిక ఉత్తరం అందుకోవడం మాటల్లో చెప్పలేని ఆనందం. ఏడు కవితలకు అవార్డులు వచ్చాయి. అలీఘర్ ముస్లిం యూనివర్సిటీ, హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్, నాటా సభలకు ఆహ్వానం, దర్భంగా, మైథిలీ రీజియన్‌లో కుల అణచివేత, ఆదివాసీ సాహిత్యం, దళితుల సమస్యల మీద రాయడం... వంటివి నేను నా జీవితాన్ని ఆదర్శవంతంగా జీవిస్తున్నాననే సంతోషాన్ని కలిగించిన సందర్భాలు. స్ట్రీట్ చిల్డ్రన్ గురించి రాసిన 'వీధిచుక్క' రచనకు తెలుగు వాళ్ల నుంచి అందుకున్న ప్రశంసలకు లెక్కలేదు.

■ అందమైన కుటుంబం

కుటుంబం విషయానికి వస్తే... డిగ్రీ కాగానే పెళ్లయింది. మా వారు బంధువులబ్బాయే. ఆయనది ఫైనాన్స్ సెక్టార్. పెళ్లి తర్వాత హైదరాబాద్‌లో కాపురం ఉన్నాం. అప్పుడు పీజీ, పీహెచ్‌డీ చేశాను. నాకు ఢిల్లీలో ఉద్యోగం రావడంతో ఇద్దరు పిల్లలతో ఢిల్లీలో ఉంటున్నాం. ఇక్కడకు వచ్చిన తర్వాత ఫ్రెంచ్‌లో అడ్వాన్స్‌డ్ డిప్లమో చేశాను. నిత్యం చదువుతూ, రాస్తూ ఉండడం ఇష్టం. అలాగే పిల్లలకు కథలు చెప్పడం ఇంకా ఇష్టం'' అన్నారు జ్యోతి ఫణిజ.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

యూత్ పల్స్

యువతరంలో ప్లాంట్ ఇన్‌ఫ్లుయెన్సర్‌ల సంఖ్య పెరుగుతోంది. 'ఆలోచన-అవగాహన-అధ్యయనం' అనే కాన్సెప్ట్‌తో మొక్కల పెంపకానికి సంబంధించిన సమస్త విషయాలపై లోతైన అధ్యయనం చేస్తున్నారు. 'ప్లాంట్ ఇన్‌ఫ్లుయెన్సర్'గా తాము తెలుసుకున్న విషయాలను సామాజిక మాధ్యమాల ద్వారా నలుగురితో పంచుకుంటున్నారు. ఎంతోమందిని పచ్చదనం వైపు నడిపిస్తున్నారు...



● ప్లాంట్ ఇన్‌ఫ్లుయెన్సర్స్

జెనరేషన్ గ్రీన్

ప్రపంచంలోని 25 కాలుష్య బాధిత పట్టణాలలో తొమ్మిది మన దేశంలోనే ఉన్నాయి! ఇదే సమయంలో కాంక్రీట్ జంగిల్స్‌లో మొక్కల ప్రేమికుల సంఖ్య పెరుగుతోంది. గ్రీన్ ఇంటీరియర్ డెకర్ ట్రెండ్ ఊపందుకుంది. దీనికి కారణం ప్లాంట్ ఇన్‌ఫ్లుయెన్సర్‌లు. మొక్కలను ప్రేమించడమే కాదు ఇతరులు కూడా ప్రేమించేలా చేయడంలో, మొక్కల గురించి సమగ్ర సమాచారం తెలుసుకోవడమే కాదు ఇతరులు కూడా తెలుసుకునేలా చేయడంలో ప్లాంట్ ఇన్‌ఫ్లుయెన్సర్‌లు క్రియాశీల పాత్ర పోషిస్తున్నారు.

'ఇంట్లో పచ్చటి మొక్కలు కనిపిస్తే ఆ అందం, ఆనందమే వేరు' అంటున్నాడు ఆన్‌లైన్ స్టార్టప్ 'లేజీ గార్డెనర్' ఫౌండర్ వినాయక్ గార్గ్. 'మొక్కలకు ఏది మంచిది?' లాంటి ప్రశ్నలు ఫాలోవర్‌ల నుంచి గార్గ్‌కు వస్తుంటాయి,

'గతంలో నర్సరీలకు వెళ్లి అందుబాటులో ఉన్న మొక్కలను కొనేవారు. ఇప్పుడు అలా కాదు. రకరకాల డిమాండ్స్‌తో వస్తున్నారు. స్థానికేతర మొక్కలపై కూడా ఆసక్తి చూపుతున్నారు' అంటున్నాడు గార్గ్.

'మొక్కలకు సంబంధించిన కంటెంట్‌ను పాపులరైజ్ చేయడంలో ప్లాంట్ ఇన్‌ఫ్లుయెన్సర్‌లు నిర్ణయాత్మక పాత్ర పోషిస్తున్నారు. యువతలో ప్లాంట్ ఇన్‌ఫ్లుయెన్సర్‌ల సంఖ్య పెరుగుతోంది. మొక్కలపై ప్రేమ, వాటికి సంబంధించిన పరిజ్ఞానం అనేది హాబీ మాత్రమే కాదు అంతకు మించిన సామాజిక బాధ్యత' అంటుంది సీమా త్రిపాఠీ. పుణెకు చెందిన సీమ ఆన్‌లైన్ నర్సరీ నిర్వహిస్తోంది.

'గార్డెన్ అప్' పేరుతో యూట్యూబ్ చానల్ నడుపుతోంది ఏక్తా చౌధురి. ఆమె చానల్‌కు 1.5 మిలియన్‌ల సబ్‌స్క్రైబర్‌లు ఉన్నారు. ఈ చానల్ ద్వారా మొక్కల పెంపకానికి సంబంధించిన చిట్కాలు, సలహాలు చెబుతుంటుంది ఏక్తా. ఇండోర్ ప్లాంట్స్‌పై చేసిన వీడియో తన తొలి వైరల్ వీడియో. ఈ వీడియో ఒక మిలియన్ వ్యూస్‌ను దక్కించుకుంది.

'2020లో ఒక మొక్కతో పచ్చటి ప్రయాణం ప్రారంభించిన వారి బాల్కనీ, టెర్రస్‌లలో ప్లాంట్ ఇన్‌ఫ్లుయెన్సర్‌ల ప్రభావం వల్ల ఇప్పుడు 200 వరకు మొక్కలు కనిపిస్తున్నాయి. ఇది నమ్మశక్యం కాని నిజం' అంటుంది ఏక్తా.

హరియాణాకు చెందినఏక్తా చౌధురి ఐఐఎస్‌సీ పబ్లిక్ యూనివర్శిటీ, బెంగళూరులో ఎకాలజీలో పీహెచ్‌డీ స్టూడెంట్. కొన్ని సంవత్సరాల క్రితం తన హాస్టల్ రూమ్‌లో రెండు మూడు మొక్కలు ఉండేవి. ఆ తరువాత ఈ మినీ ప్లాంట్స్ సంఖ్య యాభైకి చేరింది 'గార్డెన్ అప్' చానల్ ద్వారా సక్సెస్ అయిన ఏక్తా రిటైల్ విభాగంలోకి కూడా అడుగుపెట్టింది. 'గార్డెన్ అప్: యువర్ వన్ స్టాప్ గైడ్ టు గ్రోయింగ్ ప్లాంట్స్ ఎట్ హోమ్' పేరుతో పుస్తకం కూడా రాసింది.

ఇండస్ట్రీయల్ ఇంజినీరింగ్‌లో ఎం.టెక్. చేసిన విశాఖ సిన్హాకు మొక్కలు అంటే ఎంతో ఇష్టం. ఆమెకు సొంతంగా నర్సరీ, గార్డెనింగ్ స్టోర్ ఉంది. 'ఇ బగీయా' పేరుతో ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక పేజీ ఉంది. పెద్దగా శ్రమ అవసరం లేకుండానే మొక్కలను ఎలా పెంచాలో ఇన్‌స్టా ద్వారా చెబుతోంది విశాఖ.

సీఏ స్టూడెంట్ అయిన రక్షా అగర్వాల్‌కు గార్డెనింగ్ అంటే ఇష్టం. ప్లాంట్ ఇన్‌ఫ్లుయెన్సర్ కూడా. ఇన్‌స్టాగ్రామ్‌లో 'గార్డెన్ విత్ హర్' అనే పేజీ ఉంది. ఈ పేజీలోకి వెళితే పచ్చటిమొక్కలు, వాటికి సంబంధించిన సమాచారం కనిపిస్తుంది. మొక్కలు, కూరగాయల పెంపకానికి సంబంధించి వర్క్‌షాప్‌లు కూడా నిర్వహిస్తుంటుంది.

'ఇండోర్‌కు ఎలాంటి మొక్కలు సరిపోతాయి... అనే అంశంపై ఇన్‌స్టాగ్రామ్‌లో ఎన్నో స్టోరీలు చేశాను. ఇండోర్ గార్డెనింగ్ అనేది టఫ్ హాబీ కాదు. మీనియేచర్ ట్రీ గార్డెన్‌లు కూడా పెరుగుతున్నాయి. మొక్కల పెంపకానికి సంబంధించి ప్రాచుర్యంలో ఉన్న కొకేడమ అనే జపనీస్ మెథడ్‌కు ప్రాధాన్యత పెరుగుతోంది. ఇతరులను ఇన్‌స్పైర్ చేయడానికి. తమ పరిసరాలలో పచ్చదనం నింపుకోవడానికి మొక్కలకు సంబంధించిన ఇమేజ్‌లను ఇన్‌స్టాలో పోస్ట్ చేస్తుంటాను' అంటుంది నవీ ముంబైకి చెందిన యాక్టివ్ ప్లాంట్ ఇన్‌ఫ్లుయెన్సర్ సీమా గుప్తా.

'ఎప్పుడైనా ఒత్తిడిగా అనిపిస్తే మొక్కల మధ్య కూర్చుంటాను. ప్రశాంతంగా అనిపిస్తుంది. మొక్కలలో ఏదో శక్తి ఉంది. ప్లాంట్ ఇన్‌ఫ్లుయెన్సర్‌ల సూచనలను ఫాలో అవుతుంటాను' అంటుంది ఢిల్లీకి చెందిన నందిని.

ఇంజినీరింగ్ స్టూడెంట్ అయిన నందినికి మొదట్లో మొక్కల పెంపకంపై అవగాహన లేదు. అయితే ఒక ఇన్‌ఫ్లుయెన్సర్ యూట్యూబ్ వీడియో చూసిన తరువాత వాటిపై ఆసక్తి పెరగడమే కాదు తన స్టడీ రూమ్‌లో రకరకాల మొక్కలను పెంచుతుంది.

'సోషల్ మీడియా ద్వారా యువతరంలో ఇండోర్ గార్డెనింగ్ హాబీ పెరుగుతోంది. ప్లాంట్ ఇన్‌ఫ్లుయెన్సర్‌లలో ఎక్కువమంది తమ వయసు వారే ఉండడంతో సులభంగా కనెక్ట్ అవుతున్నారు' అంటున్నాడు హార్టికల్చరిస్ట్ అండ్ ల్యాండ్‌స్కేప్ డిజైనర్ షాన్ లాల్వానీ.

ఇరవై నాలుగు సంవత్సరాల అన్వేష్ నాయర్ ప్లాంట్ ఇన్‌ఫ్లుయెన్సర్. అతడి గదిలో రకరకాల అందమైన మొక్కలతోపాటు గోడపై ఉన్న అక్షరాలు కూడా ఆకట్టుకుంటాయి.

'నీ గదిలో ఒక్క మొక్క ఉన్నా సరే పదిమంది స్నేహితులు ఉన్నట్లే'

సమాచార కొరత ఉంది

చాలామందికి మొక్కల పెంపకంపై ఆసక్తి ఉన్నా వాటికి సంబంధించి సమాచార కొరత ఉంది. నేను జీవావరణ శాస్త్రం చదువుకోవడంతో మొక్కలు, పర్యావరణ సంబంధిత విషయాలు, మొక్కల పెంపకంలో ఎదురయ్యే సమస్యల నివారణకు మార్గాలను ఇతరులతో పంచుకోవడానికి గార్డెన్ అప్ ఒక వేదిక అయింది. పచ్చటి మొక్కలు పర్యావరణానికి మేలు చేస్తాయి. మానసిక ప్రశాంతత కలిగిస్తాయి

– ఏక్తా చౌధురి, ప్లాంట్ ఇన్‌ఫ్లుయెన్సర్



మానసిక ప్రశాంతత లభిస్తుంది

మొక్కలను చూస్తే ఆత్మీయులను చూసినట్లుగా అనిపిస్తుంది. మానసిక ప్రశాంతత లభిస్తుంది. ఆత్మస్థైర్యం వస్తుంది. మొదట్లో గార్డెనింగ్‌కు సంబంధించి నాకు పెద్దగా తెలియదు. పొరపాట్ల నుంచి ఎన్నో విషయాలు తెలుసుకున్నాను. ప్లాంట్ ఇన్‌ఫ్లుయెన్సర్‌గా నేను నేర్చుకున్న విషయాలను పదిమందితో పంచుకుంటున్నాను.

– రక్షా అగర్వాల్,
ప్లాంట్ ఇన్‌ఫ్లుయెన్సర్



న్యూస్‌మేకర్

అంగారక గ్రహం పై మానవ నివాస యోగ్యత కోసం సాగుతున్న అన్వేషణలో నాసా ప్రయోగించినరోవర్‌ను ఆపరేట్ చేసే మొదటి ఇండియన్‌గా, మొదటి భారతీయ వనితగా ఘనత సాధించింది బెంగళూరుకు చెందిన అక్షత కృష్ణమూర్తి. నాసాలో పని చేయాలనే ఏకైక లక్ష్యంతో అమెరికా వెళ్లిన అక్షత ఈ స్థాయికి ఎదగడానికి కేవలం పట్టుదలే కారణం అంటోంది. తనను చూసి యువత స్ఫూర్తి పొందాలని కోరుతోంది.

మన అంగారక వనిత

దాదాపు కారు సైజులో ఉండి, వెయ్యి కిలోల బరువు ఉండే 'ప్రెజర్వరెన్స్ రోవర్' 2021 ఫిబ్రవరి 18న అంగారక గ్రహం మీద దిగినప్పటి నుంచి శాంపిల్స్ సేకరణకు దాదాపు 21 కిలోమీటర్లు తిరిగిందంటే ఆశ్చర్యమే కదా. 1020 రోజులుగా అది అంగారక తలం మీద పని చేస్తూనే ఉందంటే కారణం భూతలం నుంచి దానిని ఆపరేట్ చేస్తున్న నాసా శాస్త్రవేత్తల మేధో శ్రమే. ఇప్పుడు ఆ మేధోశ్రమలో మన భారతీయురాలు కూడా భాగం అయ్యింది. బెంగళూరుకు చెందిన అక్షత కృష్ణమూర్తి లాస్ ఏంజెలెస్‌లోని నాసా జెట్ ప్రొపల్షన్ లాబొరేటరీ నుంచి ప్రెజర్వరెన్స్ రోవర్‌ను ఆపరేట్ చేయనుంది. ఈ అవకాశం దక్కిన తొలి భారతీయురాలు ఆమె.

చిన్నప్పటి కల

అక్షత కృష్ణమూర్తికి నాసాలో పని చేయాలని చిన్నప్పటి ఉంచి కోరిక. ఇండియాలో చదువుకున్నాక 13 ఏళ్ల క్రితం నాసాలో పని చేయడానికి అమెరికా చేరుకుంది. అయితే భారతీయ పౌరసత్వం కలిగిన ఆమెకు అది అంత సులువుగా సాధ్యమయ్యే పని కాదని మెల్లగా అర్థమైంది. ఎన్నో ప్రయత్నాలు చేసినా ఆమెకు పూర్తి స్థాయి నాసా ఉద్యోగం దొరకలేదు. నాసాలో పని చేసేందుకే మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి ఏరోనాటిక్స్ అండ్ ఆస్ట్రోనాటిక్స్‌లో పీహెచ్‌డీ చేసింది. ఫిబ్రవరి 2020 నుంచి ఆమెకు నాసాలో ఉద్యోగం దొరికింది. నాసా సైంటిస్ట్‌గా ఆమె చూపించిన ప్రతిభ ఆమె అంగారక గ్రహంపై రోవర్‌ను ఆపరేట్ చేసే స్థాయికి చేర్చింది.



గురి చెదరని కృషి

ఈ సందర్భంగా అక్షత ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక స్ఫూర్తినిచ్చే కథనం రాసింది. 'ప్రయత్నిస్తూనే ఉండండి. మీ కలల సాధ్యాసాధ్యాలపై ఎవరు ఏమన్నా లెక్క చేయకండి. మీ పట్ల మీరు నిజాయితీగా ఉండండి. మీ సామర్థ్యాలను విశ్వసించండి. గురి చెదరని కృషి చేసిన వారినే విజయం అనుసరిస్తుంది. నాసాలో శాస్త్రవేత్తను కావడానికి ఎన్నో ఆటంకాలు ఎదుర్కొన్నాను. వంద తలుపులు తట్టాను. చివరకు సాధించాను. నన్ను చూసి స్ఫూర్తి పొందండి. పెద్దకలలు కనడానికి వెరవకండి.' అని రాసిందామె.

ఒక భారతీయ శాస్త్రవేత్త నాసాలో ఇలాంటి గుర్తింపు పొందడం చూసి వేలాది మంది భారతీయులు ఆమెను అభినందనల్లో ముంచెత్తుతున్నారు.



మార్స్‌పై రోవర్

భూమి తరువాత సౌర కుటుంబం మొత్తమ్మీద మనిషి బతికేందుకు కొద్దో గొప్పో అవకాశాలున్న ఏకైక గ్రహం అంగారకుడు. ఈ కారణంగానే మన ఇస్రో సహా అనేక దేశాల అంతరిక్ష పరిశోధన సంస్థలు అరుణగ్రహంపై బోలెడన్ని ప్రయోగాలు చేపడుతున్నాయి. అగ్రరాజ్యం అమెరికాకు చెందిన నాసా దశాబ్దాలుగా అంగారకుడిపై ప్రయోగాలు నిర్వహిస్తూనే ఉంది. 1971లో సోవియట్ యూనియన్ తొలిసారి మార్స్ లాండర్ -2ను ప్రయోగించినా అది ల్యాండయ్యే సమయంలోనే కుప్పకూలిపోయింది. ఆ తరువాత నాసా 1976లో వైకింగ్-2 లాండర్‌ను విజయవంతంగా ప్రయోగించడంతో అంగారకుడిపై మొట్టమొదటి సారి మానవ నిర్మిత యంత్రం ఒకటి దిగినట్లు అయ్యింది. ఆ తరువాతి కాలంలో కొన్ని రోవర్లు, లాండర్లు మార్స్‌పై అడుగుపెట్టాయి. మూడేళ్ల క్రితం నాసా ప్రయోగించిన రోవర్ ప్రిసెర్వరెన్స్, 2020 జూలై 30న నేలపై నుంచి నింగికి ఎగసిన ఈ రోవర్ ప్రధాన ఉద్దేశం అరుణ గ్రహంపై పాతకాలపు సూక్ష్మజీవుల అవశేషాలేమైనా ఉన్నాయా.... పరిశీలించడం. దీంతోపాటే అక్కడి రాతి, మట్టి నమూనాలను సేకరించి వీలైతే భూమికి తిప్పి పంపడం. ఇందుకు తగ్గట్టుగా ఈ రోవర్‌లో పలు శాస్త్ర సంబంధిత పరికరాలను ఏర్పాటు చేశారు. నాసా ప్రిసెర్వరెన్స్ ఏడు నెలల సుదీర్ఘ ప్రయాణం తరువాత 2021 ఫిబ్రవరి 18న అంగారక గ్రహంపైని జెజిరో లోయలో కాలు మోపింది. ఇంకో గ్రహంపై ఎగిరిన తొలి విమానంగా రికార్డు సృష్టించింది కూడా. జెజిరో లోయ ప్రాంతంలో కొన్ని కోట్ల ఏళ్ల క్రితం నీరు ప్రవహించిందని, సరస్సుల్లాంటివి ఉండేవని శాస్త్రవేత్తలు విశ్వసిస్తున్నారు.

ఇంటిప్స్

● సెలెరీని సిల్వర్ ఫాయిల్‌లో చుట్టి రిఫ్రిజిరేటర్‌లో పెడితే రెండు మూడు వారాలపాటు తాజాగా ఉంటుంది.



● మిగిలిపోయిన పాలను ఐస్‌ట్రేలో పోసి ఫ్రీజర్‌లో పెట్టాలి. గడ్డకట్టిన పాల బిళ్లలను టీ కాఫీలలో వాడుకోవచ్చు.



● ఒక్కోసారి క్యారట్‌పైన ఎక్కువగా మట్టి పేరుకుపోతుంటుంది. అటువంటప్పుడు .. స్టీల్ స్క్రబర్‌తో రుద్ది కడిగితే, సులభంగా మట్టి వదులుతుంది.



● టొమాటోలను పసుపు నీళ్లల్లో వేసి పదినిమిషాలు ఉంచాలి. తరువాత కడిగి తుడిచిపెట్టుకుంటే ఎక్కువ రోజులు తాజాగా ఉంటాయి.



● కేక్ మిగిలిపోయినప్పుడు అంచులకిరువైపులా బ్రెడ్‌స్లైసులను పెట్టాలి. స్లైసులు పడిపోకుండా టూత్ పిక్ గుచ్చి, రిఫ్రిజిరేటర్‌లో పెడితే కేక్ పాడవకుండా తాజాగా ఉంటుంది.



అవకాశాలు అందిపుచ్చుకోవాలి!

ఇండియా నుంచి విదేశాల వెళ్లే యువతకు ఉండే అవకాశాలను తెలియజేసేందుకు ఇటీవల బిజినెస్ స్కూల్ 'గ్రాడ్ రైట్' ప్రోగ్రామ్ హైదరాబాద్‌లో జరిగింది. గ్రాడ్యుయేట్స్ తమ ఆసక్తులకు తగిన కోర్సులను ఎంచుకోవడానికి ఏర్పాటు చేసిన కార్యక్రమం ఇది. ఈ కార్యక్రమంలో అమెరికా నుంచి సదరన్ మెథడిస్ట్ యూనివర్శిటీ ప్రతినిధి జెస్సికా పాల్గొన్నారు. గ్లోబల్ హయ్యర్ ఎడ్యుకేషన్ మీద జరిగిన సదస్సుల్లో భాగంగా ఆమె విదేశాలలో యువతకు ఉండే అవకాశాల గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా జెస్సికాతో చిట్‌చాట్.

■ విదేశాలకు వెళ్లే భారతీయ విద్యార్థుల్లో యువతుల సంఖ్య ఎలా ఉంది?

ఒక్క భారతీయ విద్యార్థులు అనే కాదు, మా బిజినెస్ స్కూల్‌కి అన్ని దేశాల నుంచి విద్యార్థులు ఉన్నారు. మహిళలను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో మా స్కూల్ నుంచి కొన్ని ఫౌండేషన్స్ కూడా వర్క్ చేస్తుంటాయి. బిజినెస్ స్కూల్స్‌కి యువకులే కాదు యువతులు కూడా ముందుకు రావాలి అని కూడా చెబుతుంటాం. ఓవరాల్‌గా పర్సెంటేజీ చూస్తే మాత్రం మహిళల శాతం తక్కువే అని చెప్పవచ్చు.

■ విదేశాలకు వచ్చే విద్యార్థులు ఏ కోర్సులను ఎక్కువ ఎంచుకుంటున్నారు?

సదరన్ మెథడిస్ట్ యూనివర్శిటీ నుంచి నేను వర్క్ చేస్తున్నాను. ఇక్కడ ఇంజినీరింగ్, లా, ఎంబీయే ప్రోగ్రామ్స్... వంటివి ఉన్నాయి. వీటిలో ఎంబీయే ప్రోగ్రామ్స్‌లో ఎక్కువమంది విద్యార్థులు కనిపిస్తుంటారు.

■ జెండర్ బేస్డ్‌గా రూల్స్ ఎలా ఉంటాయి?

మాస్టర్స్ ప్రోగ్రామ్‌లలో జెండర్ బేస్డ్ అనేది ఏమీ ఉండదు. చదువుకు సంబంధించి ఆడా–మగ ఇద్దరూ ఒకటే. వారి వారి సమర్థతల మీదనే వారి భవిష్యత్తు ఉంటుంది.

■ జాబ్స్ విషయంలో ఎలా చూస్తారు?

జాబ్స్ విషయంలోనూ అదే విధానం అప్లై అవుతుంది. అయితే, స్టూడెంట్స్ జాబ్స్‌ను ఎంచుకునే విధానం, వ్యక్తిగత ఆసక్తులను బట్టే ఉంటుంది. ముఖ్యంగా స్టూడెంట్స్ సమర్థతపైనే ఆధారపడి ఉంటుంది. ముందస్తుగా మాత్రం స్టూడెంట్ జాబ్స్ మీద యూనివర్శిటీలు అంతగా దృష్టి పెట్టవు. చదువు మీద ఫోకస్ ఉండదని. విద్యార్థుల పని గంటలలో ఒక పరిమితి విధించడానికి కూడా అదే కారణం. లీగల్‌గా అయితే యూనివర్శిటీ క్యాంపస్‌లోనే పనిచేయాలి. ఈ పనుల్లోనూ స్టూడెంట్స్‌కి క్యాంపస్ ప్లేస్‌మెంట్ ఇస్తుంది. ప్రతి డిపార్ట్‌మెంట్‌కు ఆ జాబ్స్‌కు కూడా డిఫరెంట్‌గా ఉంటాయి. లైబ్రరీలు, కెఫ్టేరియాలు.. వంటివి. ఇక్కడ కూడా జాబ్స్ లిమిటెడ్‌గానే ఉంటాయి. సెర్చ్ చేస్తూ ఉండాలి. ఎవరికి వారు అవకాశాలను అందిపుచ్చుకుంటూ ఉండాలి. ఒకసారి యూనివర్శిటీలోకి అడుగుపెట్టామంటే.. ప్రతిరోజూ కనుక్కుంటూనే ఉండాలి.



జెస్సికా

■ ఇక్కడ నుంచి వెళ్లే విద్యార్థులకు మీరెలాంటి సలహా ఇస్తారు?

అండర్ గ్రాడ్యుయేషన్ కోర్స్ ఏది చేసినా విదేశాలలో పై చదువులకు ఇప్పుడు అవకాశాలు మెరుగ్గా ఉన్నాయి. అయితే, రూల్స్ అండ్ రెగ్యులేషన్స్‌ను బట్టి అప్లై చేసుకోవాలి. విదేశాలకు వెళ్లే విద్యార్థులు చదువుతోపాటు మరో రెండు విషయాలపై ఫోకస్ పెట్టాలి. ఒకటి యూనివర్శిటీకి కట్టే ఫీజు, రెండు బతకడానికి కావల్సిన అమౌంట్. విదేశాల్లో చదువు పూర్తయ్యాక కూడా ఆ తర్వాత మూడేళ్ల వరకు జాబ్‌కు ప్రయత్నం చేయవచ్చు. అయితే, మూడు నాలుగు నెలల్లో ఓపీటీ ని కన్ఫర్మ్ చేసుకోవాలి. ఈ మధ్య చాలామంది ఒత్తిడిని ఎదుర్కొనేవారుంటారు. ఇదంతా ఫోకస్డ్‌గా ఉంటే సమస్య రాదు'' అని చెప్పుకొచ్చారు జెస్సికా.

– నిర్మలారెడ్డి



అశ్విని-తనీషా జోడీ ర్యాంక్‌లో పురోగతి

ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) మహిళల డబుల్స్ ర్యాంకింగ్స్‌లో అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో (భారత్) జోడీ పురోగతి సాధించింది. తాజా ర్యాంకింగ్స్‌లో అశ్విని-తనీషా ద్వయం నాలుగు స్థానాలు మెరుగుపర్చుకొని 28వ ర్యాంక్‌కు చేరుకుంది. గతవారం లక్నోలో జరిగిన సయ్యద్ మోడి ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీలో అశ్విని-తనీషా జోడీ రన్నరప్‌గా నిలిచింది.

న్యూజిలాండ్‌పై పాక్ తొలిసారి సిరీస్ సొంతం

సమష్టి ప్రదర్శనతో పాకిస్తాన్ మహిళల క్రికెట్ జట్టు తొలిసారి న్యూజిలాండ్ జట్టుపై టి20 సిరీస్‌ను సొంతం చేసుకుంది. డ్యూనెడిన్‌లో జరిగిన రెండో మ్యాచ్‌లో పాక్ పది పరుగులతో నెగ్గి మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-0తో దక్కించుకుంది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అలియా రియాజ్ (32 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్), మునీబా అలీ (35; 6 ఫోర్లు) రాణించడంతో... పాక్ 6 వికెట్లకు 137 పరుగులు చేసింది. అనంతరం న్యూజిలాండ్ 7 వికెట్లకు 127 పరుగులకే పరిమితమైంది.



యువ భారత్ శుభారంభం

- దక్షిణ కొరియాపై 4-2తో విజయం
- అరైజీత్ సింగ్ 'హ్యాట్రిక్'



కౌలాలంపూర్: జూనియర్ పురుషుల అండర్-21 ప్రపంచకప్ హాకీ టోర్నమెంట్‌లో మాజీ చాంపియన్ భారత జట్టు శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన పూల్ 'సి' తొలి మ్యాచ్‌లో టీమిండియా 4-2 గోల్స్ తేడాతో దక్షిణ కొరియాను ఓడించింది. భారత్ తరఫున అరైజీత్ సింగ్ హుండల్ మూడు గోల్స్‌తో 'హ్యాట్రిక్' సాధించాడు. అరైజీత్ 11వ, 16వ, 41వ నిమిషాల్లో గోల్స్ చేశాడు. మరో గోల్‌ను అమన్‌దీప్ (30వ ని.లో) సాధించాడు. కొరియా తరఫున డోహున్ లిమ్ (38వ ని.లో), మిన్‌క్వాన్ కిమ్ (45వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. రేపు జరిగే రెండో లీగ్ మ్యాచ్‌లో స్పెయిన్‌తో భారత్ ఆడుతుంది. మంగళవారమే జరిగిన ఇతర లీగ్ మ్యాచ్‌ల్లో ఫ్రాన్స్ 3-1తో ఈజిప్ట్‌పై, జర్మనీ 5-3తో దక్షిణాఫ్రికాపై, స్పెయిన్ 7-0తో కెనడాపై, అర్జెంటీనా 1-0తో ఆస్ట్రేలియాపై, మలేసియా 7-1తో చిలీపై గెలుపొందాయి.

సమరానికి సై...

- నేడు ఇంగ్లండ్ మహిళల జట్టుతో భారత్ తొలి టి20 మ్యాచ్
- రాత్రి 7 గంటల నుంచి 'స్పోర్ట్స్-18'లో ప్రత్యక్ష ప్రసారం

ముంబై: భారత పురుషుల జట్టు ఇటీవల పొట్టి ఫార్మాట్‌లో ఆస్ట్రేలియాపై అదరగొట్టింది. ఇప్పుడు భారత మహిళల జట్టు కూడా అలాంటి ప్రదర్శనే ఇచ్చేందుకు ఇంగ్లండ్‌తో టి20 సమరానికి సిద్ధమైంది. మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో భాగంగా బుధవారం ఇక్కడి వాంఖెడె స్టేడియంలో తొలి మ్యాచ్ జరుగుతుంది. ఈ ఏడాది హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం ప్రత్యేకించి టి20 ఫార్మాట్‌లో రాణించింది. ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకం సహా... బంగ్లాదేశ్ గడ్డపై 2-1తో సిరీస్‌ను కైవసం చేసుకుంది. సఫారీ గడ్డపై జరిగిన ముక్కోణపు టి20 సిరీస్‌లోనూ భారత మహిళల జట్టు మెరుగ్గా రాణించి ఫైనల్లో రన్నరప్‌గా సంతృప్తి పడింది. అక్కడే జరిగిన టి20 ప్రపంచకప్‌లో ఒకే గ్రూప్‌లో ఉన్న భారత్, ఇంగ్లండ్ సెమీఫైనల్ చేరాయి. కానీ ప్రత్యర్థుల చేతిలో ఇరు జట్లు ఓటమి చవిచూశాయి. గతంలో కంటే మెరుగ్గా కనిపిస్తున్న భారత జట్టు ఇప్పుడు ఇంగ్లండ్‌తో పేలవమైన గత రికార్డును మరిచేలా చక్కని ప్రదర్శన ఇవ్వాలనే పట్టుదలతో ఉంది. ఐసీసీ టి20 ర్యాంకుల్లో నాలుగో స్థానంలో ఉన్న భారత్ తమ సొంతగడ్డపై ఇంగ్లండ్‌తో తొమ్మిది టి20 మ్యాచ్‌లాడితే కేవలం రెండు మ్యాచ్‌ల్లోనే నెగ్గింది. మరోవైపు రెండో ర్యాంకులో ఉన్న ఇంగ్లండ్ జట్టు 1-2తో శ్రీలంక చేతిలో ఓడింది. ఈ అనుకూలతలను వినియోగించుకొని ఫామ్‌లో ఉన్న హర్మన్ బృందం ఈ సిరీస్‌లో గట్టి సవాల్ విసిరేందుకు సన్నద్ధమైంది. పురుషులతో పోల్చితే పరిమిత సంఖ్యలో జరిగే మ్యాచ్‌లతో అమ్మాయిల జట్టు... వచ్చే ఏడాది బంగ్లాదేశ్ ఆతిథ్యమిచ్చే టి20 ప్రపంచకప్‌కు మేటి జట్టుగా బరిలోకి దిగాలని ఆశిస్తోంది. ఓపెనర్ స్మృతి మంధాన, టాపార్డర్‌లో జెమీమా రోడ్రిగ్స్, మిడిలార్డర్‌లో హర్మన్‌ప్రీత్ ఫామ్‌లో ఉన్నారు. బౌలింగ్‌లో దీప్తి శర్మ, పూజ వస్త్రకర్ నిలకడగా రాణిస్తున్నారు.



పిచ్, వాతావరణం

వాంఖెడె వికెట్ బ్యాటింగ్‌కు అనుకూలిస్తుంది. తూర్పు తీరాన్ని తుఫాను వణికిస్తున్నా... ముంబైలో ఆ బెడద లేదు. మ్యాచ్‌కు వర్షం ముప్పు లేదు. ఈ సిరీస్‌లోని మూడు మ్యాచ్‌లను తిలకించేందుకు ప్రేక్షకులకు ఉచితంగా మైదానంలోకి అనుమతి ఇస్తున్నారు.

27 ఓవరాల్‌గా భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య ఇప్పటి వరకు 27 టి20 మ్యాచ్‌లు జరిగాయి. 7 మ్యాచ్‌ల్లో భారత్ గెలుపొందగా... 20 మ్యాచ్‌ల్లో ఇంగ్లండ్ విజయం సాధించింది. భారత్‌లో ఈ రెండు జట్ల మధ్య తొమ్మిది మ్యాచ్‌లు జరిగాయి. 2 మ్యాచ్‌ల్లో టీమిండియా, 7 మ్యాచ్‌ల్లో ఇంగ్లండ్ గెలిచాయి.

గుజరాత్ జెయింట్స్ జోరు



అహ్మదాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో గుజరాత్ జెయింట్స్ జట్టు విజయపరంపర కొనసాగుతోంది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్ 39-37తో మాజీ చాంపియన్ యు ముంబా జట్టును ఓడించింది. ఈ లీగ్‌లో గుజరాత్‌కిది వరుసగా మూడో విజయం కావడం విశేషం. రెయిడర్ సోనూ జగ్లాన్ 11 పాయింట్లు స్కోరు చేసి గుజరాత్ గెలుపులో కీలకపాత్ర పోషించాడు. రాకేశ్ (9 పాయింట్లు), రోహిత్ గులియా (7 పాయింట్లు) కూడా రాణించారు. యు ముంబా తరఫున గుమన్ సింగ్, అమీర్ మొహమ్మద్ పది పాయింట్ల చొప్పున స్కోరు చేసినా కీలకదశలో గుజరాత్ జెయింట్స్ ఆటగాళ్లు పైచేయి సాధించారు. నేడు జరిగే మ్యాచ్‌ల్లో తెలుగు టైటాన్స్‌తో పట్నా పైరేట్స్; యూపీ యోధాస్‌తో హరియాణా స్టీలర్స్ తలపడతాయి.

ప్రొ కబడ్డీ లీగ్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	టై	పా
గుజరాత్ జెయింట్స్	3	3	0	0	15
యు ముంబా	2	1	1	0	6
తమిళ్ తలైవాస్	1	1	0	0	5
పుణేరి పల్టన్	1	1	0	0	5
బెంగాల్ వారియర్స్	1	1	0	0	5
బెంగళూరు బుల్స్	2	0	2	0	2
యూపీ యోధాస్	1	0	1	0	1
జైపూర్ పింక్ పాంథర్స్	1	0	1	0	1
తెలుగు టైటాన్స్	1	0	1	0	1
దబంగ్ ఢిల్లీ	1	0	1	0	0

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు

భారత్ 'పంచ్' పవర్


నిషా


ఆకాంక్ష


పాయల్

- మూడు స్వర్ణాలు సహా మొత్తం 17 పతకాలు సొంతం
- ప్రపంచ జూనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్

యెరెవాన్ (అర్మేనియా): అంతర్జాతీయ వేదికపై మరోసారి భారత బాక్సర్లు తమ పంచ్ పవర్‌ను చాటుకున్నారు. అర్మేనియాలో ముగిసిన ప్రపంచ జూనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో మహిళల, పురుషుల విభాగాల్లో కలిసి భారత్ ఖాతాలో మొత్తం 17 పతకాలు చేరాయి. ఇందులో మూడు స్వర్ణాలు, తొమ్మిది రజతాలు, ఐదు కాంస్య పతకాలు ఉన్నాయి. చివరిరోజు భారత్‌కు మూడు పసిడి పతకాలు, ఆరు రజత పతకాలు లభించాయి. మూడు స్వర్ణాలూ మహిళా బాక్సర్లే నెగ్గడం విశేషం. పాయల్ (48 కేజీలు), నిషా (52 కేజీలు), ఆకాంక్ష (70 కేజీలు) బంగారు పతకాలు సొంతం చేసుకున్నారు. ఫైనల్స్‌లో పాయల్ 5-0తో హెజినె పెట్రోసియాన్ (అర్మేనియా)పై, నిషా 5-0తో ఫరినోజ్ అబ్దుల్లాఇవా (తజికిస్తాన్)పై, ఆకాంక్ష 5-0తో తైమజోవా ఎలిజవెటా (రష్యా)పై విజయం సాధించారు. ఇతర ఫైనల్స్‌లో వినీ (57 కేజీలు) 0-5తో మమతోవా సెవర (ఉజ్బెకిస్తాన్) చేతిలో... సృష్టి (63 కేజీలు) 0-5తో సియోభ్రా లాలెస్ (ఐర్లాండ్) చేతిలో... అనా బుజులెవా (రష్యా) చేతిలో నాకౌట్ అయిన మేఘ (80 కేజీలు) ఫైనల్లో ఓడిపోయి రజత పతకాలు దక్కించుకున్నారు. పురుషుల విభాగంలో సాహిల్ (75 కేజీలు), హేమంత్ సాంగ్వాన్ (ప్లస్ 80 కేజీలు), జతిన్ (54 కేజీలు) ఫైనల్లో పరాజయం చవిచూసి రజత పతకాలు గెల్చుకున్నారు. సాహిల్ 0-5తో అల్బెర్ట్ హరుతిన్యాన్ (అర్మేనియా) చేతిలో... హేమంత్ 0-5తో సలిఖోవ్ (ఉజ్బెకిస్తాన్) చేతిలో... జతిన్ 1-4తో తులెబెక్ (కజకిస్తాన్) చేతిలో ఓడిపోయారు.

రాహుల్ సింగ్ మెరుపు శతకం

- 56 బంతుల్లో 10 ఫోర్లు, 7 సిక్స్‌లతో 105 పరుగులు చేసిన కెప్టెన్
- ఐదు వికెట్లు తీసిన కార్తికేయ
- చివరి లీగ్ మ్యాచ్‌లో మేఘాలయపై హైదరాబాద్ ఘన విజయం

జైపూర్: విజయ్ హజారే ట్రోఫీ దేశవాళీ వన్డే క్రికెట్ టోర్నమెంట్‌ను హైదరాబాద్ జట్టు విజయంతో ముగించింది. మేఘాలయ జట్టుతో మంగళవారం జరిగిన గ్రూప్ 'బి' చివరి లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ తొమ్మిది వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. టాస్ గెలిచిన హైదరాబాద్ ఫీల్డింగ్ ఎంచుకోగా... ముందుగా బ్యాటింగ్‌కు దిగిన మేఘాలయ 41.1 ఓవర్లలో 158 పరుగులకు ఆలౌటైంది. కార్తికేయ కక్ 36 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టి మేఘాలయను కట్టడి చేశాడు. రోహిత్ రాయుడు రెండు వికెట్లు తీశాడు. అనంతరం హైదరాబాద్ కేవలం 18.4 ఓవర్లలో ఒక వికెట్ నష్టపోయి 161 పరుగులు సాధించి గెలిచింది. కెప్టెన్ గహ్లోత్ రాహుల్ సింగ్ (56 బంతుల్లో 105 నాటౌట్; 10 ఫోర్లు, 7 సిక్స్‌లు) అజేయ మెరుపు శతకం సాధించి హైదరాబాద్ విజయంలో కీలకపాత్ర పోషించాడు.


రాహుల్


కార్తికేయ

రోహిత్ రాయుడు (0) డకౌట్‌కాగా... మరో ఓపెనర్ తన్మయ్ అగర్వాల్ (54 బంతుల్లో 49 నాటౌట్; 8 ఫోర్లు)తో కలిసి రాహుల్ సింగ్ రెండో వికెట్‌కు అజేయంగా 159 పరుగులు జోడించాడు. ఎనిమిది జట్లున్న గ్రూప్ 'బి'లో హైదరాబాద్ తమ ఏడు మ్యాచ్‌లను పూర్తి చేసుకుంది. నాలుగు మ్యాచ్‌ల్లో గెలిచి, మూడు మ్యాచ్‌ల్లో ఓడిన హైదరాబాద్ 16 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచి నాకౌట్ దశకు అర్హత సాధించడంలో విఫలమైంది. గ్రూప్ 'డి'లో పోటీపడ్డ ఆంధ్ర జట్టు ఆరు పాయింట్లతో ఐదో స్థానంలో నిలిచింది. మంగళవారంతో విజయ్ హజారే ట్రోఫీ లీగ్ దశ మ్యాచ్‌లు ముగిశాయి. హరియాణా, రాజస్తాన్, విదర్భ, కర్ణాటక, ముంబై, తమిళనాడు జట్లు నేరుగా క్వార్టర్ ఫైనల్ చేరుకున్నాయి. మిగిలిన రెండు క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ల కోసం ఈనెల 9న ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో బెంగాల్‌తో గుజరాత్; కేరళతో మహారాష్ట్ర తలపడతాయి. ఈ మ్యాచ్‌ల్లో నెగ్గిన రెండు జట్లు క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశిస్తాయి.

శివాంశిక గెలుపు

సాక్షి, హైదరాబాద్: జాతీయ అండర్-13 చెస్ చాంపియన్‌షిప్ బాలికల విభాగంలో తెలంగాణ అమ్మాయి శివాంశిక వరుసగా మూడో విజయం సాధించింది. మంగళవారం జరిగిన రెండో గేమ్‌లో ధనుష్క (కర్ణాటక)పై, మూడో గేమ్‌లో ప్రియదర్శిని (ఒడిశా)పై శివాంశిక గెలిచింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నీనా గోర్లి, ఆముక్త, గ్రావ్యశ్రీ కూడా వరుసగా మూడు విజయాలు నమోదు చేశారు. ఓపెన్ విభాగంలో కొల్లా భావన్ కూడా వరుసగా మూడు విజయాలతో 'హ్యాట్రిక్' సాధించాడు.

సినిమా

కేరళకు గుంటూరు కారం


● మహేశ్‌బాబు

కేరళకు ప్రయాణం కానున్నారు మహేశ్‌బాబు. 'అతడు', 'ఖలేజా' చిత్రాల తర్వాత హీరో మహేశ్‌బాబు, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'గుంటూరు కారం'. శ్రీ లీల, మీనాక్షీ చౌదరి హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో మొదలైన ఈ సినిమా తాజా షూటింగ్ షెడ్యూల్ ముగిసిందని తెలిసింది. కొన్ని కీలక సన్నివేశాలతో పాటు మహేశ్‌బాబు, మీనాక్షీ చౌదరి కాంబినేషన్‌లో ఓ పాటను చిత్రీకరించారని సమాచారం. కాగా 'గుంటూరు కారం' నెక్ట్స్ షెడ్యూల్ చిత్రీకరణ కేరళలో ఆరంభం కానుందట. కొంత టాకీ పార్టుతో పాటు మహేశ్‌బాబు, శ్రీలీల కాంబినేషన్‌లో ఓ సాంగ్‌ను ప్లాన్ చేసిందట యూనిట్. నాన్‌స్టాప్‌గా షూటింగ్ జరిపి, ఈ నెలాఖరుకల్లా సినిమాని పూర్తి చేయాలనుకుంటున్నారట. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై సూర్యదేవర రాధాకృష్ణ నిర్మిస్తున్న 'గుంటూరు కారం' సినిమా జనవరి 12న విడుదల కానుంది.

కాలర్ ఎగరేసుకుని బయటకు వస్తారు

\- నితిన్


● సుధాకర్ రెడ్డి, వక్కంతం వంశీ, నితిన్, శ్రీ లీల, రాజశేఖర్, నిఖితా రెడ్డి

''ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్' సినిమాలో నేను ఎక్స్‌ట్రార్డినరీ మ్యాన్. కానీ రియల్ లైఫ్‌లో శ్రీ లీల ఎక్స్‌ట్రార్డినరీ ఉమెన్. ఎందుకంటే వ్యక్తిగతంగా తను డాక్టర్. అలాగే స్విమ్మింగ్, హాకీ, కూచిపూడి, భరతనాట్యం, వీణ.. ఇలా ఎన్నో ప్రతిభలు ఉన్నాయి. ఇక సినిమాల్లో మంచి యాక్టర్, డ్యాన్సర్. నాకు, దర్శకుడు వంశీకి ఈ చిత్రం చాలా ముఖ్యం. ఈ మూవీ పెద్ద హిట్ అవ్వాలి.. నిర్మాతలకు లాభాలు రావాలి. సినిమా చూసిన నా అభిమానులు, ప్రేక్షకులు కాలర్ ఎగరేసుకుని థియేటర్ నుంచి బయటకు వస్తారు'' అని హీరో నితిన్ అన్నారు. వక్కంతం వంశీ దర్శకత్వంలో నితిన్, శ్రీ లీల జంటగా నటుడు రాజశేఖర్ కీలక పాత్రలో నటించిన చిత్రం 'ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్'. రాజ్‌కుమార్ ఆకెళ్ల సమర్పణలో ఎన్. సుధాకర్ రెడ్డి, నిఖితా రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 8న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో నితిన్ మాట్లాడుతూ- ''ఇప్పటి వరకు నేను చేయని పాత్రని ఈ చిత్రంలో ఇచ్చిన వక్కంతం వంశీకి థ్యాంక్స్. రాజశేఖర్‌గారు హీరోగా చేసిన 'మగాడు' సినిమాతో మా నాన్న (సుధాకర్ రెడ్డి) డిస్ట్రిబ్యూషన్ ఆరంభించారు. ఆ సినిమా హిట్ అవడం వల్లే నాన్న ఇండస్ట్రీలో ఉన్నారు.. ఆయన ఇండస్ట్రీలో ఉన్నారు కాబట్టే నేను హీరోగా ఉన్నాను. రాజశేఖర్ గారు లేకపోతే 'ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్' లేదు'' అన్నారు. ''ఈ చిత్రం సూపర్ హిట్ కాబోతోంది. అందరం సక్సెస్ మీట్‌లో కలుద్దాం'' అని సుధాకర్ రెడ్డి, నిఖితా రెడ్డి అన్నారు. వక్కంతం వంశీ మాట్లాడుతూ- ''ప్రతి విషయంలో నాకు తోడుగా ఉన్న నితిన్, సుధాకర్ రెడ్డిగార్లకు థ్యాంక్స్. రాజశేఖర్‌గారు లేకుంటే ఈ సినిమాని ఊహించుకునేవాణ్ని కాదు. ఈ మూవీతో రెండున్నర గంటల సేపు కుటుంబాన్ని కడుపుబ్బా నవ్విస్తాం'' అన్నారు. ''ఈ చిత్రంలో నాది అతిథి పాత్ర. నా క్యారెక్టర్ ప్రేక్షకులకు నచ్చుతుంది'' అన్నారు డా. రాజశేఖర్. ''ఈ సినిమా అందర్నీ నవ్విస్తుంది.. థియేటర్లో చూసి ఎంజాయ్ చేయండి'' అన్నారు శ్రీలీల.

ప్రతి సినిమా ఓ పరీక్ష

\- హేషమ్ అబ్దుల్ వాహబ్



''ఈ ఏడాది నేను సంగీతం అందించిన 'ఖుషి', 'స్పార్క్' చిత్రాలు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. ఇప్పుడు 'హాయ్ నాన్న' రాబోతోంది. ప్రతి సినిమా నాకో పరీక్ష.. ఓ లెర్నింగ్ ఎక్స్‌పీరియన్స్.. ఇక సంగీత దర్శకుడిగా 'హాయ్ నాన్న' నన్ను నేను కొత్తగా ఆవిష్కరించుకోవడానికి తోడ్పడింది'' అన్నారు హేషమ్ అబ్దుల్ వహాబ్. నాని, మృణాల్ ఠాకూర్ హీరో హీరోయిన్లుగా శ్రుతీహాసన్, బాల నటి కియారా ఖన్నా కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'హాయ్ నాన్న'. మోహన్ చెరుకూరి, డా. విజయేందర్ రెడ్డి తీగల నిర్మించిన ఈ చిత్రం రేపు రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా మంగళవారం విలేకర్ల సమావేశంలో హేషమ్ అబ్దుల్ వాహబ్ చెప్పిన విశేషాలు.


● ఇటీవల నేను సంగీతం అందించిన సినిమాల్లో ప్రేమకథలే ఎక్కువ. అబ్బాయి, అమ్మాయిల మధ్య ఉండే ప్రేమకథలు ఒకే విధంగా ఉంటాయి. అయితే ఆ కథను దర్శకుడు ఎంత కొత్తగా చూపించారు? అన్నది ముఖ్యం. అలాగే ప్రేమ పాటలు కూడా. ఆ పాటలను ఎవరు పాడారు? ఏ సందర్భంలో పాడారు? ఎలాంటి సాహిత్యం ఉంది? అన్న అంశాలతో కొత్త క్రియేషన్ ఉంటుంది. ఇప్పుడు ఆడియన్స్ చాలా అప్‌డేటెడ్‌గా ఉంటున్నారు. నా మలయాళ సినిమా 'హృదయం'లోని 'దర్శన..', 'హాయ్ నాన్న'లోని 'సమయమా..' పాటలకు శ్రోతలు పోలిక పెడుతున్నారు. అయితే 'దర్శన..' కంటే 'సమయమా..'లో క్లాసిక్ కంపోజిషన్ ఎక్కువగా ఉంటుంది. అయినా.. ఈ రెండు పాటలు నావే. రెండూ వైరల్ అయ్యాయి (నవ్వుతూ). ● 'హాయ్ నాన్న' సాఫ్ట్ రొమాంటిక్ మూవీ. సంగీతం కూడా అంతే సాఫ్ట్‌గా చేశాం. 'సమయమా'.., 'గాజుబొమ్మ', 'అమ్మాడి..' ఇలా సినిమాలోని ప్రతి పాటకూ ప్రాముఖ్యత ఉంది. కథలో ఓ పెద్ద పార్టీలో భాగంగా 'ఓడియమ్మ..' పాట వస్తుంది. ఈ పాటలను శౌర్యువ్ ఆవిష్కరించిన తీరు నన్ను సర్‌ప్రైజ్ చేసింది. ● దాదాపు 40 రోజుల పాటు 15 మంది మ్యుజిషియన్స్‌తో హైదరాబాద్‌లోనే 'హాయ్ నాన్న' కోసం పని చేశాం. మరో 20 మందికి పైగా మ్యూజిక్ ప్లేయర్స్ పాల్గొన్నారు. నిర్మాతలు ఎక్కడా రాజీ పడలేదు. అలాగే ఆర్ఆర్ కోసం ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) టెక్నాలజీని వాడాం. ఈ తరహాలో ఆర్ఆర్ చేసిన తొలి ఇండియన్ సినిమా 'హాయ్ నాన్న' కావొచ్చేమో. ప్రస్తుతం తెలుగులో రష్మికా మందన్నా 'ది గర్ల్‌ఫ్రెండ్', శర్వానంద్‌గారి సినిమాలకు సంగీతం అందిస్తున్నాను.


● సాయి పల్లవి

యశ్‌కు జోడీగా..?

కన్నడ స్టార్ హీరో, 'కేజీఎఫ్' ఫేమ్ యశ్‌కు జోడీగా సాయిపల్లవి నటించనున్నారనే టాక్ శాండిల్‌వుడ్‌లో వినిపిస్తోంది. యశ్ హీరోగా కేవీఎన్ ప్రొడక్షన్స్ ఓ సినిమాను నిర్మించనున్న సంగతి తెలిసిందే. 'కేజీఎఫ్: చాప్టర్-1', 'కేజీఎఫ్: చాప్టర్-2' చిత్రాల తర్వాత యశ్ చేయనున్న ఈ సినిమాకు ఎవరు దర్శకత్వం వహిస్తారనే అంశంపై సర్వత్రా ఆసక్తి నెలకొని ఉంది. కాగా మలయాళ దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తారని, ఈ చిత్రంలో సాయి పల్లవి హీరోయిన్‌గా నటిస్తారనే టాక్ ప్రచారంలోకి వచ్చింది. ఈ నెల 8న ఈ సినిమాకి సంబంధించిన వివరాలు అధికారికంగా రానున్నాయి. మరి.. ఈ చిత్రానికి దర్శకురాలిగా గీతూ మోహన్‌దాస్, హీరోయిన్‌గా సాయిపల్లవి పేర్లే ఖరారు అవుతాయా? వేచి చూడాల్సిందే.

లీడర్ మీనల్ రాథోడ్


● దీపికా పదుకోన్

హృతిక్ రోషన్, దీపికా పదుకోన్ హీరో హీరోయిన్లుగా అనిల్ కపూర్ కీలక పాత్రలో నటించిన చిత్రం 'ఫైటర్'. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా జనవరి 25న విడుదల కానుంది. ఈ సినిమాలో స్క్వాడ్రన్ లీడర్ మీనల్ రాథోడ్ పాత్రలో దీపికా పదుకోన్ నటించినట్లుగా వెల్లడించి, ఆమె లుక్‌ను మంగళవారం విడుదల చేశారు. ఇక స్క్వాడ్రన్ లీడర్ షంషేర్ పఠానియా పాత్రలో నటించారు హృతిక్ రోషన్. భారత వైమానిక దళం నేపథ్యంలో 'ఫైటర్' సినిమా కథనం సాగుతుంది.

రీల్స్

ఆడు మచ్చా...


● రవితేజ

రవితేజ హీరోగా నటించిన యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'ఈగల్'. ఇందులో అనుపమా పరమేశ్వరన్, కావ్యా థాపర్ హీరోయిన్లుగా, నవదీప్, మధుబాల కీలక పాత్రల్లో నటించారు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం జనవరి 13న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాలోని 'ఆడు మచ్చా..' పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు. దావ్‌జాంద్ స్వరకల్పనలో కల్యాణ చక్రవర్తి సాహిత్యం అందించిన ఈ పాటను రాహుల్ సిప్లిగంజ్ పాడారు. ''రవితేజ మల్టీషేడ్స్‌లో నటించిన చిత్రం ఇది. ఓ గ్రామీణ పండగ నేపథ్యంలో 'ఆడు మచ్చా..' పాట వస్తుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సహ-నిర్మాత: వివేక్ కూచిభొట్ల.

ఆకాశంలోకి ఎగరాలి


● తాప్సీ, షారుక్ ఖాన్

హీరో షారుక్ ఖాన్, దర్శకుడు రాజ్‌కుమార్ హిరాణి కాంబినేషన్‌లో రూపొందిన సినిమా 'డంకీ'. తాప్సీ హీరోయిన్‌గా నటించారు. ఈ నెల 21న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా 'డంకీ' డ్రాప్ 4' అంటూ ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఐదుగురు స్నేహితులు లండన్ వెళ్లే నేపథ్యంలో 'డంకీ' ఉంటుంది. 'శతాబ్దాలుగా బ్రిటిష్ వాళ్లు మనల్ని పరిపాలించారు. వాళ్లు ఇక్కడికి వచ్చినప్పుడు మనం అడగలేదు... మీకు హిందీ వచ్చా? అని. మనం వారిని ఆపలేదు. అలాంటప్పుడు మనల్ని ఆపడానికి వారికి ఎంత ధైర్యం?' అంటూ షారుక్ చెప్పిన డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి. ''ఎమోషనల్ రోలర్ కోస్టర్‌లో ప్రయాణించడానికి సిద్ధంగా ఉండండి. మీ కలలు విమానాల్లా ఆకాశంలోకి ఎగరాలి. స్నేహం విరబూయాలి'' అని యూనిట్ పేర్కొంది.

విప్లవ వీరుడు వస్తున్నాడు


● సభావత్

క్యూబా పోరాట యోధుడు చేగువేరా జీవితం ఆధారంగా రూపొందిన చిత్రం 'చే'. బీఆర్ సభావత్ నాయక్ టైటిల్ రోల్ పోషించి, దర్శకత్వం వహించారు. లావణ్య సమీర, పూల సిద్ధేశ్వర్, కార్తీక్ నూనె, వినోద్, పసల ఉమా మహేశ్వర్ కీలక పాత్రధారులు. సూర్య, బాబు, దేవేంద్ర నిర్మించిన ఈ సినిమా ఈ నెల 15న విడుదల కానుంది. సభావత్ నాయక్ మాట్లాడుతూ- ''విప్లవ వీరుడు చేగువేరా జీవిత చరిత్రను సినిమాగా తెరకెక్కించినందుకు గర్వంగా ఉంది. క్యూబా తర్వాత ప్రపంచంలోనే తొలిసారి భారతీయ చిత్ర పరిశ్రమలో రూపొందిన చేగువేరా బయోపిక్ ఇది. ఆయన చేసిన పోరాటాలు, త్యాగాలను ఈ చిత్రంలో చూపించాం. వీరాంజనేయ పిక్చర్స్ ద్వారా 100కుపైగా థియేటర్స్‌లో మా సినిమా రిలీజ్ కానుంది'' అన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)			
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲	నాస్‌డాక్	14,220	▲	35
431	169	డోజోన్స్	36,103	▼	102
69,296	20,855	ఎఫ్‌టీఎస్ఈ 100	7,490	▼	23
		డాక్స్	16,533	▼	128
		షాంఘై	2,972	▼	51
		నికాయ్	33,776	▼	455

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి
•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) — ముంబై

బంగారం (24 క్యారెట్) 62,287	▼	994
బంగారం (22 క్యారెట్) 62,038	▼	990
వెండి (కేజీ) 71,576	▼	2,047

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.63	84.30
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	103.73	107.17
€	యూరో	ఎస్‌బీఐ	88.94	92.08
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.84	57.58
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.87	56.20
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	61.38	63.37
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.28	22.90
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.80	23.60
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.55	12.63

అదానీ గ్రూప్ చేతికి సంఘీ ఇండస్ట్రీస్

సవరించిన ధరతో కొనుగోలు ప్రక్రియ పూర్తి



న్యూఢిల్లీ: సంఘీ ఇండస్ట్రీస్ (ఎస్ఐఎల్) కొనుగోలు ప్రక్రియ పూర్తయినట్లు అదానీ గ్రూప్‌లో భాగమైన అంబుజా సిమెంట్స్ (ఏసీఎల్) వెల్లడించింది. షేరు ఒక్కింటికి రూ. 121.90 చొప్పున సవరించిన ధర మేరకు కొనుగోలు చేసినట్లు వివరించింది. గతంలో ఎస్ఐఎల్‌లో పబ్లిక్ షేర్‌హోల్డర్లకు ఉన్న 26 శాతం వాటాల కోసం కంపెనీ రూ. 114.22 రేటును ఆఫర్ చేసింది. ఎస్ఐఎల్ విలువను రూ. 5,185 కోట్లుగా లెక్కగట్టి దక్కించుకున్నట్లు ఏసీఎల్ తెలిపింది. సంఘీ ఇండస్ట్రీస్‌లో తమకు నియంత్రణాధికారాలతో 54.51 శాతం వాటాలు లభించినట్లు వివరించింది. దేశీ సిమెంటు పరిశ్రమలో తమ స్థానాన్ని పటిష్టపర్చుకునేందుకు ఈ డీల్ ఉపయోగపడుతుందని అదానీ గ్రూప్ సిమెంట్ వ్యాపార విభాగం సీఈవో అజయ్ కపూర్ తెలిపారు.

74.6 ఎంటీపీఏకి ఉత్పత్తి సామర్థ్యాలు

ఎస్ఐఎల్‌కు గుజరాత్‌లోని సంఘీపురంలో 2,700 హెక్టార్లలో క్లింకర్, సిమెంటు సమగ్ర తయారీ యూనిట్ ఉంది. ఇందులో 6.6 ఎంటీపీఏ క్లింకర్ ఉత్పత్తికి రెండు బట్టీలు, 6.1 ఎంటీపీఏ సిమెంటు గ్రైండింగ్ యూనిట్, 13 మెగావాట్ల క్యాప్టివ్ విద్యుదుత్పత్తి ప్లాంటు మొదలైనవి ఇందులో ఉన్నాయి. ఈ కొనుగోలుతో ఏసీఎల్ ఉత్పత్తి సామర్థ్యం వార్షికంగా 68.5 మిలియన్ టన్నులు (ఎంటీపీఏ) నుంచి 74.6 ఎంటీపీఏకి చేరుతుందని పేర్కొంది. కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, గుజరాత్ తదితర పశ్చిమ తీర ప్రాంత మార్కెట్లలో తమ కార్యకలాపాలను మరింతగా విస్తరించనున్నట్లు కంపెనీ తెలిపింది. వచ్చే 30 నెలల్లో ఉత్పత్తి సామర్థ్యాలను అదనంగా పెంచుకోనున్నట్లు వివరించింది.

మరిన్ని భాషల్లో మైక్రోసాఫ్ట్ సేవలు

ఐడీసీ సిల్వర్ జూబ్లీ వేడుకల్లో వెల్లడి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ దేశీయంగా మరిన్ని ప్రాంతీయ భాషల్లో తమ ఉత్పత్తులు, సేవలను అందుబాటులోకి తేవడంపై దృష్టి పెడుతోంది. హైదరాబాద్‌లోని ఇండియన్ డెవలప్‌మెంట్ సెంటర్ (ఐడీసీ)ని ప్రారంభించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన సిల్వర్ జూబ్లీ వేడుకల్లో పాల్గొన్న సంస్థ ఎండీ రాజీవ్ కుమార్ ఈ విషయం వెల్లడించారు. అమెరికా రెడ్‌మండ్‌లోని తమ ప్రధాన కార్యాలయం తర్వాత ఇది రెండో అతి పెద్ద రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కేంద్రమని ఆయన తెలిపారు. ఐడీసీ వేడుకల్లో ప్రఖ్యాత క్రికెటర్ కపిల్‌దేవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మైక్రోసాఫ్ట్ 365తో పాటు జుగల్‌బందీ, అజూర్ స్పెషలైజ్డ్ ఏఐ సూపర్ కంప్యూటర్‌ను కంపెనీ ఆవిష్కరించింది.

ఇమేజ్‌ను టెక్ట్స్ రూపంలోకి మార్చి, ఎంచుకున్న భాషలోకి అనువదించే మైక్రోసాఫ్ట్ 365 యాప్‌ను ఇటీవల అందుబాటులోకి తెచ్చినట్లు కుమార్ చెప్పారు. అలాగే, ఇంగ్లిష్‌ను ప్రాంతీయ భాషల్లోకి అనువదించి, వాయిస్ రూపంలో అందించే జుగల్‌బందీ అనే కోపైలట్ టూల్‌ను మరింత అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఇది తెలుగుతో పాటు 10 భాషల్లో ఉండగా త్వరలో 22 ప్రాంతీయ భాషలకు విస్తరించనున్నట్లు వివరించారు. అలాగే భాషిణి అనే చాట్‌బాట్‌ను కూడా త్వరలో అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు. మనకు తెలిసిన భాషలో సందేహాలు అడిగితే జనరేటివ్ ఏఐ సాయంతో సమాధానాలు చెప్పేలా దీన్ని తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు.

రెండో రోజూ రికార్డుల ర్యాలీ

- 69 వేల స్థాయిపైకి సెన్సెక్స్
- 20,850 పాయింట్లపైకి నిఫ్టీ
- ఆరో రోజూ కొనసాగిన సూచీల ర్యాలీ



ముంబై: స్టాక్ మార్కెట్‌లో రెండో రోజూ ర్యాలీ కొనసాగింది. బ్యాంకింగ్, ఫైనాన్స్, మెటల్ షేర్లు రాణించడంతో సూచీలు మంగళవారం ఇంట్రాడే, ముగింపులోనూ చరిత్రాత్మక గరిష్టాలను అందుకున్నాయి. సెన్సెక్స్ 431 పాయింట్లు లాభపడి 69,296 వద్ద వద్ద, నిఫ్టీ 169 పాయింట్లు పెరిగి 20,855 వద్ద స్థిరపడ్డాయి. సూచీలకిది వరుసగా ఆరోరోజూ లాభాల ముగింపు కావడం విశేషం. గరిష్ట స్థాయిల వద్ద టెలికం, ఫార్మా, ఎఫ్ఎంసీజీ రంగాలకు చెందిన చిన్న, మధ్య తరహా షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ద్వితీయార్థంలో మరోసారి కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు సరికొత్త రికార్డుల వద్ద ట్రేడింగ్ ముగిశాయి.

రికార్డుల ర్యాలీ ఎందుకంటే..?

అయిదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ మూడు రాష్ట్రాల్లో గెలిచిన సానుకూలతలు రెండోరోజూ దలాల్ స్ట్రీట్‌లో ప్రతిబింబించాయి. అదానీ గ్రూప్ షేర్లు 20% వరకు లాభపడి ర్యాలీకి దన్నుగా నిలిచాయి. ఆర్‌బీఐ కీలక వడ్డీరేట్లను యథాతథంగా కొనసాగించవచ్చనే ఆశావహ అంచనాలు నెలకొన్నాయి. జీడీపీతో సహా కీలక స్థూల ఆర్థిక గణాంకాలు మెప్పించాయి. క్రూడ్ ధరలు దిగి రావడంతో విదేశీ ఇన్వెస్టర్లు 8 సెషన్లలో రూ.17,133 కోట్ల షేర్లు కొన్నారు.

రూ.14 లక్షల కోట్లకు చేరువలో అదానీ గ్రూప్ మార్కెట్ క్యాప్

అమెరికా ఏజెన్సీ ఐడీఎఫ్‌సీ క్లీన్‌చిట్ ఇవ్వడంతో అదానీ గ్రూప్ షేర్ల ర్యాలీ కొనసాగింది. అదానీ ఎనర్జీ, అదానీ టోటల్ గ్యాస్ 20%, అదానీ ఎంటర్‌ప్రైజెస్ 17%, అదానీ పవర్ 16%, అదానీ పోర్ట్స్ 15%, అదానీ విల్మార్ 10%, ఏసీసీ 8%, అంబుజా సిమెంట్స్ 7% లాభపడ్డాయి. సంఘీ ఇండస్ట్రీస్ (5%)తో సహా మొత్తం 11 కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ మంగళవారం ఒక్కరోజే రూ.1.92 లక్షల కోట్లు పెరిగింది. గ్రూప్ సంయుక్త మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.14 లక్షల కోట్ల చేరువలో రూ.13.91 లక్షల కోట్ల వద్ద ముగిసింది.

- సెన్సెక్స్ ర్యాలీతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.2.99 లక్షల కోట్లు పెరిగి జీవితకాల గరిష్ట స్థాయి రూ. 346.47 లక్షల కోట్లకు చేరింది. కాగా ఆరోరోజూ ర్యాలీతో బీఎస్ఈలో రూ.17.75 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది.

క్యాబ్ సర్వీసుల్లోకి ర్యాపిడో

హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీలో షురూ

న్యూఢిల్లీ: వాహన సేవల సంస్థ ర్యాపిడో కొత్తగా క్యాబ్ సర్వీసుల విభాగంలోకి ప్రవేశించింది. తద్వారా దిగ్గజ సంస్థలు ఓలా, ఉబెర్‌తో పోటీపడనుంది. ముందుగా హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీ–ఎన్‌సీఆర్ (నేషనల్ క్యాపిటల్ రీజియన్)లో 1.2 లక్షల క్యాబ్‌లతో సేవలను ప్రారంభించినట్లు సంస్థ సహ వ్యవస్థాపకుడు పవన్ గుంటుపల్లి వెల్లడించారు. 2024 సెప్టెంబర్ నాటికల్లా 35 నగరాలకు కార్యకలాపాలను విస్తరించనున్నట్లు వివరించారు. ఇటు యూజర్లపై భారం పడకుండా, అటు జీరో కమీషన్ మోడల్‌తో అటు డ్రైవర్ భాగస్వాముల ఆదాయాలను పెంచడంపై దృష్టి పెడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.



ఈ విధానంలో కస్టమర్ చెల్లించే డబ్బు మొత్తం డ్రైవర్లకే (కెప్టెన్లు) వెడుతుంది. ర్యాపిడో ఎటువంటి కమీషను తీసుకోదు. అయితే, డ్రైవర్ల ఆదాయం నిర్దిష్ట స్థాయిని దాటిన తర్వాత మాత్రం వారు కొంత సబ్‌స్క్రిప్షన్ ఫీజు కట్టాల్సి ఉంటుంది. 2024 జనవరి–మార్చి నాటికి ముంబై, పుణె, కోల్‌కతా, చెన్నైకి విస్తరిస్తామని పవన్ వివరించారు.

2030 నాటికి

మూడో అతిపెద్ద ఎకానమీగా భారత్!

- ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ నివేదిక
- ప్రపంచ తయారీ కేంద్రంగా మారడమే ముందున్న సవాలు



న్యూఢిల్లీ: భారత్ 2030 నాటికి ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ విశ్లేషించింది. అయితే 'అపారమైన అవకాశాన్ని' అన్‌లాక్ చేసి తదుపరి అతిపెద్ద ప్రపంచ తయారీ కేంద్రంగా మారడం దేశానికి ప్రధాన పరీక్ష అని పేర్కొంది. ఏప్రిల్‌తో ప్రారంభమైన ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2023–24) అంచనా వేసిన 6.4 శాతం వృద్ధి వేగం 2026 నాటికి 7 శాతానికి చేరుకుంటుందని పేర్కొంది. రాబోయే మూడేళ్లలో భారతదేశం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా మారుతుందని అమెరికా కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న రేటింగ్ ఏజెన్సీ అంచనా వేస్తోంది. సేవల–ఆధిపత్య ఆర్థిక వ్యవస్థ నుండి భారత్ తయారీ–ఆధిపత్యంగా మార్చడానికి బలమైన లాజిస్టిక్స్ ఫ్రేమ్‌వర్క్‌ను అభివృద్ధి చేయడం కీలకమని 'గ్లోబల్ క్రెడిట్ ఔట్‌లుక్ 2024: కొత్త ఇబ్బందులు, మార్గాలు' అన్న అంశంపై విడుదల చేసిన నివేదికలో రేటింగ్ సంస్థ పేర్కొంది. 2022–23లో భారత్ ఎకానమీగా వ్యవసాయ రంగం వాటా 18.4 శాతం. పారిశ్రామిక రంగం వాటా 28.3 శాతం. సేవల రంగం వాటా 53.3 శాతం. 25.5 ట్రిలియన్ డాలర్లతో అమెరికా ప్రస్తుతం ప్రపంచంలో అతిపెద్ద ఎకానమీగా కొనసాగుతోంది. ఇక 17.9 శాతం ప్రపంచ జీడీపీ వాటాతో 18 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా చైనా రెండవ స్థానంలో ఉంది. తరువాతి స్థానాల్లో జపాన్ (4.2 ట్రిలియన్ డాలర్లు), జర్మనీ (4 ట్రిలియన్ డాలర్లు)లు ఉన్నాయి. 3.75 ట్రిలియన్ డాలర్లతో భారత్ ఐదవ స్థానంలో నిలుస్తోంది. కాగా, 2022 నాటికి భారత్ ఎకానమీ బ్రిటన్, ఫ్రాన్స్‌లను అధిగమించగా, 2023 నాటికి జర్మనీని అధిగమించే అవకాశం ఉందన్న అంచనాలు ఉన్నాయి. తాజా నివేదికలో ఎస్అండ్‌పీ పేర్కొన్న ముఖ్యాంశాలు..

- శ్రామిక మార్కెట్ సామర్థ్యాన్ని అన్‌లాక్ చేయడం అనేది కార్మికుల నైపుణ్యం పెంపొందించడం, శ్రామికశక్తిలో మహిళా భాగస్వామ్యాన్ని పెంచడంపై ఆధారపడి ఉంటుంది. ఈ రెండు అంశాల్లో విజయం ద్వారా భారత్ తన అధిక శాతం యువత నుంచి ఆర్థిక ప్రయోజనం పొందగలుగుతుంది.
- వృద్ధి చెందుతున్న దేశీయ డిజిటల్ మార్కెట్ వచ్చే దశాబ్దంలో భారత్‌లో అధికంగా వృద్ధి చెందుతున్న స్టార్టప్ రంగానికి ప్రయోజనం చేకూర్చుతుంది.
- 2024లో 50 కంటే ఎక్కువ దేశాల్లో ఎన్నికలు (అధ్యక్ష/లేదా శాసన సభలు) ఉన్నాయి. వీటి ఫలితాలపై ఆధారపడి చాలా వరకు ప్రపంచ పరిణామాలు ఉండవచ్చు.
- త్వరలో మూడో సంవత్సరంలోకి అడుగుపెట్టనున్న యుద్ధంలో చిక్కుకున్న రష్యా– ఉక్రెయిన్ రెండు దేశాల్లో మార్చిలో అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. పశ్చిమాసియా సంక్షోభంలో ప్రత్యక్ష సంబంధం ఉన్న అమెరికాలో కూడా అధ్యక్ష ఎన్నికలు జరగనుండడం గమనార్హం. భారత్‌సహా ఇండోనేషియా, దక్షిణాఫ్రికా, మెక్సికో వంటి వర్ధమాన దేశాలు కూడా ఎన్నికలకు వెళ్లనున్నాయి.

నవంబర్‌లో సేవలు పేలవం..

56.9 పతనమైన బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ • ఏడాది కనిష్ట స్థాయి



న్యూఢిల్లీ: భారత్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో దాదాపు 53 శాతం వాటా కలిగిన సేవల రంగం నవంబర్‌లో పేలవ పనితీరును కనబరిచింది. ఎస్అండ్‌పీ గ్లోబల్ ఇండియా సర్వీసెస్ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ అక్టోబర్‌లో 58.4 వద్ద ఉంటే, నవంబర్‌లో 56.9కి పడిపోయింది. గడచిన ఏడాది కాలంలో ఇంత తక్కువ స్థాయికి సేవల రంగం సూచీ పడిపోవడం ఇదే తొలిసారి. ధరల ఒత్తిడి తగ్గినప్పటికీ, నవంబర్‌లో కొత్త ఆర్డర్లు, ఉత్పత్తి స్పీడ్ నెమ్మదించడం మొత్తం ఫలితాలపై ప్రభావం చూపినట్లు ఎస్అండ్‌పీ గ్లోబల్ మార్కెట్ ఇంటెలిజెన్స్‌లో ఎకనామిక్స్ అసోసియేట్ డైరెక్టర్ పోలియానీ డీ లిమా పేర్కొన్నారు. కాగా, ఈ సూచీ 50పైన ఉంటే వృద్ధి ధోరణిగానే పరిగణించడం జరుగుతుంది. ఆ దిగువకు పడిపోతేనే క్షీణతగా పరిగణిస్తారు. ఈ ప్రాతిపదికన సేవల రంగం సూచీ వరుసగా 28 నెలల నుంచీ వృద్ధి బాటలోనే కొనసాగుతోంది.

సేవలు–తయారీ కలిపినా కిందకే..

మరోవైపు సేవలు–తయారీ రంగాలను కలిసి లెక్కించే ఎస్అండ్‌పీ గ్లోబల్ ఇండియా కాంపోజిట్ పీఎంఐ అవుట్‌పుట్ ఇండెక్స్ అక్టోబర్‌లో 58.4 వద్ద ఉంటే, తాజా సమీక్షా నెల నవంబర్‌లో 57.4కు పడిపోయింది.

జాబ్ పాయింట్

ఐడీబీఐలో 2100 కొలువులు

ప్రభుత్వరంగ బ్యాంక్.. ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఐడీబీఐ) ఉద్యోగ ప్రకటన విడుదల చేసింది. ఇందులో భాగంగా 2100 పోస్టుల భర్తీకి నియామక ప్రక్రియ చేపట్టనుంది. వీటిలో గ్రేడ్ ఓ జూనియర్ అసిస్టెంట్ మేనేజర్ పోస్టులు 800 కాగా, సేల్స్, ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ విభాగానికి సంబంధించి 1300 పోస్టులు ఒప్పంద ప్రాతిపదికన భర్తీచేస్తారు.

అర్హతలు

అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు కనీసం 60 శాతం మార్కులతో ఏదైనా విభాగంలో డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులైతే 55 శాతం మార్కులతో పాసైతే సరిపోతుంది. ఎగ్జిక్యూటివ్(కాంట్రాక్ట్) ఉద్యోగాలకు మాత్రం ఏదైనా డిగ్రీ ఉండాలి.

ఎంపిక విధానం

జూనియర్ అసిస్టెంట్ మేనేజర్(జేఏఎం), ఎగ్జిక్యూటివ్ సేల్స్–ఆపరేషన్స్(ఈఎస్ఓ) పోస్టులకు ఆన్‌లైన్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, పర్సనల్ ఇంటర్వ్యూ, ప్రీ రిక్రూట్‌మెంట్ మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

రాతపరీక్ష ఇలా

మొత్తం 200 మార్కులకు రాత పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు.ఈ పరీక్షలో లాజికల్ రీజనింగ్, డేటా అనాలిసిస్ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్, ఇంగ్లిష్ లాంగ్వేజ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, జనరల్/ఎకానమీ/బ్యాంకింగ్ అవేర్‌నెస్ /కంప్యూటర్/ఐటీ సబ్జెక్టులపై ప్రశ్నలు అడుగుతారు. ఇంగ్లిష్,హిందీ భాషల్లో పరీక్ష జరుగుతుంది.

వేతనాలు

» జూనియర్ అసిస్టెంట్ మేనేజర్ (జేఏఎం) పోస్టులకు ఎంపికైన వారికి రూ.6,14,000 నుంచి రూ.6,50,000 వరకు వార్షిక వేతనం లభిస్తుంది. » ఎగ్జిక్యూటివ్ పోస్టులకు తొలి ఏడాది నెలకు రూ.29వేలు చొప్పున వేతనం ఇస్తారు. రెండో ఏడాది నుంచి నెలకు రూ.31 వేల చొప్పున చెల్లిస్తారు.

ముఖ్యసమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:06.12.2023
» వెబ్‌సైట్ : https://ibpsonline.ibps.in/idbiesonov23

ఏలూరు జీజీహెచ్‌లో 108 పారామెడికల్ పోస్టులు

ఏలూరులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, ప్రభుత్వ వైద్య కళాశాల, నర్సింగ్ కళాశాలలో.. ఒప్పంద/ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పారామెడికల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 108
» పోస్టులు: ఆఫీస్ సబార్డినేట్స్, ఈఎంటీ, కంప్యూటర్ ప్రోగ్రామర్, జనరల్ డ్యూటీ అటెండెంట్, ఫార్మసిస్ట్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, ల్యాబ్ టెక్నీషియన్ తదితరాలు.
» అర్హత: పోస్టును అనుసరించి ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. వయసు: 42 ఏళ్లు మించకూడదు.
» ఎంపిక విధానం: విద్యార్హత మార్కులు, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ప్రిన్సిపాల్ కార్యాలయం, ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి కార్యాలయం, ఏలూరు చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 11.12.2023.
» వెబ్‌సైట్: eluru.ap.gov.in

ఆర్ఆర్‌సీ–నార్త్ ఈస్టర్న్ రైల్వేలో 1104 యాక్ట్ అప్రెంటిస్‌లు

గోరఖ్‌పూర్ (ఉత్తరప్రదేశ్)లోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్ (ఆర్ఆర్‌సీ)–నార్త్ ఈస్టర్న్ రైల్వే ఎన్ఈఆర్ పరిధిలోని డివిజన్/యూనిట్లలో యాక్ట్ అప్రెంటిస్‌ల శిక్షణ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం ఖాళీల సంఖ్య: 1104
» డివిజన్/వర్క్‌షాప్: మెకానికల్ వర్క్‌షాప్ (గోరఖ్‌పూర్), సిగ్నల్ వర్క్‌షాప్ (గోరఖ్‌పూర్ కంటోన్మెంట్), బ్రిడ్జ్ వర్క్‌షాప్ (గోరఖ్‌పూర్ కంటోన్మెంట్), మెకానికల్ వర్క్‌షాప్ (ఇజ్జత్‌నగర్), డీజిల్ షెడ్(ఇజ్జత్‌నగర్), క్యారేజ్ అండ్ వ్యాగన్ (ఇజ్జత్‌నగర్), క్యారేజ్ అండ్ వ్యాగన్ (లక్నో జంక్షన్), డీజిల్ షెడ్(గోండా), క్యారేజ్ అండ్ వ్యాగన్ (వారణాసి).
» అర్హత: పదో తరగతితోపాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
» ట్రేడ్‌లు: ఫిట్టర్, వెల్డర్, ఎలక్ట్రీషియన్, కార్పెంటర్, పెయింటర్, మెషినిస్ట్, టర్నర్, పెయింటర్, మెకానిక్ డీజిల్, ట్రిమ్మర్.
» వయసు: 25.11.2023 నాటికి 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
» ఎంపిక విధానం: మెట్రిక్యులేషన్, ఐటీఐ మార్కులు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 24.12.2023
» వెబ్‌సైట్: www.apprentice.rrcner.net

అమెరికా కొలువుకు దారి.. ఓపీటీ!

» యూఎస్‌లో చదువుకు ఏటేటా పెరుగుతున్న క్రేజ్
» అధిక శాతం మంది భారతీయుల లక్ష్యం అక్కడే జాబ్!
» అగ్రరాజ్యంలో ఉద్యోగావకాశాలకు మార్గంగా ఓపీటీ
» అన్ని కోర్సుల విద్యార్థులకు ఓపీటీ అవకాశం



అమెరికా.. చదువైనా, కొలువైనా.. మన దేశ విద్యార్థులకు తొలి గమ్యంగా నిలుస్తున్న దేశం! యూఎస్ యూనివర్సిటీల్లో ఉన్నత విద్య కోర్సుల్లో చేరి అక్కడే ఉద్యోగం సొంతం చేసుకోవాలన్నది ఎంతోమంది కల!! ఎఫ్-1 స్టూడెంట్ వీసాతో అమెరికాలో అడుగుపెడితే.. ఉద్యోగ సాధన సులభమనే అభిప్రాయం!! కారణం.. అంతర్జాతీయ విద్యార్థులకు యూఎస్ కల్పిస్తున్న ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్(ఓపీటీ) విధానం. ఈ నేపథ్యంలో.. యూఎస్‌లో ఓపీటీ విధానం, భారతీయ విద్యార్థులకు ప్రయోజనాలు, అమెరికాలో అవకాశాలు అందుకునేందుకు మార్గాలపై ప్రత్యేక కథనం..

యూఎస్‌లో ఉన్నత విద్య కోసం వెళ్లే విద్యార్థుల్లో అధిక శాతం మంది కోర్సు పూర్తయ్యాక అక్కడే కొలువులో చేరాలని కోరుకుంటున్నారు. అందుకోసం తమకు అందుబాటులో ఉండే మార్గాలపై అన్వేషణ సాగిస్తున్నారు. అలాంటి వారికి చక్కటి అవకాశం.. ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్(ఓపీటీ) విధానం అంటున్నారు నిపుణులు.

ఓపీటీ అంటే

అమెరికాలోని యూనివర్సిటీలు, ఇన్‌స్టిట్యూట్‌లలో చదువుతున్న లేదా కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులు..తమ చదువుకు తగ్గ రంగంలో తాత్కాలిక పద్ధతితో నిర్దేశిత వ్యవధిలో ఆయా సంస్థల్లో ఉద్యోగం చేసేందుకు అవకాశం కల్పించే విధానమే.. ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్(ఓపీటీ). ఉదాహరణకు మేనేజ్‌మెంట్ కోర్సుల విద్యార్థులకు అమెరికాలోని సంస్థల్లో మేనేజ్‌మెంట్ విభాగంలో ఓపీటీ విధానంలో పని చేసే అవకాశం లభిస్తుంది. అయితే ఈ ఓపీటీ విధానంలో పని చేయాలంటే తప్పనిసరిగా కనీసం ఏడాది వ్యవధి గల కోర్సులో చేరాల్సి ఉంటుంది.

ఆ కోర్సులకు 12 నెలలు

సంప్రదాయ కోర్సుల విద్యార్థులకు ఓపీటీ విధానంలో.. గరిష్టంగా 12 నెలలు పని చేసే అవకాశం లభిస్తుంది. ఇందుకోసం విద్యార్థులు ముందుగా తమ ఇన్‌స్టిట్యూట్‌ల అధికారులను సంప్రదించాలి. సదరు యూనివర్సిటీల అధికారులు స్టూడెంట్ అండ్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ఇన్ఫర్మేషన్‌లో విద్యార్థుల వివరాలను పొందుపరుస్తారు.

ఆ తర్వాత విద్యార్థులు ఐ–765గా పేర్కొనే ఎంప్లాయ్‌మెంట్ ఆథరైజేషన్ అప్లికేషన్‌ను యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ విభాగానికి దరఖాస్తు చేయాలి. దీనికి ఎంప్లాయ్‌మెంట్ ఆథరైజేషన్ డాక్యుమెంట్ (ఈఏడీ) పేరుతో ఆమోదం లభిస్తుంది. దానిద్వారా అభ్యర్థులు తమ కోర్సుకు సరితూగే సంస్థల్లో పని చేసేందుకు మార్గం సుగమం అవుతుంది.

స్టెమ్ విద్యార్థులకు 36 నెలలు

స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్) సంబంధిత కోర్సుల విద్యార్థులు 36 నెలలు అంటే మూడేళ్లపాటు ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ పేరుతో సంబంధిత సంస్థల్లో పని చేసే అవకాశం ఉంది. దీనికి ప్రధాన కారణం.. అమెరికాలో నెలకొన్న స్టెమ్ నిపుణుల కొరతే. అందుకే తొలుత ఏడాది వ్యవధికే ఓపీటీకి అనుమతిచ్చినా.. దాన్ని మరో 24 నెలలు పొడిగించుకునే అవకాశాన్ని అమెరికా ఇమిగ్రేషన్ అధికారులు కల్పిస్తున్నారు.

ఓపీటీ.. రెండు రకాలు

ఈ ఓపీటీ రెండు రకాలుగా ఉంటుంది. ప్రీ కంప్లీషన్ ఓపీటీ, పోస్ట్ కంప్లీషన్ ఓపీటీ!

ప్రీ కంప్లీషన్ ఓపీటీ: విద్యార్థులు కోర్సు చదువుతున్న సమయంలోనే సంస్థల్లో పని చేసే అవకాశం కల్పించే విధానమిది. దీనికి అనుమతి లభించిన విద్యార్థులు.. క్లాసులు జరుగుతున్న సమయంలో వారానికి 20 గంటలు పార్ట్‌టైమ్ విధానంలో, సెలవుల్లో ఫుల్‌టైమ్ విధానంలో పని చేసే వీలుంటుంది.

పోస్ట్ కంప్లీషన్ ఓపీటీ: కోర్సు పూర్తి చేసుకున్న తర్వాత సంస్థల్లో పనిచేసే అవకాశం కల్పించే విధానం ఇది. దీని ప్రకారం విద్యార్థులు వారానికి 20 గంటలు పార్ట్ టైమ్ విధానంలో లేదా పూర్తి స్థాయిలో 12 నెలల పాటు సంస్థల్లో తాత్కాలిక ఉద్యోగిగా విధులు నిర్వహించొచ్చు. అదే స్టెమ్ కోర్సుల విద్యార్థులైతే మరో 24 నెలలు అంటే మొత్తం 36 నెలలు పాటు పోస్ట్ కంప్లీషన్ ఓపీటీ పేరుతో స్టెమ్ రంగాలకు చెందిన సంస్థలు, విభాగాల్లో పని చేయొచ్చు.

వేతనం ఇలా

ఓపీటీ విధానంలో ఆయా సంస్థల్లో ఉద్యోగాలు చేస్తున్న వారికి వేతనాలు కూడా ఆకర్షణీయంగానే ఉంటున్నాయి. ఎంట్రీ లెవల్ ఉద్యోగాలకు వార్షిక వేతనం 49 వేల డాలర్లకు పైగా ఉంటోంది. ఆయా రంగాల్లో అనుభవం ఉంటే లక్షా 20 వేల డాలర్ల వరకు వార్షిక వేతనం పొందే అవకాశం ఉంది. గంటల ప్రాతిపదికన పరిగణనలోకి తీసుకుంటే గంటకు 36 డాలర్లు చొప్పున లెక్కించి వేతనం అందిస్తారు. ఓపీటీలో ఉన్న విద్యార్థులకు పలు రకాల పన్నుల నుంచి యూఎస్ ప్రభుత్వం మినహాయింపు ఇస్తోంది.

ముందుగానే దరఖాస్తు

ఓపీటీ విధానంలో అమెరికాలోని సంస్థల్లో పని చేయాలనుకుంటున్న విద్యార్థులు ఇమిగ్రేషన్ నిబంధనల ప్రకారం కోర్సు సమయంలోనే దరఖాస్తు చేయాల్సి ఉంటుంది.

స్టెమ్ కోర్సులు చదువుతూ ప్రీ కంప్లీషన్ ఓపీటీ కోసం కోర్సు ముగియడానికి 90 రోజుల ముందే దరఖాస్తు చేసుకోవాలి. పోస్ట్ కంప్లీషన్ ఓపీటీ కోసం కోర్సు ముగియడానికి 90 రోజుల ముందు నుంచి కోర్సు ముగిసిన తర్వాత 60 రోజుల లోపు దరఖాస్తు చేసుకోవాలి. అదే విధంగా స్టెమ్ కోర్సుల విద్యార్థులు 24 నెలల పొడిగింపు అవకాశం కోరుకుంటే.. దానికి సంబంధించి ముందుగా 12 నెలల వ్యవధికి మంజూరు చేసే ఓపీటీ ముగియడానికి 90 రోజుల ముందే దరఖాస్తు చేసుకోవాలి.

స్టెమ్ విభాగానికి చెందని విద్యార్థులు ప్రీ కంప్లీషన్ ఓపీటీ కోసం కోర్సు ముగియడానికి 90 రోజుల ముందుగా దరఖాస్తు చేయాలి. అదే విధంగా పోస్ట్ కంప్లీషన్ ఓపీటీ కోసం కోర్సు ముగియడానికి 90 రోజులు ముందుగా, కోర్సు ముగిశాక 60 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలి.

హెచ్-1బికు ఆస్కారం

ఓపీటీ పూర్తయిన తర్వాత హెచ్–1బి వీసాకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. ఓపీటీ విధానంలో తాత్కాలిక పద్ధతిలో ఆయా సంస్థల్లో పని చేసే అభ్యర్థులు చక్కటి పనితీరు కనబరిస్తే.. హెచ్1బి వీసా పొందేందుకు అవకాశాలు మెరుగవుతాయి. అధిక శాతం సంస్థల యాజమాన్యాలు ఓపీటీ అభ్యర్థుల తరఫున పిటిషన్లు దాఖలు చేస్తున్నట్లు యూఎస్ ఇమిగ్రేషన్ వర్గాల సమాచారం. ప్రధానంగా సైన్స్, టెక్నాలజీ రంగాలకు చెందిన సంస్థల్లో ఈ ధోరణి కనిపిస్తోంది. హెచ్1బికి పిటిషన్ దాఖలు చేసిన అభ్యర్థులు ఓపీటీ ముగిసిన సమయానికి, హెచ్1బి వీసా మంజూరుకు మధ్య ఉన్న వ్యవధిలో అమెరికాలోనే నివసించే అవకాశం కూడా ఉంది. ఈ విషయంలో క్యాప్ గ్యాప్ అనే విధానం కూడా అమలవుతోంది. అంటే.. ప్రతి ఏటా హెచ్1బి పిటిషన్ల మంజూరు ఏప్రిల్ 1న జరుగుతుంది. వాటిని పొందిన అభ్యర్థులు అక్టోబర్ 1 నుంచి విధుల్లో చేరాల్సి ఉంటుంది. ఏప్రిల్ 1 కంటే ముందే ఓపీటీ పూర్తి చేసుకుని హెచ్1బి పిటిషన్‌కు అవకాశం పొందినా.. అక్టోబర్ 1 వరకు పని చేసే అవకాశం ఉండదు. ఈ సమయంలో అభ్యర్థులు స్వదేశానికి వెళ్లాల్సి ఉంటుంది.

సంస్థలు సానుకూలం

ఓపీటీ విధానంలో పని చేస్తున్న భారత విద్యార్థుల పట్ల అక్కడి కంపెనీలు సానుకూలంగానే స్పందిస్తున్నాయి.హెచ్–1బి పిటిషన్ల విషయంలో ఓపీటీ పూర్తి చేసుకున్న వారికే సంస్థలు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఓపీటీ చేస్తున్న విద్యార్థులు.. ఎప్పటికప్పుడు ఇమిగ్రేషన్ నిబంధనలు గమనిస్తూ ఉండాలి. ఒక్కోసారి అకస్మాత్తుగా నిర్ణయాలు, నిబంధనలు మారే అవకాశం కూడా ఉంది.

ఓపీటీలో పెరుగుదల

యూఎస్‌లో ఓపీటీ విధానంలో పని చేస్తున్న అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్య 2023లో భారీగా పెరగడం విశేషం. గత మూడేళ్లతో పోల్చితే 2022–23లో ఓపీటీ విద్యార్థుల సంఖ్య 8 శాతం పెరిగి 1,98,793గా నిలిచింది. వీరిలో భారత విద్యార్థులు తొలి స్థానంలో ఉన్నారు. ఓపెన్ డోర్స్ నివేదిక ప్రకారం– అన్ని విభాగాల్లో కలిపి.. 69,062 మంది భారత విద్యార్థులు ఉన్నారు. 2021–22లో ఈ సంఖ్య 62,188గా నమోదైంది.

యూఎస్ తగ్గని క్రేజ్

యూఎస్‌లో ఉన్నత విద్యపై భారతీయ విద్యార్థులకు ఏ మాత్రం క్రేజ్ తగ్గడం లేదని ఓపెన్‌డోర్స్ తాజా నివేదిక స్పష్టం చేసింది. 2022–23 విద్యా సంవత్సరంలో అమెరికాలో విద్యను అభ్యసిస్తున్న భారత్ విద్యార్థుల సంఖ్య 2,68,923గా నమోదైంది. గత కొన్నేళ్లలో ఇదే అత్యధికమని, భారత విద్యార్థుల సంఖ్యలో 35 శాతం పెరుగుదల నమోదైందని ఓపెన్ డోర్స్ నివేదికలో స్పష్టమైంది.

క్లుప్తంగా...



గవర్నర్‌ను కలిసిన డీజీపీ

సాక్షి, హైదరాబాద్‌: తెలంగాణ రాష్ట్ర డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన రవిగుప్తా మంగళ వారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ తమిళిసై సౌందరరాజన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అంజనీకుమార్‌పై ఎన్నికల కమిషన్‌ సస్పెన్షన్‌ వేటు వేయడంతో ఆయన స్థానంలో సీనియర్‌ ఐపీఎస్‌ అధికారి రవిగుప్తా తెలంగాణ రాష్ట్ర నాలుగో డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే.

తెలంగాణలో 1425 అభివృద్ధి పనులు

కేంద్ర మంత్రి సాధ్వీ నిరంజన్‌ జ్యోతి



సాక్షి, న్యూఢిల్లీ: శ్యామ ప్రసాద్‌ ముఖర్జీ రుర్బన్‌ మిషన్‌ కింద తెలంగాణలో 1425 అభివృద్ధి పనులు జరుగుతున్నాయని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి సాధ్వీ నిరంజన్‌ జ్యోతి తెలిపారు. పార్లమెంటు ప్రశ్నోత్తరాల సమయంలో బీఆర్‌ఎస్‌ ఎంపీ రంజిత్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ తెలంగాణలో ఈ మిషన్‌ కింద 17 క్లస్టర్లలో 1425 పనులు జరుగుతున్నాయని వివరించారు. ఈ పథకానికి అవసరమైన నిధులను మంజూరు చేశామని, డిసెంబర్‌ నెలాఖరుకల్లా పనులు పూర్తవుతాయని రాష్ట్ర ప్రభుత్వం సమాచారం ఇచ్చిందని పేర్కొన్నారు. ఈ మిషన్‌ కింద వికారాబాద్‌ జిల్లాలోని అల్లాపూర్‌ ఎస్‌ క్లస్టర్‌లో 80 పనులు జరుగుతున్నాయని ఆమె వెల్లడించారు.

రేపు ఎన్‌ఐఎస్‌టీలో నర్సింగ్‌ ఉద్యోగాల స్క్రీనింగ్‌ పరీక్షలు

సాక్షి, హైదరాబాద్‌: వైద్యరంగంలో డిమాండ్‌ ఉన్న నర్సింగ్‌ ఉద్యోగాల భర్తీ కోసం ఈనెల 7న ఉదయం 10 గంటలకు విద్యానగర్‌లో ఉన్న నేషనల్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ స్కిల్‌ ట్రెనింగ్‌ (ఎన్‌ఐఎస్‌టీ)లో స్క్రీనింగ్‌ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఓవర్సీస్‌ మ్యాన్‌పవర్‌ కంపెనీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆసక్తి ఉన్న 30 ఏళ్లలోపు బీఎస్సీ నర్సింగ్‌, జీఎన్‌ఎం డిప్లొమా కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరు కావొచ్చని వెల్లడించింది. ఎంపికైన అభ్యర్థులకు తగిన శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొంటూ అభ్యర్థులు జపాన్‌లోని ఆస్పత్రుల్లో పనిచేయాల్సి ఉంటుందని వివరించింది. మరిన్ని వివరాలకు టామ్‌కామ్‌ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించింది.

కోలేటి రాజీనామా

సాక్షి, హైదరాబాద్‌: పోలీస్‌ హౌసింగ్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ కోలేటి దామోదర్‌ మంగళవారం తన పదవికి రాజీనామా చేశారు. గడిచిన ఐదేళ్లుగా దామోదర్‌ ఈ పదవిలో కొనసాగుతున్నారు. తన పదవీకాలంలో సహకరించిన అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్టీసీలో 'ఎంటర్‌ప్రైజ్‌ రిసోర్స్‌ ప్లానింగ్‌' ప్రారంభం

సాక్షి, హైదరాబాద్‌: ఆర్టీసీలో అంతర్గతంగా ఉన్న వివిధ విభాగాలన్నింటినీ ఒకే సాఫ్ట్‌ వేర్‌ పరిధిలోకి తెచ్చారు. గతంలో ఒక్కో విభాగానికి ఒక్కో సాఫ్ట్‌ వేర్‌ వ్యవస్థ ఉండేది. ఇప్పుడు ఎంటర్‌ ప్రైజ్‌ రిసోర్స్‌ ప్లానింగ్‌ పేరుతో ఉమ్మడి సాంకేతిక వ్యవస్థను ప్రారంభించారు. 9 వేలకు పైగా బస్సులతో దాదాపు 10 వేల గ్రామాలను కలుపుతూ ప్రతిరోజూ 35 లక్షల కిలోమీటర్ల మేర బస్సులు నడుపుతూ సుమారు 45 లక్షల మంది ప్రయాణికులకు సంస్థ రవాణా సేవలు అందిస్తోంది. 50 వేల మంది ఉద్యోగుల వివిధ విభాగాల్లో, హోదాల్లో పని చేస్తున్నారు. ఆయా విభాగాల్లో గందరగోళం, డూప్లికేషన్‌, సమన్వయలోపం లేకుండా డిజిటైజేషన్‌లో భాగంగా సెంట్రలైజ్డ్‌ ఇంటిగ్రేటెడ్‌ సొల్యుషన్స్‌ను ప్రారంభించారు. మంగళవారం ప్రారంభ కార్యక్రమంలో ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌, నల్సాఫ్ట్‌ సీఈఓ నల్లూరి వెంకట్‌, నల్సాఫ్ట్‌ ఈక్విటీ పార్ట్‌నర్‌ త్రినాథ్‌ బాబు, సీఓఓ రవీందర్‌ పాల్గొన్నారు.

నేడు రాష్ట్రంలో వర్షాలు..

రానున్న రెండ్రోజులు తగ్గనున్న ఉష్ణోగ్రతలు

అశ్వారావుపేటలో 13.1 సెం.మీ వర్షపాతం నమోదు



నేలకొండపల్లి మండలం మంగాపురంలో వరి పంట నేలవాలడంతో రోదిస్తున్న రైతు భూక్యా బక్క

సాక్షి, హైదరాబాద్‌: నైరుతి బంగాళాఖాతంలో కొనసాగిన అతి తీవ్ర తుపాను మంగళవారం సాయంత్రం తుపానుగా దక్షిణ ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల ప్రాంతంలో తీరం దాటింది. ఆ తర్వాత క్రమంగా బలహీన పడినట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. ఫలితంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు నమోదయ్యాయి. రాష్ట్రంలో సగటున 3 సెంటీమీటర్ల వర్షం కురిసింది. అత్యధికంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో ఏకంగా 13.1 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. అదే జిల్లా దమ్మపల్లి, ముల్కలపల్లి, ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో భారీ నుంచి అతి భారీ వర్షాలు, కొన్ని చోట్ల అత్యంత భారీ వర్షాలు కూడా నమోదయ్యాయి.

ఆ జిల్లాల్లో భారీ వర్షాలు!

వాతావరణ పరిస్థితుల దృష్ట్యా బుధవారం కూడా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ సూచించింది. మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్‌ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు నమోదు కావొచ్చని హెచ్చరించింది. ఉమ్మడి అదిలాబాద్‌, నిజామాబాద్‌, కరీంనగర్‌, వరంగల్‌, నల్లగొండ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాల నమోదుకు అవకాశం ఉన్నట్లు వివరించింది.

తగ్గిన ఉష్ణోగ్రతలు

తుపాను ప్రభావంతో వాతావరణంలో నెలకొన్న మార్పులతో ఉష్ణోగ్రతలు భారీగా పతనమయ్యాయి. గత రెండ్రోజుల వరకు రాష్ట్రంలో సాధారణం కంటే 2 డిగ్రీల మేర అధిక ఉష్ణోగ్రతలు నమోదు కాగా... మంగళవారం సాధారణం కంటే రెండు డిగ్రీలు తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బుధ, గురు వారాల్లో ఇదే తరహాలో తక్కువ ఉష్ణోగ్రతలు నమోదు కావొచ్చని వాతావరణ శాఖ అధికారులు సూచిస్తున్నారు. మంగళవారం రాష్ట్రంలో నమోదైన ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే గరిష్ట ఉష్ణోగ్రత అదిలాబాద్‌లో 28.3 డిగ్రీ సెల్సియస్‌, కనిష్ట ఉష్ణోగ్రత హకీంపేట్‌లో 18.7 డిగ్రీ సెల్సియస్‌గా నమోదైంది. ఉష్ణోగ్రతలు తగ్గడంతో చలి తీవ్రత పెరిగే అవకాశం ఉంది.

మంగళవారం అత్యధిక వర్షపాతం నమోదైన ప్రాంతాలు (సెం.మీలలో)

అశ్వారావుపేట	13.1	గంగారం	5.25
అంకంపాలెం	7.35	నాలగుపల్లి	5.03
మందలపల్లి	6.05	నాయుడుపేట	4.90
ములకలపల్లి	5.53	సదాశివునిపాలెం	4.78

వరి, పత్తి పంటలకు నష్టం

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భారీ వర్షం

- నేల కొండపల్లిలో గుడిసె కూలి భార్యాభర్తలు మృతి
- సింగరేణిలో నిలిచిన బొగ్గు ఉత్పత్తి..
- నేడు కూడా విద్యాసంస్థలకు సెలవు

సాక్షి నెట్‌వర్క్‌, ఖమ్మం, నేలకొండపల్లి: తుపాను ప్రభావంతో ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం కురుస్తోంది. సోమవారం సాయంత్రం మొదలైన వాన మంగళవారం తగ్గుముఖం పట్టినా మళ్లీ సాయంత్రం పెరిగింది. రాత్రి పొద్దుపోయే వరకు జిల్లావ్యాప్తంగా భారీగా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో వరి, పత్తి పంటలకు నష్టం వాటిల్లగా కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడవడంతో రైతులు కాపాడుకోవడానికి నానా తిప్పలు పడుతున్నారు. కొన్నిచోట్ల రహదారులపై చెట్లు విరిగిపడడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వర్షాల కారణంగా ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో విద్యాసంస్థలకు మంగళ, బుధవారాలు సెలవు ప్రకటించారు. మరోపక్క కలెక్టరేట్లలో కంట్రోల్‌రూంలు ఏర్పాటుచేసిన అధికారులు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. ఇప్పటికే అన్ని ప్రాంతాలకు బోట్లు సమకూర్చడంతో పాటు గజ ఈతగాళ్లను సిద్ధం చేశారు. భద్రాచలానికి 20 మందితో కూడిన ఎన్డీఆర్‌ఎఫ్‌ బృందం, పది మందితో కూడిన ఇతర అధికారులు చేరుకుని సహాయక చర్యలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. సింగరేణి ఓసీల్లో నీరు నిలవడంతో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది.

రెండు నిండు ప్రాణాలను బలితీసుకున్న వర్షం

రోజంతా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో గోడలు నాని పూరి గుడిసె కూలడంతో ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం చెరువు మాధారం గ్రామానికి చెందిన నూకతోటి పుల్లారావు(40) – లక్ష్మి (30) దంపతులు మృత్యువాత పడ్డారు. మట్టిపెళ్లలు మీద పడడంతో అక్కడిక్కడే మృతి చెందారు. అప్పటివరకు చుట్టుపక్కల వారితో మాట్లాడి ఆ దంపతులు ఇంట్లోకి వెళ్లగా.. ఒక్కసారిగా శబ్దం రావటంతో స్థానికులు వెంటనే స్పందించారు. 108కు సమాచారం ఇవ్వగా అక్కడి చేరుకున్న సిబ్బంది అప్పటికే భార్యాభర్తలు మృతి చెందినట్లు నిర్ధారించారు. వ్యవసాయ కూలీ పనులు చేసుకుని జీవనం సాగించే నిరుపేద దంపతులు అకాల వర్షంతో మృతి చెందడం గ్రామస్తుల్లో విషాదాన్ని నింపింది.

వణికించిన 'మిచాంగ్‌'



ఒంగోలులోని ముంగమూరురోడ్డు సత్యసాయిస్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో ప్రజలకు భోజనం వడ్డిస్తున్న స్థానిక కార్పొరేటర్‌, సచివాలయ సిబ్బంది

▶ మొదటి పేజీ తరువాయి

ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ప్రధాన రోడ్లపై మోకాళ్ల లోతుకుపైగా నీళ్లు ఉండడంతో రాకపోకలు దాదాపు నిలిచిపోయాయి. వాగులు, వంకలు పొంగి పొర్లాయి. దీంతో పలుచోట్ల రోడ్లు తెగిపోయాయి. ఈదురు గాలులకు నెల్లూరు జిల్లాలో కరెంటు స్తంభాలు, పలు చోట్ల గుడిసెలు నేలకూలాయి. అనేక ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా నిలిచిపోయింది. రోడ్లపై చెట్లు కూలిపోయాయి. అయితే ప్రభుత్వం సహాయక చర్యల్ని వేగంగా చేపట్టడంతో యుద్ధ ప్రాతిపదికన కరెంటును పునరుద్ధరించగలిగారు. కూలిన చెట్లను రోడ్లపై నుంచి తొలగించే పనులు చేపట్టారు. మరోవైపు ప్రకాశం, బాపట్ల, కృష్ణా, పశ్చిమగోదావరి, బీఆర్‌ అంబేడ్కర్‌ కోనసీమ, కాకినాడ, గుంటూరు, ఎన్టీఆర్‌, తూర్పుగోదావరి జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. రెండు మూడు రోజులుగా రాష్ట్ర వాసులను భయపెడుతున్న మిచాంగ్‌ తుపాను ఎట్టకేలకు మంగళవారం మధ్యాహ్నం 12.30 నుంచి 2.30 గంటల మధ్య బాపట్లకు నైరుతి దిశగా 15 కి.మీల దూరంలో తీవ్ర తుపానుగా తీరాన్ని దాటింది. ఆ సమయంలో గంటకు 90 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచాయి. తీరం దాటడానికి 3 రోజుల ముందు నుంచి బంగాళాఖాతంలో తుపాను 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో బాపట్ల వైపు దూసుకువచ్చింది. మొదట్లో దివిసీమ, మచిలీపట్నం మధ్య తీరం దాటే అవకాశం ఉన్నట్లు కనిపించినా, చివరకు అది తీవ్ర తుపానుగా మారి బాపట్లకు దగ్గరగా వచ్చి ఆ సమీపంలోనే తీరం దాటింది. మంగళవారం రాత్రి 9 గంటలకు బాపట్లకు 20 కిలోమీటర్లు, ఒంగోలుకు 50 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఆరు గంటల్లో తీవ్ర వాయుగుండంగా అది బలహీన పడుతుందని వాతావరణ శాఖ తెలిపింది. తుపాను బలహీనపడినా బుధవారం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్‌ జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి గుంటూరు, బాపట్ల, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోనూ వర్షాలు పడతాయని పేర్కొంది. .

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్‌ కోడ్‌ను స్కాన్‌ చేయండి

చింతవరంలో 42 సెం.మీ. వర్షం

తుపాను ప్రభావంతో మంగళవారం తిరుపతి జిల్లా వ్యాప్తంగా సగటున 9.3 సెంటీమీటర్ల వర్షం కురిసింది. అంబేడ్కర్‌ కోనసీమ జిల్లాలో సగటున 8.6 సెంటీమీటర్లు, బాపట్ల జిల్లాలో 6.4, కృష్ణాలో 5.5, నెల్లూరు జిల్లాలో 5.4 సెంటీమీటర్ల వర్షం కురిసింది. తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం చింతవరంలో 24 గంటల వ్యవధిలో 42 సెంటీమీటర్ల వర్షం కురిసింది. కోట మండలం చిట్టేడులో 39 సెంటీమీటర్లు, పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా మనుబోలు మండలం కట్టువపల్లెలో 37, తిరుపతి జిల్లా కోట మండలం అల్లంపాడులో 35, చిల్లకూరులో 33, నాయుడుపేటలో 29, బాలాయపల్లె మండలం చిల్లమన్నూరులో 25, నెల్లూరు జిల్లా సైదాపురంలో 22, వెంకటాచలంలో 21 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. తిరుపతి జిల్లా వెంకటగిరి, సత్యవేడు, పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా సైదాపురం, మనుబోలు, వెంకటాచలం, అన్నమయ్య జిల్లా పెనగలూరు, బాపట్ల జిల్లా పర్చూరు, బాపట్ల, అంబేడ్కర్‌ కోనసీమ జిల్లా ముమ్మిడివరం, అయినవిల్లి, కృష్ణా జిల్లా మచిలీపట్నం మండలాల్లో పలుచోట్ల 15 నుంచి 20 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. సుడిగాలి ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలం రాజానగరంలో ఇద్దరిని బలి తీసుకుంది.



నటులు ఆమిర్‌ఖాన్‌, విష్ణు విశాల్‌ సహా ఇతర వరద బాధితులను చెన్నైలోని కారపాక్కం నుంచి బోటులో తరలిస్తున్న దృశ్యం. తన తల్లి చికిత్స కోసం ఆమిర్‌ కొంతకాలంగా చెన్నైలో నివసిస్తున్నారు.

తేరుకుంటున్న చెన్నై

సాక్షి, చెన్నై: 'మిచాంగ్‌' తుపాను సృష్టించిన విలయం నుంచి తమిళనాడు రాజధాని నగరమైన చెన్నై క్రమంగా తేరుకుంటోంది. సోమవారం అర్ధరాత్రి నుంచి వర్షం తెరిపినివ్వడంతో.. తమిళనాడు ప్రభుత్వం సహాయక చర్యలను ముమ్మరం చేసింది. నీటమునిగిన చెన్నైలోని పలు ప్రధాన ప్రాంతాలను సాధారణ స్థితికి తీసుకువచ్చింది. జల దిగ్బంధనంలో చిక్కుకున్న నగర శివారులు, లోతట్టు ప్రాంతాల్లో సహాయక చర్యలు చురుగ్గా కొనసాగుతున్నాయి. పడవలు, ట్రాక్టర్లతో పాటు దాదాపు 5 వేల మంది సిబ్బంది ఉత్తర చెన్నైలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న సహాయక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని చెన్నై కార్పొరేషన్‌ అధికారులు తెలిపారు. కాగా, ఇప్పటివరకు తుపాను సంబంధిత ఘటనల్లో ఒక హెడ్‌కానిస్టేబుల్‌ సహా 12 మంది మృతి చెందగా.. 11 మంది గాయపడ్డారు. తుపాను కారణంగా సోమవారం మూతపడిన చెన్నై విమానాశ్రయాన్ని మంగళవారం తిరిగి తెరిచారు. అయితే, ప్రయాణికులు లేకపోవడంతో చెన్నై నుంచి వెళ్లాల్సిన 89, రావాల్సిన 88 విమాన సర్వీసులు రద్దయ్యాయి. చెంగల్పట్టు, కాంచీపురం పరిధిలోని ప్రాంతాలు ఇంకా జలదిగ్బంధనంలోనే ఉండటంతో.. స్థానిక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. విద్యుత్‌ సరఫరా నిలిచిపోవడంతో తాంబరం, అశోక్‌నగర్‌, కట్టుపాక్కం, పెరుంగుడి ప్రాంతవాసులు ఇబ్బందులు పడ్డారు. తమిళనాడు సీఎం స్టాలిన్‌ మంగళవారం తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు.

రైళ్లు, విమానాల రాకపోకలకు బ్రేక్‌

- కొనసాగుతున్న మిచాంగ్‌ ప్రభావం
- దక్షిణమధ్య రైల్వే పరిధిలో 120 రైళ్లకు అంతరాయం
- శంషాబాద్‌లో నిలిచిన 20 విమాన సర్వీసులు

సాక్షి, హైదరాబాద్‌: మిచాంగ్‌ తుపాన్‌ ప్రభావంతో మంగళవారం కూడా వివిధ ప్రాంతాలకు వెళ్లే రైళ్లు రద్దయ్యాయి. కొన్ని రూట్‌లలో పరిమితంగా సర్వీసులను పునరుద్ధరించారు. ముంబయి మీదుగా చెన్నైకి వెళ్లే కొన్ని రైళ్లను ఇతర మార్గాల్లో మళ్లించారు. ఈ నెల 8వ తేదీ వరకు వివిధ మార్గాల్లో సుమారు 120 రైళ్లను రద్దు చేయనున్నట్లు అధికారులు ప్రకటించారు. తుపాన్‌ తగ్గుముఖం పట్టి, సాధారణ పరిస్థితులు నెలకొంటే రైళ్లను పునరుద్ధరించనున్నట్లు దక్షిణమధ్య రైల్వే జనరల్‌ మేనేజర్‌ అరుణ్‌కుమార్‌ జైన్‌ తెలిపారు. తెలుగు రాష్ట్రాలతో పాటు, చెన్నై, భువనేశ్వర్‌, కోల్‌కతా, తదితర ప్రాంతాలకు వెళ్లే రైలు మార్గాల్లో వరదల ప్రభావాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేసేందుకు నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. పట్టాలపై వరదనీటిని తొలగించేందుకు క్షేత్రస్థాయిలో సిబ్బంది రాత్రింబవళ్లు విధులను నిర్వహిస్తున్నారని వివరించారు.

రాకపోకలు నిలిచిన రైళ్లు ఇవే: కాచిగూడ-చెంగల్పట్టు, హైదరాబాద్‌-తాంబరం, సికింద్రాబాద్‌-కొల్లాం, సికింద్రాబాద్‌-తిరుపతి, లింగంపల్లి-తిరుపతి. సికింద్రాబాద్‌-రేపల్లె, కాచిగూడ-రేపల్లె. చెన్నై-హైదరాబాద్‌, సింద్రాబాద్‌-గూడూరు, సికింద్రాబాద్‌-త్రివేండ్రమ్‌ తదితర ప్రాంతాల మధ్య నడిచే రైళ్లను రద్దు చేశారు. మరోవైపు చెన్నై నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే రైళ్ల రాకపోకలు కూడా నిలిచిపోయాయి. రైళ్ల రాకపోకలపై ప్రయాణికులకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని చేరవేసేందుకు సికింద్రాబాద్‌, నాంపల్లి, కాచిగూడ స్టేషన్లలో అధికారులు ఏర్పాట్లు చేశారు.

ఆ రూట్‌లో రైలు సర్వీసులు పునరుద్ధరణ: తిరుపతి-సికింద్రాబాద్‌, లింగంపల్లి-తిరుపతి, సికింద్రాబాద్‌-గూడూరు రూట్‌లలో కొన్ని సర్వీసులను పునరుద్ధరించినట్లు అధికారులు పేర్కొన్నారు. తుపాన్‌ కారణంగా రద్దయిన రైళ్లలో ఇప్పటికే రిజర్వేషన్‌లు బుక్‌ చేసుకొన్న ప్రయాణికులు రైళ్ల పునరుద్ధరణకు అనుగుణంగా తిరిగి తమ టికెట్‌లను బుక్‌ చేసుకోవచ్చు.

20 విమాన సర్వీసులు రద్దు

శంషాబాద్‌ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే సుమారు 20 దేశీయ విమాన సర్వీసులు నిలిచిపోయినట్లు అధికార వర్గాలు తెలిపాయి. హైదరాబాద్‌ నుంచి విజయవాడ, విశాఖ, చెన్నై, రాజమండ్రి, భువనేశ్వర్‌ తదితర ప్రాంతాలకు బయలుదేరే విమానాలను వాతావరణ ప్రభావం కారణంగా అధికారులు రద్దు చేశారు. మరోవైపు చెన్నై నుంచి హైదరాబాద్‌కు రావలసిన విమాన సర్వీసులు కూడా ఆగిపోయాయి. తప్పనిసరిగా వెళ్లవలసిన వాళ్లు రైళ్లతో పాటు విమానాలు కూడా రద్దవడంతో ఇబ్బందులను ఎదుర్కోవలసి వచ్చింది.

అప్రమత్తంగా ఉండాలి: సీఎస్‌



సాక్షి, హైదరాబాద్‌: బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర తుపాన్‌ మిచాంగ్‌తో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురియనున్న నేపథ్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కలెక్టర్లను అప్రమత్తం చేశారు. భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, ములుగు, హనుమకొండ, వరంగల్‌, జనగాం, మహబూబాబాద్‌, సూర్యాపేట తదితర జిల్లాల కలెక్టర్లతో మంగళవారం సీఎస్‌ శాంతికుమారి విపత్తుల నిర్వహణ కార్యదర్శి రాహుల్‌ బొజ్జతో కలిసి టెలీకాన్ఫరెన్స్‌ నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాలకు ఎన్డీఆర్‌ఎఫ్‌ బృందాలను పంపిస్తున్నామని అధికారులు వెల్లడించారు. ఇప్పటికే పూర్తిగా నిండిన చెరువులకు గండ్లు పడకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సీఎస్‌ ఆదేశించారు. నీటిపారుదల, విపత్తుల నిర్వహణ, రోడ్లు భవనాలు, పంచాయతీ రాజ్‌, రెవెన్యూ శాఖలు అప్రమత్తంగా ఉండాలని, ప్రధానంగా వరదలు వచ్చే అవకాశం ఉన్నందున కాజ్‌-వే, లోతట్టు ప్రాంతాల వద్ద జాగ్రత్త చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు వీలుగా పునరావాస కేంద్రాలను ముందుగానే గుర్తించాలని సూచించారు.

ఇబ్బందులు రాకుండా చూడాలి: భట్టి



సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలో మిచాంగ్‌ తుపాను ప్రభావంతో వర్షాలు కురుస్తున్నందున ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని మధిర ఎమ్మెల్యే భట్టి విక్రమార్క సూచించారు. రాగల 48 గంటల్లో భారీ వర్షాలు పడతాయని వాతావరణశాఖ వెల్లడించిన నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చెరువులు, వాగులు పొంగిపొర్లే అవకాశం ఉందని, ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా చూడాలని అధికారులను కోరారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి అక్కడి ప్రజలను అప్రమత్తం చేయాలని, పునరావాసం కోసం తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, ఎన్డీఆర్‌ఎఫ్‌ బృందాల సంఖ్యను పెంచుకోవాలని వెల్లడించారు. తుపాన్‌ ప్రభావం నేపథ్యంలో ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రావొద్దని, ఎవైనా ఇబ్బందులు ఏర్పడితే కంట్రోల్‌ రూం నంబర్‌కు ఫోన్‌ చేయాలని సూచించారు. తుపాన్‌ ప్రభావం వల్ల రైతులు ఆందోళన, అధైర్య పడొద్దని, కాంగ్రెస్‌ ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

నాణ్యమైన నేలతోనే మానవాళి భవితకు భరోసా

ఇప్పటికే 33 శాతం భూములు కోతకు గురి
మోతాదుకు మించి సహజవనరుల వాడకం వల్లే పర్యావరణ క్షీణత.. అగ్రిఫుడ్‌ టెక్‌-360 సదస్సులో ఉద్యాన వర్సిటీ వీసీ నీరజా ప్రభాకర్‌

ఏజీ వర్సిటీ: నాణ్యమైన నేలతోనే మానవాళి భవిష్యత్తుకు భరోసా లభిస్తుందని... నేలను కాపాడే బాధ్యత ప్రజలందరిపై ఉందని శ్రీ కొండా లక్ష్మణ్‌ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయ వీసీ నీరజా ప్రభాకర్‌ అన్నారు. అంతర్జాతీయ నేల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌ రాజేంద్రనగర్‌లోని శ్రీ కొండా లక్ష్మణ్‌ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయంలో లిబర్టీ ఫౌండేషన్‌, ఉద్యాన విశ్వవిద్యాలయం సంయుక్తంగా అగ్రిఫుడ్‌ టెక్‌-360 సదస్సును నిర్వహించాయి. ఈ సదస్సుకు నీరజా ప్రభాకర్‌ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. వివిధ రకాల నేలల సుస్థిర యాజమాన్యంపైనే మానవ మనుగడ ఆధారపడి ఉందని... భవిష్యత్‌ తరాలకు మనం ఇవ్వగలిగే అపురూప కానుక సారవంతమైన నేలనే అని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆహార రంగంలో పారిశ్రామికీకరణ, యాంత్రీకరణ, మోతాదుకు మించి సహజవనరుల వాడకం పర్యావరణ క్షీణతకు కారణమవుతున్నాయని చెప్పారు. ఇప్పటికే 33 శాతం భూములు కోతకు గురయ్యాయని, 2050 నాటికి 80-90 శాతం భూములు కోతకు గురయ్యే అవకాశం ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా సాలీనా ఎకరానికి ఒకటి నుంచి రెండు టన్నుల మట్టి నిర్వీర్యం అవుతోందని... పంట మార్పిడి, కవర్‌ పంటల సాగు, జీవన ఎరువులు బయో స్టిమ్యులెంట్‌, సమగ్ర పంటల సాగు వ్యవస్థ వ్యర్థాల వినియోగం వాడకంతో భూములు పునర్జీవమవుతాయని నీరజా ప్రభాకర్‌ తెలిపారు. నాగార్జున గ్రూప్‌ చైర్మన్‌ కేఎస్‌ రాజు మాట్లాడుతూ మానవ భవిష్యత్తు బాగుండాలంటే భూముల ఆరోగ్యం బాగుండాలన్నారు. ఇందుకోసం ప్రతి ఒక్కరూ ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం డీన్‌ డాక్టర్‌ అడపా కిరణ్‌కుమార్‌, ప్రశాంత్‌, కోరమండల్‌ ఫెర్టిలైజర్స్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ జీవీ సుబ్బారెడ్డి, రైతులు, విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

'పార్సిల్‌ స్కాం పసిగట్టండి ఇలా..'

సాక్షి, హైదరాబాద్‌: ప్రజల నుంచి డబ్బు కొల్లగొట్టేందుకు సైబర్‌ నేరగాళ్లు కొత్త తరహా మోసాలకు తెరతీస్తున్నారు. ఆన్‌లైన్‌ ద్వారా కొనుగోలు చేయని వస్తువుల పేరుతో పార్సిల్‌ వచ్చిదంటూ అమాయకులకు ఫోన్లు చేసి డబ్బు గుంజుతున్నారని సైబర్‌ క్రైం పోలీసులు హెచ్చరిస్తున్నారు. ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని వివిధ మార్గాల్లో సేకరించి ఆ వివరాలతో వారికి పార్సిల్‌ వచ్చిందంటూ మెసేజ్‌లు, ఫోన్లు చేస్తున్నారని తెలిపారు. ఇలా అపరిచిత వ్యక్తులు పంపే పార్సిళ్లలో కొన్ని అక్రమ పదార్థాలు, వస్తువులు ఉంటున్నాయని... అడిగినంత డబ్బు పంపకపోతే అరెస్టు తప్పదని బ్లాక్‌మెయిల్‌ చేస్తూ వీలైనంత డబ్బు గుంజుతున్నారని పేర్కొన్నారు. ఇలాంటి మెసేజ్‌లు, ఫోన్‌కాల్స్‌పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

ఎలా గుర్తించాలంటే...

- ఆటోమేటెడ్‌ వాయిస్‌ మెసేజ్‌ ద్వారా వచ్చే అనుమానాస్పద వివరాలను, ఆర్డర్‌ చేయని వస్తువులు పార్సిల్‌గా వచ్చాయంటూ వచ్చే ఫోన్స్‌కాల్స్‌ను నమ్మొద్దు.
- మీకు పార్సిల్స్‌ వచ్చాయంటూ వచ్చే ఈ-మెయిల్స్‌లో పార్సిల్‌ పంపిన వారి అడ్రస్‌, ఫోన్‌ నంబర్లు పరిశీలించాలి. అనుమానాస్పద నంబర్ల నుంచి పార్సిళ్లకు సంబంధించిన మెసేజ్‌లు వస్తే అవి నకిలీవని గుర్తించాలి. మెసేజ్‌లు, ఈ-మెయిల్స్‌లో అక్షర దోషాలు, అచ్చు తప్పులను గుర్తించాలి. అలాంటివి నకిలీవని గుర్తుంచుకోవాలి.
- మీరు ఆర్డర్‌ చేయని పార్సిళ్లకు, మీ పేరిట వచ్చిన పార్సిల్‌లో ఏవైనా అక్రమ వస్తువులు ఉన్నాయంటూ బెదిరింపులకు పాల్పడి డబ్బు డిమాండ్‌ చేసినా డబ్బు పంపొద్దు. వెంటనే పోలీసులకు ఈ సమాచారాన్ని ఇచ్చి ఫిర్యాదు చేయాలి.

ప్రజలకు అండగా ఉండాలి

అధికారులకు టీపీసీసీ చీఫ్‌ రేవంత్‌రెడ్డి సూచన

- తుపానుతో రాష్ట్ర ప్రజలు ఇబ్బందులు పడొద్దు
- ముఖ్యంగా ధాన్యం తడవకుండా చూడాలి
- జిల్లాల వారీగా అలర్ట్‌లు ప్రకటించండి



సాక్షి, హైదరాబాద్‌: మిచాంగ్‌ తుపాను నేపథ్యంలో రాష్ట్రంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని టీపీసీసీ అధ్యక్షుడు, ఎంపీ రేవంత్‌రెడ్డి కోరారు. ముఖ్యంగా వర్షాల కారణంగా పలు ప్రాంతాల్లో వరి ధాన్యం తడిచిపోయే అవకాశం ఉంది కాబట్టి, తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే టార్పాలిన్లు ఇవ్వాలని, లోతట్టు ప్రాంతాలు, ఏజెన్సీ ఏరియాల్లో జన జీవనం స్తంభించకుండా, రైతులకు ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ములుగు, భద్రాద్రి, ఖమ్మంలలో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ఈ మూడు జిల్లాలకు రెడ్‌ అలర్ట్‌ ప్రకటించాలన్నారు. మహబూబాబాద్‌, వరంగల్‌ జిల్లాలకు ఆరెంజ్‌ అలర్ట్‌, కరీంనగర్‌, పెద్దపల్లి, జనగామ, నల్లగొండ, యాదాద్రి, జయశంకర్‌ భూపాపల్లి, సిద్దిపేట, నాగర్‌కర్నూల్‌, వనపర్తి, నారాయణపేట్‌, హైదరాబాద్‌, మేడ్చల్‌ జిల్లాలకు ఎల్లో అలర్ట్‌ ప్రకటించాలని సూచించారు. ఐఎండీ అలర్ట్‌లకు అనుగుణంగా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. లోతట్టు ప్రాంతాల్లో వరద ప్రవాహాన్ని ముందే అంచనా వేసి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి ఆహారం, నీరు అందించాలని సూచించారు. 'విద్యుత్‌ సరఫరా, దెబ్బతిన్న రహదారులు వెంటనే పునరుద్ధరించాలి. పురాతన భవనాలు, నిర్మాణాల్లో ఎవరైనా ఉంటే ఖాళీ చేయించాలి..' అని రేవంత్‌రెడ్డి కోరారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.